




# బోల్షివిక్

సంచిక: 9 | సి.పి.ఐ(మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక | జూలై-డిసెంబర్ 2017

## లోపలి పేజీల్లో...


అంతర్జాతీయ పరిస్థితి ........... 03

ఎస్.ఎమ్.సి. సందేశం ........... 08

సామాజిక సంబంధాలు ........... 12

మహో ప్రారంభం ........... 16

పత్రికా ప్రకటన ........... 27

దేశీయ పరిస్థితి ........... 29

నేను గెరిల్లానెందుకయ్యానంటే? ........... 35

కామ్రేడ్ సుక్కాల్ జీవిత చరిత్ర ........... 41

కుందిలి అత్యాచార ఘటన ........... 43

పోరాట స్రవంతి ........... 46

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది! లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, కౄరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2017 జులై నుండి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బి.లో కామ్రేడ్ సుక్కాల్ (సి.ఆర్.సి.పి.ఎల్-పి.ఎమ్), కటాఫ్ ఏరియా మిలీషియా కామ్రేడ్ సమ్ర నేలకొరిగారు. ఈ కామ్రేడ్స్‌తో పాటు దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో విరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దు:ఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి. ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

వ్యాసం

# 1930ల నాటి, మహాసంక్షోభంలోకి, జారుకుంటున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం

# ఘర్షణల దిశగా, కదులుతున్న ప్రముఖ సామ్రాజ్యవాద దేశాలు

'సామ్రాజ్యవాద సాధారణ సంక్షోభం'లో భాగంగా రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, 1970ల మొదటి భాగంలో, సామ్రాజ్యవాదం మరోసారి ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయింది. వాస్తవంగా, అప్పటికే, సామ్ర్యాజ్యవాద ఫైనాన్షియల్ ప్రభువుల కూటమి (ఫైనాన్షియల్ ఆలిగార్కి) చేతుల్లోకి పెద్ద మొత్తంలో ద్రవ్య పెట్టుబడి పోగుపడింది. ఈ ద్రవ్య పెట్టబడి నిర్వహించే వాణిజ్య కార్యకలాపాలు, తీసుకునే నిర్ణయాలు జాతీయ రాజ్యాల పరిధిని దాటిపోయాయి. అయితే ఈ ద్రవ్య పెట్టుబడి విస్తరణకు ప్రపంచంలోని, ఆయా దేశాలు అమలు చేస్తున్న రక్షణ (సుంకాలు, నిబంధనలు) విధానాలు ఆటంకమయ్యాయి. ఈ ఆటంకాలను తొలగించుకొని, ద్రవ్య పెట్టబడి విస్తరణకు సానుకూల పరిస్థితులను పొందటం కోసం, మిల్టన్ ఫ్రీడ్‌మెన్ వంటి సిద్ధాంత కర్తలు 'ప్రపంచీకరణ' సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. వీరు రాజ్యం జోక్యాన్ని తగ్గిస్తూ, స్వేచ్ఛాయుత పెట్టుబడిదారీ విధానాన్ని నొక్కి చెప్పారు. దీన్ని ఒక్కమాటలో చెప్పాలంటే, అప్పటిదాకా పెట్టుబడిదారీ విధానం అనుసరిస్తున్న 'మార్కెట్‌లో డిమాండ్ పెంచేందుకు రాజ్యం జోక్యం చేసుకోవాలనే' కెనిషియన్ థియరీని పక్కన పెట్టి, ద్రవ్య పెట్టుబడి సులువుగా అన్ని మార్కెట్‌లను కబ్జా చేసుకొనేందుకు అనువుగా ఉండే 'ప్రపంచీకరణ' సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. మొట్టమొదటిగా, 1980 దశకంలో అమెరికా అధ్యక్షుడు రీగన్, బ్రిటన్ ప్రధానమంత్రి మార్గరెట్ థాచర్ ఈ సిద్ధాంతానికి అనుగుణంగా తమ తమ దేశాలలోని ఆర్థిక విధానాలలో మార్పులు ప్రారంభించారు. ముందుగా 'సంక్షేమ రాజ్యం' అనే భావనకు విరుద్ధంగా సంక్షేమ కార్యక్రమాలకు కోతలు పెట్టారు. ప్రముఖంగా ప్రపంచంలోని ప్రధాన సామ్రాజ్యవాద దేశాలు, తమ ద్రవ్య పెట్టుబడికి ఎదురులేకుండా చేసుకునేందుకు, ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచ బ్యాంకుల ద్వారా 'సరళీకరణ', 'సంస్థాగత మార్పుల'ను వెనకబడిన దేశాలపై రుద్దారు. అయితే వెనకబడిన దేశాల పాలకవర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలక వర్గాలు సామ్రాజ్యవాదులకు ఏజెంటుగిరీ చేస్తుండటం వలనా, సామ్రాజ్యవాదుల దోపిడీలో తమ ప్రయోజనాలు కూడా ఇమిడి వుండటం వలన ఈ సంస్థాగత మార్పులకు ఇష్టపూర్వకంగానే వకాల్తా పుచ్చుకున్నారు. దీనితో అంతర్జాతీయ వాణిజ్యంలో, దేశాల మధ్య వున్న, సుంకాల రక్షణ కోటలు కూలిపోయాయి. పెట్టుబడుల ప్రవాహానికి దాదాపు అడ్డుగోడలు తొలగిపోయాయి. ప్రపంచ దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలు పెరిగి, పరస్పర ఆధారిత ప్రపంచంగా, వేగంగా పరిణామం చెందింది. ఈ కాలంలోనే రాజకీయంగా జరిగిన మరో ముఖ్యమైన పరిణామం ఏమిటంటే, 1991 మధ్యకి రష్యా ఆర్థికంగా బలహీనపడి, తన అగ్రరాజ్య స్థాయిని కోల్పోయింది. ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికాతో జరుగుతున్న ప్రచ్ఛన్నయుద్ధం నుండి పక్కకు తప్పుకున్నది. ఇటువంటి పరిస్థితుల్లోనే సామ్రాజ్యవాదులు 'ప్రపంచీకరణ'లో భాగంగా తాత్కాలికంగా కుమ్మక్కై, ప్రపంచ మార్కెట్‌ను విభజించుకునేందుకు అనేక ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, ఎవరికి వారే తమ వాటాను పెంచుకోవటానికి పోటీ పడుతూ వచ్చారు.

గత మూడున్నర దశాబ్దాలుగా సంక్షోభ తీవ్రతను తగ్గించుటకు 'సర్వరోగ నివారిణి'గా చెప్పబడుతూ వచ్చిన ఈ 'ప్రపంచీకరణ' (స్వేచ్ఛా మార్కెట్) నమూనా, 2008 సెప్టెంబర్‌లో వచ్చిన అమెరికా సబ్‌ప్రైమ్ (గృహ ఋణాల) సంక్షోభంతో విఫలమైందని రుజువైంది. వాస్తవంగా అమెరికాలో బద్దలైన ఈ ద్రవ్య సంక్షోభానికి (సబ్‌ప్రైమ్) ముందుగానే సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి నెట్టబడింది. 2008కి ముందు ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు కొంత పెరిగినప్పటికీ, తదనుగుణంగా శ్రామికుల నిజ వేతనాలు పెరగలేదు. పర్మనెంట్ కార్మికులు తగ్గుతూ కాంట్రాక్టు, క్యాజువల్ లేబర్ సంఖ్య పెరుగుతూ వచ్చింది. వున్నతాధికారుల వేతనాలు విపరీతంగా పెరిగితే, సాధారణ కార్మికుల వేతనాలు అధ్వానపు స్థితికి చేరినాయి. ప్రముఖ బహుళజాతి సంస్థలలో పని చేసే సి.ఇ.ఒ.ల వేతనాలు సంవత్సరానికి 6 నుండి 7 కోట్ల రూపాయల వరకూ వుంటే, సాధారణ కార్మికుల వేతనాలు కనీస అవసరాలు తీర్చుకునేందుకు కూడా సరిపోని స్థాయిలో కుదించబడ్డాయి. 'ప్రపంచీకరణ' నమూనా నిరుద్యోగంతో పాటు ఆర్థిక అసమానతలు, దారిద్ర్యాన్ని విపరీతంగా పెంచింది. ప్రపంచంలోనే 80 మంది కుబేరులు, కోటీశ్వరుల వద్ద వున్న సంపద మొత్తం ప్రపంచంలోని దాదాపు 360 కోట్ల మంది ఆస్తితో సరిసమానంగా వుందనే విషయాన్ని అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. 500 మందిదాకా వున్న ఈ అంతర్జాతీయ కుబేరులలో 23 మంది భారతీయులు వున్నారనీ, ఆ జాబితాలో 20వ స్థానంలో రిలయన్స్ అధినేత ముఖేష్ అంబనీ వున్నాడని ఆ నివేదికలు తెలియజేస్తున్నాయి. సంపన్నులకు, పేదలకు మధ్య ఏర్పడిన ఈ గండి రోజు రోజుకూ పూడ్చుకో లేనంతగా పెరిగిపోతున్నది. పెరిగిపోతున్న ఈ తీవ్రమైన అసమానతల ఫలితంగా కోట్లాదిమంది శ్రమ జీవులు కొనుగోలు శక్తి దెబ్బతిని, మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడంతో, వున్న ఉత్పాదక శక్తి, వినియోగ సామర్థ్యం తగ్గించడం జరుగుతూ వచ్చింది. ఈ పరిణామాలు క్రమంగా వృద్ధి రేటును తగ్గించి ఉత్పత్తిని మాంద్యంలోకి నెట్టాయి.

ఇటువంటి పరిస్థితులలోనే బహుళజాతి కంపనీలు ఎక్కువ లాభాల కొరకు, పునాది రంగాలైన పరిశ్రమలపైన, వ్యవసాయంపైన, కాకుండా, ప్రధానంగా ద్రవ్యరంగంపై (చట్టవ్యాపారం-డెరివేటివ్స్, సెక్యూరిటీలు, ఫ్యూచర్స్, ఆప్షన్స్, ఫార్వర్డ్ ట్రేడింగ్) పెట్టుబడులు పెడుతూ వచ్చారు. అయితే పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా మారిన తర్వాత, సామ్రాజ్యవాద దేశాలు ప్రధానంగా ద్రవ్యరంగంలో పెట్టుబడులు పెట్టి 'డబ్బు నుంచి డబ్బు'ను సంపాదించే 'వడ్డీ భుక్త' (రెంటియర్) లక్షణాన్ని సహజంగానే సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలోనే పై మార్పులు చూడాలి. ఈ సందర్భంగా పెట్టుబడులు ప్రధానంగా షేర్ మార్కెట్, రియలెస్టేట్ రంగాలలో పెట్టారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీలకు అప్పులు ఇచ్చారు. కొన్ని అప్పులను తనఖా లేకుండా కూడా ఇచ్చారు. కృత్రిమంగా షేర్‌ల ధరలు, ఇండ్ల స్థలాల ధరలు పెరిగేలా చూసి, ఈ రంగంలో వ్యాపారం జోరుగా సాగేలా చేశారు. ఈ కృత్రిమమైన, అరాచకమైన, తాత్కాలికమైన, 'వికాసం' ఎక్కువకాలం నిలబడలేదు. షేర్‌ల, స్థలాల ధరలు పడిపోయాయి. బ్యాంకుల నుండి అప్పులు తీసుకున్నవారు తిరిగి అప్పులు చెల్లించలేకపోయారు. పర్యావసానంగా బ్యాంకులు పెద్ద ఎత్తున దివాలా తీసాయి. దీనితో ఈ రంగాలలో ఏర్పడ్డ 'అభివృద్ధి గాలి బుడగ' పేలిపోయి, మొట్టమొదటగా అమెరికాలో 'గృహఋణాల సంక్షోభం' రూపంలో ద్రవ్య సంక్షోభం బద్దలయ్యింది. ఈ సంక్షోభం, పరస్పర ఆధారితంగా వున్న ప్రపంచాన్ని ఆవరించింది. ముఖ్యంగా, అమెరికా ఆర్థిక వ్యవస్థతో ఎక్కువగా విలీనం అయిన దేశాల ఆర్థిక వ్యవస్థలపై, ఈ సంక్షోభం తీవ్రమైన ప్రభావాన్ని వేసింది.

ఈ ద్రవ్య సంక్షోభం, అప్పటికే మాంద్యంలో కొనసాగుతున్న ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి, మరింత కుదేలు చేసింది. ఈ ఆర్థిక సంక్షోభం 1930ల నాటి మహా సంక్షోభంతో పోల్చదగినది. ఇది 1930ల తర్వాత వచ్చిన సంక్షోభాలన్నింటికన్నా పెద్దదీ, లోతైనదీ, విస్తృతమైనది. చాలా ఎక్కువ కాలం నుండి కొనసాగుతున్నది కూడా. ఈ సంక్షోభం 1930ల నాటి గత మహా సంక్షోభం కన్న, కొంత భిన్నమైనది కూడా. గత సంక్షోభంలో, మాంద్యం (స్టాగ్నేషన్) తీవ్ర స్థాయిలో ఉన్నప్పటికీ, ధరలు నియంత్రణలో వుండటం వల్ల ద్రవ్యోల్బణం పెరగలేదు. కానీ, ఈ సారి మాంద్యంతో పాటు ధరలు కూడా, విపరీతంగా పెరిగి ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరింది. ప్రస్తుత పరిస్థితుల్లో స్టాగ్నేషన్, ఇన్‌ఫ్లేషన్ కలిసి వుండటం వలన ఈ పరిస్థితిని 'స్టాగ్‌ఫ్లేషన్' అంటున్నారు.

రోజురోజుకు సుడులు తిరుగుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఈ ఆర్థిక సంక్షోభ తీవ్రతను తగ్గించేందుకు సామ్రాజ్యవాదులు, వారి బంట్లు (దళారీ, నిరంకుశ బుర్జువా, భూస్వామ్య వర్గాలు) సిద్ధాంత కర్తలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఉద్దరగా 'ఉద్దీపన పథకాల' పేరుతో బహుళజాతి కంపెనీలకూ, కార్పొరేట్ కంపెనీలకు, బ్యాంకులకు ఇస్తున్నారు. ఈ మధ్యనే భారతదేశంలో, మొండిబకాయిల వల్ల, దివాలా దిశగా ప్రయాణం చేస్తున్న ప్రభుత్వ బ్యాంకులకు మోదీ ప్రభుత్వం 2.2 లక్షల కోట్ల రూపాయల 'ఉద్దీపన పథకాన్ని' అందించింది. మరోవైపు పెట్టుబడికి ఉత్తేజం కలిగించేందుకు, ప్రపంచంలోని కేంద్ర బ్యాంకులు 'సరళ ద్రవ్య విధానం' పేరుతో, వడ్డీరేటును తగ్గించి, ద్రవ్య సరఫరాను పెంచుతున్నాయి. దీనితో ద్రవ్యోల్బణం తారాస్థాయికి చేరుకుంటున్నది. అమెరికన్ ఫెడరల్ బ్యాంకు అయితే జీరో వడ్డీరేట్లను కొనసాగిస్తున్నది. ఈ విధానాలన్నీ, తిరిగి కెనిషియన్ థియరీకి అనుగుణంగా, ఆర్థిక వ్యవస్థలోకి రాజ్యం జోక్యాన్ని పెంచుతున్నాయి. మరోవైపు ఈ విధానాలకు తోడు, ఈ మధ్య కాలంలో, ప్రధాన సామ్రాజ్యవాద దేశాలు 'ప్రపంచీకరణ'కు వ్యతిరేకంగా 'రక్షణ విధానాల'ను చేపడుతున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో 'అమెరికా ఫస్ట్' (అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యత) అంటూ ప్రచారం చేసిన ట్రంప్, అధ్యక్ష పదవి చేపట్టగానే హెచ్-1బి వీసాలపై ఆంక్షలు విధించాడు. ఇదే బాటలో ఆస్ట్రేలియా, కెనడా వంటి ఇతర పెట్టుబడిదారీ దేశాలు కూడా ప్రయాణం చేస్తున్నాయి. బ్రిటన్ రిఫరెండం ద్వారా ఇ.యు. నుండి విడిపోవడాన్ని (బ్రెగ్జిట్) ఇందులో భాగంగానే చూడాలి. అమెరికా సహా, ప్రధాన సామ్రాజ్యవాద దేశాలు రక్షణ విధానాలను చేపడుతూ, భారత్ వంటి వెనుకబడిన దేశాలను తలుపులు మరింత బార్లా తెరవమని ఆజ్ఞాపిస్తున్నాయి. ఇప్పటికే రక్షణ రంగంలో, భారత్ ఎగుమతుల వల్ల అమెరికాలో రెండు లక్షల, ఆరవై వేల ఉద్యోగాలు ఏర్పడ్డాయని ఫిక్కి (భారత వాణిజ్య పారిశ్రామిక సంస్థ) ప్రకటించింది. ఈ అసమాన ఒప్పందాలు 'స్వేచ్ఛమార్కెట్' బండారాన్ని బయట పెడుతున్నాయి. అయినప్పటికీ సామ్రాజ్యవాదులు, వారి ఏజెంట్లు ఇంకానూ 'ప్రపంచీకరణ' మంత్రాన్ని జపిస్తూ, వెనుకబడిన దేశాలను విచక్షణా రహితంగా కొల్లగొట్టేందుకు వత్తిడిని తీవ్రతరం చేస్తున్నాయి.

గత 9 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ 'ప్రపంచీకరణ' విధానాలేవీ, ఆర్థిక సంక్షోభపు ఊబిలో గొంతులోతుల్లోకి కూరుకుపోయిన సామ్రాజ్యవాదులను బయట పడేయించలేక పోతున్నాయి. ఈ పరిణామాలు 'విశృంఖల స్వేచ్ఛ మార్కెట్ వ్యవస్థ' శకం ముగిసిన విషయాన్ని తెలియజేస్తున్నాయి. 'మార్కెట్ తనంతట తానే అన్ని పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు చేసుకుంటుదనే' స్వేచ్ఛ మార్కెట్ సిద్ధాంత బండారాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ఇప్పుడు వాళ్ళంతా, ఈ గండం నుండి బయట పడేందుకు శాస్త్ర, సాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలతో పాటు, మరో విప్లవాన్ని ఆశిస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఐ.టి. రంగంలో వచ్చిన విప్లవం, పెట్టుబడిదారీ విధానానికి కొంత శ్వాస అందించినప్పటికీ, ఆ రంగం కూడా సంక్షోభంలో పడింది. ప్రస్తుతం ఆ రంగంలో నూతన కొలువులు లేక, ఉన్న కొలువులు ఊడుతుండటంతో, యువత భవిష్యత్తు అంధకార బంధురమై, వివిధ సమాజాల్లో, ఒక భయానక

వాతావరణం నెలకొన్నది. ఇక వారు ఆశిస్తున్న నూతన 'నాలుగో పారిశ్రామిక విప్లవం' [ఆర్టిఫిషల్ ఇంటలిజెన్సీ (ఎ.ఐ), ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐ.ఒ.టి), రోబోటిక్స్... వగైరా] కూడా సంక్షోభంలో ఉన్న ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను ఏ మాత్రం గట్టెక్కించలేవు. 'మెకెన్సీ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్' అంచనా ప్రకారం, రాబోయే నూతన టెక్నాలజీ వల్ల అంతర్జాతీయ కార్మిక బలంలో 15% (40 కోట్లు) మంది, 2030 కల్లా ఉద్యోగాలు కోల్పోతారు. కనుక ఈ నూతన ఆవిష్కరణలు కూడా సంక్షోభ తీవ్రతను ఏ మాత్రం తగ్గించలేవు.

ఇటువంటి పరిస్థితుల్లో 'నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 1930ల నాటి మహా సంక్షోభంలోకి జారుకుంటున్నదనీ, ఈ పరిస్థితి నుండి బయట పడేందుకు 'వృద్ధి'ని పెంచే ప్రయత్నాల్లో తిరిగి 1930ల నాటి సమస్యల్లోకి కూరుకుపోతున్నమనీ, కొత్తగా చేపట్టాల్సిన చర్యలు ఏమిటో ఊహించలేకపోతున్నమని' పెట్టుబడిదారీ సిద్ధాంత కర్తలు, నిపుణులు వాపోతున్నారు.

సాధారణంగా ఈ ఆర్థిక సంక్షోభం రాజకీయ, సామాజిక కల్లోలాలకు దారి తీస్తుంది. పెరుగుతున్న ఉద్యమాలను ప్రక్కతోవ పట్టించేందుకు కుల, మత, ప్రాంతీయ విద్వేషాలకు, ఫాసిస్టు నిర్బంధాలకు దోపిడీ పాలక వర్గాలు పూనుకుంటాయి. స్థానిక యుద్ధాలకు తెగబడతాయి. వాస్తవంగా నేటి అంతర్జాతీయ, రాజకీయ, సామాజిక వస్తుగత స్థితి, ప్రస్తుత ప్రపంచ ఆర్థిక స్థితికి అద్దం పడుతున్నది.

## పదునెక్కుతున్న అంతర్జాతీయ మౌలిక వైరుధ్యాలు

పైన చెప్పుకున్నట్లుగా, పెరుగుతున్న ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయంగా రాజకీయ, సామాజిక కల్లోలాలకు, సంక్షోభాలకు, మార్పులకు కారణం అవుతున్నది. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద శక్తుల మధ్య బలాబలాల పొందికలో మార్పులు తెస్తున్నది. ఈ మార్పులు పెట్టుబడిదారీ విధానంలోని అసమాన అభివృద్ధికి ప్రతిబింబాలే అయినప్పటికీ, ఈ ఆర్థిక సంక్షోభం వాటిని మరింత త్వరితం చేస్తున్నది. ముఖ్యంగా అంతర్జాతీయంగా, దేశీయంగా మౌలిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నది.

అంతర్జాతీయంగా నేటి పరిస్థితులను నిర్దిష్టంగా పరిశీలించినప్పుడు సామ్రాజ్యవాదులకూ, పీడిత జాతులకు, ప్రజలకు మధ్య వైరుధ్యం రోజురోజుకు తీవ్రతరం అవుతున్నది. సామ్రాజ్యవాదులు ప్రధానంగా అమెరికన్ సామ్రాజ్యవాదులు, ప్రస్తుతం తాము ఎదుర్కొంటున్న ఈ ఆర్థిక సంక్షోభం నుండి బయట పడేందుకు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాకు చెందిన వెనుకబడిన దేశాలపై 'ప్రపంచీకరణ'ను బలవంతంగా రుద్దుతూ, అక్కడి ప్రాకృతిక వనరులతో పాటు, మార్కెట్‌లను విచ్చలవిడిగా కొల్లగొడుతున్నారు. ఇందుకు తమకు తొత్తులుగా పని చేస్తున్న ఆయా దేశాల పాలక వర్గాలను (దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు) వాహకాలుగా వినియోగించుకుంటున్నారు. తమ ఆదేశాలకు తలొగ్గని దేశాల్లో దురాక్రమణ యుద్ధాలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదం అఫ్ఘనిస్తాన్, ఇరాక్, సిరియా, లిబియా, యెమెన్, సోమాలియా, మాలి తదితర దేశాల్లో ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను దురాక్రమణ యుద్ధాలను కొనసాగిస్తున్నది. ఇరాన్ ఉత్తర కొరియాలలో అణ్వాయుధాల తయారీకి వ్యతిరేకంగా, ఏకపక్ష ఆంక్షలు చేపడుతూ, వాటిని లొంగదీసుకొనేందుకు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నది. మరోవైపు మార్కెట్ పునఃపంపకంలో నూతన పోటీదారునిగా, రంగప్రవేశం చేసిన చైనా సామ్రాజ్యవాదం 'ప్రపంచీకరణ' అమలుకు తానే 'ఛాంపియన్'ను అంటూ దూకుడుగా ముందుకు వస్తున్నది. ఇప్పటికే ఆఫ్రికా ఖండంలోని అనేక దేశాలను అప్పులు, సహాయం అనే తన టెంటకిల్స్‌తో వాటిని బంధించి అక్కడి ప్రజల రక్తాన్ని జుర్రుకుంటున్నది. దక్షిణ ఆసియాలో కూడా ఒక్కొక్క దేశాన్ని చిన్నగా తన కబంధ హస్తాలలోకి ఇరుకించుకుంటున్నది. చైనా, శ్రీలంకల మధ్య కుదిరిన ఆర్థిక ఒప్పందాలలో భాగంగా, చైనా సహాయంతో లంకలో నిర్మించిన 'హంబన్‌టోవా' ఓడరేవు ఎలాంటి కార్యకలాపాలు సాగక, తీవ్ర నష్టాలు తీసుకొస్తుంటే, దానికి ఏటా భారీ మొత్తంలో చైనాకు వాయిదాలు చెల్లించాల్సి వస్తుంటే, శ్రీలంక విలవిలలాడి పోతున్నది. తనను దివాలా తీయిస్తున్న ఈ ఓడరేవును, ఒదిలించుకునేందుకు, దాన్ని నిర్మించిన చైనా పబ్లిక్ రంగ సంస్థ 'చైనా మర్చెంట్ పోర్టల్స్ (సి.ఎమ్.పి) సంస్థకే, తిరిగి దానికి అప్పగించింది. ఆ ఓడరేవులో 85% వాటాను దానికే అప్పగించి, దాన్ని చైనాకు 99 ఏళ్ళకు లీజుకిచ్చింది.

బర్మాలో రోహింగ్యాల సమస్య కూడా 'ప్రపంచీకరణ'లో భాగంగా ఉత్పన్నమైనదే. ప్రస్తుతం రోహింగ్యాల మాతృభూమి "రాఖైనే" రాష్ట్రం చైనా, అమెరికా, యూరప్ ఆయిల్ కంపెనీల అడ్డా (హబ్)గా మారింది. వాటి అనుబంధ ప్రాజెక్టులతో నిండింది. ఈ నేపథ్యంలోనే తమ మాతృభూమిని రక్షించుకునేందుకు రోహింగ్యాలు చేపడుతున్న ఆందోళనలను, సామ్రాజ్యవాదులకు తొత్తుగా వ్యవహరిస్తున్న 'అంగ్‌సాన్‌సూచీ' ప్రభుత్వం, పోరాడుతున్న రోహింగ్యాలను అత్యంత అమానుషంగా, కౄరంగా అణచివేస్తున్నది. ఈ వాస్తవాలను మరుగు పరిచి బర్మాలో ముస్లింలకు, బౌద్ధులకు మధ్య ఘర్షణగా ఈ మారణకాండను ప్రచారం చేస్తున్నారు. ఈ తీరున సామ్రాజ్యవాద దేశాలు పీడిత ప్రజలను, జాతులను దోపిడీ పీడనలకు గురి చేస్తుంటే, ప్రపంచంలో ప్రత్యేకంగా అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశాల్లో పేదరికం, అతి తీవ్రంగా పెరుగుతున్నది. లక్షలాది మంది ప్రజలు సామ్రాజ్యవాద యుద్ధాలతో, బలవంతపు విస్తాపనలతో, అంటు రోగాలతో, కౄరమైన నిరుద్యోగంతో విలవిలలాడుతున్నారు, మరణిస్తున్నారు, వలసపోతున్నారు.

మరోవైపు సామ్రాజ్యవాదుల నయా వలస విధానాలకు వ్యతిరేకంగా పాలస్తీనా, ఇరాక్, అఫ్ఘనిస్తాన్, సిరియా, లిబియా, యెమెన్ వంటి దేశాలలో జాతీయ విముక్తి పోరాటాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్నాయి. భారత్, ఫిలిప్పిన్స్ మరికొన్ని దేశాలలో, సామ్రాజ్యవాదులకు, వారి తొత్తులైన పాలక వర్గాలకు

వ్యతిరేకంగా నూతన ప్రజాస్వామిక విప్లవాలు దృఢంగా పురోగమిస్తున్నాయి. లాటిన్ అమెరికాలోని వెనిజులా, బొలివియా తదితర దేశాల పాలక వర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నప్పటికీ, 'బొలివేరియన్ సోషలిజం' పేరుతో తమ ఆర్థిక వ్యవస్థలను 'ప్రపంచీకరణ'లో భాగంగా, సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలో భాగం చేయడం వలన, అక్కడ కూడా, ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలవుతూ, తమ పాలక వర్గాలను వ్యతిరేకించడం రోజురోజుకు తీవ్రతరం అవుతున్నది. ఈ పరిస్థితులన్నీ వెనుకబడిన దేశాలలో నూతన ప్రజాస్వామిక విప్లవాలకు భౌతిక పరిస్థితులను సమకూర్చి పెడుతున్నాయి.

గత 9 సంవత్సరాలుగా అమెరికాతో సహా రష్యా, చైనా, జపాన్, యురప్ వంటి పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాల్లో, పాలక వర్గాలు ఈ సంక్షోభ పరిష్కారానికి అనుసరించిన ఆర్థిక, ద్రవ్య, రాజకీయ విధానాలన్నీ విఫలమయినాయి. ఫలితంగా అయా దేశాల కార్మికవర్గానికీ, బూర్జువా వర్గానికి వైరుధ్యం తీవ్రతరం అవుతున్నది. ఈ దేశాలన్నింటా నిరుద్యోగం ప్రబలింది. ఆర్థిక అభివృద్ధి కుంటుబడింది. ముఖ్యంగా గ్రీస్, ఇటలీ, స్పెయిన్ వంటి పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థలు ఈ సంక్షోభానికి తీవ్రంగా ప్రభావితం అయినాయి. దీనితో ఆయా దేశాలలోని కార్మికవర్గం ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచ బ్యాంకులు విషమ షరతులనూ, ముఖ్యంగా ప్రభుత్వ పొదుపు చర్యలనూ, సంక్షేమ వ్యతిరేక కార్యక్రమాలను పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తూ, ఆందోళనకు దిగుతున్నారు. స్విట్జర్లాండ్ దేశంలోని, దావోస్ నగరంలో, సామ్రాజ్యవాద దేశాల ఆధ్వర్యంలో జరిగే 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం' వార్షిక సమావేశాలను వివిధ దేశాల నుండి భారీగా సమీకరించబడిన కార్మికవర్గం ఊరేగింపులు, ధర్నాల ద్వారా తమ నిరసనను తెలిజేస్తున్నది. ఈ సంవత్సరం కూడా తమ నిరసన తెలియజేసేందుకు పెద్ద సంఖ్యలోనే కార్మికులు దావోస్‌లో సమీకరించబడుతున్నారు. పెట్టుబడిదారులకు, కార్మికులకు మధ్య పెరుగుతున్న వైరుధ్యం, పెట్టుబడిదారీ దేశాలలో, వేరువేరు రూపాలలో కూడా వ్యక్తమవుతున్నది. స్పెయిన్‌లో, కేటలోనియా ప్రాంత వాసులు స్వచ్ఛందంగా రిఫరెండం జరిపి, ప్రత్యేక దేశంగా విడిపోతామని ప్రకటించారు. కానీ, స్పెయిన్ నిరంకుశ పాలకులు కేటలోనియా ప్రాంత ప్రజల, కార్మికుల ప్రజాస్వామిక ఆకాంక్షను తొక్కిపట్టారు. మరోవైపు సామ్రాజ్యవాద దేశాలలోని దోపిడీ పాలక వర్గాలు కార్మికుల, ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు, జాత్యహంకారాన్ని (రేసిజాన్ని) రెచ్చగొడుతున్నాయి. జాతి అహంకారం పునాదిగా ఫాసిస్టు భావజాలాన్ని పెంపొందిస్తూ, అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చాడు. అమెరికాలో ట్రంప్ అధికారంలోకి రాగానే నల్లజాతీయులపై, ముస్లింలపై, అమెరికేతర వలస ప్రజలపై జాతీ ఉన్మాద దాడులు పెరుగుతున్నాయి. యురప్‌లో కూడా ప్రజల అసంతృప్తిని అసరా చేసుకొని ఫాసిస్టు పార్టీలు అధికారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

మరోవైపు కార్మికవర్గంలోని, పురోగామి శక్తులు, సామ్రాజ్యవాదాన్ని సంపూర్ణంగా తుదముట్టించేందుకు, కార్మికవర్గాన్ని, వివిధ వర్గాల ప్రజలను చైతన్యవంతం చేస్తూ, సమరశీల పోరాటాలకు నేతృత్వం వహిస్తున్నారు. ఈ పోరాటాల నుండే నిజమైన విప్లవ (మావోయిస్టు) పార్టీలు ఆవిర్భవిస్తున్నాయి. ఈ పరిస్థితులన్నీ పెట్టుబడిదారీ దేశాల్లో బుర్జువా వర్గానికీ, కార్మిక వర్గానికి నడుమ పెరుగుతున్న వైరుధ్యాల తీవ్రతను తెలియజేయడమే కాకుండా, సోషలిస్టు విప్లవాలకు అవసరమైన భౌతిక ప్రాతిపాదికను ఏర్పరుస్తున్నాయి.

పై నేపథ్యంలోనే వివిధ సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యం కూడా రోజురోజుకు తీవ్రతరం అవుతున్నది. 1991 మధ్య నాటికి, రష్యా తన అగ్రరాజ్య హెూదాను కోల్పోయి, అమెరికాతో కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం నుంచి వైదొలగింది. దీనితో సామ్రాజ్యవాద అగ్రరాజ్యల మధ్య ప్రథమ స్థానంలో ఉన్న పోటీని తాత్కాలికంగా కుమ్మక్కు అక్రమించింది. కానీ కాలక్రమంలో ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం ఫలితంగా, సామ్రాజ్యవాద దేశాల బలాబలాల్లో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రష్యా 1991 నాటికి అగ్రరాజ్య స్థాయిని కోల్పోయినప్పటికీ, అతి పెద్ద చమురు నిల్వలతో, అతిపెద్ద ఆయుధ సరఫరాదారుగా, విస్తారమైన పారిశ్రామిక పునాదిని కలిగి, స్పేస్ టెక్నాలజీ, స్టీల్ వంటి రంగాలలో ప్రపంచంలోనే మొదటి స్థానం సంపాదించి బలమైన పునాదిని కలిగి వున్నది. తదుపరి కాలంలో, ఈ అనుకూల అంశాలను ఉపయోగించుకొని, వాడకం సరుకుల కొరత, ఆహార కొరత వంటి సమస్యలను కొంత మేరకు పరిష్కరించుకొని ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాచి వేయగల ఫాసిస్టు పాలనను స్థిరపరచుకున్న తర్వాత, అది తిరిగి తన పాత మార్కెట్‌లను చేజిక్కించుకొనేందుకు సిద్ధమైంది. ఉక్రెయిన్‌లో అంతర్‌యుద్ధాన్ని సృష్టించడంతో పాటు, 'క్రిమియా' ప్రాంతాన్ని రిఫరెండం ముసుగులో దాని నుండి స్వాధీనం చేసుకున్నది. సిరియాలో 'బషర్ అల్ అసద్' ప్రభుత్వానికి మద్దతుగా తన సైన్యాన్ని దింపింది. ఉత్తర కొరియా చర్యలన్నింటికీ వెనుక నుండి తన గట్టి మద్దతు తెలియజేస్తున్నది.

చైనాలో కామ్రేడ్ మావో అమరుడైన తర్వాత, చైనా కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టు పార్టీగానూ, కార్మికవర్గ నియంతృత్వం బూర్జువా వర్గ నియంతృత్వంగాను మారాయి. కమ్యూనిస్టు ముసుగులో ఉన్న ఈ దోపిడీ పాలక వర్గాలు, అప్పటి సోషలిస్టు ఆర్థిక వనరులను శక్తివంతంగా వినియోగించుకొని, అన్ని రంగాలలో వేగంగా పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేశాయి. ఈ క్రమంలోనే చైనా సామ్రాజ్యవాద శక్తిగా అవతరించి, మార్కెట్ పునర్‌విభజన కోసం అమెరికాతో తీవ్రంగా పోటీ పడుతున్నది. దక్షిణ చైనా సముద్రంలో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు కృత్రిమ దీవులను నిర్మించడంతో పాటు, అక్కడ వేలాది సైన్యాన్ని మోహరించి, ఇతర దేశాల సముద్ర ప్రయాణాలపై ఆంక్షలు విధిస్తున్నది. తూర్పు చైనా సముద్రంలో 'సెంకాకు' దీవులపై ఆధిపత్యం కోసం జపాన్‌తో ఘర్షణ

పడుతున్నది. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, దక్షిణ ఆసియా దేశాలలోకి తన ద్రవ్య పెట్టుబడులను విస్తరిస్తూ, అమెరికాకు వ్యతిరేకంగా తన ప్రభావాన్ని పెంచుకుంటున్నది. 2013లో జిన్‌పింగ్, 'సిల్క్ రోడ్' పునరుద్ధారణకు వన్ బెల్ట్ వన్ రోడ్ (ఒబోర్)కు శ్రీకారం చుట్టాడు. చైనా ఈ బృహత్తర పథకానికి 124 బిలియన్ (80 లక్షల కోట్లు) డాలర్లను వెచ్చిస్తున్నది. ఈ పథకం ద్వారా ప్రపంచంలోని, వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలను అనుసందానిస్తూ, వాటిపై పట్టు సాధించాలని చూస్తున్నది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, తిరుగులేని శక్తిగా అవతరించిన, అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ ఆధిపత్యం కోసం ఎడతెరుపి లేని యుద్ధాలను కొనసాగించింది. అందుకు అనుకూలంగా తన ఆర్థిక వ్యవస్థను, యుద్ధ ఆర్థిక వ్యవస్థగా మలిచింది. అయితే అది తన లక్ష్యాన్ని సాధించలేకపోగా, లక్షల కోట్ల డాలర్ల ప్రజాధనాన్ని బుగ్గిపాలు చేసి, రాజకీయంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా బలహీనపడింది. ఈ స్థితిలో మిత్ర దేశాలను తన పక్షాన నిలబట్టుకోలేక పోతున్నది. ఆర్థిక రంగంలో అమెరికాకు, ఇ.యు.లకు మధ్య పెరుగుతున్న పోటీ రీత్యా, నాటో కూటమి కోసం గతంలోలాగా నిధులు కేటాయించలేక పోతున్నది. నాటో కూటమిని సమైక్యంగా ఉంచలేకపోతున్నది. అయినప్పటికీ, దాని ఆధిపత్య ధోరణిగానీ, యుద్ధోన్మాదం గాని ఏమాత్రం తగ్గలేదు. అమెరికన్ పాలక వర్గాల ఆలోచనలకు ట్రంప్ ఈ మధ్య చేస్తున్న దుందుడుకు ప్రకటనలు, చర్యలు అద్దం పడుతున్నాయి. ఉత్తర కొరియాపై దాడి చేస్తానని హుంకరించడం, ఇరాన్‌తో కుదిరిన ఆరు దేశాల అణు ఒప్పందం నుండి వైదొలగడం, 195 దేశాలు సంతకం చేసిన పారిస్ పర్యావరణ ఒప్పందం నుండి తప్పుకోవడం, ఆఫ్ఘన్‌లో యుద్ధాన్ని కొనసాగిస్తానని ప్రకటించి, 'తాలిబాన్ల'ను వేటాడే పేరుతో అతి పెద్ద అణుయేతర బాంబు (మథర్ బాంబు)ను వేయడం వగైరా ఉన్మాద ప్రకటనలు, చర్యలు దాని దుందుడుకు స్వభావాన్ని బహిర్గత పరుస్తున్నాయి. అంతేకాకుండా చైనా విస్తరణను అడ్డుకొనేందుకు అమెరికా, జపాన్, భారత్, ఆస్ట్రేలియాలను క్వాడ్(చతుర్భుజి)గా ఏర్పరిచి, ఇండోపసిఫిక్ ప్రాంతంలో కీలకపాత్ర పోషించాలని ప్రయత్నిస్తున్నది. దక్షిణ చైనా సముద్రంలో చైనా ఆధిపత్యాన్ని దెబ్బతీసేందుకు నిఘా లక్ష్యంతో తన జలాంతర్గాములను పంపిస్తున్నది. సిరియాలో రష్యా అనుకూల ప్రభుత్వాన్ని కూలదోసేందుకు 'ఫ్రీ సిరియా ఆర్మీ'ని నిర్మించి, దాని సాయుధ చర్యలకు అన్ని రకాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నది. దక్షిణ కొరియాలో థాడ్ (టెర్మినల్, హై ఆటిట్యూడ్ డిఫెన్స్) మిస్సైల్ రక్షణ వ్యవస్థను ఏర్పటు చేసి, రష్యా, చైనాలను లక్ష్యంగా చేసుకోవాలని ప్రయత్నిస్తున్నది. డిసెంబర్ 2017లో రూపొందించిన జాతీయ భద్రత వ్యూహానికి సంబంధించిన నివేదికలో, 'రష్యా, చైనాలే తమకు ప్రధాన పోటీదారులని' ప్రకటించి, రక్షణ బడ్జెట్‌ను, పెద్ద ఎత్తున పెంచేందుకు నిర్ణయం తీసుకున్నది. ప్రచ్ఛన్న యుద్ధానికి తలుపులు తెరుస్తున్నది. మరోవైపు ఈ నివేదిక భారత్‌ను 'ప్రధానమైన ప్రపంచ శక్తిగా' గుర్తించి దానిని పూర్తిగా తన పంచన చేర్చుకోవాలని ప్రయత్నిస్తున్నది.

ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా, యురప్ కూటమికి పోటీగా చైనా, రష్యా కూటమి రంగంలోకి దిగింది. చైనా, రష్యాలు కలిసి దక్షిణాఫ్రికా, బ్రెజిల్, భారత్‌లను కలుపుకొని 'బ్రిక్స్' వాణిజ్య సంస్థను ఏర్పరిచాయి. చైనా నాయకత్వంలో 'షాంఘై సహకార మండలి' ఏర్పడింది. ఈ మధ్య కాలంలో, ఇందులోకి భారత్, పాకిస్తాన్‌లు సభ్య దేశాలుగా చేరాయి. అమెరికా నిర్వాహణలోని ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచ బ్యాంకులకు పోటీగా చైనా, రష్యాల నేతృత్వంలో 'బ్రిక్స్ బ్యాంకు'ను ఏర్పరిచాయి. చైనా నేతృత్వంలో 'ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు' ఏర్పడింది. చైనా, రష్యాలు ఈ ద్రవ్య సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా, అమెరికా కూటమికి వ్యతిరేకంగా ఆర్థిక, వాణిజ్య రంగాలలో పోటీని తీవ్రతరం చేశాయి. మార్కెట్ పునర్విభజన కోసం వాణిజ్య రంగంలో పెరుగుతున్న పోటీ క్రమంగా సైనిక రంగంలో ఉద్రిక్తతలుగా మారుతున్నాయి. ఈ స్థితిలో భౌగోళిక, రాజకీయ (జియో, పొలిటికల్) సమీకరణలు (రీ-అలైన్‌మెంట్) మారుతున్నాయి. ఎప్పటినుండో, అమెరికా, యురప్ దేశాలకు అతి సన్నిహితంగా ఉంటూ, నాటో కూటమిలో భాగస్వామిగా ఉన్న ఏకైక ఆసియా దేశం టర్కీ, క్రమంగా అమెరికా కూటమికి దూరమై, రష్యాతో స్నేహ సంబంధాలు మెరుగుపరుచుకుంటున్నది. ఇందుకు అక్కడి భౌగోళిక, రాజకీయ సమస్యలే ప్రధాన కారణం. ఈ మధ్య కాలంలో, టర్కీలో జరిగిన మిలటరీ తిరుగుబాటుకు కారణం అయిన ఒక మత గురువుకు, అమెరికా రక్షణనిస్తున్నదని టర్కీ ఆరోపిస్తున్నది. అలాగే, టర్కీ, కుర్దుల మధ్యన రాజుకుంటున్న వివాదంలో, అమెరికా కూటమి కుర్దులకు మద్ధతు తెలియజేస్తున్నది. ఈ కారణాల రీత్యా టర్కీ, అమెరికా కూటమికి మధ్య దూరం పెరుగుతున్నది. అలాగే ఎప్పటి నుండో అమెరికాకు అనుకూలంగా ఉన్న ఫిలిప్పీన్స్‌కు డ్యూటరైట్ అధ్యక్షుడైన పిదప, అమెరికాను దూరంగా వుంచి, చైనాతో సత్ సంబంధాలు ఏర్పర్చుకోవడంతో, దక్షిణ చైనా సముద్రంలో వారిరువురి మధ్య వున్న వివాదం కొంత వెనుకపట్టు పట్టింది. ఇది అమెరికాకు ఏ మాత్రం రుచించడం లేదు. భారత్‌లో మోదీ నేతృత్వంలోని దోపిడీ పాలక వర్గాలు, రెండు పక్షాలతో చెలిమి చేస్తున్నట్లు వ్యవహరిస్తున్నప్పటికీ, అమెరికా కూటమికి సాగిలపడే ధోరణే ప్రధానంగా కనిపిస్తున్నది. అటువైపు నుండి కూడా అమెరికా కూటమితో పాటు చైనా రష్యా కూటమి కూడా భారత్‌ను పూర్తి స్థాయిలో తమకు అనుకూలంగా మలచుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే ఈ ప్రాంతంలో ఉన్న భౌగోళిక, రాజకీయ సమస్యల వల్ల అంటే, భారత్‌కు చైనా పాకిస్తాన్‌లతో వున్న భౌగోళిక, రాజకీయ విభేదాల వల్ల భారత్ పూర్తిస్థాయిలో అమెరికాకు అనుబంధ దేశంగా మారే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అటువైపే మొగ్గు కనిపిస్తున్నది. భారతదేశానికి చెందిన దోపిడీ పాలక వర్గాల వలనే, పాకిస్తాన్ దోపిడీ పాలక వర్గాలు కూడా ప్రస్తుతం రెండు పడవలపై

8వ పేజీలో...

ఎస్.ఎమ్.సి. సందేశం

# శత్రు ప్రతీఘాతుక, బహుముఖ, హంతకదాడిని గెరిల్లా యుద్ధ ఎత్తుగడలతో తిప్పి కొడదాం!

## నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో ప్రజాయుద్ధాన్ని విస్తృతం, తీవ్రతరం చేస్తూ, ప్రజలను, మిలీషియాను సంఘటితం చేద్దాం, సాయుధం చేద్దాం!

## పి.ఎల్.జి.ఎ. 17వ వార్షికోత్సవాల సందర్భంగా ఎస్.ఎమ్.సి. పిలుపు!

*ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా !*

డిసెంబర్ 2, 2000న భారత పీడిత ప్రజలు తమదైన కార్మిక, కర్షక ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని (పి.ఎల్.జి.ఎ) ఏర్పాటు చేసుకున్న రోజు. తాము దశాబ్దాల తరబడి ఎదురు చూసిన ఆశాకిరణం. భారత విప్లవోద్యమంలో ఎర్రతేజమై మెరిసిన రోజు. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అంతర్భాగంగా సాగే భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం, అంతర్జాతీయ కార్మికవర్గ సైన్యానికి చెందిన ఒక డిటాచ్‌మెంట్ (విభాగం)గా ఆవిర్భవించింది పి.ఎల్.జి.ఎ. ఆరోజు ప్రపంచ పీడిత ప్రజానీకానికీ, నిర్ధిష్టంగా భారతదేశంలో సకల పీడిత వర్గాల, జాతుల, తెగల విముక్తికి ప్రగాఢమైన హామినిచ్చింది. భారత విప్లవ మహెూపాధ్యాయులు కామ్రేడ్ చారుమజుందార్, కన్హాయ్‌చటర్జీల కలల్ని సాకారం చేస్తూ, భారతదేశంలో రివిజనిజాన్ని నడ్డి విరిచి, సాయుధ పోరాట మార్గాన్ని ఎలిగెత్తి చాటుతూ గొప్ప ఉత్తేజాన్ని, ఉత్సాహాన్నిచ్చింది. డిసెంబర్ 2, 2017 నాటికి మన వీర పి.ఎల్.జి.ఎ. 17 వసంతాలు పూర్తి చేసుకోబోతుంది. ఈ సందర్భంగా మన ఎ.ఒ.బి. గెరిల్లాజోన్ ప్రాంతంలో 17వ వార్షికోత్సావాలను అత్యంత ఆనందోత్సాహాలతో జరపాల్సిందిగానూ, భారత విప్లవోద్యామాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో, దోపిడీ పాలకవర్గాలు ప్రజలపై సాగిస్తున్న పాశవిక గ్రీన్‌హంట్ హంతకదాడిని ప్రజాయుద్ధం ఎత్తుగడల ద్వారా ఓడించేందుకు అత్యంత తెగువతో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం, విస్తృతం చేస్తూ విస్తరించాల్సిందిగా అన్ని స్థాయి కమాండ్లకు, పార్టీ కమిటీలకు, పి.ఎల్.జి.ఎ., మాస్‌వర్క్ యూనిట్స్‌కు, విప్లవ ప్రజానికానికి ఎ.ఒ.బి-ఎస్.ఎమ్.సి. పిలుపునిస్తుంది. ఈ క్రమంలో పి.ఎల్.జి.ఎ. సాధించిన సకారాత్మక, నకారాత్మక అనుభవాలను సకల పి.ఎల్.జి.ఎ. పోరాట యోధులకు శిక్షణ గరిపేందుకు ఈ అవకాశాన్ని అద్భుతంగా ఉపయోగించుకోవల్సిందిగా కోరుతుంది.

ఈ సంవత్సర కాలంలో శత్రువు కొనసాగించిన విప్లవ ప్రతీఘాతుక హంతక దాడిలో కేంద్రకమిటీ స్థాయి నుండి సాధారణ విప్లవ ప్రజానీకం వరకు అనేక మంది మన ప్రియతమ కామ్రేడ్స్ తమ విలులైన ప్రాణాలను ఈ నేలతల్లి విముక్తి కోసం ధారపోశారు. వీరిలో కేంద్ర కమిటీ పోలిట్ బ్యూరో సభ్యుడైన కామ్రేడ్ నారాయణ సన్యాల్ (విజయ్ దా) క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ అమరుడు కాగా, మరో కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ దేవరాజు (యోగేష్, రమేష్) తో పాటు, మరో ఎమ్.జడ్.సి. స్థాయి కామ్రేడ్ అజిత(కావేరి)ను పోలీసులు పట్టుకొని తీవ్ర చిత్రహింతసలకు గురి చేస్తూ, బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు.

మరోవైపు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పి.ఎల్.జి.ఎ.) 16వ వార్షికోత్సవాలకు కొద్దినెలలు ముందే, రాంగూడ దగ్గర శత్రువు మనపై జరిపిన మారణకాండ యావత్ పీడిత ప్రజలను

---

*7వ పేజీ తరువాయి...*

కాళ్ళు పెట్టిన చందంగా కనిసిస్తున్నప్పటికీ, మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, చైనా, రష్యా కూటమికి అనుబంధ దేశంగా మారే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

నేడు ప్రపంచ పెట్టుబడిదారీ విధానం ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభాల కారణంగానే సామ్రాజ్యవాద శక్తుల బలాబలాల సమతూకంలో మార్పులు వచ్చాయి. ఈ మార్పులకు అనుగుణంగానే మార్కెట్ పునర్విభజన ఊపందుకుంది. ప్రముఖ సామ్రాజ్యవాద శక్తుల మధ్య వాణిజ్య, సైనిక ఘర్షణలు పెరుగుతున్నాయి. ఈ శక్తులు తమ బలాలను పెంచుకునేందుకు పునర్‌సమీకరణలను ప్రోత్సాహిస్తున్నాయి. మొదటి రెండు ప్రపంచ యుద్ధాలు కూడా సామ్రజ్యవాద శక్తుల బలాబలాల సమతూకంలో వచ్చిన మార్పుల వల్లనే జరిగాయి. అయితే నేడు ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ విముక్తి పోరాటాలు, ప్రజాస్వామిక విప్లవ పోరాటాలు, ప్రజా పోరాటాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ మొత్తం పరిస్థితిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు, కామ్రేడ్ మావో ఇచ్చిన ఈ అంచనా –"ప్రపంచ యుద్ధమే బద్ధలైతే విప్లవ వెల్లువకు దారి తీయవచ్చు, లేదా విప్లవ వెల్లువే ప్రపంచ యుద్ధాన్ని నివారించవచ్చు, ఏ విధంగా జరిగినా విప్లవమే నేటి ప్రపంచంలో ప్రధాన ధోరణి" –అనే ఈ సూత్రీకరణ నేడు అత్యంత ప్రాసంగికతను కలిగి వున్నది. ✦

దుఃఖసాగరంలో ముంచెత్తింది. ఈ ఘటనలో 31 మంది మన ప్రియతమ కామ్రేడ్స్ శత్రువుతో విరోచితంగా పోరాడుతూ నేలకొరిగారు. 2016 అక్టోబర్ నుండి జూన్ 2017 వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజాసంఘాల సభ్యులు, నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బి.లో బాకూరి వెంకటరమణరాజు (ప్రసాద్) ఎస్.జడ్.సి.ఎమ్., చామల కిష్టయ్య (దయ) ఎస్.జడ్.సి.ఎమ్, ప్రభాకర్ (గంగాధర్) డి.వి.సి.ఎమ్., సువర్ణరాజు (కిరణ్) డి.వి.సి.ఎమ్., బొడ్డు కుందనం (మమత) ఎ.సి.ఎమ్., భారతి (లత) ఎ.సి.ఎమ్., సింహాచలం (హరి) ఎ.సి.ఎమ్., గౌతం (సుర్జిత్ దర్రో) టెక్నికల్ డిపార్ట్‌మెంట్ కమాండర్, పృధ్వీ (మున్నా) సి.ఆర్.సి.పి.ఎల్-పి.పి.సి.ఎమ్., పి.ఎల్ డిప్యూటీ కమాండర్, కేశవరావు (బిర్సు) సి.ఆర్.సి.పి.ఎల్-పి.పి.సి.ఎమ్, సెక్షన్ కమాండర్, భీమ (రాజేష్) సి.ఆర్.సి.పి.ఎల్-పి.పి.సి.ఎమ్., నంగాల్ (ఎర్రాల్) సి.ఆర్.సి.పి.ఎల్-పి.పి.సి.ఎమ్, సాధురాం (దాసురాం) సి.ఆర్.సి.పి.ఎల్-పి.ఎమ్., సూరి (నరేష్) సి.ఆర్.సి.పి.ఎల్-పి.ఎమ్, దాసు (మధు) ప్రొటక్షన్ పి.ఎల్-పి.పి.సి.ఎమ్., సోడి బుద్రి, ప్రొటక్షన్-పి.ఎల్., పి.పి.సి.ఎమ్., సెక్షన్ డిప్యూటీ కమాండర్, మాడవి ఉంగి (మంజుల) ప్రొటక్షన్ పి.ఎల్-పి.పి.సి.ఎమ్., పాయికే (చిలక) ప్రొటక్షన్ పి.ఎల్-పి.ఎమ్., గంగాల్ ప్రొటక్షన్ పి.ఎల్-పి.ఎమ్. లక్కె (కమల) ప్రొటక్షన్ పి.ఎల్-పి.ఎమ్, రజిత (శాంతి) పి.ఎమ్., జ్యోతి, పి.ఎమ్., మిలీషియా కామ్రేడ్స్ సిందే, దాసు, కొములు, జయరాం, శ్యామల, జొమ్మి, కావేరి, కమల, లక్ష్మణ్, కోరాపుట్ శ్రీకాకుళం డివిజన్‌లో కాంత (పద్మ) ఎ.సి.ఎమ్., అంకు (టుబ్రి) ఎ.సి.ఎమ్., ఈస్ట్ డివిజన్‌లోని గొర్లమెట్టలో జాంబ్రి ఎ.సి.ఎమ్., చిట్టిబాబు (మిలీషియా సభ్యుడు) నేలకొరిగారు. ఈ కామ్రేడ్స్‌తో పాటు దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో విరోచితంగా పోరాడుతూ అమరులైనారు.

కటాఫ్ ప్రాంతంలో దకడపాదర్ గ్రామ మిలీషియా సభ్యుడిని శత్రువు పట్టుకొని, తీవ్ర చిత్రహింసలకు గురి చేయడంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఎ.పి.లో విప్లవమేధావి కామ్రేడ్ వర్ధనరావు, సీనియర్ కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు కామ్రేడ్ అనసూయమ్మలు వృద్ధాప్యంలో అమరులైనారు.

దేశ వ్యాపితంగా చూసినప్పుడు మన పి.ఎల్.జి.ఎ.యోధులు విప్లవ ప్రజా సంఘాల కార్యకర్తలు, ప్రజలు తమ అమూల్యమైన ప్రాణాలు ధారపోశారు. వీరందరూ ఆదర్శప్రాయులే. ఈ అమరులందరికీ ఎ.ఒ.బి-ఎస్.ఎమ్.సి. తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తున్నది. వీరి త్యాగాల దారిలో, విప్లవ ఆదర్శాలను అనుసరిస్తూ, వారి ఆశయాల సాధన కోసం తుదకంటా పోరాటం కొనసాగిస్తూ, అమరుల కలలని నిజం చేద్దామని శపదం చేద్దాం.

'జోన్ ప్రధాన కర్తవ్యమైన గెరిల్లా యుద్ధం తీవ్రతరం చేద్దాం' అనే కర్తవ్య సాధనలో భాగంగా ఈ సంవత్సర కాలంలో మన ప్రధాన, ద్వితీయ, పునాది బలగాలు చేపట్టిన ఎత్తుగడల ఎదురు దాడులు, ప్రతిఘటనా క్యాంపియన్లలో మనం కొన్ని సకారాత్మక, నకారాత్మక ఫలితాలను పొందాం. శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్‌లో శత్రువు బలహీనతలపై ఆధారపడి, సుంకి గాటి దగ్గర మన పి.ఎల్.జి.ఎ. బలగాలు చేసిన డెలిబరేట్ అంబూష్‌లో 9 మంది ఓ.ఎస్.ఎ.పి. పోలీసులను మట్టుబెట్టి, మరో 4గురిని తీవ్రంగా గాయపర్చాం. రాంగూడ మారణకాండ తర్వాత శత్రువుపై మనం జరిపిన ఈ సంఘటన ప్రజలమీద, పార్టీ, పి.ఎల్.జి.ఎ. క్యాడర్‌పై మంచి ప్రభావాన్ని వేసింది. అయితే శత్రువు నిరాయుధంగా వుండటంతో ఆయుధాలు దొరకలేదు. ఎమ్.కె.వి.బి. డివిజన్, కోరుకొండ ప్రాంతంలో శత్రువుపై జరిపిన మరో డెలిబరేట్ అంబూష్‌లో ఒక హెూంగార్డును ఖతం చేసాం. ఈ చర్యలో మనకు ఫలితాలు తక్కువగానే ఉన్నప్పటికీ, ఎ.పి. భూభాగం మీద జరగడంతో శత్రువు అదిరిపోయాడు. ఈ ఘటన తర్వాత, శత్రువు అనేక జాగ్రత్తలు తీసుకుంటూ, తిరగాల్సిన పరిస్థితులు ఏర్పాడ్డాయి. వీటితో పాటు, పదుల సంఖ్యల్లోనే ప్రజాద్రోహులను, ప్రజల సమక్షంలో విచారించి శిక్షించాం. మనం చేపట్టిన టి.సి.ఒ.సి. క్యాంపెయిన్‌లలోనూ, ప్రతిఘటనా కార్యక్రమాలలోనూ ప్రజలు తమ సంపూర్ణ మద్ధతును తెలియజేస్తూ, పార్టీ, పి.ఎల్.జి.ఎ.లను కంటికి రెప్పలా కపాడుకున్నారు. భూమి, విస్తాపన, ఇతర ప్రజా సమస్యలను తీసుకొని, ప్రజలను ఆయా పోరాటాల్లో మిలిటెంట్‌గా కదలించడానికి చేసిన ప్రయత్నాల్లో కొంత పురోభివృద్ధి వుంది. కొన్ని ప్రాంతాల్లో ప్రజల, మిలీషియా కదలికల్లో మెరుగుదల కన్పిస్తుంది. వీటిని మరింత సంఘటితం చేసుకునే విధంగా మన ప్రయత్నాలను కొనసాగించాలి. వాళ్ళను సైద్ధాంతిక, రాజకీయ, మిలటరీపరంగా తర్ఫీదు చేసుకోవడం ద్వారా శత్రువును దెబ్బతీయటానికి మరికొన్ని అనుకూలతలను సృష్టించుకోగల్గుతాం. ప్రజాయుద్ధంలో ప్రజల యొక్క క్రియాశీలక భాగస్వామ్యం పెరిగినప్పుడే, ఆ ఉద్యమం ఒక గుణాత్మకమైన మార్పును తీసుకుంటుంది. దీని కోసం ఎస్.జడ్.సి.లో రూపొందించుకున్న సంఘటితీకరణ క్యాంపెయిన్‌ను, పార్టీ, పి.ఎల్.జి.ఎ.లలో పని చేస్తున్న అన్ని స్థాయిల కామ్రేడ్స్ బోల్షివిక్ స్పిరిట్‌తో విజయవంతం చేసేందుకు ప్రయత్నించాలి.

## శత్రుదాడి పధకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ వ్యాపితంగా 2009 సం॥రం నుండి ఆపరేషన్ గ్రీన్‌హంట్ హంతక దాడిని, బహుముఖ పద్ధతుల్లో కొనసాగిస్తూ వస్తున్నాయి. నిర్ధిష్టంగా మన జోన్ సంబంధంలో చూసినపుడు, కార్పెట్ సెక్యూరిటీని బలోపేతం చేసుకోవడంలో భాగంగా, అనేక పోలీసు క్యాంపులు ఉద్యమ ప్రాంతంలో వెలిసాయి. మరికొన్ని క్యాంపుల ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు జరుగుతున్నాయి. విశాఖ ప్రాంతంలో బాక్సైట్‌ను వెలికితీయడం కోసం 100 ఔట్‌పోస్టులు ఏర్పాటు చేయటానికి శత్రువు ప్రణాళికలు రూపొందించాడు. కటాఫ్ ఉద్యమాన్ని అణచివేయడానికి గురుప్రియ

బిడ్జిని ఆగమేఘాల మీద పూర్తి చేస్తున్నాడు. కొరాపుట్‌లో, నారాయణపట్నా భూపోరాటాలను అణచివేయడానికి కార్పెట్ సెక్యూరిటీని విస్తృతం చేశాడు. వీటితో పాటు, వ్యూహాత్మక నాయకత్వాన్ని నిర్మూలించటానికి శత్రువు ఆలౌట్ అభియాన్ క్యాంపెయిన్‌ను కొనసాగించాడు. నిరంతరం నాయకత్వ కదలికలపై నిఘాను కొనసాగించడం కోసం, స్థానిక ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవడంతో పాటు, ఇజ్రాయిల్ దేశ సహకారంతో టెక్నికల్ ఇంటలిజెన్స్‌ని, ఆధునిక ఆయుధాలను సమకూర్చుకోవడం చేస్తున్నాడు. ఈ మధ్య కాలంలో ఇజ్రాయిల్ దేశ పోలీసు ఆఫీసర్స్ మన ప్రాంతంలో ఏరియల్ సర్వేలు నిర్వహించి, అనేక కుట్ర పూరితమైన పథకాలను రూపొందించారు. ఇజ్రాయిల్ దేశం నుండి కొనుగోలు చేసిన డ్రోన్స్, టోయ్‌లు, ఈ మధ్య కాలంలో మన ప్రాంతంలో రాత్రి, పగలు విస్తృతంగా సంచరిస్తున్నాయి.

విప్లవోద్యమానికి వ్యతిరేకంగా సాగించే కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్ ఎత్తుగడల్లో భాగంగా ఉపయోగిస్తున్న కమాండో బలగాల్లో గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి., డి.బి.ఎఫ్., కోబ్రా బలగాలు కీలకంగా వుంటున్నాయి. ఉద్యమ ప్రాంతంలో టెర్రయిన్ గురించి తెలిసిన లంపెన్ శక్తులను, గూండాలను వీటిలో నియమిస్తున్నారు. పార్టీ, పి.ఎల్.జి.ఎ. నుండి పారిపోయిన, సరెండర్ అయి విప్లవ ప్రతీఘాతుకులుగా మారిన వారిలో అత్యధికులు ఈ కమాండ్ బలగాల్లో చేరుతున్నారు. ఫీల్డ్ ఆపరేషన్స్‌ల్లో పైన చెప్పిన కమాండ్ బలగాలే స్ట్రైకింగ్ ఫోర్స్‌గా ఉంటూ, మిగతా బి.ఎస్.ఎఫ్., సి.ఆర్.పి.ఎఫ్., తదితర పారామిలటరీ బలగాలు సపోర్టు, సెక్యూరిటీ బలగాలుగా వుంటున్నాయి. అందుకే రానున్న రోజుల్లో మన పి.ఎల్.జి.ఎ. బలగాలు పైన చెప్పిన కమాండ్ బలగాలను నిర్మూలించకుండా ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోలేము.

పార్టీ నాయకత్వంపై క్యాడర్‌లకూ, పార్టీపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లేలా అసత్యాలను ప్రచారం చేస్తూ, శత్రువు నిరంతరం వేరు వేరు రూపాలలో మానసిక యుద్ధాని కొనసాగిస్తున్నాడు. మరో వైపు లక్షలాది రూపాయలను ఇస్తామని ఆశ చూపుతూ, ప్రలోభాలకు గురి చేసి, సరెండర్స్‌ను ప్రోత్సహిస్తున్నాడు. వీటితో పార్టీ, పి.ఎల్.జి.ఎ.లలో కొందరు బలహీనులు శత్రువుకు లొంగిపోయి విప్లవ ప్రతీఘాతకులుగా మారుతున్నారు.

### శత్రువు ఎత్తుగడలను తిప్పికొడదాం

ఎ.ఒ.బి. ఉద్యమ ప్రాంతానికి వున్న వ్యూహాత్మక ప్రాధాన్యత రీత్యా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొదటి నుండీ ఉద్యమాన్ని అణచివేయడానికి తీవ్రమైన ప్రయత్నాలను కొనసాగిస్తూ వస్తున్నాయి. అందులో భాగంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్, బహుముఖ దాడిలో రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, సైనికంగా ఎన్నో రకాల ఎత్తుగడలను అనుసరిస్తున్నాయి. అయితే శత్రువు వ్యూహాత్మకంగా కాగితపు పులే అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, శత్రు ఎత్తుగడలకు ధీటైన ప్రతిఎత్తుగడలను అనుసరించడం ద్వారా వాడిని ఓడించగల్గుతాము.

సామ్రాజ్యవాద, దళారీ బూర్జువా కార్పొరేట్ సంస్థలు సాగించే దోపిడీ కోసమే ప్రజలపై యుద్ధంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ (ఆలౌట్ క్యాంపెయిన్)కొనసాగుతుందని బహిర్గత పర్చుతూ, ప్రజలను రాజకీయంగా సమీకరించడానికి మనం చేస్తున్న రాజకీయ కృషిని మరింత తీవ్రతరం చేయాలి.

దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలు, వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పబ్లిక్, ప్రైవేటు పార్ట్నర్‌షిప్ పేరుతో తలపెట్టిన, కొనసాగిస్తున్న మైనింగ్ ప్రాజెక్టులు, రోడ్డులు, డ్యాములు తదితర పనులవల్ల, వేల ఎకరాల భూములను కోల్పోయి, లక్షల సంఖ్యలో ప్రజలు విస్తాపితులవుతున్నారు. విస్థాపితులైన పీడిత రైతాంగాన్నీ, ఆదివాసీలను సమీకరించి మిలిటెంట్ పోరాటాలు చేపట్టాలి. ఈ పోరాటాలకు పార్టీ, పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ సమర్థవంతమైన నాయకత్వం వహించాలి. ఈ పోరాటాల్లో ముందుకు వచ్చిన శక్తులను రాజకీయంగా అభివృద్ధి చేసుకుంటూ రిక్రూట్ వనరుగా మల్చుకోవాలి.

కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్ ఎత్తుగడలను అనుసరిస్తున్న వివిధ రకాల కమాండో బలగాలు ఫీల్డ్‌లో అనుసరిస్తున్న ఎత్తుగడలను నిరంతరం అధ్యయనం చేస్తూ, శత్రువును శాస్త్రీయంగా అంచనా వేసి మన ప్రజాపునాది, పటిష్టత, బలహీనతలు, టెర్రయిన్ అనుకూల, ప్రతికూలతలను పరిగణలోకి తీసుకొని, ఈ ప్రాంతంలో కొనసాగించే యుద్ధ ఎత్తుగడలను అభివృద్ధి చేయాలి.

పరిమిత ప్రాంతంలో కాకుండా, విశాల ప్రాంతంలో మన కదలికలు కొనసాగించడం ద్వారా శత్రువు దాడి నుండి మనం రక్షించుకోగల్గుతాం. శత్రువు నెట్‌వర్క్‌ను ఎప్పటికప్పుడు ప్రజల సహకారం, ఆమోదంతో గుర్తించి ధ్వంసం చేయాలి.

మన కార్యాచరణలో జరుగుతున్న లోపాలను, బలహీనతలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ, బయటపడే విధంగా మన కృషిని కొనసాగించాలి. లీగలిజం, గెరిల్లా నియమాలు, పద్ధతులను అమలు చేయడంలో కొనసాగుతున్న అలసత్వం, శత్రువును ఎదుర్కొనే విషయంలో మనలో కొనసాగుతున్న మిలటరీ బలహీతనతలు, పరిమితులను అధిగమించాలి. స్వార్థపూరిత ఆలోచనల నుండి బయటపడుతూ, ప్రజల కోసమే సర్వస్వం ధారపోస్తాననే కమ్యూనిస్టు ఆలోచనకు అనుగుణంగా గట్టి పునాదిని ఏర్పర్చుకోవాలి. శత్రువు కొనసాగించే మానసిక యుద్ధానికీ, చూపించే ప్రలోభాలకు గురికాకుండా పి.ఎల్.జి.ఎ. తన రాజకీయ దృఢత్వాన్ని పెంపొందించుకోవాలి. పీడిత ప్రజలను దోపిడీ చేస్తూ, తమ అధికారాన్ని ఎల్లకాలం నిలబెట్టుకోవడానికి దోపిడీ పాలక వర్గాలు నిరంతరం ప్రయత్నం చేస్తాయే తప్ప, పీడిత ప్రజల మేలును అవి ఎప్పుడు కోరుకోవు. దోపిడీ వర్గాలను కాపాడటం కోసమే రాజ్య యంత్రాంగం (కోర్టులు, జైళ్ళు, పోలీసులు) ఉనికిలో ఉంటాయనేది మనం దృష్టిలో పెట్టుకోవాలి. అందుకే శత్రువు చేస్తున్న ప్రచారం ఏదైనా మోసమే, మనకు నష్టదాయకమే అనే విషయాన్ని గుర్తించి చైతన్యవంతంగా శత్రువు ప్రచారాన్ని తిప్పి కొట్టాలి.

## పి.ఎల్.జి.ఎ.ను సంఘటిత పర్చుకుందాం

గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దామనే మన జోన్ ప్రధాన కర్తవ్యాన్ని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా మన పార్టీ, పి.ఎల్.జి.ఎ., ఐక్యసంఘటనలో పని చేస్తున్న కామ్రేడ్స్ వాళ్ళ కర్తవ్యాలకు అనుగుణంగా శక్తి, సమర్థతలు పెంచుకోవల్సిన అవసరం వుంది. ప్రజలలో ఆత్మీయ సంబంధాలను మెరుగుపర్చుకోవాలి.

స్థానిక వనరులపై ఆధారపడి గెరిల్లా యుద్ధాన్ని కొనసాగించాలి. మైన్ యుద్ధతంత్రాన్నీ విస్తృతంగా ఉపయోగిస్తూ, షార్ప్ షూటర్స్‌గా, స్నైపర్స్‌గా అభివృద్ధి అవుతూ, పరిమిత వనరులతోనే శత్రువును గడగడలాడించాలి. దీని కోసం నిరంతరం మన మిలటరీ ప్రాక్టీసును కొనసాగించాలి. నూతన టెక్నిక్స్‌ను అభివృద్ధి చేసుకునే విధంగా పి.ఎల్.జి.ఎ ప్రయత్నాలు చేయాలి. మన సమాచారం శత్రువుకు చేరకుండా, అత్యంత రహస్యాన్ని పాటించడం అనేది పి.ఎల్.జి.ఎ ఒక షరతుగా అమలు చేయాలి. ఎమ్.ఎల్.ఎమ్ సిద్ధాంత రాజకీయాలను నిరంతరం అధ్యయనం చేస్తూ, మానసిక దృఢత్వం పెంచుకోవాలి. పునాది బలగాలలో మన రాజకీయ కృషిని కొనసాగిస్తూ, వాళ్ళను సంఘటితం చేయాలి. పార్టీ కర్తవ్యాలకు అనుగుణంగా వారిని డ్రైవ్ చేస్తూ, పూర్తికాలం విప్లవకారులుగా తయారు చేసుకునే కృషిని తీవ్రతరం చేయాలి. దీని కోసం ప్రధాన, ద్వితీయ బలగాల నుండి తగిన శక్తులను కేటాయించుకోవాలి.

### ప్రియమైన కామ్రేడ్స్ !

దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రముఖ వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. కేంద్రంలో నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్.పి.జి. విధానాల అమల్లో దూకుడు పెరిగింది. మరోవైపు హిందుత్వ ఎజెండాను ప్రణాళిక బద్ధంగా అన్ని రంగాల్లో అమలు చేయడం కోసం ప్రయత్నాలు తీవ్రతరం చేశారు. జమిలీగా సాగుతున్న ఈ రెండింటితో భారతదేశంలో వున్న పీడిత వర్గాలు, జాతులు, మత మైనార్టీలు హిందూ ఫాసిజాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారు. రానున్న రోజుల్లో దీని తీవ్రత మరింత పెరిగే అవకాశం వుంది. రాష్ట్రాల్లో కూడా చంద్రబాబు, నవీన్ పట్నాయక్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాల వలన అనేక మంది ప్రజలు తమ సమస్యల సాధన కోసం మిలిటెంట్‌గా ముందుకు కదులుతున్నారు. ప్రస్తుత పరిస్థితి విప్లవానికి అనుకూలంగా వుంది. ఈ పరిస్థితిని ఉపయోగించుకునే విధంగా మన ప్రాంతంలో అన్ని వర్గాలను కలుపుకొని ప్రపంచీకరణకు, హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాలమైన ఐక్య సంఘటనను నిర్మించడానికి కృషి చేయాలి.

ప్రపంచంలో సామ్రాజ్యవాదులకు, పీడిత ప్రజలకు, జాతులకు మధ్య వైరుధ్యం తీవ్రతరమవుతూనే వుంది. ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఇరాన్, ఉత్తరకొరియా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, తదితర దేశాల పీడిత ప్రజలు, జాతులు తలొగ్గకుండా విరోచితంగా పోరాటాలు కొనసాగిస్తున్నారు. మరోవైపు అమెరికా నాయకత్వంలో వున్న ఆర్థిక కూటములు, రష్యా, చైనా నాయకత్వంలో వున్న ఆర్థిక కూటముల మధ్య వైరుధ్యాలు గతం కంటే తీవ్రతరమయినాయి. భవిష్యత్‌లో ఈ రెండు కూటములు తమ ఆధిపత్యం కోసం సైనిక పరిష్కారం దిశగా కదులుతున్నాయి.

నేడు సామ్రాజ్యవాదులు, తాము ఎదుర్కొంటున్న ఆర్థిక, ద్రవ్య సంక్షోభాలను అధిగమించేందుకు ప్రపంచ వ్యాపితంగా, ముఖ్యంగా వెనకబడిన దేశాలలోని పీడిత ప్రజలను ముందెన్నడూ చూడని విధంగా దోపిడీ పీడనలకు గురి చేస్తున్నాయి. ఆయా దేశాల పీడిత ప్రజలపై, జాతులపై యుద్ధాన్ని రుద్దుతున్నాయి. సామ్రాజ్యవాదులు అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా పీడిత ప్రజలు, జాతులు ఉద్యమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అందుకే నేడు దేశ, ప్రపంచ వ్యాపితంగా విప్లవ పరిస్థితులు అనుకూలంగా వున్నాయి. మనం సాహసించి పోరాడితే అంతిమ విజయం ప్రజలదే.

★ దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాకి కట్టుబడి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని దృఢసంకల్పంతో కొనసాగిద్దాం!

★ మన పార్టీ, విప్లవోద్యమాన్ని నిర్మూలించాలన్న లక్ష్యంతో, పాలక వర్గాలు కొనసాగిస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ (ఆలౌట్ క్యాంపెయిన్) బహుముఖ దాడిని ఓడిద్దాం!

★ ఎత్తుగడల ఎదురు దాడులను కొనసాగిస్తూ, జోన్‌లో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం!

★ భూమి, విస్థాపన, ఇతర ప్రజా సమస్యలపై కేంద్రీకరించి, ప్రజలను మిలిటెంట్ పోరాటాల వైపు డ్రైవ్ చేద్దాం!

★ జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం కోసం పీడిత ప్రజానీకాన్ని సమీకరిద్దాం!

★ పి.ఎల్.జి.ఎ.లో పార్టీ నాయకత్వాన్ని, రాజకీయ కృషిని బలోపేతం చేద్దాం!

★ పి.ఎల్.జి.ఎ. కమాండ్లకు, పోరాట యోధులకు, ప్రజా మిలీషియాకు, ప్రజలకు రాజకీయ, మిలిటరీ శిక్షణను అందిద్దాం!

★ పి.ఎల్.జి.ఎ.లోకి యువతీ, యువకులను రిక్రూట్ చేసుకునే క్యాంపెయిన్స్‌ను కొనసాగిద్దాం!

★ పి.ఎల్.జి.ఎ.లో ఉక్కుక్రమశిక్షణను అభివృద్ధి చేస్తూ, అజేయమైన సైన్యంగా అభివృద్ధి చేద్దాం!

★ సి.పి.ఐ.(మావోయిస్టు) వర్ధిల్లాలి!

★ పి.ఎల్.జి.ఎ. వర్ధిల్లాలి!

విప్లవాభివందనాలతో,

ఎ.ఒ.బి-ఎస్.ఎమ్.సి.,

సి.పి.ఐ.(మావోయిస్టు).

# శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్

## సామాజిక పరిశోధన

శ్రీకాకుళం–కొరాపుట్ డివిజన్, నారాయణపట్నా ఏరియా కమిటి పరిధిలో సామాజిక పరిశోధన కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ కార్యక్రమం నిర్వహించటం కోసం ఎస్‌జడ్‌సి నుండి–1, డివిసి–2, ఎసిఎమ్స్–2 మొత్తం 5గురితో టీం ఏర్పడింది. ముందుగా ఈ కార్యక్రమం లక్ష్యాన్ని, దానికి అవలంబించాల్సిన విధానాన్ని రూపొందించుకోవటం జరిగింది.

**లక్ష్యం**

నారాయణపట్నా ఎసి పరిధిలో మూడు రకాల ప్రాంతాలు ఉన్నాయి. 1. సాపేక్షికంగా అభివృద్ధి చెంది, వర్గ పోరాటం జరగని, వర్గ సంఘాలు బలంగా లేని ప్రాంతం. 2 వర్గపోరాటం జరిగి వర్గసంఘాలు, ఆర్‌పిసిలు ఏర్పడి తీవ్రమైన శత్రు నిర్బంధానికి గురైన ప్రాంతం. 3 రాజకీయంగా, సామజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా బాగా వెనుకబడిన తెగకు చెందిన గ్రామాలు ఉన్నాయి. ఈ 3 కేటగిరిల్లో వున్నటువంటి గ్రామాలను తీసుకుని సామాజిక పరిశోధన, వర్గ పరిశీలన చేయటం ద్వారా నిర్దిష్టంగా ఆయా ప్రాంతాలలోనూ- గ్రామాలలోనూ వైరుధ్యాలను అర్థం చేసుకుని వాటి మీద ఆధారపడి ఎత్తుగడలను రూపొందించుకోవటం.

**అవలంబించిన విధానం**

లక్ష్యానికి అనుగుణంగా మొదటి కేటగిరికి చెందిన గ్రామాలు–5 (ఈ పాకెట్‌లో మనకు కొంత వెసులుబాటు ఉన్న కారణంగా ఎక్కువ గ్రామాలలో పెట్టుకున్నాం) 2వ కేటగిరి–గ్రామాలు 2 (ఆచరణలో ఒకటే చేయగలిగాం), 3వ కేటగిరికి చెందిన గ్రామాలు -3 ఎంచుకున్నాం. సామాజికి పరిశోధన కోసం 3 అంశాలతో కూడిన (రాజకీయ, ఆర్థిక, సామాజిక) ప్రశ్నావళిని, నిర్దిష్టంగా గ్రామాల వర్గ విశ్లేషణ కోసం కుటుంబాల వారిగా తెలుసుకోవాల్సిన, సేకరించాల్సిన అంశాలతో కూడిన మరొక పట్టికను విడిగా తయారు చేసుకున్నాం. ఈ కార్యక్రమంలో మనం అనుకున్న సమాచారం రాబట్టటం కోసం గ్రామంలో ఒక కోర్‌ను ఎంపిక చేసుకున్నాం. అందులో పెద్ద వయసువారు (గ్రామానికి సంబంధించి పూర్వపరాలు, వివరాలు తెలిసి చెప్పగలిగేవారు), మధ్య వయస్కులు, యువకులు, సంఘ కార్యవర్గం నుండి మొత్తం 10 నుండి 15 మంది వుండేలా చూసుకున్నాం. వీరికి మన లక్ష్యాన్ని అర్థం చేయించి సామాజిక పరిశోధన కోసం రూపొందించుకున్న ప్రశ్నలకు సమాచారం తీసుకున్నాం. తరువాత గ్రామంలో కూడా ప్రజలందరికీ విషయం అర్థం చేయించి కుటుంబాల వారీగా వివరాలతో కూడిన వర్గపరిశీలన పట్టికను పూర్తి చేయాలనుకున్నాం. ఒక్కో గ్రామానికి 2 రోజులు టైం కేటాయించుకున్నాం.

పై విధంగా అనుకున్నప్పటికీ, ఆచరణలో మనకు మొదటి గ్రామం చేసిన తరువాత 2 రోజుల్లో ఒక్కో గ్రామంలో అనుకున్న టార్గెట్‌ని పూర్తి చేయలేమనీ, సమయం సరిపోదని అర్థం అయ్యింది. అయితే శత్రు నిర్బంధం కారణంగా ఆ ప్రాంతంలో ఒక గ్రామానికి 2 రోజుల కంటే ఎక్కువ సమయం కేటాయించలేకపోయాం. ఈ సమస్యలతో, 8 గ్రామాలలో సామాజిక పరిశోధన (సమాచార సేకరణ) పూర్తి చేసినప్పటికీ, నిర్దిష్టంగా వర్గ విశ్లేషణ కోసం కుటుంబాల వారీగా సేకరించాల్సిన పట్టికను 3 గ్రామాల్లో (ఎగువసీందెరి, చింతలమంజరి, గందెరిగండ) మాత్రమే పూర్తి చేయగలిగాం. ఈ 3 గ్రామాల్లో కూడా మొదటి కేటగిరికి చెందినవి–2, 3వ కేటగిరి–1 గ్రామం ఉంది. ఇందులో కూడా చింతలమంజరి గ్రామంలో 33 కుటుంబాలు వుండగా 23 కుటుంబాలది మాత్రమే చేయగలిగాం. కనుక ఈ 3 గ్రామాలకు సంబంధించిన వర్గ పరిశీలన మీద ఆధారపడి సంశ్లేషణ నివేదికను విడిగానూ, మిగతా గ్రామాల రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల నివేదికను విడిగాను ఇస్తున్నాం.

ఈ అధ్యయనం చేసే క్రమంలో మనకు ఎదురైన సమస్యలు 1. మెజార్టీ ప్రజలు తమ భూముల వివరాలను ఎకరాలలో చెప్పలేక పోవటం. 2. ఆదాయాలను చెప్పలేకపోవటం లేదా తక్కువ చెప్పటం. 3. ఖర్చుల పద్దులను చెప్పలేక పోవటం 4. ఎలక్ట్రానిక్స్ పరికరాలను (ముఖ్యంగా మొబైల్స్) చెప్పకపోవటం. 5. అటవీ ఉత్పత్తుల సేకరణను, ఆదాయాన్ని చెప్పకపోవటం.

ఈ సమస్యలను పరిష్కరించుకోవటం కోసం పొలం భూమిలో వారు వేసిన విత్తనాలను బట్టి ఎకరాలను అంచనా కట్టాం. (1 ఎకరానికి–1 పుట్టి విత్తనాలు, పుట్టి–20 కుంచాలు–80 కేజీలు), మెట్ట భూమిని వారు పండించిన వాణిజ్య పంటల దిగుబడి మీద ఆధారపడి (7 క్వింటాళ్ళకు 1 ఎకరా చొప్పున) అంచనా కట్టాం. పోడు సగటున 1/2 ఎకరా చొప్పున (ఒక్కో కుటుంబానికి) అంచనా కట్టాం. ఆదాయాలను వాణిజ్య పంటలకు దిగుబడిని మార్కెట్ రేటు ప్రకారం లెక్క కట్టాం. ఖర్చులను వారు వారపు సంతలో చేసే ఖర్చును పద్దుల వారీగా తెలుసుకుని సం။రానికి లెక్క కట్టాం. అటవీ వుత్పత్తులను, ఎలక్ట్రానిక్స్ పరికరాలను వారు చెప్పినవి మాత్రమే నమోదు చేసుకున్నాం.

***మన నుండి జరిగిన లోపాలు (సమాచార సేకరణలో)***

★ వర్గ పరిశీలన కోసం సేకరించాల్సిన విషయాలలో కూలిపనులకు సంబంధించి వివరాలను సమగ్రంగా సేకరించలేకపోయాం.

★ బంగారం తెలుసుకున్నాం. వెండి తెలుసుకోలేదు.

★ ప్రభుత్వ గుర్తింపు కార్డులో రేషన్ మాత్రమే తెలుసుకున్నాం. ఓటరు, ఆధార్... వంటివి తీసుకోలేదు.

★ ఖర్చులలో కాస్మొటిక్స్, వ్యవసాయ పరికరాలు వంటి వాటిని కొన్ని తీసుకోలేదు.

★ నిల్వలు (బ్యాంకు డిపాజిట్లు వగైరా) తెలుసుకోలేదు.

★ వ్యవసాయంలో సాగు పద్ధతిని నిర్ధిష్టంగా (ఎన్ని కుటుంబాలు, ఏ పద్ధతి)తెలుసుకోలేదు.

## సామాజిక పరిశోధనలో అధ్యయనం చేసిన మూడు గ్రామాల విశ్లేషణ

ఎగువ సీందెరి, చింతల మంజరి గ్రామాలు కొంత అభివృద్ధి చెంది, ప్రభుత్వ సంస్కరణలు, స్వచ్ఛంద సంస్థల సంస్కరణలు, క్రిష్టియన్ మత ప్రభావాన్ని కలిగి వున్నాయి. అయితే ఈ గ్రామాలు కొంత మేరకు విప్లవోద్యమ పరిచయం ప్రభావం కలిగి వున్నాయి. గందెరిగండ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా అత్యంత వెనుకబడిన తెగ (మటియ)కు చెందిన గ్రామం. ఈ 3 గ్రామాలలోని మనం అధ్యయనం చేసిన 82 కుటుంబాలలో మొత్తం జనాభ 386 కాగా అందులో వయోజనులు-136 (స్త్రీలు-120, పురుషులు-116) పిల్లలు-150 (ఆడ-82, మగ-68) వున్నారు. ఈ గ్రామాలలో 2 తెగలు, 2 కులాలకు చెందిన వారు వున్నారు. కువ్వి-56, మటియ-22, డొంబ-1, బ్రాహ్మణ-3 కుటుంబాలు ఉన్నాయి.

**ఉత్పత్తి విధానం**

మూడు గ్రామాలలోనూ వ్యవసాయం మీద ఆధారపడి జీవించటమే ప్రధానం. 82 కుటుంబాలలో 20 కుటుంబాలు వ్యవసాయం మీద, మరో రెండు కుటుంబాలు ఉద్యోగాల మీద ఆధారపడుతున్నవి. ఈ 80 కుటుంబాలకు మొత్తం భూమి (పొలం, మెట్ట, కొండ..అంతా కలిపి) 115 ఎకరాలు (సాగులో) ఉంది. ఇందులో పొలం 19 ఎకరాల 20 సెంట్లు (16.66%), మెట్ట (39.93%) 46 ఎకరాలు, కొండపోడు 50 ఎకరాలు (43.40%) ఉంది. వీరిలో పొలం ఉన్నవారు 57 మంది, లేనివారు 23, (ఎక్కువలో ఎక్కువ 4 ఎకరాలు (ఒక్కరికే ఉంది) అతి తక్కువ 20 సెంట్లుగా ఉంది). మెట్ట ఉన్నవారు 77, లేనివారు-3 (ఎక్కువ-3ఎకరాలు, తక్కువ-1/2 ఎకరా) ఉన్నారు. కొండపోడు 78 కుటుంబాలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న 2 కుటుంబాలు మాత్రమే పోడు చేయడం లేదు. మొత్తం భూమిలో (పొలం, మెట్ట, పోడు కలిపి) వ్యవసాయం చేస్తున్న 80 కుటుంబాలలో సగటున ఒక్కొక్క కుటుంబానికి 1 1/2 ఎకరా మాత్రమే భూమి వున్నట్టు.

- పొలం ఉన్న 57 కుటుంబాలలో చెక్‌డ్యాం ద్వారా-5, కెనాల్/కాలువ ద్వారా-36 కుటుంబాలకు సాగునీటి సౌకర్యం ఉండగా 16 కుటుంబాలు పూర్తిగా వర్షాధారం మీదనే ఆధారపడుతున్నాయి.
- భూమి ఉన్న 80 కుటుంబాలలో 35 కుటుంబాలకు-37 ఏర్లు (దుక్కిటెద్లు జత) ఉండగా 45 కుటుంబాలకు ఏర్లు లేవు. వీరు సహకార పద్ధతులలో (ఇతరులతో కలసి దున్నటం అంటే ఏరు వున్న వాళ్ళ భూమిలో దున్నటానికి వెళ్ళి తరువాతే తమ భూముల్లో ఆ ఏరుతో దున్నుకోవటం) నాగళ్ళను తీసుకుని దున్నటం ఉంది. మెజార్టీగా పారలతో తవ్వటం ఉంది.
- పొలం 57 కుటుంబాలలో (పొలం) 52 కుటుంబాలకు 1 పంట, 5 కుటుంబాలకు మాత్రమే 2 పంటలు పండుతున్నాయి. (రెండవ పంట వేయకపోవడానికి, ఈ ప్రాంతంలో పశువులను కాయకుండా వదిలివేయటం ప్రధాన కారణంగా వుంది).
- భూమి సాగు కొరకు వాడే ఉత్పత్తి పరికరాలు అత్యంత వెనుకబడిన నాగళ్ళు, పారలు మాత్రమే ఉన్నాయి. ట్రాక్టర్లు లేవు.
- కూరగాయలు పండించటం, అటవీ ఉత్పత్తుల సేకరణ వంటివి వ్యక్తిగతంగానే చేస్తున్నారు. పోడు నరకటం, చీపుర్లు, గాబు తీయటం, కోతలు, అల్లం, పసుపు తవ్వటం వంటి పనులు వ్యక్తిగతంగానూ, సహకార బృందాల పద్ధతిలోనూ చేస్తున్నారు. బృందాల వారీగా చేసే పనులకు కూలీ ఉండదు (ఉదా : ఒక కుటుంబానికి చీపుర్లు వేయటానికి భూమి ఉంటే అతనితో మరో 4 కుటుంబాలు కలిసి (భూమి లేని వారు) ఆ పనిలో పాల్గొంటారు. చీపుర్ల కొండ నరికిన దగ్గర నుండి వాటిని కోయటం, కట్టటం వరకు కలిసే చేస్తారు. ఆ తరువాత చీపుర్లను గానీ, చీపుర్లు అమ్మగా వచ్చిన డబ్బులు గానీ సమానంగానే పంచుకుంటారు. ఇళ్ళు రేకులు/పెంకులు వేయటం, కొండపోడు నరకటం వంటి పనులను శ్రమ సహకార పద్ధతిలో చేస్తున్నారు. సహకార పద్ధతిలో వ్యవసాయమే ప్రధానంగా ఉంది.

**వలసలు/కూలీ పనులు**

ఈ మూడు గ్రామాలలో కూలీ పనులకు వలసలు పోయింది లేదు. గ్రామాలలో ఉండే వ్యవసాయ పనులకు మాత్రం కూలీకి వెళుతున్నారు. గ్రామంలో పని అయితే కూలీ 50/-, భోజనం పెట్టటం అనే పద్ధతి ఉంది. ప్రభుత్వ పథకాల క్రింద, స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామాలకు వచ్చే పనులలో గ్రామంలో ఇంటికొక్కరు చొప్పున అందరూ పనికి వెళతారు. 2015లో ఎగువసీందెరి గ్రామంలో ఒక చెక్‌డ్యాం పని, చింతలమంజరిలో కల్వర్టు పని వచ్చింది. గందెరిగండలో ఇంతవరకు ఏ పని రాలేదు. కనుక ఈ రెండు పనులలో చింతల మంజరిలో 2 కుటుంబాలు మినహా మిగతా 58 కుటుంబాలు 60 రోజులు ఈ పనుల్లో కూలికి వెళ్ళారు. చెక్‌డ్యాం పనికి 150/-, కల్వర్టు పని 165/- చొప్పున రోజు కూలీ వచ్చింది. దీని విలువ 2,83,500/- గతంలో (పార్టీ/ సంఘం రాకముందు) ఈ పనులను బయటవారు (ఆదివాసేతరులు) కాంట్రాక్ట్ తీసుకుని చేసేవారు. అలాగే వారు గ్రామానికి గొడ్లు ఇచ్చి గుత్తగా పని చేయించటం ద్వారా శ్రమ దోపిడీ చేసేవారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద పనులలో (పంచాయితీ బిల్డింగ్స్, స్కూల్స్ వగైరా) ఈ పద్ధతి కూడా నడుస్తున్నది. గ్రామాలకు సంబంధించి వచ్చే పనులలో గ్రామ యువకులే 5, 6గురు కలసి గ్రూప్‌గా పనిని కాంట్రాక్ట్ తీసుకుని చేయిస్తున్నారు. ఇలాంటి కాంట్రాక్ట్ పనులలో కొంత పెట్టుబడి పెట్టగల కుటుంబాలే, అంటే పెద్దమనుషులు ఉంటున్నారు. వీరు కూలీ ఇచ్చి, డబ్బులను మిగుల్చుకుని తీసుకుంటున్నారు. ఇందిరావాస్ ఇళ్ళ నిర్మాణం పనులలో రోజు కూలీ లేబర్‌కు 50/-, భోజనం పెట్టటం, మేస్త్రీకి

100/- కూలీ ఇస్తున్నారు. భూమిని అమ్మటం, కొనటం, కౌలుకి, భాగానికి తీసుకోవటం ఈ ప్రాంతంలో లేదు.

**పంటలు**

ఈ మూడు గ్రామాలలో వరి, సామలు, చోళ్ళు ప్రధాన ఆహార పంటలుగాను, జొన్న, కందులు, అల్లం, పసుపు, అరటి, చీపుర్లు ప్రధాన వాణిజ్య పంటలుగా సాగు చేస్తున్నారు. కూరగాయలలో ఉల్లి,మిర్చి, టమాట,బీన్స్, బఠాని, ముల్లంగి, వంకాయ, చిక్కుళ్ళు, గుమ్మడి ప్రధానంగా ఆహారం కోసం వేస్తున్నారు. కొద్దిమంది మాత్రమే మార్కెట్‌లో అమ్ముతున్నారు. ఈ 3 గ్రామాలలో 80 కుటుంబాలకు ఆహారపంటలపై వచ్చిన దిగుబడి మొత్తం 27 1/2 క్వింటాళ్ళు మాత్రమే (ఇందులో ఎగువ సీందెరి-120 క్వింటాళ్ళు, చింతలమంజరి-126 1/2 క్వింటాళ్ళు గందెరిగండ-29 క్వింటాళ్ళు). అంటే 80 కుటుంబాలలో సగటున ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి 3 1/2 క్వింటాళ్ళు మాత్రమే వస్తుంది.

**పంటల దిగుబడి**

| | |
|---|---|
| ధాన్యం-146.75 క్వి | |
| చోళ్ళు- 85.50 క్వి | |
| సామలు-43.50 క్వి | |
| మొక్కజొన్న-29 క్వి | - 1,16,000 |
| కందులు-15క్వి | - 1,20,980 |
| అల్లం-70క్వి | - 2,80,000 |
| పసుపు-8క్వి | - 54,400 |
| చీపుర్లు-10క్వి | - 29,400 |
| అటవీ ఉత్పత్తులపై | - 2,500 |
| కూరగాయలపై | - 10,050 |
| వాణిజ్యపంటలపై ఆదాయం | - 6,13,330 |

ఎగువసీందెరి,చింతలమంజరి గ్రామాలలో 52 కుటుంబాలు వాణిజ్యపంటలు (అల్లం, పసుపు) పండిస్తున్నారు. గందెరిగండలోని 22 కుటుంబాలలో కేవలం 13 కుటుంబాలు మాత్రమే కందులు పండించి 1 1/2 క్వి॥ 9,800/-లకు, 1 కుటుంబం అరటిచెట్ల (5 చెట్లు) మీద 1000/- ఆదాయాన్ని పొందారు. మిగతా 2 గ్రామాలకు 6,02,530/- ఆదాయం వచ్చింది.

**వ్యవసాయంపై పెట్టుబడి**

ఆహార పంటల్లో వరి విత్తనాలను కొద్దిమంది మాత్రమే కొంటున్నారు. సామలు, చోళ్ళను స్వయంగానే విత్తనాలు తయారుచేసుకుంటున్నారు. వాణిజ్య పంటల్లో కూడా జొన్న విత్తనాలను చాలా కొద్దిమంది బయటనుండి కొంటున్నారు. కూరగాయల విత్తనాలను ముఖ్యంగా ఉల్లి కొంటున్నారు.

✶ రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం చాలా తక్కువగా ఉంది. గందెరిగండ గ్రామంలో మొత్తం సేంద్రీయ ఎరువులు (పశువుల గెత్తం) వాడుతున్నారు. మిగతా 2 గ్రామాల్లో 21 కుటుంబాలు రసాయనిక ఎరువులు మొత్తం 2 క్వింటాళ్ళ 45 కేజీలు వాడారు. ఇందులో అతి తక్కువ 1 కేజి, ఎక్కువ-30 కేజీలు వాడారు.

✶ ఎగువసీందెరి, చింతల మంజరి గ్రామాల్లో 'విదా'(స్వచ్ఛంద సంస్థ) ద్వారా మహిళా ఎస్‌ఎచ్‌జి గ్రూపుల ద్వారా అల్లం, పసుపు, కూరగాయల విత్తనాలను ఇస్తున్నారు.

✶ వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టటం కోసం బయట అప్పులు చేయడం లేదు. అనివార్య పరిస్థితులలో అవసరాలకు (పనుల సీజన్‌లో దుక్కిటెద్దు చనిపోవటం, అనారోగ్యం కోసం) గ్రామంలోనే బదులు తీసుకుంటున్నారు. దీనికి వడ్డీ తీసుకోవడం లేదు. చింతల మంజరి గ్రామంలో 2,13,000/- అప్పు ఉంది.

✶ వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టటం చాలా తక్కువగా ఉంది. ప్రతీ సంవత్సరం ఒకే రకమైన పరిమాణంలోనే విత్తనాలు వేస్తున్నారు. కొన్నిసార్లు తగ్గటమే జరుగుతుంది తప్ప పెరిగింది ఎక్కడా లేదు.

**మార్కెట్ (క్రయవిక్రయాలు)**

♦ సీందెరి, చింతలమంజరి గ్రామాల రైతులకు రవాణా సౌకర్యం ఉంది. సంత రోజే కాకుండా అవసరమైతే ఏరోజైనా వెళతారు. ప్రధానంగా వీరు అల్లం, పసుపు, కందులు, చీపుర్లు సిమిలిగూడకూ, కూరగాయలు కుందిలి మార్కెట్‌కు తీసుకెళ్ళి షావుకార్లకు అమ్ముతారు. షావుకార్లు మార్కెట్ రేటు కంటే, ఈ రైతుల వద్ద చాలా తక్కువ ధరలకు (చీపుర్ల కట్ట ఒక్కోదానికి 30/- మాత్రమే ఇస్తున్నారు. ఇది మార్కెట్‌లో 100/-పైనే ఉంటుంది)కొంటున్నారు. రవాణా కోసం లగేజిచార్జి 1బస్తాకు 100/- మనిషికి రాను, పోను 50/- అవుతున్నది. సంతల్లో ఆసీలు కడుతున్నారు.

♦ గందెరిగండ గ్రామంలో మటియా ప్రజలు వాణిజ్యపంటలు, కూరగాయలు పండించేది తక్కువ. కందులు మాత్రమే అమ్ముతున్నారు. వాటిని కూడా దళారులు (పక్కనే ఉన్న పెద్ద గ్రామాల కువ్వివారే) గ్రామానికి వచ్చి అతి తక్కువ ధరకు కొంటున్నారు. ఈ గ్రామస్తులు నారాయణపట్నాకు వెళ్ళేది, అమ్మేది చాలా తక్కువ.

♦ ఈ మూడు గ్రామాలలో ప్రజలు సాగు చేస్తున్న భూమి చాలా తక్కువ. మొత్తం భూమిలో కూడా కొండపోడు మీద వ్యవసాయం ప్రధానంగా వుండటం, అత్యంత వెనుకబడిన ఉత్పత్తి పరికరాలు, ఎక్కువమందికి ఎడ్లు లేకపోవటం, ప్రకృతి వైపరీత్యాల వలన భూములను, పంటలను నష్టపోవటం, సాగునీటి సౌకర్యం లేకపోవటం వంటి కారణాల వలన వ్యవసాయం ఉత్పత్తిలో అభివృద్ధి లేదు.

♦ సీందెరి, చింతల మంజరి గ్రామాల ప్రజలు ఎక్కువగా దుస్తులు, చెప్పులు, కాస్మోటిక్స్, వంటపాత్రలు, మత్తుపానీయాలు, ఆహార పదార్థాలు (ఉప్పు, నూనె, ఎండుచేపలు, పిల్లలకు తినుబండారాలు, మసాలాలు) వారపు సంతల్లో (సిమిలిగూడలో) కొనుగోలు చేస్తారు.

♦ గందెరిగండ వాళ్ళు నారాయణపట్నా సంతకు వెళతారు. కానీ ప్రతీ వారం వెళ్ళరు. డబ్బులు ఉన్నప్పుడు మాత్రమే వెళతారు. ఎక్కువగా గ్రామానికి 'డొంబ' వాళ్ళు తెచ్చే వేలం బట్టలను (సెకండ్ హ్యాండ్‌వి), ఎండుచేపలు, పొగాకు, ఉల్లి, అగ్గిపెట్టెలు వగైరా కొనుక్కుంటారు. నూనె వాడకం మెజార్టీగా లేదు. ఆముదం నూనె (తాము పండించినది)ను వంటకు కూడా వాడతారు.

### పశుసంపద

ఈ 3 గ్రామాలలో ఎడ్లు-74, మేకలు-48, గొర్రెలు-18, ఆవులు-26, కోళ్ళు-109, పందులు-10 ఉన్నాయి. క్రిష్టియన్ గ్రామాల్లో పందులను చంపి తినేసారు. గందెరిగండలోనే ఉన్నాయి. ఈ సంవత్సరం ఒక్క సీందెరి గ్రామంలోనే 31 గొర్రెలు, 22 మేకలు, 4 ఆవులు, గందెరిగండలో ఒక దూడ, 11 కోళ్ళు రోగాలతో చనిపోయాయి. పశువులకు సరైన పోషణ లేకపోవటం, ప్రకృతి వైపరీత్యాలు (పిడుగులు పడి) వలన కూడా పశువులు చనిపోయాయి.

### చేతివృత్తులు/వ్యాపారాలు

ఎగువసీందెరి, చింతలమంజరి గ్రామాలలో కమ్మర్లు లేకపోవడంతో తమ వ్యవసాయ పరికరాలను తయారు చేసుకోవటానికీ, మరమ్మత్తులు చేసుకోవటానికి వేరే గ్రామంలో కమ్మర్లను (కువ్వివారే) ఆశ్రయిస్తారు. సహజంగా 4,5 గ్రామాలకు కలిపి ఒక కమ్మరి ఉంటాడు. వీరికి సంవత్సరానికి ప్రతి కుటుంబం కొంత ధాన్యం, డబ్బులు ఇస్తుంటారు. చింతలమంజరి గ్రామానికి ఒక బారిక (చలాన్) పని చేస్తున్నాడు. అతడు ఈ సంవత్సరం గొడ్డు, 8,500/- సారా కోసం 900/- గ్రామానికి ఇచ్చాడు. ఇతడికి గ్రామస్తులు ప్రతిరోజూ 1 గ్లాసు తిండిగింజలు (ఊరు మొత్తం కలిపితే రోజుకు 4 కేజీలు పైగానే వస్తాయి) ఇస్తారు. పంటలు పండిన తరువాత ప్రతి కుటుంబం 3 కుంచాల ధాన్యం (12 కేజీలు), 30/- డబ్బులు ఇస్తారు. దీన్ని లెక్కిస్తే అతడు గ్రామానికి ఇచ్చేది 9,400/- అయితే, తిరిగి ప్రజలు ఇచ్చేది 11,500/- అవుతుంది. అంటే ఆ గ్రామం నుండి అతడికి 2000/- వెళు తుంది. సీందెరిలో ధాన్యం మిల్లు ఉంది. ఆ గ్రామంలో పండిన ధాన్యం అంతా మిల్లుకే వేస్తారు. దానికి డబ్బులు కాకుండా ధాన్యం ఆడిస్తే వచ్చే పొట్టును (ఊక) మాత్రమే యజమాని తీసుకుంటాడు. దాన్ని కేజి 4/- చొప్పున అమ్ముకుంటాడు. ఇదే గ్రామంలో 1 కమాండర్ ఉంది. దీని మీద పాసింజర్ ఒకరికి 50/-, లగేజి బస్తాకు 100/- చొప్పున సం॥రానికి 72,000/- ఆదాయం వస్తుంది.

గందెరిగండ గ్రామంలో ప్రజలు బాగా వెనుకబడిన తెగకు చెందినవారు కావటంతో తెగ సాంప్రదాయాల పేరుతో, మూఢనమ్మకాలతో అనారోగ్యాలకు గురైతే పూజలు చేయటం, ఆచారాల పేరుతో పండుగలు చేస్తుంటారు. ఇందులో గురవళ్ళు, పెజ్జిణిలకు మాంసం, సారా, డబ్బులు ప్రజలు ఇస్తారు. అందుకని గందెరిగండ గ్రామంలో ప్రజలకు పూజలు, పండగలకు అయ్యే ఖర్చు 24,000/- అయితే వైద్యానికి (మందులకు) ఖర్చు 2000/- మాత్రమే వుంది.

### అటవీ ఉత్పత్తులు

చీపుర్లు, నారెంజసాలి (చెట్టు బెరడు), నరమామిడి చెక్క, దుంపలు, అనేక రకాల వనమూలికలు, గింజలు (రేకో,మొర్చికి) జఫర్ వంటివి అడవి నుండి సేకరిస్తున్నారు. అయితే మనకు గ్రామాల అధ్యయనంలో అటవీ ఉత్పత్తుల మీద ఆదాయం 31,900/- మాత్రమే వచ్చింది (ప్రజలు సరిగ్గా చెప్పలేకపోయారు).

### సంవత్సరం మొత్తం ఆదాయం

| | |
|---|---|
| వాణిజ్యపంటలపై | - 5,81,430 (42.47%) |
| అటవీ ఉత్పత్తులపై | - 31,900 (2.33%) |
| కూలిపనులపై | - 2,70,450 (19.75%) |
| ఉద్యోగాలపై | - 1,89,800 (13.86%) |
| పాస్టర్లకు | - 72,000 (5.26%) |
| వ్యాపారం/వాహనాలు | - 75,600 (5.52%) |
| పెన్షన్ల మీద | - 1,47,600 (10.78%) |
| మొత్తం | 13,68,780 |

### ఖర్చులు

| | |
|---|---|
| ఆహారం | - 1,99,110 (23.64%) |
| దుస్తులు | - 1,13,750 (13.50%) |
| ఆరోగ్యం | - 80,450 (9.55%) |
| మత్తు | - 1,31,438 (15.60%) |
| పండుగలు | - 59,000 (7.06%) |
| చావు/పెళ్ళి | - 52,500 (6.23%) |
| వ్యవసాయం | - 7,000 (0.83%) |
| చదువు | - 1,81,000 (21.49%) |
| బారికకు | - 2,000 (0.23%) |
| **మొత్తం** | - 8,42,148 |

| | |
|---|---|
| సంవత్సర మొత్తం ఆదాయం | - 13,68,780 |
| మొత్తం ఖర్చులు | - 8,42,148 |
| మిగులు | - 5,26,632 |
| మొత్తం అప్పులు | - 2,13,000 |

### మొత్తం స్థిరాస్తులు

| | |
|---|---|
| బంగారం | - 5,70,000 |
| వాహనాలు | - 2,40,000 |
| రైస్‌మిల్లు | - 50,000 |
| ఎలక్ట్రానిక్స్ | - 61,000 |
| **మొత్తం** | - 9,21,000 |

### ప్రభుత్వ పథకాలు

★ మూడు గ్రామాలలో మొత్తం 70 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 5గురికి ఒక్కొక్కరికి డబుల్ కార్డులు (రెండు) ఉన్నాయి. కనుక 65 మందికి కార్డులు ఉన్నట్లు. 17 మందికి రేషన్ కార్డులు లేవు. ఒడిశా ప్రభుత్వం టొంకా చావల్ (1/-బియ్యం) ఇస్తున్నది. కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి మనిషికి 5 కేజీల చొప్పున ఇస్తున్నారు. కుటుంబంలో 6గురు సభ్యులకు మించి ఉన్నా కూడా 30 కేజీలకు మించి బియ్యం ఇవ్వరు. కార్డులు లేనివారు డీలర్లను బ్రతిమాలుకుని 1 కేజీ 10/- చొప్పున కొనుక్కుంటున్నారు.

★ వృద్ధాప్య పించన్లు 39 మందికి (నెలకు 300/-) వికలాంగ పించన్లు (నెలకు 600/-) ఒకరికి వస్తున్నాయి.

★ ఇందిరా ఆవాస్ ఇండ్ల పథకం ద్వారా ఎగువసీందెరి, చింతలమంజరి గ్రామాలలో 23 మంది మాత్రమే లబ్ది పొందారు. గందెరిగండలో ఒక్క ఇల్లు కూడా ఈ పథకం ద్వారా రాలేదు.

★ ఎగువసీందెరి గ్రామంలో ఇంటికి ఒక లెట్రిన్ కట్టమని వర్క్

16వ పేజీలో...

సిద్ధాంత వ్యాసం

# మహా ప్రారంభం

## (వెనుకతట్టు ప్రాంతంలోని కార్మికుల వీరత్వం. "కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు")

యెర్ర సైనికుల వీరత్వపు ఘటనలు అనేకం పత్రికలు ప్రచురిస్తున్నాయి. కొల్చాక్‌తోనూ, దెనీకిన్‌తోనూ, భూస్వాముల, పెట్టుబడిదార్ల యితర సైన్యాలతోనూ చేసే పోరాటంలో కార్మికులూ, కర్షకులూ సోషలిస్టు విప్లవ లాభాలను రక్షించుకుంటూ అద్భుతమైన ధైర్యమూ, ఓర్పూ ప్రదర్శిస్తున్నారు. అవ్యవస్థ చర్యలూ, వేసరికా, క్రమశిక్షణా రాహిత్యమూ అధిగమింపబడుతున్నాయి; యిది నిదానమైన, కష్టమైన క్రమం, అయితే ఎన్ని అడ్డంకులున్నా, యిది ముందుకు పోతున్నది. సోషలిజం విజయం కొరకు ఐచ్ఛికంగా త్యాగాలు చేసే శ్రామిక ప్రజల వీరత్వం -ఇది యెర్ర సైన్యంలోని కొత్త, సోదర భావపు క్రమశిక్షణ పునాది, దేనిమీద ఆ సైన్యం పునరుద్భవిస్తూ, స్థిరపడుతూ, పెరుగుతున్నదో ఆ పునాది.

వెనుకతట్టు ప్రాతంలోని కార్మికుల వీరత్వం అంతకంటె తక్కువ గమనార్హమైన దేమీకాదు. యీ సందర్భంలో, కార్మికులు తమ సొంత చొరవతో ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు నిజంగా అపారమైన ప్రాముఖ్యం గలవి. తేటతెల్లంగా, యిది ప్రారంభం మాత్రమే, కానీ అసాధారణమైనంత గొప్ప ప్రాముఖ్యం గల ప్రారంభం. యిది బూర్జువా వర్గాన్ని కూలదోయడం కంటె ఎక్కువ కష్టమైన, ఎక్కువ భౌతికమైన, ఎక్కువ మౌలికమైన, ఎక్కువ నిర్ణయాత్మకమైన విప్లవం యొక్క ప్రారంభం; యెందుకంటే, యిది మన సొంత యధాస్థితితత్వం మీదా, క్రమశిక్షణా రాహిత్యం మీదా, పెటీబూర్జువా అహంభావంమీదా విజయం, పాపిష్టి పెట్టుబడిదారీ వ్యవస్థ కార్మికునికీ, కర్షకునికీ వారసత్వంగా యిచ్చిపోయిన అలవాట్లమీదా విజయం. యీ విజయం దృఢపడినప్పుడు, అప్పుడు, అప్పుడు మాత్రమే కొత్త సామాజిక క్రమశిక్షణ, సోషలిస్టు క్రమశిక్షణ సృష్టింపబడుతుంది, అప్పుడు, అప్పుడు మాత్రమే పెట్టుబడిదారీ వ్యవస్థకు తిరోగమనం అసాధ్యమౌతుంది, కమ్యూనిజం నిజంగా అజేయమౌతుంది.

ఎ.జే. రాసిన "విప్లవాత్మక పద్ధతిలో పని (కమ్యూనిస్టు సుబ్బోత్నిక్)" అనే వ్యాసాన్ని "ప్రావ్దా" తన మే 17 నాటి సంచికలో ప్రచురించింది. యీ వ్యాసం యెంత ముఖ్యమైనదంటే, దీని నిక్కడ పూర్తిగా పునఃప్రచురిస్తున్నాము:

---

15వ పేజీ తరువాయి...

ఆర్డర్ వచ్చింది. ముందు స్వంత డబ్బులతో కట్టాక, దాన్ని జెఇ చూసి 12,000/- శాంక్షన్ చేస్తారు. కానీ డబ్బులు లేక చేయలేదని అన్నారు.

**ఇండ్ల పరిస్థితి**

మూడు గ్రామాలలోని 82 కుటుంబాలలో పెంకు-26, సిమెంట్ రేకు-53, గడ్డి-2 ఇళ్ళు ఉన్నాయి. చింతలమంజరిలో అంగన్‌వాడి దీది అంగన్‌వాడి బిల్డింగ్‌లోనే ఉంటుంది. స్వంత ఇల్లు లేదు.

**విద్య-ఉద్యోగాలు**

ఎగువసీందెరి, చింతల మంజరి గ్రామాలలో ప్రాథమిక పాఠశాల (5వ తరగతి వరకు) ఉన్నప్పటికీ మాస్టర్లు రారు. ఈ గ్రామాల పిల్లలందర్నీ సిమిలిగూడ, కొటియా, తురియా హాస్టల్స్‌లో వేస్తున్నారు. గ్రామంలో కనీసం 15 మంది పిల్లలుంటే స్కూలు శాంక్షన్ చేస్తున్నారు. కనుక ఈ స్కూల్లో పిల్లల పేర్లు నమోదయ్యి ఉంటాయి కానీ వారు ఇక్కడ చదవరు. ఈ పిల్లల పేరుతో నెలనెలా వచ్చే బియ్యాన్ని గ్రామస్తులు పంచుకుంటారు. దుస్తులు పిల్లలకు ఇస్తారు. గందెరిగండ గ్రామంలో స్కూలు లేదు. తమ తెగ మైనార్టీ కనుక దూరంగా స్కూళ్ళలో వేస్తే అక్కడ ఇతర తెగలకు చెందిన పిల్లల డామినేషన్, కొట్టుకోవటం వుంటాయని స్కూల్‌కి పంపటం లేదని చెప్పారు.

ఎగువ సీందెరి, చింతల మంజరి గ్రామాల నుండి 56 మంది (14.50%) చదువుకుంటున్న వారు ఉండగా అందులో ఆడపిల్లలు -26, మగ పిల్లలు-30 మంది వున్నారు. ప్రాథమిక విద్య ఆడ-22, మగ-25, ఉన్నత విద్య ఆ-4, మగ-5గురు వున్నారు. అతి తక్కువ 1వ తరగతి కాగా, ఎక్కువ +2 (ఇంటర్‌మీడియట్) వున్నారు. గ్రామాల వారీగా అక్షరాస్యత శాతం చూస్తే ఎగువసీందెరిలో 21.80%, చింతల మంజరి-15.30% గందెరిగండలో నిరక్షరాస్యత ఉంది.

ఎగువసీందెరి, చింతలమంజరి గ్రామాల్లో అంగన్‌వాడి దీదిలు (టీచర్లు)-2, ఆశాదీదిలు-2, అంగన్‌వాడి ఆయా (కుక్)-2, మిని అంగన్‌వాడి దీది-1, ఫాస్టర్లు-5గురు (వీరు క్రిష్టియన్ సంస్థ ద్వారా జీతం పొందుతున్నారు)వున్నారు.

**(సంశేషం)**

# విప్లవాత్మక పద్ధతిలో పని

## (కమ్యూనిస్టు సుబ్బోత్నిక్)

"విప్లవాత్మక పద్ధతిలో పని చేయడం గురించి రష్యన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ రాసిన లేఖ కమ్యూనిస్టు పార్టీ శాఖలకూ, కమ్యూనిస్టులకూ శక్తివంతమైన ప్రేరణనిచ్చింది. సార్వత్రిక ఉత్సాహపు వెల్లువ అనేక కమ్యూనిస్టు రైల్వే కార్మికులను యుద్ధ రంగానికి తీసుకపోయింది, కానీ వాళ్ళలో అధిక సంఖ్యాకులు తమ బాధ్యతాయిత పదవులను వదలిపెట్టలేకపోయి, విప్లవ పద్ధతిలో పని చేయడానికి కొత్త రూపాలు కనుక్కోలేకపోయినారు. సమీకరణ కృషి నిదానంగా జరగడం గురించీ, రెడ్‌టేపు ప్రబలంగా వుండడం గురించీ ఆ ప్రాంతాల నుండి వచ్చిన వార్తల మూలంగా మాస్కో-కజాన్ రైల్వే ప్రాంతం తన దృష్టిని రైల్వే పని చేసే విధం మీదికి మళ్ళించవలసి వచ్చింది. కార్మికుల కొరత మూలంగానూ, శ్రమయొక్క హీన ఉత్పాదకత మూలంగానూ, జరూరు ఆర్డర్లూ, రైలింజన్లకు రిపేర్లూ నిలిచిపోతున్నాయని తేలింది. మే 7న జరిగిన మాస్కో-కజాన్ రైల్వే ప్రాంతపు కమ్యూనిస్టుల, సానుభూతిపరుల సాధారణ సమావేశంలో కొల్చాక్ మీద విజయం సాధించడానికి తోడ్పడడంలో మాటల నుండి చేతలకు పోయే సమస్య లేవనెత్తబడింది. యీ తీర్మానంలో యిలా ప్రతిపాదించబడింది:

''తీవ్ర జాతీయు, అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా కమ్యూనిస్టులూ, సానుభూతిపరులూ, వర్గ శత్రువుమీద పైచేయి సంపాదించడానికి, మళ్ళీ తమను తాము పురికొల్పుకొని, తమ విశ్రాంతి నుండి ఒక గంటను తగ్గించుకోవాలి, అనగా పని దినాన్ని ఒక గంట పొడిగించి, యీ అదనపు గంటలను ప్రోగుచేసి, తక్షణ ఉపయోగంగల నిజమైన విలువలు సృష్టించడానికిగానూ, శనివారంనాడు ఆరు అదనపు గంటల శరీర శ్రమ చేయాలి. కమ్యూనిస్టులు విప్లవ లాభాల కోసం తమ ఆరోగ్యమూ, ప్రాణమూ యివ్వడానికి వెనుదీయకూడదు గనుక, యి పని జీతం లేకుండా చేయాలి. కమ్యూనిస్టు సుబ్బోత్నిక్ ప్రాంతం అంతటా ప్రవేశపట్టి, కొల్చాక్ మీద పూర్తి విజయం సాధించేదాకా కొనసాగించాలి."

"కొంత తటపటాయింపు తర్వాత, యీ తీర్మానం యేకగ్రీవంగా ఆమోదింపబడింది."

''మే 10, శనివారంనాడు సాయంత్రం ఆరు గంటలకు కమ్యూనిస్టులూ, సానుభూతిపరులూ సైనికుల్లాగ పనికి వచ్చి, దళాలుగా యేర్పడి, హడావుడీ, గడబిడా లేకుండా ఫోర్మన్లచేత వివిధ పనులకు తీసుకపోబడినారు.

విప్లవాత్మక పద్ధతిలో పని చేయడం వల్ల ఈ క్రింది ఫలితాలు వచ్చాయి.

"మాములు కూలి రేట్ల ప్రకారం చేసిన పని మొత్తం విలువ 50 లక్షల రుబుళ్ళు; ఓవర్ టైం రేట్ల ప్రకారం లెక్క వేస్తే అది 50 శాతం ఎక్కువ ఉంటుంది.

"వేగన్లు లోడు చేయడంలో శ్రమ ఉత్పాతకత మాములు కార్మికుల కంటే 270 శాతం ఎక్కువ ఉండింది. ఇతర పనులలో శ్రమ ఉత్పాదకత అలాగే యెక్కువ ఉండింది.

"కార్మికుల కొరత మూలంగానూ, రెడ్‌టేపు మూలంగానూ వారం రోజులు మొదలుకొని మూడు నెలల దాకా ఆగిపోయిన పనులు (జరురైనవి) పూర్తి చేయబడినాయి.

"పరికరాలు రిపేరు చేయబడని స్థితిలో వుండినప్పటికీ (ఆ స్థితి సులభంగా సవరించబడేదే) పని జరిగింది; ఈ స్థితి మూలంగా కొన్ని బృందాలు 30, 40 నిమిషాలు ఆగవలసి వచ్చింది.

"పనికి బాధ్యులుగా పెట్టబడిన అధికార్లు కార్మికులకు కొత్త పనులు కష్టం మీద చూపించగలిగారు. వర్గ చైతన్యం లేని, చురుకుదనం లేని కార్మికులు ఒక వారంలో చేసేటంత పని యీ కమ్యూనిస్టు శనివారంనాడు జరిగిందని ఒక వృద్ధ ఫోర్‌మన్ అనడం కాస్త అతిశయోక్తి కావచ్చు.

''అనేక కమ్యూనిస్టేతరులు, సోవియట్ ప్రభుత్వపు హృదయపూర్వక మద్దతుదార్లు, పనిలో పాల్గొనడం దృష్ట్యానూ, భావి శనివారాలలో యింకా అనేకులు పాల్గొంటారని ఆశించడం దృష్ట్యానూ, మాస్కో-కజాన్ రైల్వేలోని కమ్యూనిస్టు కార్మికుల ఆదర్శాన్ని అనేక యితర ప్రాంతాలు అనుసరించ గోరుతూండడం దృష్ట్యానూ, ఆయా స్థలాల నుండి అందిన వార్తలను బట్టి తెలిసిన విధంగా, యీ విషయపు వ్యవస్థీకరణ పార్శ్వాన్ని మరింత వివరంగా తెలుపుతాను.

"పనిలో పాల్గొన్నవాళ్ళలో సుమారు పది శాతం మంది ఆయా స్థలాలో శాశ్వతంగా నియుక్తులైన కమ్యూనిస్టులు. తక్కినవాళ్ళు బాధ్యతాయుతమైన, యెన్నుకోబడిన పదవులలో వున్నవాళ్ళు-రైల్వే కమిస్సార్ మొదలుకొని వృష్టి సంస్థల కమిస్సార్లదాకానూ, ట్రేడ్‌యూనియన్ ప్రతినిధులూ, హెడ్ ఆఫీస్‌లో పనిచేసేవాళ్లూ, రైల్వేల కమిస్సారియట్‌లో పనిచేసేవాళ్లూ.

''పనిచేసేటప్పుడు ప్రదర్శింపబడిన ఉత్సాహమూ, సమిష్టితత్వమూ అసాధారణమైనవి. కార్మికులు, గుమాస్తాలూ, హెడ్ ఆఫీసు ఉద్యోగులూ, కీచులాటలు, వాదోపవాదాలు లేకుండా, అరవై మణుముల రైలింజను చక్రాన్ని పట్టుకొని, శ్రమశీలమైన చీమలలాగా, దాన్ని దాని స్థానంలోకి దొర్లించినప్పుడు, యీ సమిష్టి కృషిని చూసి హృదయం ప్రగాఢమైన సంతోషంతో నిండిపోయింది, కార్మికవర్గ విజయం అభేద్యమైనదనే విశ్వాసం బలపడింది. అంతర్జాతీయ దారిదోపిడీ దొంగలు విజేతృ కార్మికులను నలిపివేయరు; ఆంతరంగిక విధ్వంసకులు కొల్చాక్‌ను చూసేదాకా బతకరు.

"పని పూర్తి అయినప్పుడు అక్కడున్నవాళ్ళు కనివిని యెరుగని దృశ్యం చూసినారు: వందమంది కమ్యూనిస్టులు, అలసిపోయి, అయినా కన్నులలో ఆనంద దీప్తితో, తన విజయాన్ని 'అంతర్జాతీయ గీతం' గంభీర ధ్వనులతో వ్యక్తం చేసినారు. విజయవంతమైన గీతపు, విజయవంతమైన ధ్వనులు గోడలు దాటి కార్మికవర్గపు మాస్కో

అంతటా వ్యాపిస్తాయనీ, చెరువులో వేసిన రాయి కలిగించే అలలలాగా కార్మికవర్గపు రష్యా అంతటా వ్యాపించి, అలసినవాళ్ళనూ, అలసులనూ తట్టి లేపుతాయనీ అనిపించింది.

–ఎ.జే".

యీ అసాధారణ ఘటనను "అనుసరించదగిన ఆదర్శం"గా అంచనావేస్తూ, ఆ శీర్షికతో కామ్రేడ్ ఎస్.ఆర్. మే 20 నాటి "ప్రావ్ద"లో ఒక వ్యాసం రాసినాడు:

"కమ్యూనిస్టులు యిలా పని చేసే ఘటనలు అరుదు కాదు. ఒక విద్యుత్ కేంద్రంలోనూ, వివిధ రైల్వేలలోనూ యిలాంటి ఘటనలు నాకు తెలుసు. నికొలాయెవ్స్కయ రైల్వేలో, టర్న్‌టేబుల్ గుంతలో పడిన రైలింజన్‌ను యెత్తడానికి కమ్యూనిస్టులు పలు రాత్రులు ఓవర్‌టైమ్ పని చేసినారు. చలికాలంలో, ఉత్తర రైల్వేలోని కమ్యూనిస్టులూ, సానుభూతిపరులూ అందరూ రైలు మార్గం మీదనుండి మంచును తొలగించడానికి పలు ఆదివారాలు పని చేసినారు; అనేక గూడ్సు స్టేషన్లవద్ద వున్న కమ్యూనిస్టు శాఖలు దొంగతనాలు జరగకుండా స్టేషన్లకు కాపలా వుంటున్నాయి. కానీ యీ పని అంతా యధాలాపంగా క్రమపద్ధతి రహితంగా వుండింది. మాస్కో–కజాన్ రైల్వేలోని కార్మికులు యీ పనిని క్రమపద్ధతి గల, శాశ్వతమైన పనిగా చేస్తున్నారు, అదీ కొత్త విషయం. "కొల్చాక్ మీద పూర్తి విజయం సాధించేదాకా" అని వాళ్ళు తమ తీర్మానంలో అన్నారు. అందులో వున్నది వాళ్ళ పని ప్రాముఖ్యం. యుద్ధ స్థితి వున్నంత కాలం వాళ్ళు ప్రతి కమ్యూనిస్టు, ప్రతి సానుభూతిపరుని పని దినాన్ని ఒక గంట పొడిగిస్తున్నారు. అదే సమయంలో వాళ్ళ శ్రమ ఉత్పాదకత ఆదర్శప్రాయంగా వుంది.

"యీ ఆదర్శం యితోధిక అనుసరణను ఉత్పన్నం చేసింది, ఉత్పన్నం చెయ్యక తప్పదు. అలెక్సాంద్రొవ్స్కయ రైల్వేలోని కమ్యూనిస్టుల, సానుభూతిపరుల సాధారణ సమావేశం యుద్ధ పరిస్థితినీ, మాస్కో–కజాన్ రైల్వేలోని కామ్రేడ్లు అవలంబించిన తీర్మానాన్ని చర్చించిన తర్వాత, యీ విధంగా తీర్మానించినారు: 1. అలెక్సాంద్రొవ్స్కయ రైల్వేలోని కమ్యూనిస్టులకూ, సానుభూతిపరులకూ 'సుబ్బోత్నిక్కులు' ప్రవేశపెట్టాలి, మొదటి సుబ్బోత్నిక్ మే 17న జరగాలి; 2. ప్రస్తుత సామాగ్రితో, పరికరాలతో, ప్రస్తుత ఆహార పరిస్థితిలో యెలా పని చేయవలసిందీ, నిజంగా యేమి సాధ్యమయ్యేదీ కార్మికులకు చూపించి తీరేటట్టి ఆదర్శ ప్రాయమైన దళాలుగా కమ్యూనిస్టులనూ, సానుభూతిపరులనూ వ్యవస్థీకరించాలి.

"తమ ఆదర్శం గొప్ప ప్రభావం కలిగించిందనీ, వచ్చే శనివారంనాడు పార్టీ యేతర కార్మికులు పెద్ద సంఖ్యలో వస్తారని తాము ఆశిస్తున్నామనీ మాస్కో–కజాన్ రైల్వే కామ్రేడ్లు అంటున్నారు. యీ పంక్తులు రాసే సమయానికి, అలెక్సాంద్రొవ్స్కయ రైల్వే కార్ఖానాలలో కమ్యూనిస్టులు ఓవర్‌టైమ్ పని చేయడం యింకా ప్రారంభించలేదు; కానీ వాళ్ళు అలా చేయనున్నారనే వార్త వ్యాపించిన వెంటనే పార్టీయేతర కార్మిక జనబాహుళ్యం కదలినారు. 'మాకు నిన్న తెలియదు, లేకపోతే మేమూ పని చేసేవాళ్ళం!', 'వచ్చే శనివారం నేను తప్పక వస్తాను' అనే మాటలు అన్ని వైపుల నుండీ వినవస్తున్నాయి. యిలాంటి పని కలిగించిన ప్రభావం చాలా గొప్పది.

"మాస్కో–కజాన్ రైల్వే కామ్రేడ్ల ఆదర్శాన్ని వెనుకతట్టు ప్రాంతంలోని కమ్యూనిస్టు శాఖలన్నీ అనుసరించాలి; మాస్కో జంక్షన్‌లోని కమ్యూనిస్టు శాఖలు మాత్రమే కాదు, రష్యాలోని మొత్తం పార్టీ. గ్రామీణ ప్రాంతాలలో కూడా కమ్యూనిస్టు శాఖలు మొదట యెర్ర సైనికుల పొలాలు దున్నడానికి పూనుకొని, తద్వారా వాళ్ళ కుటుంబాలకు తోడ్పడాలి.

"మాస్కో–కజాన్ రైల్వేలోని కామ్రేడ్లు 'అంతర్జాతీయ గీతం' పాడుతూ తమ మొదటి కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కును ముగించినారు. యావత్తు రష్యాలోని కమ్యూనిస్టు శాఖలు యీ ఆదర్శాన్ని అనుసరించి, సుసంగతంగా ప్రయోగిస్తే, రష్యన్ సోవియట్ రిపబ్లిక్ వచ్చే తీవ్రమైన నెలలను రిపబ్లిక్‌లోని శ్రామిక జనులందరూ పాడే 'అంతర్జాతీయ గీతం' గంభీర ధ్వనులతో విజయవంతంగా దాటుతుంది...

"కమ్యూనిస్టు కామ్రేడ్స్, పదండి పనికి!"

1919 మే 23న "ప్రావ్ద" యిలా రాసింది:

"అలెక్సాంద్రొవ్స్కయ రైల్వేలో మొదటి కమ్యూనిస్టు 'సుబ్బోత్నిక్' మే 17న జరిగింది. తమ సాధారణ సమావేశంలో చేసిన తీర్మానం ప్రకారం తొంబై యెనిమిది మంది కమ్యూనిస్టులూ, సానుభూతిపరులూ జీతం లేకుండా అయిదు గంటలు ఓవర్‌టైమ్ పనిచేసినారు; దానికిగాను రెండవ భోజనమూ, శరీర కష్టం చేసేవాళ్ళుగా భోజనంతో పాటు అరపౌండు బ్రెడ్డూ కొనుక్కునే హక్కును మాత్రం పొందినారు."

పనికి సన్నాహాలు చేయడమూ, పనిని వ్యవస్థీకరించడమూ హీనంగా వుండినప్పటికీ, శ్రమ ఉత్పాదకత మామూలుకంటె రెండు మూడు రెట్లు యెక్కువగా వుండింది.

**యివి కొన్ని ఉదాహరణలు :**

అయిదుగురు టర్నర్లు నాలుగు గంటలలో యెనబై యిరుసులు తయారు చేసినారు. ఉత్పాతకత మామూలు స్థాయికి 213 శాతం వుంది.

యిరవై మంది అనిపుణ కార్మికులు నాలుగు గంటలలో 600 పూడ్ల మొత్తం తూకం గల తుక్కు సామగ్రీ, ఒక్కొక్కటి 3 1/2 పూడ్ల తూకం గల 70 రైలు పెట్టెల స్ప్రింగులూ–మొత్తం 850 పూడ్లు–పోగుచేసినారు. ఉత్పాదకత మామూలు స్థాయికి 300 శాతం.

"దీనికి కారణం యేమంటే, మామూలుగా తమ పని విసుగుగా, ఆయాసకరంగా వుంటుందనీ, యిక్కడ ఒక సంకల్పంతోనూ, ఉత్సాహంతోనూ పని చేసినామనీ కామ్రేడ్లు చెప్పినారు. కానీ యిప్పుడు కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులలో చేసినంత కంటె మామూలు పని గంటలలో తక్కువ చేయడానికి వాళ్ళు సిగ్గు పడతారు.

"యిప్పుడు అనేక పార్టీయేతర కార్మికులు తాము కూడా సుబోత్నిక్కులలో పాల్గొంటామని అంటున్నారు. రైలింజన్ల సిబ్బంది సుబ్బోత్నిక్ నాడు రైలింజన్లను 'స్మశానం' నుండి బయటికి తీసి, రిపేరు చేసి, నడిపిస్తామని ఐచ్ఛికంగా ముందుకు వస్తున్నారు.

"యిలాంటి సుబ్బోత్నికులు వ్యాజ్మ రైల్వేలో జరుపుతామని వార్త వచ్చింది."

యీ కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులలో పని యెలా జరిగిందీ "ఒక సుబ్బోత్నిక్ కార్మికుని నోట్సు" అనే వ్యాసంలో జూన్ 7 నాటి "ప్రావ్ద"లో కామ్రేడ్ ఎ. ద్యచేన్కొ వర్ణించినాడు. యీ వ్యాసంలోని ప్రధాన ఖండికలు ఉల్లేఖిస్తాము:

"పార్టీ యొక్క రైల్వే ప్రాంతీయ కమిటీ నిర్ణయంతో యేర్పాటు చేయబడిన సుబ్బోత్నిక్‌లో మా వంతు పని చేయడానికి ఒక కామ్రేడూ, నేనూ సంతోషంతో పోయినాము. మధ్యలో కొద్ది గంటల సేపు నేను నా బుర్రకు విశ్రాంతి యిచ్చి, నా కండరాలకు కాస్త వ్యాయామం యివ్వదలచుకున్నాను... మేము రైల్వే వడ్రంగిశాలకు పంపబడినాం. మేము అక్కడ చేరినాం, అక్కడ మావాళ్ళు కొందరు వుండినారు. మేము ఒకరినొకరం పలకరించుకొని, కాసేపు కబుర్లు చెప్పుకొని, మా జనాన్ని లెక్కవేసి, అంతా ముప్పై మంది వున్నామని తేల్చుకున్నాం... మా యెదుట ఒక 'భూతం' వుండింది, ఆరేడు వందల పూడ్లకు తక్కువ గాని బరువు గల బాయిలర్. మా పని దానిని కదలించడం, అనగా సుమారు 300 మీటర్ల దూరంలో వున్న దాని స్థానానికి దాన్ని తోసుకపోవడం. మాకు సందేహాలు రాసాగినాయి... అయినా, మేము పని ప్రారంభించినాము. కొందరు కామ్రేడ్లు బాయిలర్ కింద కొయ్య స్తంభాలు పెట్టి, బాయిలర్‌కు రెండు మోకులు కట్టినారు, మేము గుంజసాగినాం... బాయిలర్ కదలడానికి యిష్టపడలేదు, కానీ చివరకు కదలింది. మాకు సంతోషం కలిగింది. యెంతైనా మేము చాలా తక్కువమంది వుండినాం... దాదాపు రెండు వారాలపాటు మాయంత మూడంతలు మంది కమ్యూనిస్టేతర కార్మికుల ప్రయత్నాలకు బాయిలర్ లొంగలేదు, మేము వచ్చిందాకా దాన్ని కదిలించే మార్గం లేకపోయింది... మేము గంటసేపు పని చేసినాం, శ్రమ పడతూ, లయబద్ధంగా, 'ఒకటి, రెండు, మూడు' అనే మా ఫోర్మన్ కేకల మేరకు, బాయిలర్ దొర్లుతూ వుంటుంది. హఠాత్తుగా గంద్రగోళం యేర్పడింది, మా కామ్రేడ్లు పలువురు యితరులకు నవ్వు కలిగేలా తూలి కిందపడినారు. మోకు 'బోల్తా కొట్టించింది'... క్షణం ఆలస్యం, అంతకంటె లావు మోకు కట్టబడింది... సాయంత్రం. చీకటి పడుతూ వుండింది, మోమింకా ఒక చిన్న మిట్ట యెక్కవలసివుండింది, అప్పుడిక మా పని త్వరలో పూర్తి అవుతుంది. మా రెట్టలు సలుపుతున్నాయి, మా అరచేతులు మండుతున్నాయి, ఒళ్ళు వేడెక్కింది, శక్తి కొలది గుంజుతూ వుండినాం. ముందుకు సాగుతూ వుండినాం. 'మేనేజిమెంటు' చుట్టూ నిలబడివుండినారు, మా విజయానికి కాస్త సిగ్గుపడి, ఒక మోకు పట్టుకున్నారు. 'చేయి వేయండి, వేసే సమయం వచ్చింది!' ఒక యెర్ర సైనికుడు మా కష్టం చూస్తూ వుండినాడు; అతను చేతుల్లో అకార్డియన్ పట్టుకొని వుండినాడు. అతను యే మనుకుంటున్నాడు? యెవరు వీళ్ళు? అందరూ యిండ్ల వద్ద వుండగా, వీళ్ళు శనివారంనాడు యెందుకు పని చేయాలి? అతని సమస్యను నేను పరిష్కరించి, అతనితో అన్నాను: 'కామ్రేడ్, మాకు ఏదైనా సరదా పాట వాయించు. మేము చేతకానివాళ్ళం కాదు, నిజమైన కమ్యూనిస్టులం. మా చేతుల్లో పని యెంత వేగంగా జరుగుతున్నదీ కనిపించడం లేదా? మేము సోమరులం కాదు, శక్తి కొలది పని చేస్తున్నాం!' జవాబుగా యెర్ర సైనికుడు జాగ్రత్తగా తన అకార్డియన్ నేలమీద పెట్టి, తొందరగా వచ్చి ఒక మోకు కొన పట్టుకున్నాడు...

"హఠాత్తుగా కామ్రేడ్ యు. కార్మికుల పాట 'దుబీనుష్క' యెత్తుకున్నాడు, 'తెలివైన ఇంగ్లీషువాడు' అని శ్రావ్యంగా పాడినాడు. యీ కార్మికుల పేటపాటకు మేమందరమూ గొంతు కలిపినాము: 'ఓయ్, దుద్దుకర్ర, హైలెస్సా! ముందుకు సాగిపోదాం!'

"మేము పనికి అలవాటు పడినవాళ్ళం కాదు, మా కండరాలు అలసిపోయినాయి, భుజాలు, వీపులూ సలిపినాయి... కానీ మరు దినం సెలవు దినం, మా విశ్రాంతి దినం, కోరినంతసేపు నిద్రపోగలం. గమ్యం దగ్గరలో వుండింది, కొంత తటపటాయింపు తర్వాత మా 'భూతం' దాదాపు తన స్థానం వద్దకు దొర్లింది. 'కింద కొన్ని పలకలు పెట్టి, దానిని అడుగుమట్టం మీద నిలబెట్టండి, బాయిలర్ చాలా కాలంగా చేయవలసివున్న పనిని చేయనీయండి.' మేము గుంపుగా స్థానిక పార్టీ శాఖ 'క్లబ్బు గది'కి పోయినాం. గది ప్రకాశవంతంగా వెలుగుతూ వుండింది. గోడలు పోస్టర్లతో అలంకరించబడి వుండినాయి. చుట్టూ రైఫిళ్ళు పేర్చబడి వుండినాయి. ఉత్సాహంగా 'అంతర్జాతీయ గీతం' పాడిన తర్వాత మేము టీ, 'రమ్', అంతేకాక బ్రెడ్డు కూడా సేవించినాము. మాకు స్థానిక కామ్రేడ్లు యిచ్చిన యీ విందు మా తీవ్రమైన శ్రమ తర్వాత ప్రియంగా వుండింది. మేము మా కామ్రేడ్లతో సోదరత్వ పూర్వకంగా సెలవు తీసుకొని, బారు తీరినాం. రాత్రి నిశ్శబ్దంలో, నిండ్రించే వీధుల గుండా విప్లవ గీతాలు ప్రతిధ్వనించినాయి. క్రమబద్ధమైన మా నడక సంగీతపు లయకు అనుగుణంగా వుండింది. 'కామ్రేడ్స్, భేరి భంకారమ్ములు వినబడె' అనే పాటా, 'నిద్దుర మునిగిన అనాథులంతా లేవండోయ్' అనే పాట అంటే అంతర్జాతీయ శ్రామికుల పాట మేము పాడినాం.

"ఒక వారం గడించింది. మా రెట్టలూ, భుజాలూ మళ్ళీ మాములు స్థితికి వచ్చినాయి, మేము మరొక 'సుబ్బోత్నిక్కు'కు పోతూ వుండినాం, యీసారి తొమ్మిది మైళ్ళ దూరానికి, రైల్వే వేగన్లు రిపేరు చేయడానికి. మా గమ్యం పెరోవొ. కామ్రేడ్లు ఒక 'అమెరికన్' వేగన్ కప్పుమీదకి యెక్కి, ఉత్సాహంతో 'అంతర్జాతీయ గీతం' బాగా పాడినారు. రైలులోని ప్రయాణికులు ఆశ్చర్యంతో పాట వింటూ వుండినారు. రైలు చక్రాలు తాళం వేసినాయి. మాలో కప్పుమీదికి యెక్కలేనివాళ్ళు మెట్లకు కరుచుకున్నారు, 'తెగించిన'

ప్రయాణీకులలాగ నటిస్తూ. రైలు ఆగింది. మేము మా గమ్యం చేరినాం. మేము ఒక పెద్ద బయలు గుండా పోయినాం. కమిస్సార్ కామ్రేడ్ జి. మాకు హార్దికంగా స్వాగతం యిచ్చినాడు.

"పని బోలెడు వుంది, కానీ చేసేవాళ్ళు కొద్దిమంది! మేము వున్నది ముప్పై మంది మాత్రం, మరి ఆరు గంటల్లో పదమూడు వేగన్లకు సగటు రిపేర్లు చేయాలి! యిప్పటికే గుర్తు పెట్టిన కవల చక్రాలు యిక్కడున్నాయి. ఖాళీ వేగన్లు మాత్రమే కాక, నిండిన తొట్టి కూడా వుంది... కానీ, అదెంత లే, అది చేసేస్తాం కామ్రేడ్స్!'

"పని జోరుగా సాగింది. అయిదుగురు కామ్రేడ్లూ, నేనూ కప్పీ యంత్రాలతో పని చేస్తూ వుండినాం. మా భూజాలు, రెండు కప్పి యంత్రాల ఒత్తిడితో, మా ఫోర్మన్ దర్శకత్వం కింద, ఒక్కొకటి అరవై, డెబ్బై పూడ్ల బరువు గల యీ కవల చక్రాలు ఒక బాట మీద నుండి మరొక బాట మీదకి మహా చురుకుగా యెగురుతూ వుండినాయి. ఒక జత తొలగించబడేది, మరొక జత ఆ స్థానంలోకి దొర్లుకుంటూ వచ్చేది. చివరకు అన్నీ నియమిత స్థానాలలో ఉంచబడినాయి. అరిగిపోయిన ఈ పాత తుక్కు సామగ్రిని షెడ్డులోకి చేర్చినాం... ఒకటి, రెండు, మూడు–తిరిగే యినప కప్పీ యంత్రం చేత వాటిని పై కెత్తి క్షణంలో కమ్మీల నుండి పక్కకు తొలగించినాం. అటువైపు, చీకటిలో వడివడిగా సుత్తె దెబ్బలు వినిపించినాయి; కామ్రేడ్లు శ్రామిక తేనెటీగలలాగ, తమ చెడిపోయిన రైలు పెట్టెల పనిలో నిమగ్నులై వుండినారు, కొందరు వడ్రంగం చేస్తూ వుండినారు, కొందరు రంగు వేస్తూ వుండినారు, మరి కొందరు రైలు పెట్టెలకు పై కప్పు వేస్తూ వుండినారు, కామ్రేడ్ కమిస్సార్‌కూ, మాకూ ఆనందం కలిగిస్తూ. కమ్మర్లు మా సాయం కోరినారు. సంచార కమ్మరశాలలోని కొలిమిలో కప్లింగ్ కొక్కెంతో ఒక కడ్డీ తెల్లగా కాగి మెరుస్తూ వుండింది; అజాగ్రత్తగా షంటింగు చేయడం వలన అది వంగిపోయి వుండింది. మిణుగురులు వెదజిమ్ముతుండగా అది దాకలిమీద పెట్టబడింది; అనుభవజ్ఞుడైన కమ్మరి దర్శకత్వం కింద మా విశ్వసనీయమైన సమ్మెటలు దానిని సరైన రూపానికి కొట్టినాయి. యింకా ఎర్రగా మినుగురులు కక్కుతుండగా, దానిని మేము మా భూజాల మీద వేగంగా తీసుకపోయి, అది వుండవలసిన చోట పెట్టినాం. దానిని దాని రంధ్రంలోకి తోసినాం. కొద్ది సమ్మెట దెబ్బలతో అది బిడించబడింది. మేము వేగను కిందకి పాకినాం. కప్లింగు వ్యవహారం కండ్లకు కనిపించినంత సరళమైనది కాదు. రివెట్లతో, స్ప్రింగులతో దానికి రకరకాల తిరకాసులు వున్నాయి...

"పని జోరుగా సాగుతూ వుండింది. చీకటి పడుతూ వుండింది. దివిటీలు యింతకు ముందు కంటె కాంతివంతంగా మండినట్లు కనిపించినాయి. కాసేపట్లో పని ఆపేసే సమయం అవుతుంది. కొంతమంది కామ్రేడ్లు చక్రాలకు ఆనుకొని విశ్రాంతి తీసుకుంటూ, వేడి టీ చప్పరిస్తూ వుండినారు. మే మాసపు రాత్రి చల్లగా వుండింది; శుక్లపక్ష చంద్రుడు తళతళ మెరిసే కొడవలిలాగ ఆకాశంలో అందంగా ప్రకాశిస్తూ వుండినాడు. జనం నవ్వుతూ, హస్యాలాడుతూ వుండినారు.

" 'ఆపండి కామ్రేడ్ జి., పదమూడు వేగన్లు చాలు!'

"కానీ కామ్రేడ్ జి.కి తృప్తి లేదు.

"మేము టీ ముగించి, విజయోత్సాహపు పాటలు యెత్తుకొని, ద్వారం వద్దకు నడిచినాం".

"కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కుల"ఉద్యమం మాస్కోకు పరిమితం కాదు. జూన్ 6 నాటి "ప్రావ్ద" యీలా రాసింది:

"త్వేర్‌లో మొదటి కమ్యూనిస్టు సుబ్బోత్నిక్ మే 31న జరిగింది. నూటా యిరవై యెనిమిది మంది కమ్యూనిస్టులు రైల్వేలో పని చేసినారు. వాళ్ళు మూడున్నర గంటలలో పద్నాలుగు వేగన్లు లోడింగూ, అన్‌లోడింగూ చేసినారు, మూడు రైలింజన్లు రిపేరు చేసినారు, 213 మీటర్ల వంటచెరుకు కోసినారు. యింకా యితర పని చేసినారు. నిపుణ కమ్యూనిస్టు కార్మికుల శ్రమ ఉత్పాదకత మామూలు కంటె పదమూడు రెట్లు యెక్కువగా వుండింది."

మళ్లీ, జూన్ 8న "ప్రావ్ద"లో యిలా వుంది:

"కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు

"సరాతొవ్, జూన్5. తమ మాస్కో కామ్రేడ్ల విజ్ఞప్తికి ప్రతిస్పందనగా ఇక్కడి కమ్యూనిస్టు రైల్వే కార్మికులు ఒక సాధారణ పార్టీ సమావేశంలో యిలా తీర్మానించినారు: జాతీయ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేయడానికిగాను, జీతం లేకుండా శనివారాలనాడు అయిదు గంటలు ఓవర్‌టైమ్ పని చేయాలి."

* * *

కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కుల గురించి నేను అత్యంత సంపూర్ణమైన, అత్యంత సవివరమైన సమాచారం యిచ్చినాను; యెందుకుంటే, దీనిలో మనకు కమ్యూనిస్టు నిర్మాణపు అత్యంత ముఖ్యమైన పార్శ్వం ఒకటి నిస్సంశయంగా కనపడుతుంది, మన పత్రికలు తగినంత శ్రద్ధ చూపనట్టిది, మనమందరమూ యింకా సరిగా దాని విలువను గ్రహించనట్టిది.

తక్కువ రాజకీయ ఆర్భాటాలు, కమ్యూనిస్టు నిర్మాణపు అత్యంత సరళమైన, కానీ సజీవమైన వాస్తవాలకు, వాస్తవ జీవితం నుండి గ్రహించబడినవీ, వాస్తవ జీవితం చేత పరీక్షించి చూడబడినవీ అయినవాటికి యెక్కువ శ్రద్ధ–యిది మనమందరమూ, మన రచయితలూ, ఆందోళనకారులూ, ప్రచారకులూ, ఆర్గనైజర్లూ మొదలైనవాళ్ళు యెడతెగకుండా పునశ్చరణ చేయవలసిన నినాదం.

శ్రామికవర్గ విప్లవం తరువాతి మొదటి దశలో మనం బూర్జువా వర్గపు ప్రతిఘటనను అధిగమించడమూ, దోపిడీదార్లను ఓడించడమూ, వాళ్ళ కుట్రను (పెట్రోగ్రాడ్‌ను అప్పగించడానికి "నల్ల నూర్ల" 108వాళ్ళు, కాడెట్లూ మొదలుకొని మెన్షెవిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ అందరూ పాల్గొన్న "బానిస యజమానుల కుట్ర" లాంటి దాన్ని) నలిపివేయడమూ అనే ప్రధాన, మౌలిక కర్తవ్యంలో ప్రధానంగా నిమగ్నులం కావలసి వుండడం సహజమూ, అనివార్యమూ. కానీ, యీ కర్తవ్యానికి సమకాలికంగా, మరొక కర్తవ్యం

అంతే అనివార్యంగానూ, కాలం గడిచేకొద్దీ అంతకంటే విధాయకంగా కూడానూ ముందుకు వస్తుంది, యేదంటే, కమ్యూనిస్టు నిర్మాణం, నూతన ఆర్థిక సంబంధాలను, నూతన సమాజాన్ని సృష్టించడం, అనే మరింత ముఖ్యమైన కర్తవ్యం.

నేను ఒకటి కంటే యెక్కువసార్లు-యితర సందర్భాలతో పాటు, మార్చి 12న పెట్రోగ్రాడ్ సోవియట్ సమావేశంలో నేను యిచ్చిన ఉపన్యాసంలోనూ – పేర్కొన్నట్లు శ్రామికవర్గ నియంతృత్వం అంటే దోపిడీదార్ల మీద బలప్రయోగం మాత్రమే కాదు, ప్రధానంగా బలప్రయోగం కూడా కాదు. యీ విప్లవ బలప్రయోగపు ఆర్థిక పునాదీ, దీని ప్రయోజకత్వానికీ, విజయానికీ హామీ యేమిటంటే, కార్మికవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థ కంటె ఉన్నతమైన శ్రమయొక్క సామాజిక వ్యవస్థీకరణకు ప్రాతినిధ్యం వహించడమూ, ఆ వ్యవస్థీకరణను సృష్టించడమూ. యిదే ముఖ్యమైనది, ఇదే బలం మూలమూ, కమ్యూనిజం అంతిమ విజయం అనివార్యం కావడానికి హామీ.

సామాజిక శ్రమయొక్క ఫ్యూడల్ వ్యవస్థీకరణ బెత్తం క్రమశిక్షణ మీద ఆధారపడి వుండింది, కొద్దిమంది భూస్వాముల చేత దోచుకోబడి, హింసింపబడిన శ్రామిక ప్రజలు పూర్తిగా అజ్ఞానులుగానూ, నేల రాయబడినవాళ్ళుగానూ వుండినారు. సామాజిక శ్రమయొక్క పెట్టుబడిదారీ వ్యవస్థీకరణ ఆకలి క్రమశిక్షణ మీద ఆధారపడి వుండింది; బూర్జువా సంస్కృతీ, బూర్జువా ప్రజాస్వామ్యమూ యెంత పురోగమించినప్పటికీ, అత్యంత పురోగామి, నాగరిక, ప్రజాతంత్ర రిపబ్లిక్కుల్లో శ్రామిక ప్రజల అపార జనబాహూళ్యం కొద్ది మంది పెట్టుబడి దార్లచేత దోచుకోబడి, హింసిపబడే కూలి బానిసల, లేదా దమిత రైతుల నేలరాయబడిన జనబాహుళ్యంగా వుంది. సామాజిక శ్రమ యొక్క కమ్యూనిస్టు వ్యవస్థీకరణ, సోషలిజం దేనివైపు మొదటి అడుగో అది, భూస్వాముల, పెట్టుబడిదార్ల పెత్తనాన్ని తోసివేసిన శ్రామిక ప్రజలదే అయిన స్వేచ్ఛాయుత, చైతన్యపూరిత క్రమశిక్షణమీద ఆధారపడుతుంది, కాలం గడచేకొద్దీ అంతకంతకూ యెక్కువగా ఆధారడుతుంది.

యీ కొత్త క్రమశిక్షణ ఆకాశం నుండి వూడిపడదు, భక్తిపూరిత కాంక్షల నుండి ఉద్భవించదు; యిది భారీ పెట్టుబడిదారీ ఉత్పత్తి యొక్క భౌతిక పరిస్థితుల నుండి, వాటి నుండి మాత్రమే ఉద్భవిస్తుంది. అవి లేకుండా ఇది అసంభవం. ఈ భౌతిక పరిస్థితులు నిర్వహించేది భారీ పెట్టుబడిదారీ వ్యవస్థ చేత సృష్టింపబడి, వ్యవస్థీకరింపబడి, సమైక్యం చేయబడి, తర్ఫీదు చేయబడి, విద్యావంతం చేయబడి, కాకలు తీర్చబడిన ఒక నిర్దిష్టమైన చారిత్రక వర్గం. యీ వర్గం శ్రామికవర్గం.

"శ్రామికవర్గ నియంతృత్వం" అనే లాటిన్ భాషలోని శాస్త్రీయ, చారిత్రక-తాత్విక పదాన్ని సరళమైన భాషలోకి అనువదిస్తే, దాని అర్థం సరిగ్గా యిది:

పెట్టుబడి పెత్తనాన్ని తోసివేయడానికి జరిగే పోరాటంలోనూ, దాన్ని నిర్వహించడంలోనూ, విజయాన్ని నిలుపుకోవడానికీ, దృఢపరచుకోడానికీ చేసే పోరాటంలోనూ, కొత్త, సోషలిస్టు సామాజిక వ్యవస్థను సృష్టించడంలోనూ, వర్గాల సంపూర్ణ రద్దు కొరకు చేసే యావత్తు పోరాటంలోనూ దోపిడీ చేయబడే మొత్తం శ్రామిక ప్రజా బహుళ్యానికి ఒక నిర్దిష్ట వర్గం మాత్రమే నాయకత్వం వహించగలదు-యేదంటే, పట్టణ కార్మికులూ, దరహంమీద ఫాక్టరీ, పారిశ్రామిక కార్మికులూ. (యిక్కడ ఒక మాట చెప్పనివ్వండి: సోషలిజంకూ, కమ్యూనిజంకూ మధ్య గల ఒకేఒక శాస్త్రీయ భేదం యేమిటంటే, మొదటి మాటకు అర్థం పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి ఉద్భవించే నూతన సమాజపు మొదటి దశ, రెండవ మాటకు అర్థం తరువాతి, మరింత ఉన్నతమైన దశ.)

"బెర్న్" రాజీవాద ఇంటర్నేషనల్ చేసే పొరపాటు యేమిటంటే, దాని నాయకులు వర్గ పోరాటాన్నీ, కార్మికవర్గపు నాయక పాత్రనూ మాటలలో మాత్రమే ఒప్పుకుంటారు, కానీ దాని తార్కిక నిర్ధారణదాకా తుదముట్ట ఆలోచించడానికి భయపడతారు. ప్రత్యేకంగా యేది బూర్జువాలను భయకంపితులను చేస్తుందో, యేది బూర్జువాలకు అనంగీకారయోగ్యమో, ఆ నిర్ధారణకు వాళ్ళు భయపడతారు. శ్రామికవర్గ నియంతృత్వం వర్గ పోరాట కాలం కూడా అనీ, వర్గాలు రద్దు చేయబడకుండా వున్నంత కాలం యీ పోరాటం అనివార్యమనీ, యీ పోరాటం రూపం మారుతూ, పెట్టుబడి కూలదోయబడిన తర్వాత వెంటనే వచ్చే కాలంలో మరీ భీషణంగా, ప్రత్యేకించి విలక్షణంగా వుంటుందనీ ఒప్పుకోడానికి వాళ్ళు భయపడతారు. రాజకీయ అధికారం పట్టుకున్న తర్వాత శ్రామికవర్గం వర్గ పోరాటం ఆపదు, వర్గాలు రద్దయిందాకా దీనిని కొనసాగిస్తుంది – సహజంగా, భిన్న పరిస్థితులలో, భిన్న రూపంలో, భిన్న సాధనాలతో.

"వర్గాల రద్దు" అంటే యేమిటి అర్థం? సోషలిస్టులమని చెప్పుకునేవాళ్లందరూ దీనిని సోషలిజం అంతిమ గమ్యంగా గుర్తిస్తారు, కానీ దాని ప్రాముఖ్యం గురించి అందరూ ఆలోచించరు. వర్గాలు అంటే, చారిత్రకంగా నిర్ణీతమైన సామాజిక ఉత్పత్తి వ్యవస్థలో తాము ఆక్రమించే స్థానంలోనూ, ఉత్పత్తి సాధనాలతో తమకు గల సంబంధం (అత్యధిక సందర్భాలలో చట్టం చేత నిర్ణయించబడి, రూపొందించబడిన సంబంధం)లోనూ, శ్రమ సామాజిక వ్యవస్థీకరణలోని తమ పాత్రలోనూ, తత్పర్యవసానంగా, సామాజిక సంపదలో తాము ఖర్చుపెట్టే భాగపు పరిమాణాలలోనూ, ఆ భాగాన్ని సంపాయించే పద్ధతిలోనూ పరస్పరం భిన్నంగా వుండే విశాల ప్రజా బృందాలు. వర్గాలు అంటే, నిర్ణీత సామాజిక ఆర్థిక వ్యవస్థలో తాము ఆక్రమించే భిన్న స్థానాల మూలంగా, ఒకదాని శ్రమను మరొకటి సొంతపరచుకోగల ప్రజా బృందాలు.

స్పష్టంగా, వర్గాలను పూర్తిగా రద్దు చేయడానికి దోపిడీదార్లను – భూస్వాములనూ, పెట్టుబడిదార్లనూ – కూలదోయడం చాలదు, వాళ్ళ ఆస్తి హక్కులను రద్దుచేయడం చాలదు; ఉత్పత్తి సాధనాల వ్యక్తిగత స్వామ్యం అంతటినీ రద్దు చేయడం కూడా అవసరం,

పట్టణానికీ, గ్రామీణ ప్రాంతానికీ మధ్య భేదాన్నీ, శరీర శ్రమ చేసే కార్మికులకూ, మెదడు శ్రమ చేసే కార్మికులకూ మధ్య భేదాన్నీ రద్దు చేయడం అవసరం. దీనికి చాలా దీర్ఘకాలం పట్టుతుంది. దీనిని సాధించడానికి ఉత్పాదక శక్తుల అభివృద్ధిలో అపారమైన ముందడుగు వేయాలి; సన్నకారు ఉత్పత్తి యొక్క అనేక అవశేషాల ప్రతిఘటనను (తరుచుగా నిష్క్రియాత్మకమైన దాన్ని, అందువలన మరీ మొండిదీ, అధిగమించడానికి మరీ కష్టమైనదీ అయినదాన్ని) అధిగమించడం అవసరం; యీ అవశేషాలతో లంకింపబడిన అపారమైన అలవాటు బలాన్నీ, యధాస్థితితత్వాన్నీ అధిగమించడం అవసరం.

"శ్రామిక ప్రజ"లందరూ యీ పని చేయడానికి సమానంగా సమర్థులని అనుకోవడం వట్టి మాట, లేదా కృతయుగంనాటి, మార్క్సు పూర్వ సోషలిస్టు భ్రమ; యెందుకంటే, యీ సామర్థ్యం దానిపాటికదే రాదు, చారిత్రకంగా పెరుగుతుంది, భారీ పెట్టుబడిదారీ ఉత్పత్తి భౌతిక పరిస్థితుల నుండి మాత్రమే పెరుగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజంకు పోయే బాట యొక్క ప్రారంభంలో యీ సామర్థ్యం కార్మికవర్గానికి మాత్రమే వుంటుంది. తనను యెదుర్కొనే బ్రహ్మాండమైన కర్తవ్యాన్ని నిర్వహించే సామర్థ్యం దానికి యెందుకు వుందంటే, మొదటిది, అది నాగరిక సమాజంలో అత్యంత బలమైన, అత్యంత పురోగామి అయిన వర్గం గనుకా; రెండవది, అత్యంత అభివృద్ధి అయిన దేశాలలో అది ప్రజానీకంలో మెజారిటీగా ఉంది గనుకా; మూడవది, రష్యా లాంటి వెనుకబడిన పెట్టుబడిదారీ దేశాలలో ప్రజానీకంలో మెజారిటీ అర్ధ నిరాస్తిపరులు గనుకా, అనగా, యేడాదిలో కొంతభాగం క్రమం తప్పకుండా శ్రామికవర్గ పద్ధతిలో జీవిస్తూ, క్రమం తప్పకుండా తమ జీవనోపాధిలో కొంత భాగాన్ని పెట్టుబడిదారీ సంస్థలలో వేతన కార్మికులుగా సంపాయిస్తారు గనుకా.

పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిజంకు జరిగే పరివర్తనలో యిమిడివున్న సమస్యలను స్వేచ్ఛా, సమానత్వమూ, దరహంమీద ప్రజాస్వామ్యమూ, శ్రమ ప్రజాస్వామ్య సమానత్వమూ, వగైరాల గురించిన సాధారణ మాటల ప్రాతిపదికమీద (కౌట్స్కీ, మార్తొవ్‌ల లాగా, బెర్న్ రాజీవాద ఇంటర్నేషనల్‌కు చెందిన యితర వీరులలాగా) పరిష్కరించడానికి ప్రయత్నించేవాళ్ళు తద్వారా తమ పెటీబూర్జువా, కూపస్థమండూక స్వభావాన్ని మాత్రమే వెల్లడి చేస్తారు, సైద్ధాంతికంగా బానిస బుద్ధితో బూర్జువావర్గపు అడుగు జాడలను అనుసరిస్తారు. యీ సమస్యకు సరైన పరిష్కారం యెక్కడ లభించగలదంటే, రాజకీయ అధికారం జయించుకున్న నిర్దిష్ట వర్గం అయిన కార్మికవర్గానికీ, కార్మికవర్గేతర, అర్ధనిరాస్తిపర శ్రామిక ప్రజా బాహుళ్య మంతటికీ మధ్య గల నిర్దిష్ట సంబంధాలను - ఊహాలోక సామరస్యపు "ఆదర్శ" పరిస్థితులలో కాక, అనేక భిన్న రూపాలు ధరించే బూర్జువావర్గపు భీషణ ప్రతిఘటన గల వాస్తవ పరిస్థితులలో రూపుదాల్చే సంబంధాలను - నిర్దిష్టంగా అధ్యయనం చేయడంలో మాత్రమే లభించగలదు.

రష్యాతో సహా, యే పెట్టుబడిదారీ దేశంలోనైనా వున్న ప్రజానీకంలోని - అంతకంటె యెక్కువగా శ్రామిక ప్రజానీకంలోని - అపారమైన మెజారిటీ స్వయంగానూ, తమ ఆత్మీయుల ద్వారానూ పెట్టుబడి పీడననూ, అది సాగించే కొల్లనూ, రకరకాల క్రౌర్యాన్నీ వేలసార్లు అనుభవించినారు. సామ్రాజ్యవాద యుద్ధం, అనగా, యావత్ప్రపంచాన్నీ కొల్లగొట్టడానికి సర్వాధిపత్యం బ్రిటిష్ పెట్టుబడికి వుండాల్నా, జర్మన్ పెట్టుబడికి వుండాల్నా అనేది నిర్ణయించడానికి కోటిమంది వధ, యీ బాధలను తీవ్రతరం చేసింది, పెంచింది, ప్రగాఢం చేసింది, వీటి అర్థాన్ని ప్రజలు గుర్తించేటట్లు చేసింది. అందుకనే ప్రజానీకంలోని అపారమైన మెజారిటీ, ముఖ్యంగా శ్రామిక ప్రజలు, కార్మికవర్గానికి అనివార్యంగా సానుభూతి చూపడం; యెందుకంటే, అది విరోచిత ధైర్యంతోనూ, విప్లవ నిర్దాక్షిణ్యంతోనూ పెట్టుబడి పెత్తనాన్ని తోసివేస్తున్నది, దోపిడీదార్లను కూలదోస్తున్నది, వాళ్ళ ప్రతిఘటనను అణచివేస్తున్నది, దోపిడీదార్లకు తావు లేని నూతన సమాజపు సృష్టికి బాట వేయడానికి తన రక్తం ధారపోస్తున్నది.

శ్రామికవర్గేతర, అర్ధ శ్రామికవర్గీయ శ్రామిక ప్రజా బహుళ్యానికి గల పెటీ బూర్జువా ఊగిసలాటా, బూర్జువా "సువ్యవస్థ"లోకి, బూర్జువావర్గ "రక్షణ"లోకి తిరిగి పోవాలనే ధోరణీ గొప్పగా, అనివార్యంగా వున్నప్పటికీ, వాళ్ళు శ్రామికవర్గపు - దోపిడీదార్లను కూలదోస్తూ, వాళ్ళ ప్రతిఘటనను అణచివేస్తూ వుండటమే కాక, ఒక నూతన, ఉన్నత సామాజిక సంబంధాన్ని, ఒక సామాజిక క్రమశిక్షణను, తమ సొంత ఐక్యత, తమ సొంత, అధిక వర్గచైతన్యపూరిత, ధీర, దృఢ, విప్లవాత్మక, సుస్థిర అగ్రదళపు అధికారాన్ని తప్ప యే పెత్తనాన్నీ, యే అధికారాన్నీ యెరగని వర్గచైతన్యపూరిత, సమైక్య శ్రామిక ప్రజల క్రమశిక్షణను, నిర్మిస్తున్న కార్మికవర్గపు - నైతిక, రాజకీయ అధికారాన్ని గుర్తించకుండా వుండలేరు.

విజయం సాధించడానికీ, సోషలిజంను నిర్మించి, దృఢపరచడానికీ, కార్మికవర్గం ద్విముఖ, లేదా ద్వంద్వ కర్తవ్యం నిర్వర్తించాలి. మొదటిది, అది పెట్టుబడిమీద చేసే విప్లవాత్మక పోరాటంలో తన మహోన్నత వీరత్వం ద్వారా దోపిడీ చేయబడే శ్రామిక ప్రజా బాహుళ్యమంతటినీ ఆకర్షించాలి, వాళ్ళను ఆకర్షించి, వ్యవస్థీకరించి, బూర్జువా వర్గాన్ని కూలదోయడానికీ, దాని ప్రతిఘటనను పూర్తిగా అణచివేయడానికీ చేసే పోరాటంలో వాళ్ళను నడిపించాలి. రెండవది, అది కొత్త ఆర్థిక అభివృద్ధి బాటమీదికి, ఒక కొత్త సామాజిక సంబంధాన్ని, ఒక కొత్త శ్రమ క్రమశిక్షణను, సరికొత్త శాస్త్ర విజ్ఞానాన్నీ, పెట్టుబడిదారీ సాంకేతిక విజ్ఞానాన్నీ, భారీ సోషలిస్టు పరిశ్రమలను సృష్టించే వర్గ చైతన్య పూరిత కార్మికుల సామూహిక సంస్థలతో సమ్మేళనం చేసే కొత్త శ్రమ వ్యవస్థీకరణను సృష్టించడంవైపు దోపిడీ చేయబడే శ్రామిక ప్రజా బాహుళ్యమంతటినీ, పెటీబూర్జువా శక్తులనూ కూడా నడిపించాలి.

రెండవ కర్తవ్యం మొదటిదాని కంటే కష్టమైనది; యెందుకంటే, వీరావేశపు విడివిడి చర్యలచేత దానిని నిర్వర్తించడం సాధ్యం కాదు;

దానికి సాదా, రోజువారీ పనిలో అత్యంత దీర్ఘమైన, పట్టు విడువని, కష్టమైన సామూహిక వీరత్వం అవసరం. కానీ మొదటిదాని కంటె యీ కర్తవ్యం ముఖ్యమైనది, యెందుకంటే, కొత్త, ఉన్నత సామాజిక ఉత్పత్తి విధానం మాత్రమే, పెట్టుబడిదారీ, పెటీబూర్జువా ఉత్పత్తి స్థానంలో భారీ సోషలిస్టు ఉత్పత్తి పెట్టడం మాత్రమే, బూర్జువావర్గం మీద విజయాలకు కావలసిన బలానికి ప్రగాఢమైన మూలంగా, యీ విజయాల సుస్థిరత్వానికీ, శాశ్వతత్వానికీ యేకైక హామిగా వుండగలదు.

* * *

"కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు" యెందుకంత అపార చారిత్రక ప్రాముఖ్యం గలవి అంటే, సరిగ్గా అవి శ్రమ ఉత్పాదకతను అభివృద్ధి చేయడంలోనూ, కొత్త శ్రమ క్రమశిక్షణను అవలంబించడంలోనూ, ఆర్థిక వ్యవస్థయొక్కా, జీవితంయొక్కా సోషలిస్టు పరిస్థితులను సృష్టించడంలోనూ కార్మికుల చైతన్యపూరిత, ఐచ్ఛిక చొరవను మనకు చూపిస్తాయి గనుకనే.

1870–1871 గుణపాఠాల తర్వాత జాతీయ దురహంకారంవైపుకో, జాతీయ ఉదారవాదంవైపుకో కాక, సోషలిజంవైపుకు పోయిన కొద్దిమంది, అసాధారణంగా అరుదైన అంటే మరింత నరిగా వుంటుంది. జర్మన్ బూర్జువా ప్రజాతంత్రవాదులలో ఒకడైన జె. యాకోబి ఒకసారి అన్నాడు: ఒక్క ట్రేడ్‌యూనియన్ యేర్పడడం సడోవా యుద్ధం కంటె యెక్కువ చారిత్రక ప్రాముఖ్యం గలదని. యిది నిజం. సడోవా యుద్ధం జర్మన్ జాతీయ పెట్టుబడిదారీ రాజ్యాన్ని సృష్టించడంలో రెండు బూర్జువా రాజరికాలలో దేనిది, ఆస్ట్రియన్ రాజరికందా, ప్రష్యన్ రాచరికందా, సర్వాధిపత్యం అయిందీ తేల్చింది. ఒక్క ట్రేడ్ యూనియన్ యేర్పడడం బూర్జువావర్గం మీద కార్మికవర్గపు ప్రపంచ విజయం వైపు ఒక చిన్న అడుగు. అదే విధంగా మనమనవచ్చు, 1919 మే 10న మాస్కో–కజాన్ రైల్వే కార్మికులు మాస్కోలో యేర్పాటు చేసిన మొదటి కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కు 1914– 1918 సామ్రాజ్యవాద యుద్ధంలో హిండెన్‌బర్గ్ గానీ, ఫోష్, బ్రిటిష్‌వాళ్ళూ గానీ సాధించిన యే విజయం కంటె కూడా యెక్కువ చారిత్రక ప్రాముఖ్యం కలదని. సామ్రాజ్యవాదుల విజయాలంటే, ఆంగ్లో–అమెరికన్, ఫ్రెంచి కోటీశ్వరుల లాభాల కొరకు లక్షల మంది కార్మికుల వధ; చెడ తినడంతో చెడ బలిసి, సజీవంగా కుళ్ళిపోతూ, చావు మూడిన పెట్టుబడిదారీ వ్యవస్థ ఘోర కృత్యాలు అవి. మాస్కో–కజాన్ రైల్వేలోని కార్మికులు ఏర్పాటు చేసిన కమ్యూనిస్టు సుబ్బోత్నిక్ అనేది భూమండంలోని సకల ప్రజలకూ పెట్టుబడి పెత్తనం నుండీ, యుద్ధాల నుండీ విముక్తిని కొనితెచ్చే, సోషలిస్టు సమాజపు జీవకణాలలో ఒకటి.

బూర్జువా పెద్దమనుషులూ, వాళ్ళ తొత్తులూ తావే ప్రజాభిప్రాయానికి ప్రతినిధులమని అనుకునే మెన్షెవిక్కులతో, సోషలిస్టు రివల్యూషనరీలతో సహా, సహజంగా కమ్యూనిస్టుల ఆశలను యీసడిస్తారు, యీ ఆశలను అరచేతిలో వైకుంఠం అంటారు; దొంగతనాలూ, సోమరితనమూ, తగ్గిపోయిన ఉత్పాతకతా, ముడి సరుకులనూ, తయారైన వస్తువులనూ చెడగొట్టడమూ, వగైరాల సంఖ్యతో పోలిస్తే తృణప్రాయమైన సుబ్బోత్నిక్కుల సంఖ్యను చూసి యెగతాళి చేస్తారు. యీ పెద్ద మనుషులకు మన సమాధానం యేమిటంటే: బూర్జువా మేధావులు రష్యన్, విదేశీ పెట్టుబడిదార్ల అధికారాన్ని పునరుద్ధరించడానికిగాను తమ జ్ఞానాన్ని వాళ్ళకు యివ్వడానికి బదులు, శ్రామిక ప్రజలకు తోడ్పడడానికి అంకితం చేసి వుంటే, విప్లవం మరింత వేగంగా, మరింత శాంతియుతంగా పురోగమించి వుండేది. కానీ యిది ఊహాజనితం; యెందుకంటే, సమస్య వర్గ పోరాటం ద్వారా పరిష్కరింపబడుతుంది, మేధావులలో మెజారిటీ బూర్జువావర్గం వైపుకు మొగ్గుతారు. కార్మికవర్గం విజయం సాధించేది మేధావుల తోడ్పాటుతో కాదు, వాళ్ళ వ్యతిరేకత వున్నప్పటికీ (కనీస మెజారిటీ సందర్భాలలో), బాగుపరచరానంతగా బూర్జువా అయినవాళ్ళను తొలగించుకుంటూ, ఊగిసలాడే వాళ్ళను సంస్కరించుకుంటూ, నూతన మనఃపరిపాకం కలిగిస్తూ లోబరచుకుంటూ, వాళ్ళలో అంతకంతకూ విస్తృతమైన విభాగాలను తమ వైపుకు తిప్పుకుంటూ విప్లవం యొక్క కాష్టాలనూ, తిరోగమనాలనూ చూసి ఉబ్బిపోవడం, భీతాహం వ్యాపింపజేయడం, గతానికి తిరిగి పోవాలని బోధించడం – యివి బూర్జువా మేధావుల వర్గ పోరాటపు సాధనాలూ, పద్ధతులూ. కార్మికవర్గం వీటికి మోసపోదు.

కానీ, అసలు విషయాలకు వస్తే, అపజయాల, తప్పుల, తిరోగమనాల దీర్ఘ పరంపర లేకుండా కొత్త ఉత్పత్తి విధానం వెంటనే వేరూనడం చరిత్రలో యెప్పుడైనా జరిగిందా? ఫ్యూడల్ దాస్యం రద్దు చేయబడిన అర్ధ శతాబ్ది తర్వాత, దాని అవశేషాలు రష్యన్ గ్రామసీమలో యింకా చెప్పుకోదగినన్ని వుండినాయి. అమెరికాలో బానిసత్వం రద్దు చేయబడిన అర్ధశతాబ్ది తర్వాత, నీగ్రోల స్థితి యింకా అతి తరుచుగా అర్ధ బానిసత్వ స్థితిగా వుండింది. బూర్జువా మేధావుల మెన్షెవిక్కులతో, సోషలిస్టు రివల్యూషనరీలతో సహా, పెట్టుబడికి సేవచేయడంలోనూ, పచ్చి బూటకపు వాదాలను ఉపయోగించడం కొనసాగించడంలోనూ తమ స్వభావానికి అనుగుణంగా వున్నారు – కార్మికవర్గ విప్లవానికి ముందు మనం ఊహాస్వర్గ వాదులమని నిందించినారు; విప్లవం తర్వాత గతకాలపు మట్టులన్నిటినీ అసంభవమైన వేగంతో మనం తుడిచివెయ్యాలని డిమాండు చేస్తున్నారు!

కానీ మనం ఊహాస్వర్గవాదులం కాదు, బూర్జువా "వాదాల" నిజమైన విలువ మనకు తెలుసు; విప్లవం తర్వాత కొంత కాలంపాటు పాత నీతుల మట్లు కొత్త నీతుల లేత మొక్కల కంటె అనివార్యంగా యెక్కువగా వుంటాయి. కొత్తది అప్పుడే జన్మించినప్పుడు యెప్పుడైనా పాతది కొంత కాలంపాటు దాని కంటె బలంగా వుంటుంది; ప్రకృతిలోనూ, సామాజిక జీవితంలోనూ యిది యెప్పుడూ వుంటుంది. కొత్త వ్యవస్థ లేత మొక్కల దుర్బలత్వాన్ని యీసడించడమూ, మేధావుల చౌకబారు సందేహతత్వమూ, వగైరాలూ సారభూతంగా యివి కార్మికవర్గం మీద బూర్జువాల వర్గ పోరాటపు పద్ధతులు, సోషలిజంకు వ్యతిరేకంగా పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించడం. దుర్భరమైన కొత్త మొక్కలను మనం

జాగ్రత్తగా అధ్యయనం చేయాలి, వాటిపట్ల గరిష్ఠ శ్రద్ధ వహించాలి, వాటి పెరుగుదలకు దోహదం చేకూర్చేందుకు సమస్తమూ చేయాలి, వాటిని "సాకాలి". వాటిలో కొన్ని నశించిపోవడం అనివార్యం. సరిగ్గా "కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు" మరీ ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయని మనం హామి యివ్వలేం. కానీ అది కాదు అసలు విషయం. అసలు విషయం కొత్త దాని ప్రతి మొలకనూ పెంచడం. అత్యంత జీవయోగ్యమైన వాటిని జీవితం యెన్నుకుంటుంది. కొరుకు వ్యాధిని నిర్మూలించడంలో మానవజాతికి తోడ్పడడానికిగానూ, నిశ్చితమైన మందు తయారు చేసే ముందు ఆరు వందల అయిదు మందులను పరీక్షించి చూసే ఓర్పు జపాన్ శాస్త్రజ్ఞునికి వుంటే, అంతకంటె కష్టమైన సమస్యను, పెట్టుబడిదారీ వ్యవస్థను ఓడించే సమస్యను పరిష్కరించ గోరేవాళ్ళకు వందల, వేల కొత్త పోరాట పద్ధతులనూ, సాధనాలనూ, ఆయుధాలనూ పరీక్షించి చూసే పట్టుదల వుండాలి, వాటి నుండి అత్యంత అనుకూలమైన వాటిని అభివృద్ధి చేసుకోడానికిగాను.

"కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు" యెందుకంత ముఖ్యమైనవంటే, అవి యేవిధంగానూ అసాధారణమైనంత మంచి పరిస్థితులలో లేని కార్మికుల చేత, వివిధ నైపుణ్యాలకు చెందిన కార్మికులచేత, యే నైపుణ్యమూ లేని కేవల అనిపుణ శ్రామికుల చేతా, మామూలు, అనగా మహాకష్టమైన పరిస్థితులలో జీవించేవాళ్ళ చేత ప్రారంభించబడినాయి. రష్యాలోనే కాక, ప్రపంచ మంతటా కనబడుతున్న శ్రమ ఉత్పాదకత క్షీణత్వానికి ప్రధాన కారణం మనకందరికీ బాగా తెలుసు; అది సామ్రాజ్యవాద యుద్ధం కలిగించిన ఆర్థిక వినాశనమూ, దారిద్ర్యమూ, కసీ, వేసరికా, అనారోగ్యమూ, పౌష్టికాహార లోపమూ. చివరిది అన్నింటికంటే ముఖ్యమైనది. కరువు – అదీ కారణం. కరువును తొలగించడానికి వ్యవసాయంలోనూ, రవాణాలోనూ, పరిశ్రమలలోనూ శ్రమ ఉత్పాదకతను పెంచాలి. కనుక, ఒక విధమైన విషవలయం యేర్పడుతున్నది: శ్రమ ఉత్పాదకతను పెంచడానికిగాను పస్తులనుండి మనల్ని మనం రక్షించుకోవాలి; పస్తులనుండి మనల్ని మనం రక్షించుకోడానికిగాను శ్రమ ఉత్పాదకలను పెంచాలి.

విష వలయాన్ని భగ్నం చేయడం ద్వారా, ప్రజల మనస్థితిలో మౌలికమైన మార్పు కలిగించడం ద్వారా, అలాంటి మౌలికమైన మార్పువున్నప్పుడు తరుచుగా నిర్ణయాత్మకమైన పాత్ర నిర్వహించే విడి బృందాల వీరోచిత చొరవ ద్వారా ఆచరణలో అలాంటి వైరుధ్యాలు పరిష్కరింపబడతాయని మనకు తెలుసు. మాస్కోలోని అనిపుణ కార్మికులూ, రైల్వే కార్మికులూ (సహజంగానే, మా మనసులో వున్నది వాళ్ళలోని మెజారిటీ, కొద్ది పాటి లాభార్జనపరులూ, ఉద్యోగుల బాపతు వైట్‌గార్డులూ కాదు) దారుణమైన పరిస్థితులలో బతుకుతున్న శ్రామిక ప్రజలు. వాళ్లు నిత్యం అర్ధ కడుపుకు తింటున్నారు, యిక యిప్పుడు, కొత్త మాసూలు వచ్చే ముందు, ఆహార పరిస్థితి సాధారణంగా క్షీణించడంతో, వాళ్ళు వాస్తవంగా పస్తులుంటున్నారు. అయినప్పటికీ యీ పస్తులుండే కార్మికులు, బూర్జువాల, మెన్షెవిక్కుల, సోషలిస్టు రివల్యూషనరీల ద్వేషపూరిత విప్లవ ప్రతీఘాత ఆందోళన చేత చుట్టుముట్టబడి, "కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు" యేర్పాటు చేస్తున్నారు. ఏ పారితోషికం లేకుండా ఓవర్‌టైమ్ పని చేస్తున్నారు, ఆహార లోపంచేత వేసరిక చెంది, హింసింపబడి, నిస్త్రాణ చెందినప్పటికి శ్రమ ఉత్పాతకతలో అపారమైన పెరుగుదలను సాధిస్తున్నారు. యిది మహోన్నత వీరత్వం కాదా? యిది మహా ప్రాముఖ్యం గల మార్పుకు ప్రారంభం కాదా?

అంతిమ పరిశీలనలో నూతన సమాజ వ్యవస్థ విజయానికి అత్యంత ముఖ్యమైనది, ప్రధానమైనది శ్రమ ఉత్పాతకత. ఫ్యూడల్ దాస్యంలో కనివిని యెరగని శ్రమ ఉత్పాతకతను పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించింది. సోషలిజం అంతకంటె చాలా ఉన్నతమైన కొత్త శ్రమ ఉత్పాదకతను సృష్టించి, పెట్టుబడిదారీ వ్యవస్థను చిత్తుగా ఓడించడలదు, ఓడిస్తుంది. యిది చాలా కష్టమైన విషయం, చాలా కాలం తీసుకోక తప్పదు, కానీ యిది ప్రారంభించబడింది; అదీ ముఖ్యమైనది. పస్తులుంటున్న మాస్కోలో, 1919 వేసవిలో, పస్తులుంటున్న కార్మికులు, బాధాకరమైన నాలుగేండ్ల సామ్రాజ్యవాద యుద్ధాన్నీ, అంతకంటె బాధాకరమైన ఒకటిన్నర యేండ్ల అంతర్యుద్ధాన్నీ అనుభవించినవాళ్ళు, యీ గొప్ప పనిని ప్రారంభించగలిగినారంటే, తరువాత, మనం అంతర్యుద్ధంలో గెలిచి, శాంతిని గెలుచుకున్నప్పుడు పరిస్థితులు యెలా అభివృద్ధి అవుతాయి?

కమ్యూనిజం పురోగామి సాంకేతిక విధానాలను వినియోగించే ఐచ్ఛిక, వర్గచైతన్యపూరిత, సమైక్య కార్మికుల శ్రమ ఉన్నత ఉత్పాదకత – పెట్టుబడిదారీ వ్యవస్థలో వున్న దానితో పోలిస్తే. కమ్యూనిజం వాస్తవ ప్రారంభంగా కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు అసాధారణమైన విలువ గలవి; యిది చాలా అరుదైన విషయం; యెందుకంటే, (మన పార్టీ కార్యక్రమం సరిగా చెప్పినట్లు) "పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి కమ్యూనిజంకు జరిగే పరివర్తనలో మొదటి అడుగులు మాత్రమే వేయబడుతున్న" దశలో మనం వున్నాం.

సామాన్య కార్మికులు శ్రమ ఉత్పాతకతను పెంచడానికి ఒళ్ళు దాచుకోకుండా శ్రమించి, మనస్ఫూర్తిగా శ్రద్ధ వహించినప్పుడు, కార్మికులకు స్వయంగా గానీ, వాళ్ళ "దగ్గరి" బంధువులకు గానీ చేరేది కాక, వాళ్ళ "దూరపు" బంధువులకు, అనగా మొత్తం సమాజానికి, మొదట ఒక సోషలిస్టు రాజ్యంలోనూ, తరువాత సోవియట్ రిపబ్లిక్కుల యూనియన్‌లోనూ సమైక్యమైన కోట్ల, దశకోట్ల ప్రజలకు చేరే ప్రతి పూడ్ ధాన్యాన్నీ, బొగ్గునూ, యినుమునూ, తదితర ఉత్పత్తినీ పొదుపుచేసేందుకు శ్రద్ధ వహించినప్పుడు కమ్యూనిజం ప్రారంభమౌతున్నది.

"పెట్టబడి"లో కార్ల్ మార్క్సు స్వేచ్ఛ, మానవ హక్కుల పటాటోప, గంభీరాడంబర బూర్జువా ప్రజాతంత్ర మహా పత్రాన్ని అపహస్యం చేస్తాడు, దరహాంమీద స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాత్రాల గురించిన వాగాడంబరాన్ని, సకల దేశాల పెటీబూర్జువాలకూ, కూపస్థమండూకాలకూ, యేహ్యామేన బెర్న్ ఇంటర్నేషనల్‌కు చెందిన ప్రస్తుత యేహ్యామైన వీరులతో సహా, కనులకు మిరుమిట్లు గొల్పేదాన్ని అపహాస్యం చేస్తాడు. యీ పటాటోప హక్కుల ప్రకటనలను మార్క్సు కార్మికవర్గం యీ సమస్యను రూపొందించే సాదా, మిత ఆచరణాత్మక, సరళ పద్ధతిలో పోలుస్తాడు – తక్కువ పని దినాన్ని శాసనం చేయడం అలాంటి పద్ధతికి విలక్షణమైన ఉదాహారణ. కార్మికవర్గ విప్లవ సారం వెల్లడయ్యే కొద్దీ మార్క్సు మాటల్లోని ఔచిత్యమూ, గాంభీర్యమూ మనకు స్పష్టమూ, తెటతెల్లమూ అవుతాయి. నిజమైన కమ్యూనిజం "సూత్రాలు" కౌట్స్కీ, మెన్షెవిక్కుల, సోషలిస్టు రివల్యూషనరీల, వాళ్ళ ప్రియతమ బెర్న్ "సోదరుల" పటాటోప, జటిల, గంభీర నుడికారాలతో యెక్కడ విభేదిస్తాయంటే, అవి ప్రతిదాన్నీ శ్రమ పరిస్థితులకు కుదిస్తాయి. "శ్రమ ప్రజాస్వామ్యం"

గురించీ, "స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రం" గురించీ, "ప్రజా పరిపాలన" గురించీ, యింకా అలాంటి వాటి నన్నింటిని గురించీ తక్కువ వాగుడు; యినాటి వర్గచైతన్యపూరిత కార్మికులూ, కర్షకులూ బూర్జువా మేధావియొక్క యీ పటాటోపపు నుడికారాల పస తెలుసుకొని, ఆ జిత్తును సులభంగా గుర్తు పట్టుతారు – యెంత సులభంగా అంటే, మామూలు లోకజ్ఞానమూ, లోకానుభవమూ గల వ్యక్తి "గొప్పోడు, కనపళ్ళా" అనదగినవాని "నిగనిగలాడే" లక్షణాలు నిష్కళంకమైన వాలకమూ చూసి, "బహుశా, బద్మాష్" అని వెంటనే పొరపాటు లేకుండా అంచనా వేసినంత సులభంగా.

తక్కువ పటాటోపపు నుడికారాలు, యెక్కువ సాదా, రోజువారీ పనీ, ప్రతి పూడు ధాన్యంపట్లా, బొగ్గుపట్లా శ్రద్ధా! ఆకలిగొన్న కార్మికులకూ, చింపిరి పాతల, దిస పాదాల రైతులకూ అవసరమైన యీ ధాన్యాన్నీ, బొగ్గునూ కీచులాట బేరం ద్వారా కాక, పెట్టుబడిదారీ పద్ధతిలో కాక, మాస్కో – కజాన్ రైల్వేలోని అనిపుణ శ్రామికులూ, రైల్వే కార్మికులూ లాంటి సాధా శ్రమజీవుల చైతన్యపూరిత, ఐచ్ఛిక, మహోన్నత వీరోచిన శ్రమ ద్వారా సమకూర్చడానికి మరింత శ్రద్ధ!

విప్లవ సమస్యలపట్ల బూర్జువా మేధావి వాగాడంబరపు వైఖరి చాయలు అడుగడుగునా, ప్రతిచోటా, మన సభ్యులలో కూడా వున్నాయని మనం ఒప్పుకోక తప్పదు. ఉదాహరణకు, మన పత్రికలు కుళ్ళిన బూర్జువా ప్రజాతంత్ర గతం యొక్క యీ కుళ్ళిన అవశేషాలతో పోరాడడానికి చేస్తున్నది చాలా తక్కువ, నిజమైన కమ్యూనిజం యొక్క సరళమైన, మితమైన, సాదా అయిన, కానీ జీవయోగ్యమైన మొలకలను సాకడానికి అవి చేస్తున్నది చాలా తక్కువ.

స్త్రీల పరిస్థితి తీసుకోండి. యీ రంగంలో, ప్రపంచంలో ఒక్కొక్క ప్రజాతంత్ర పార్టీ కూడా, అత్యంత పురోగామి బూర్జువా రిపబ్లిక్‌లో సైతం, మనం, అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి సంవత్సరంలో చేసినదానిలో శతాంశం కూడా దశాబ్దాలలో చేయలేదు. స్త్రీలను అసమాన స్థితిలో వుంచడం, విడాకులను పరిమితపరచడం, దాని చుట్టూ అసహ్యమైన తతంగాలు పెట్టడం, వివాహం కాకుండా పుట్టిన పిల్లలకు గుర్తింపు నిరాకరించడం, వాళ్ళ తండ్రుల కొరకు అన్వేషణను బలవంతంగా రుద్దడం, వగైరాలు చేసే యేహ్యమైన చట్టాలను, నేటి అనేక అవశేషాలు బూర్జువా వర్గానికీ, పెట్టుబడిదారీ వ్యవస్థకూ సిగ్గుచేటుగా, సకల నాగరిక దేశాలలోనూ కనపడతాయో ఆ చట్టాలను, మనం నిజంగా కూల్చి నేలమట్టం చేసినాం. యీ రంగంలో మనం చేసినదానికి వెయ్యి సార్లు గర్వించే హక్కు వుంది. కానీ, పాత, బూర్జువా చట్టాల, సంస్థల పనికిమాలిన చెత్తను తొలగించి, యెంత సమగ్రంగా మనం నేలను శుభ్రం చేస్తే అంత స్పష్టమౌతుంది, నేలమీద నిర్మించడానికి మనం నేలను శుభ్రం మాత్రమే చేసినామనీ, యింకా నిర్మించడం లేదనీ.

స్త్రీ విమోచనకు యెన్ని చట్టాలు చేసినప్పటికీ ఆమె గృహబానిసగా వుంటూనే వుంది; యెందుకంటే, చిల్లర యింటి పని ఆమెను నలిపేస్తుంది, ఉక్కిరిబిక్కిరి చేస్తుంది, నిరర్థకురాలిని చేస్తుంది, హీనపరుస్తుంది. ఆమెకు వంటయింటికీ, పురిటి గదికీ బంధిస్తుంది, ఆమె తన శ్రమను ఆటవికంగా అనుత్పాదకమూ, చిల్లరదీ, రొప్పు పెట్టేదీ, నిరర్థకురాలిని చేసేదీ, మనిషిని నలిపేసేది అయిన గొడ్డు చాకిరీ మీద వృథా చేస్తుంది. యీ చిల్లర యింటి పనిమీద (రాజ్యాధికారం వహించే కార్మికవర్గం నాయకత్వాన) సర్వశక్తితో పోరాటం ప్రారంభమైనప్పుడు, ప్రారంభమైన చోట మాత్రమే, లేదా ఆ యింటి పని భారీ సోషలిస్టు ఆర్థిక వ్యవస్థగా పెద్ద స్థాయిలో రూపాంతరం చెందడం ప్రారంభమైనప్పుడు మాత్రమే, నిజమైన స్త్రీ విమోచన, నిజమైన కమ్యూనిజం, ప్రారంభమౌతుంది.

సిద్ధాంతపరంగా ప్రతి కమ్యూనిస్టు నిర్వివాదమని యెంచే యీ సమస్యకు మనం ఆచరణలో తగినంత శ్రద్ధ అర్పిస్తున్నామా? నిజంగా, లేదు. యీ రంగంలో ఇప్పటికే వుంటున్న కమ్యూనిజం మొలకలపట్ల మనం సరైన జాగ్రత్త వహిస్తున్నామా? మళ్ళీ, లేదు అనేదే జవాబు. భోజనశాలలూ, శిశు సంస్థలూ, బాలోద్యానాలూ – యివి యీ మొక్కలకు ఉదాహరణలు, యివి పటాటోపాలూ, ఆడంబరాలూ, సాంగ్యాలూ యేమీ లేని సరళ, దైనందిన సాధనాలు, నిజంగా స్త్రీలను విమోచన చేయగలవీ, సామాజిక ఉత్పత్తిలోనూ, పౌర జీవితంలో స్త్రీల పాత్ర విషయంలో పురుషులతో వాళ్ళకు గల అసమానత్వాన్ని నిజంగా తగ్గించగలవీ, తొలగించగలవీ. యీ సాధనాలు కొత్తవి కావు, యివి (సోషలిజం భౌతిక పూర్వావసరాలన్నిటిలాగే) భారీ పెట్టుబడిదారీ వ్యవస్థ చేత సృష్టింపబడినాయి. కానీ పెట్టుబడిదారీ వ్యవస్థలో అవి, మొదటిది, అరుదుగానూ, రెండవది – మరీ ముఖ్యమైనది – సట్టా వ్యాపారమూ, లాభార్జనా, మోసమూ, దగాల అత్యంత హీన లక్షణాలు గల లాభార్జన సంస్థలుగా గానీ, ఉత్తమ కార్మికులు సముచితంగా ద్వేషించి, యేవగించుకున్న "బూర్జువా దయాధర్మాలతో కూడినవి"గా గానీ నిలిచి వుండినాయి.

యీ సంస్థల సంఖ్య మన దేశంలో అపారంగా పెరిగిందనడంలోనూ, వీటి స్వభావం మారడం ప్రారంభమౌతున్న దనడంలోనూ సందేహం లేదు. కార్మిక, కర్షక స్త్రీలలో మనకి తెలిసినంత కంటె యెంతో యెక్కువ వ్యవస్థీకరణ ప్రజ్ఞ వుందనీ, ప్రణాళికలూ, వ్యవస్థలూ, వగైరాల గురించి ఆ పుష్కలమైన మాటలూ, గడబిడా, కీచులాటలూ, వాగుడూ – మన పెద్ద బుర్రల "మేధావుల"కూ, అర్ధ పక్వ "కమ్యూనిస్టుల"కూ "సోకి"నట్టివి – లేకుండా, బహుళ సంఖ్యాక కార్మికుల, అంతకంటె బహుళ సంఖ్యాకమైన వినియోగదారుల సహకారంతో ఆచరణాత్మక పనిని వ్యవస్థీకరించగలవాళ్ళు మనకు తెలిసినంతకంటె యెక్కువ మంది వున్నారనీ అనడంలో సందేహం లేదు. కానీ కొత్తదాని యీ మొలకలను మనం సాకవలసినట్లుగా సాకడం లేదు.

బూర్జువాలను చూడండి. తమకు కావలసింది యెలా అడ్వర్టైజు చేసుకోవలసిందీ వాళ్ళకు యెంత బాగా తెలుసో! పెట్టుబడిదార్లు "ఆదర్శ" సంస్థలుగా పరిగణించే వాటిని వాళ్ళ వార్త పత్రికలు మిలియన్ల ప్రతులలో యెలా కీర్తిగానం చేసేది, "ఆదర్శ" బూర్జువా సంస్థలు యెలా జాతీయ గర్వకారణంగా చేయబడేదీ చూడండి! ఉత్తమ భోజనశాలలను గానీ, శిశు సంస్థలను గానీ, దినదినం పట్టుబట్టి చెప్పడం ద్వారా వాటిలో కొన్నిటిని ఆ జాతిలో ఆదర్శ సంస్థలుగా మార్చడానికిగానూ, వర్ణించే శ్రమ మన పత్రికలు తీసుకోవడం లేదు, లేదా యెప్పుడో గాని తీసుకోవడం లేదు. మన పత్రికలు వాటికి తగినంత పబ్లిసిటీ యివ్వడం లేదు, ఆదర్శప్రాయమైన కమ్యూనిస్టు కృషితో, మొత్తం సమాజానికీ, శ్రామిక ప్రజలందరికీ, విస్తరింపజేస్తే సాధింపబడగల మానవ శ్రమ కర్తవ్యాన్నీ, వినియోగదారులకు సౌకర్యాలనూ, సరుకుల పొదుపునూ,

యింటి బానిసత్వం నుండి స్త్రీల విమోచననూ, ఆరోగ్యకర పరిస్థితులలో మెరుగుదలనూ వివరంగా వర్ణించడం లేదు.

ఆదర్శప్రాయమైన ఉత్పత్తీ, ఆదర్శప్రాయమైన కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులూ, ప్రతి పూడ్ ధాన్యాన్నీ వసూలు చేయడంలోనూ, పంపకం చేయడంలోనూ ఆదర్శప్రాయమైన జాగ్రత్తా, చిత్తశుద్ధీ, ఆదర్శప్రాయమైన భోజనశాలలూ, ఫలానా భవనంలోని ఫలానా కార్మికుల యింటిలో ఆరద్శప్రాయమైన శుభ్రతా – యివన్నీ మన పత్రికలనుండీ, కార్మికుల, కర్షకుల ప్రతి సంస్థ నుండీ యిప్పుడు పొందుతున్నంతకు పదంతలు శ్రాద్ధా, జాగ్రత్తా పొందాలి. యివన్నీ కమ్యూనిజం మొలకలు, వీటిని సాకడం మన సమిష్టి, ప్రాథమిక విధి. మన ఆహార, ఉత్పత్తి పరిస్థితి కష్టంగా వున్నా, బోల్షెవిక్ పరిపాలన జరిగిన ఒకటిన్నర సంవత్సరాల కాలంలో సర్వత్రా నిస్సందేహమైన పురోగతి వుంది: ధాన్యం సేకరణ 3 కోట్ల పూడ్ల (1917 ఆగస్టు 1 నుండి 1918 ఆగస్టు 1 వరకు) నుండి 10 కోట్ల పూడ్ల ( 1918 ఆగస్టు 1 నుండి 1919 మే 1 వరకు)కు పెరిగింది; కూరగాయల వ్యవసాయం విస్తరించింది, విత్తనం వేయని భూమి తగ్గింది, యింధనం విషయంలో అపారమైన ఇబ్బందులు వున్నప్పటికీ రైల్వే రవాణా మెరుగుకావడం ప్రారంభించింది, వగైరా. యీ పూర్వరంగంలో, కార్మికవర్గ రాజ్యాధికారపు అండదండలతో, కమ్యూనిజం మొలకలు వాడిపోవు; అవి పరిపూర్ణ కమ్యూనిజంగా పెరిగి, వికసిస్తాయి.

* * *

యీ మహా ప్రారంభం నుండి యేర్పడే సహా ముఖ్యమైన ఆచరణాత్మక గుణపాఠాలన్నిటినీ లాగడానికిగాను, మనం “కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కుల” ప్రాముఖ్యాన్ని చాలా యెక్కువగా పర్యాలోచించాలి.

ప్రథమ, ముఖ్య గుణపాఠం యేమిటంటే ఈ ప్రారంభానికి సకల సాహాయము యివ్వాలి. “కమ్యూన్” అనే పదం మరీ స్వేచ్ఛగా వాడబడుతున్నది. కమ్యూనిస్టులచేత గానీ, కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో గానీ ప్రారంభించబడిన యే సంస్థ అయినా అతి తరుచుగా వెంటనే “కమ్యూన్”గా ప్రకటింపబడుతున్నది; యీ మహా గౌరవనీయమైన పేరును దీర్ఘమైన, పట్టు విడువని కృషి ద్వారా, నిజమైన కమ్యూనిస్టు నిర్మాణంలో ఆచరణగతమైన విజయం ద్వారా గెలుచుకోవాలని తరుచుగానే విస్మరింపబడుతున్నది.

అందుకనే, ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ శాసన్నాన్ని, “వినిమయదారుల కమ్యూన్లు” అనే పేరుకు సంబంధించినంత వరకు రద్దు చేయాలని కేంద్ర కార్యనిర్వాహకవర్గంలోని మెజారిటీ సభ్యుల మనస్సులలో పరిణతి చెందిన నిర్ణయం, నా అభిప్రాయంలో, సరైనది, పేరు మరింత సరళంగా వుండనీ – అన్నట్లు, కొత్త వ్యవస్థీకరణ ప్రారంభ దశల లోపాలకూ, కొరతలకూ కమ్యూన్లను నిందించరు, (న్యాయంగా చేయవలసినట్లు) చెడ్డ కమ్యూనిస్టులను నిందిస్తారు. మామూలు వాడకం నుండి “కమ్యూన్” అనే పదాన్ని తొలగించడం, ప్రతి యెల్లయ్యా, పుల్లయ్యా దానిమీద చేయి వేయడాన్ని నిషేధించడం, లేదా కమ్యూనిస్టు పద్ధతిలో తమ పనిని వ్యవస్థీకరించగలమని ఆచరణలో నిజంగా నిరూపించిన, (చుట్టు పట్ల ప్రజానీకం యేకగ్రీవంగా గుర్తించడం ద్వారా రుజువు చేసిన) నిజమైన కమ్యూన్లు మాత్రమే యీ పేరును ధరించడానికి అనుమతించడం మంచిది. మొదట, సమాజ ప్రయోజనాల కొరకు, సమస్త శ్రామిక ప్రజల ప్రయోజనాల కొరకు, ప్రతిఫలం లేకుండా పని చేయగలమని నిరూపించండి, “విప్లవాత్మక పద్ధతిలో పని చేయడం” మీకు చేతనౌననీ, శ్రమ ఉత్పాదకతను పెంచడమూ, ఆదర్శప్రాయమైన పద్ధతిలో పనిని వ్యవస్థీకరించడమూ మీకు చేతనౌననీ నిరూపించండి, తరువాత ‘‘కమ్యూన్’’ అనే గౌరవనీయమైన పేరు కొరకు చేయి చాచండి!

యీ విషయంలో, కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు అత్యంత విలువైన మినహాయింపు; యెందుకంటే, మాస్కో – కజాన్ రైల్వేలోని అనిపుణ కార్మికులూ, రైల్వే కార్మికులూ కమ్యూనిస్టులలాగ పని చేయడం తమకు చేతనౌనని చేతల ద్వారా మొదట నిరూపించి, తరువాత తమ కృషికి ‘‘కమ్యూనిస్టుల సుబ్బోత్నిక్కులు’’ అనే పేరు పెట్టుకున్నారు. భవిష్యత్‌లో, కష్టపడి పని చేయడం ద్వారానూ, దీర్ఘ కృషిలో ఆచరణగతమైన విజయం ద్వారానూ, ఆదర్శప్రాయమైన నిజమైన కమ్యూనిస్టు వ్యవస్థీకరణ ద్వారానూ కమ్యూన్ అనే పేరుకు అర్హతను నిరూపించుకోకుండా తన ప్రయత్నాన్ని గానీ, సంస్థను గానీ, కృషిని గానీ కమ్యూన్ అనే పేరుతో పిలిచేవాణ్ని జిత్తులమారిగానో, కోతలరాయునిగానో నిర్దాక్షిణ్యంగా అపహసించి, భ్రష్టు పట్టించేటట్లు మనం శ్రద్ధ వహించాలి.

“కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు” అనే ఆ మహా ప్రారంభాన్ని మరొక ప్రయోజనానికి కూడా వినియోగించాలి. దేనికంటే, పార్టీని ప్రక్షాళన చేయడానికి. విప్లవానంతరపు తొలి దశలో, “నిజాయితీ గల” కూపస్థ మండూక ప్రజాబాహుళ్యం మరీ పిరికిగా వుండినప్పుడు, బూర్జువా మేధావులు మినహాయింపు లేకుండా, సహజంగానే మెన్షెవిక్కులతో, సోషలిస్టు రివల్యూషనరీలతో సహా, బూర్జువా వర్గానికి గులాములుగా వుండి, విధ్వంసం సాగించినప్పుడు, దుస్సాహసికులూ, యితర దుష్టులూ పార్టీకి అంటగరచుకోవడం తప్పనిసరి. అది లేకుండా విప్లవం అనేది యెప్పుడూ లేదు, యెప్పుడూ వుండజాలదు. అసలు విషయం యేమిటంటే, పాలక పార్టీ, సౌష్టవమైన, బలమైన పురోగామి వర్గం మీద ఆధారపడి, తన శ్రేణులను ప్రక్షాళన చేసుకోగలిగి వుండాలి.

యీ విషయంలో మనం పని యెప్పుడో ప్రారంభించినాం. దీనిని స్థిరంగా, నిరంతరాయంగా కొనసాగించాలి. యుద్ధం కొరకు కమ్యూనిస్టులను సమీకరించడం యీ విషయంలో మనకు తోడ్పడింది: పిరికివాళ్ళూ బద్మాషులూ పార్టీ నుండి పారిపోయినారు. పీడ వదలింది! పార్టీ సభ్యత్వంలో అలాంటి తరుగుదల అంటే దాని బలంలోనూ, ప్రతిష్టలోనూ అపారమైన పెరుగుదల అన్నమాట. ప్రక్షాళనను మనం కొనసాగించాలి, “కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు” అనే ఆ నూతన ప్రారంభాన్ని యీ ప్రయోజనానికి వినియోగించుకోవాలి. “విప్లవాత్మక పద్ధతిలో పని చేయడంలో” ఆరు నెలల “పరీక్ష”, లేక “ప్రొబేషన్” తర్వాత మాత్రమే సభ్యులను పార్టీలో చేర్చుకోవాలి. 1917 అక్టోబర్ 25 తర్వాత పార్టీలో చేరి, యేదో ఒక ప్రత్యేకమైన పని ద్వారా గానీ, సేవ ద్వారా తాము పరమ విశ్వసనీయులమనీ, విధేయులమనీ, కమ్యూనిస్టులుగా వుండడం చేతనౌననీ రుజువుచేయని పార్టీ సభ్యులందరికీ అలాంటి పరీక్ష పెట్టాలి.

28వ పేజీలో...

పత్రికా ప్రకటన

# కాల్‌మనీ కుంభకోణం నుండి విశాఖ భూ కుంభకోణం వరకు పతాకస్థాయికి చేరిన చంద్రబాబు అవినీతి పాలన !

## సిట్‌ను బహిష్కరించి, జడ్జీలు, ప్రజాస్వామిక వాదులతో కూడిన ఎంక్వయిరీ కమిటీ, బహిరంగ విచారణకు డిమాండ్‌లు !!

## ప్రజా ఉద్యమాల ద్వారానే చంద్రబాబు అవినీతి పాలనను అంతం చేయాలి !!!

*ప్రియమైన ప్రజాలారా!*

రాష్ట్రంలోని టి.డి.పి., కేంద్రంలో బి.జె.పి. పార్టీలు మూడేళ్ళ పాలన పూర్తి చేసి ప్రజలకు ఏదో ఒరగబెట్టినట్లు సంబరాలు జరుపుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో బూటకపు వాగ్దానాలతో టి.డి.పి., బి.జె.పి.లు అవకాశవాద పొత్తులతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారు. వచ్చిన నాటి నుండి నేటి వరకు వీరి పాలన దోపిడీ, దౌర్జన్యాలు, కుంబకోణాలు, మోసాలు, పచ్చి అబద్ధాలు, ఆకాశం దద్దరిల్లే అసత్య ప్రచారాలతో నడుస్తోంది.

ప్రస్తుత చర్చనీయ అంశమైన విశాఖ భూకుంబకోణంలో ప్రజలకు అంతుబట్టని ఎన్నో కోణాలున్నాయి. లక్షలెకరాల భూముల రికార్డులు ఎలా తారుమారయ్యాయి? డీ.ఫారం భూములు, పోరంబోకు భూములు, ఈనాం భూములు, భూదాన భూములు దేన్నీ వదలకుండా కాజేయాలని పథకం వేసారు. గోకర్ణ, గజకర్ణ విద్యలను ప్రయోగించి రికార్డులను తారుమారు చేసారు. దసపల్లా భూములు, పెందుర్తి మండలం, ముదపాక అసైన్డ్ భూములు, కొమ్మాది, మధురవాడ, బిమిలి, ఆనందపురం, అనకాపల్లి, నక్కపల్లి, పద్మనాభం, విశాఖ రూరల్ తదితర ప్రాంతాల ప్రభుత్వ భూములు మరియు అసైన్డ్ భూములు కబ్జాకు గురి అయ్యాయి.

ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఆక్రమణకు గురి అయ్యాయని, మంత్రే స్వయంగా ప్రకటించాడంటే, పరిస్థితి ఎంత దారుణంగా వుందో అర్థం చేసుకోవచ్చు. లక్షల ఎకరాలకు సంబంధించిన, ఎఫ్.ఎమ్.బి.లు కనిపించడం లేదని, సాక్షాత్తు కలక్టరే ప్రకటించాడు. తర్వాత చంద్రబాబు వత్తిడితో కప్పదాటు వేసాడు.

ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు పార్టీలోని వ్యక్తులతో త్రిసభ్య కమిటీని వేసాడు. ఆ సమావేశంలో మాట్లాడతూ, -ఇటువంటివి జరిగినప్పుడు ప్రజలుగానీ, ప్రతిపక్షాలు గానీ, మీడియా గానీ ప్రశ్నించినప్పుడు మంత్రులు గానీ, అధికారులు గానీ, ఈ విధంగా మాట్లాడకూడదనీ, పై పెచ్చు ఎదురుదాడికి దిగాలని హితవు చెప్పాడు. ఇది చంద్రబాబు మార్కు పారదర్శకత.

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుండే అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాడు. రాజధాని నిర్మాణం విషయంలో శివరామకృష్ణన్ కమీషన్ సూచనలను బుట్టదాఖలు చేశాడు. 34 వేల ఎకరాల భూమిని సేకరించి, రైతులకు టోపి పెట్టాడు. రియలెస్టేట్ బిజినెస్‌లో వేల, కోట్ల రూపాయలు దండుకోవాలనే ఉద్దేశంతో, రాజధాని ప్రాంతం, విశాఖ ప్రాంతాలలో టి.డి.పి. పార్టీ నాయకులు వేలాది ఎకరాల భూములను కబ్జాకి ఒడిగట్టారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని, తన పార్టీ శ్రేణులకు అనుకూలంగా పని చేసే విధంగా చంద్రబాబు మలుచుకున్నాడు.

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం, కాకినాడ, విశాఖపట్నం ప్రాంతాలలోని పరిశ్రమలకు నీటి సరఫరా కోసమనీ, పారిశ్రామిక సంస్థలకు భూ కేటాయింపులు చౌకగా చేస్తామనీ చంద్రబాబు చెబుతున్నారు. మరోవైపునా ప్రతిపక్ష పార్టీల ఎమ్.ఎల్.ఎ.లను కూడా కొనుగోలు చేశాడు. 'ఓటుకు కోట్లు' కేసు కూడా చంద్రబాబు ఎదుర్కొన్నాడు.

2014 నుండి 2017 జనవరి వరకు రాష్ట్రంలో 2,284 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎన్నికలప్పుడు 5వేల కోట్లతో 'స్థిరీకరణ నిధి'ని ఏర్పాటు చేస్తామనీ చంద్రబాబు రైతులకు హామి ఇచ్చాడు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకుంటామని టి.డి.పి., బి.జె.పి.లు నాటకం ఆడారు. ఈ సమయంలోనే రాష్ట్రంలో 70 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. చంద్రబాబును నమ్మితే పాముకు పాలు పోస్తే కాటు వేసిందన్న చందంగా తయారయిందని రైతులు వాపోతున్నారు.

మూడేళ్ళ చంద్రబాబు పాలనలో ఇప్పటివరకు ఎస్.సి., ఎస్.టి. సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించలేదని కాగ్ (సి.ఎ.జి)కూడా అభ్యంతరం చెప్పింది. పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచని కారణంగా పేదవర్గాల విద్యార్థుల మీద ఆర్థికభారం పడింది. 2014-15, 2015-16 ఆర్థిక సంవత్సరాల్లో విద్యా, వైద్య రంగాల్లో కేటాయింపులు తగ్గిపోయాయని నీతిఆయోగ్ నివేదికలో స్పష్టం చేసింది.

మరోవైపున ఆదివాసీలను అభివృద్ధి చేస్తామనీ గ్రామాలను దత్తత తీసుకునే నాటకాన్ని కూడా వేశాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనింగ్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలను అమలు చేయాలనే పథకంలో భాగమే ఆదివాసిమేళా. అందువలన బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ, ఆదివాసీ ప్రజలు అప్రమత్తంగా వుండి చంద్రబాబు నాటకాలను ఓడించడానికి సిద్ధంగా వుండాలి.

దేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని ప్రజలకు అవసరం లేకపోయినా బ్రిడ్జిలు, పార్కులు, ప్రాజెక్టులు....వగైరాలను ఏర్పాటు చేస్తామనీ ఈ సంస్థలకు పనులు కల్పిస్తున్నాడు. ఇటువంటిదే ఇబ్రహింపట్నం-లింగయపాలెం బ్రిడ్జి. ఈ ఒప్పందాలలో తాను తన అనుచరగణం, అందినకాడికి తింటూ, రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేస్తున్నారు. ఈ విధంగా రాష్ట్రంలోని వనరులను దేశీ, విదేశీ కార్పోరేట్ సంస్థలకు చంద్రబాబు ప్రభుత్వం అప్పజెబుతున్నది. ఈ నిర్వాకం వల్లనే రాష్ట్ర ఆర్థిక

పరిస్థితి దిగజారింది. గత సంవత్సరం 10వేల కోట్లు, ఈ సంవత్సరం 30 వేల కోట్లు కలిసి మొత్తం 49 కోట్లు చెల్లించాల్సి వుంది. ప్రస్తుతం రాష్ట్రం అప్పులు, ప్రజల మీద పెనుభారంగా తయారవుతాయి. పరిస్థితి ఈ విధంగా వుంటే చంద్రబాబు రాష్ట్రం, దేశంలోనే నెంబర్-1 అని తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకుంటున్నాడు.

రాష్ట్రంలో అవినీతి కుళ్ళి కంపు కొడుతుంటే, విశాఖ భూ కుంబకోణం మీద ప్రజలంతా ఆందోళన చేస్తుంటే బి.జె.పి. నాయకులు మాత్రం తేలు కుట్టిన దొంగల్లాగా వున్నారు. ముఖ్యంగా చిన్న విషయానికి కూడా, పెద్ద నోరుతో ప్రచారం చేసే, ప్రసారశాఖమంత్రి వెంకయ్యనాయుడు నోరు మెదపడం లేదు.

విశాఖ భూ కుంబకోణం ఎప్పుడైతే భగ్గుమన్నదో, చంద్రబాబు కొంతకాలం బహిరంగ విచారణ నాటకం ఆడాడు. రెవిన్యూమంత్రి కె.ఇ. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బహిరంగ విచారణకు ఆదేశించాడు. తీరా ఆ రోజున ప్రజలు పెద్ద ఎత్తున ఫిర్యాదులతో వెల్లువెత్తడంతో, బహిరంగ విచారణని రద్దు చేసుకున్నాడు.

మరోవైపున రాష్ట్రంలోని ప్రజలను మోసం చేసేందుకు 'నవనిర్మాణ దీక్ష' మరియు 'మహసంకల్పం' అనే నాటకాలను రాష్ట్రమంతా ప్రధర్శించారు. ఇది చాలదని ఏకంగా 60 మంది జర్నలిస్టులను పోగుచేసి, చంద్రబాబు పథకాలను ప్రచారం చేసేందుకు, ప్రత్యేకంగా, ఒక సోషల్ మీడియాను ఏర్పర్చారు. దీనిలో నారా లోకేష్ నిత్యం తన ముఖాన్ని ప్రజలకు చూపిస్తున్నాడు. దీనికోసం 8 కోట్లు కేటాయించారు.

సాధారణంగా ఎంక్వయిరీ కమిటీలను జడ్జిలతో నియమిస్తారు. అటువంటి సాంప్రదాయాన్ని కూడా కాలదన్ని నరహంతక సంస్థ గ్రేహౌండ్స్ ఐ.జి.వినిత్ బ్రిజిలాల్ నాయకత్వంలో, ఎస్.ఐ.టి.ను ముఖ్యమంత్రి నియమించారు. ఈ ఎస్.ఐ.టి. ఎవరి ప్రయోజనాలను కాపాడుతుందో చెప్పకనే చెబుతోంది.

అందువలన రాష్ట్రంలోని దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి రైతులు, కార్మికులు, ఉద్యోగులు, మేధావులు, విద్యార్థులు, మహిళలు, మైనార్టీలు, ఆదివాసీలు, ప్రజాస్వామికవాదులు, అన్ని వర్గాల ప్రజలు, ప్రతిపక్షాలు కలిసి ఉద్యమించాలని మేము కోరుతున్నాం.

**విప్లవాభివందనాలతో,**

**జగబంధు [అధికార ప్రతినిధి],**

**ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి.,**

**సి.పి.ఐ.[మావోయిస్టు].**

---

**26వ పేజీ తరువాయి...**

నిజమైన కమూనిస్టు పద్ధతిలో పని చేసే విషయంలో పార్టీ స్థిరంగా పెరిగే డిమాండ్లు చేయడం ద్వారా జరిగే పార్టీ ప్రక్షాళన రాజ్య యంత్రావళిని మెరుగుపరుస్తుంది, విప్లవ కార్మికవర్గ పక్షానికి రైతుల అంతిమ పూర్తి మళ్ళింపును చాలా దగ్గరకు తెస్తుంది.

అన్నట్లు, "కమ్యూనిస్టు సుబ్బోత్నిక్కులు" శ్రామికవర్గ నియంతృత్వంలోని రాజ్య యంత్రావళి వర్గ స్వభావాన్ని ప్రస్ఫుటంగా వెల్లడించినాయి. "విప్లవాత్మక పద్ధతిలో పని చేయడం" గురించి కేంద్ర కమిటీ ఒక లేఖ తయారు చేస్తుంది. 1,00,000 నుండి 2,00,000 దాకా సభ్యులు గల (కఠిన ప్రక్షాళన తర్వాత నిలిచే సంఖ్య యిది అని అనుకుంటున్నాను; ప్రస్తుతం సభ్యత్వం యింకా యెక్కువగా వుంది) పార్టీ కేంద్ర కమిటీ నుండి యీ ఆలోచన వచ్చింది.

ట్రేడ్ యూనియన్లలో వ్యవస్థీకరింపబడిన కార్మికులు యీ ఆలోచనను అనుసరిస్తున్నారు. రష్యాలోనూ, ఉక్రేయిన్‌లోనూ వాళ్ళు సుమారు నలభై లక్షల మంది వున్నారు. వాళ్ళలో అపారమైన మెజారిటీ శ్రామికవర్గ రాజ్యాధికారానికి, శ్రామికర్గ నియంతృత్వానికి అనుకూలం. రెండు లక్షలూ, నలభై లక్షలూ - యిది "గేర్ చక్రాల" నిష్పత్తి, అలా వ్యక్తం చేయవచ్చునంటే. తరువాత వస్తారు కోట్లమంది రైతులు, మూడు ప్రధాన బృందాలుగా విభజింపబడినవాళ్ళు: అన్నింటికంటె యెక్కువ సంఖ్యలో వుండి, శ్రామికవర్గానికి అత్యంత దగ్గరగా వున్నది అర్ధకార్మికుల, లేదా బీద రైతుల బృందం, తరువాత మధ్య తరగతి రైతులు, చివరిది చాలా చిన్న సంఖ్యలో వున్న కులాక్కుల, లేదా గ్రామీణ బూర్జువాల బృందం.

ధాన్యంలో వర్తకం చేయడానికీ, కరువు ద్వారా లాభం సంపాయించడానికీ వీలున్నంత కాలం, రైతు అర్ధ శ్రామికుడిగా, అర్ధ లాభార్జనపరుడుగా నిలిచివుంటాడు (శ్రామికవర్గ నియంతృత్వంలో కొంత కాలంపాటు యిది అనివార్యం). లాభార్జనపరుడుగా అతను మనకు వ్యతిరేకి, శ్రామికవర్గ రాజ్యానికి వ్యతిరేకి; బూర్జువా వర్గంతోనూ, దానికి విధేయులైన గులాములతోనూ, ధాన్యవర్తకంలో స్వేచ్ఛకు అనుకూలమైన మెన్షెవిక్ షేర్‌తో, లేదా సోషలిస్టు రివల్యూషనరీ బి. చెర్నేన్కొవ్‌తో సహా, యేకీభవించడానికి అతను అభిముఖంగా వుంటాడు. కానీ శ్రామికుడుగా రైతు కార్మికవర్గ రాజ్యానికి మిత్రుడు, భూస్వామితోనూ, పెట్టుబడిదారునితోనూ చేసే పోరాటంలో కార్మికునికి అత్యంత విధేయమైన పొత్తుదారుడు. శ్రామికులుగా, రైతులు, అపారమైన రైతు జనబాహుళ్యం, లక్షోపలక్షల రైతు జనం, శ్రామికవర్గ అగ్రదళానికి చెందిన ఒకటి రెండు లక్షల మంది కమ్యూనిస్టుల నాయకత్వం కలిగి, లక్షోపలక్షల సంఘటిత కార్మికుల చేత యేర్పడిన రాజ్య "యంత్రా"నికి అండదండలు యిస్తారు.

నిజమైన అర్థంలో యింతకంటె ప్రజాస్వామికమైన రాజ్యం, దోపిడీ చేయబడే శ్రామిక ప్రజలతో యింతకంటె సన్నిహిత సంబంధం గలది, యింతవరకు యెప్పుడూ లేదు.

"కమ్యూనిస్టు సుబోత్నిక్కుల"లో చేయబడే లాంటి శ్రామిక వర్గేయ కృషే శ్రామిక వర్గ రాజ్యానికి రైతుల సంపూర్ణ గౌరవాన్నీ, ప్రేమనూ గెలుచుకునేది. అలాంటి కృషి, అలాంటి కృషి మాత్రమే మనం చేసేది సరైనదనీ, కమ్యూనిజం సరైనదని రైతును నమ్మిస్తుంది, అతన్ని మన భక్తి పూర్వక పొత్తుదారుని చేస్తుంది, తత్కారణంగా, మన ఆహార ఇబ్బందులన్నీ పూర్తిగా తొలగిపోవడానికీ, ధాన్యం ఉత్పత్తి, పంపకాల విషయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ మీద కమ్యూనిజం విజయానికీ, కమ్యూనిజం సంపూర్ణ దృఢీకరణకూ దారి తీస్తుంది.

**1919, జూన్ 28**

**పుస్తక రూపంలో**

**1919, జూలైలో, మాస్కోలో**

**ప్రభుత్వ ప్రచురణాలయం చేత**

**ప్రచురింపబడింది.**

✦

వ్యాసం

# దేశ ద్రోహులైన నరేంద్రమోడీ, అరుణ్‌జైట్లీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షాలు నంబర్ వన్ సామ్రాజ్యవాద ఏజెంట్లు!

# నరహంతక మోడీ నాయకత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వం దేశ వనరులను, సంపదను, మార్కెట్‌ను సామ్రాజ్యవాద, దేశీయ దళారీ కంపెనీలకు కట్టబెట్టే విధానాలను ఎదుర్కోవాలి!!

# దేశంలో కొనసాగుతున్న దోపిడీ వర్గాల పార్లమెంటరీ నియంతృత్వాన్ని ధ్వంసం చేయాలి. !!!

# ప్రజల ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మించే పోరాటంలో మావోయిస్టు పార్టీతో దేశభక్త ప్రజలందరూ ఐక్యం కావాలి!!!!

గత మూడున్నర సంవత్సరాలుగా దేశద్రోహి నరహంతక మోడీ నాయకత్వంలోని ఫాసిస్టు ప్రభుత్వం ఆర్థిక, రాజకీయ, విద్యా, సాంస్కృతిక సంబంధిత పాలసీలను వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు కావలి కుక్కగా మారి అమలు జరుపుతున్నారనే విషయం జరుగుతున్న సంఘటనలను విశ్లేషించుకుంటే తేలికగానే అర్థమవుతుంది. ఈ విషయాలను ఇప్పటికే బూర్జువా పత్రికల్లోనూ, ఎలక్ట్రానిక్ మీడియాలోను చర్చిస్తూనే వున్నారు.

ఎన్నికలకు ముందు విదేశాల్లో వున్న నల్లధనాన్ని తెచ్చి ఒక్కొక్కరి ఖాతాలో 15 లక్షలు వేస్తామనీ, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామనీ, అవినీతి నిర్మూలనకు జన్‌లోక్‌పాల్ లాంటి బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని వాగ్దానం చేశారు. ఎన్నికల తర్వాత, చేసిన వాగ్దానాల విషయం గురించి అమిత్‌షాను ప్రశ్నించగా, "ఎన్నికలప్పుడు ఓట్లు వేయించుకోవడం కోసం మేము ఎన్నో చెబుతాం, అంతే కానీ అవి నెరవేర్చడం కోసం కాదని" అమిత్‌షాయే తన దుర్మార్గమైన ఆలోచనను బయటపెట్టుకున్నాడు.

బి.జె.పి.పార్టీకి ఆరాధ్య దైవాలైన శ్యాంప్రసాద్ ముఖర్జీ, వీరసావర్కర్‌లు బ్రిటిషుకు అనుకూలంగా వ్యవహరించారు. ఆ రోజుల్లో కలకత్తా ప్రెసిడెన్సీలో మంత్రిగా వున్న శ్యాంప్రసాద్ ముఖర్జీ, తన మంత్రి పదవికీ రాజీనామా ఇవ్వకుండా బ్రిటిషుకు అనుకూలంగా వుండి సేవ చేశాడు. సావర్కర్ ముందు హీరోలాగా ఫోజు పెట్టాడు. తర్వాత జైలు నుండి బ్రిటిషుకి సరెండరవుతూ ఉత్తరాలు రాశాడు. జీవితాంతం బ్రిటిషు వారికి కుక్కలాగా సేవ చేస్తానని మాట ఇచ్చి, జైలు నుండి విడుదలైన తర్వాత కూడా అలాగే వ్యవహరించాడు. అనాటి నుండి నేటి మోదీ వరకు ఈ కాషాయ మూకల చరిత్రంతా సామ్రాజ్యవాదులకు సేవ చేయడమే.

సమాజానికి పునాది అయిన ఆర్థిక వ్యవస్థ (ఉత్పత్తి, పంపిణీ, యాజమాన్యం)ను ఏ విధంగా దోపిడీ చేస్తున్నారో దానికనుగుణంగా ఉపరితల విషయాలైన రాజకీయ, సాంస్కృతిక, విద్యాపరమైన పాలసీలను, చట్టాలను తమ దోపిడీకి అనుకూలంగా మార్చుకుంటూ, అభివృద్ధి అని గావుకేకలు పెడుతూ ఎలా మోసపూరితంగా ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారో చూద్దాం!

నేడు సామ్రాజ్యవాదం ప్రపంచంలోని వనరులను, సంపదను, మార్కెట్‌లను దోచుకొని ప్రపంచాన్ని తమ అదుపులో ఉంచుకొనేందుకు ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్., ప్రపంచ వాణిజ్య సంస్థల ద్వారా పాలసీలను రూపొందించి దళారీ పాలకులైన (గతంలో పి.వి. నరసింహారావు, మన్‌మోహన్‌సింగ్)నరేంద్రమోడీ లాంటి వారి చేత అమలు జరిపిస్తున్నారు. దీనిలో భాగమే మోడీ ప్రకటించిన పథకాలైన స్మార్ట్ సిటీ, డిజిటల్ ఇండియా, మేక్ఇన్ ఇండియా, భూ అధిగ్రహణ చట్టం, జన్‌ధన్ యోజన, ఫసల్‌భీమా పథకం, పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టి. మొదలగునవి ఉన్నాయి. సంక్షోభంలో పడి పనులు లేక ఈగలు తోలుకుంటున్న కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టేందుకు తెచ్చినదే స్మార్ట్ సిటీ పథకం. మన దేశంలో సుమారు 40 కోట్ల మంది ప్రజలు పట్టణాలలో ఉంటున్నారు. పట్టణాలలో నీటి సరఫరా, రవాణా వ్యవస్థ, సరుకుల సరఫరా, విద్యా, వైద్యం, విద్యుత్ లాంటి అవసరాలన్నీ ఈ కంపెనీలు చేపడతాయి. దీని కోసం ఒక ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తారు. పేద ప్రజలను పట్టణాల నుండి తరలించి అంచులోకి నెట్టివేస్తారు. ఖాళీ అయిన స్థలాలను ఈ కంపెనీలు అపార్ట్‌మెంట్‌లను, షాపింగ్ మాల్స్‌ను ఏర్పాటు చేస్తారు. దీనికి 'నగరాలను అందంగా మలచడం' అని పేరు పెట్టారు. నగరాలలోని ప్రజల వద్ద నుండి పన్నులను,

చార్జీలను ఆ కంపెనీలు వసూలు చేసుకుంటాయి. ఇది ఒక రకంగా ఆ నగరాలను ఆ కంపెనీలకు పూర్తిగా అప్పజెప్పడమే. సంవత్సరాల తరబడి 'టోల్‌గేట్' వసూలు చేసుకున్నట్లు ప్రజల నుండి డబ్బును పిండుకుంటారు.

మన దేశంలో బ్యాంకు సంస్కరణలు అమలు జరపాలనీ ద్రవ్యపెట్టుబడి ప్రతినిధులైన ప్రపంచ బ్యాంకు, ఐ.ఎమ్.ఎఫ్.లు వత్తిడి చేస్తున్నాయి. దేశంలోకి విదేశీ బ్యాంకులను అనుమతించడం, ప్రభుత్వ బ్యాంకులలో వాటాలను ప్రైవేటు బ్యాంకులకు అమ్మి వేయడం, పెద్ద ఎత్తున కార్పొరేట్ కంపెనీలకు ఋణాలివ్వడం మొదలగు చర్యలు దీనిలో వున్నాయి. దేశంలో బ్యాంకులు ఇప్పటికే కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయాలు ఋణాలిచ్చి దివాలాకు దగ్గర పడ్డాయి. బ్యాంకుల మూలధనం తగ్గిపోయింది. దీనిని పూడ్చుకునేందుకు తీసుకొని వచ్చిందే పెద్దనోట్ల రద్దు పథకం. ఈ రద్దు వలన ప్రజలు కష్టపడి సంపాదించుకొని, పోగు పెట్టుకున్న డబ్బు కూడా బ్యాంకులకు ఇవ్వాల్సి వచ్చింది. ఈ విధంగా నోట్ల రద్దు ద్వారా బ్యాంకులలో పెద్ద ఎత్తున పెట్టుబడి పోగుబడింది.

జన్‌ధన్ యోజన, సుకన్యయోజనా, బేటీ బచావో, బేటీ పడావో, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజనా, ప్రధానమంత్రి భీమా యోజనా లాంటి పథకాలలో ప్రజల చేత బ్యాంకు ఖాతాలను తెరిపించారు. ఈ ఖాతాలలో ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందనీ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. వాటిల్లో చాలా వరకు జీరో ఖాతాలుగానే వున్నాయి. డబ్బు జమచేసిన పరిస్థితుల్లో కూడా ఆ డబ్బును ప్రజలకిచ్చేది లేదు. బ్యాంకులోనే ఉంటుంది. ఈ విధంగా బ్యాంకుల్లోకి పెట్టుబడి జమ అయ్యింది. ఆ డబ్బులను ప్రైవేటు కంపెనీలకు ఋణాలిచ్చుకోవచ్చు, వ్యాపారం చేసుకోవచ్చు. పేరు ప్రజలది. సంపదను అనుభవించేది కార్పొరేట్ కంపెనీలు. మరో వైపున ప్రజలకు మోసపూరితమైన ఆశలు చూపిన మోడీని మహా నాయకుడనీ, ఇంద్రుడు, చంద్రుడని భావించి ప్రజలు జీవితాంతం మోడీకే ఓటు వేయాలనేది వీరి పథకం. అందుకనే సినిమాలలో హీరో ఒట్టి చేతులతో వందలమందిని మట్టిగరిపించిన విధంగా మోడీ కూడా దేశ ప్రజల జీవితాలను మార్చివేయగలడనీ, మోడీ వలన దేశం మారిపోతుందనీ, మోడీగాలి బాగా వీస్తున్నదని కార్పొరేట్ మీడియా ప్రచారం చేసి, మధ్య తరగతి ప్రజల మైండ్‌సెట్‌ను మార్చి, 2014 ఎన్నికల్లో విజయాన్ని సాధించి పెట్టింది. నేడు దాని రంగు వెలసిపోతున్నది. గతంలో మోసపోయిన వారు మోడీ నిజస్వరూపాన్ని తెలుసుకుంటున్నారు.

సామ్రాజ్యవాద సరుకుల పోటీలో చైనా మిగతా సామ్రాజ్యవాద దేశాలకు తలనొప్పిగా మారింది. చైనాలో తక్కువ కూలీతో తయారైన సరుకులు, మిగతా ప్రపంచ దేశాలలో చౌకగా అమ్ముడు పోవుటవలన చైనా సరుకులను ఎక్కువగా కొంటున్నారు. దీని వలన చైనాకు, అమెరికా లాంటి మిగతా పెట్టుబడిదారీ దేశాలకు జరుగుతున్న వాణిజ్యంలో చైనాకు మిగులు ఏర్పడుతోంది. చైనా దూకుడును అరికట్టాలనేది అమెరికా పథకం. అందుకు భారత్‌ను కూడా మరొక చౌక వర్క్ షాప్‌గా మార్చితే చైనా డిమాండ్‌ను తగ్గించవచ్చునని మిగతా సామ్రాజ్యవాదుల పథకం. దీనిలో భాగంగానే 'మేక్ ఇన్ ఇండియా' నినాదాన్ని మోడీ అమెరికా, ఇతర సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం ప్రచారం చేస్తున్నాడు. దీనిలో మన దేశ ప్రజల శ్రమశక్తిని దోచుకొనీ, సరుకులు తయారు చేయించుకొనీ, వాటిని అమ్ముకొని సామ్రాజ్యవాదులు లాభాలు పొందుతారు. లాభాలు సామ్రాజ్యవాదులకు, కష్టాలు-నష్టాలు మన దేశప్రజలకు. ఇది మోడీమార్క్ దేశభక్తి.

సామ్రాజ్యవాద కంపెనీలకు ఏకీకృత మార్కెట్ కావాలి. పన్నుల విధానం సరళంగా వుండాలి. మన దేశంలో కేంద్రప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వాలు కూడా పన్నులు వేసే పద్ధతి నుండి ఒకేసారి ఒకేదగ్గర పన్నువేసే పద్ధతిని తీసుకురావాలని సామ్రాజ్యవాదులు మోడీకి ఆదేశించారు. దానిలో నుండి పుట్టినదే జి.ఎస్.టి. మోడీ, అరుణ్‌జైట్లీలు ఈ విషయంలో జి.ఎస్.టి. పన్ను విధానం వ్యాపారానికి చాలా అనుకూలంగా వుంటుందని బహిరంగంగానే చెబుతున్నారు. దీనితో పాటు ధరలు తగ్గుతాయనే అబద్దాన్ని కూడా వీరు ప్రచారం చేస్తున్నారు.

పెద్దనోట్లు రద్దు మరియు జి.ఎస్.టి. వలన దేశ ఆర్థిక వ్యవస్థ కుదుపుకు గురయ్యింది. ఇది ఒక రకంగా ప్రజల మీద 'ఫైనాన్షియల్ గ్రీన్‌హంట్ ఆపరేషన్'. 25 లక్షల మంది నిరుద్యోగులయ్యారు. లక్షల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేశారు. సామ్రాజ్యవాద కంపెనీలు పండుగలు చేసుకున్నారు. ప్రజలు కష్టాలకు, కడగండ్లకు గురయ్యారు. ముఖ్యంగా చిన్న తరహా, మధ్య తరహా వ్యాపారాలు దెబ్బతిన్నాయి. జి.డి.పి.లో వీటి వాటా 38%. ఎగుమతులలో వీటి వాటా 42%గా వుంది. జి.ఎస్.టి. చెల్లింపుదారులు ఎంత మేరకు టాక్స్ క్రెడిట్‌ను కోరుకుంటారో ప్రభుత్వానికి గానీ, ఏజెన్సీలకు గానీ అంచనాలు లేవు. దీనివలన ప్రభుత్వానికి పన్ను ఆదాయం తగ్గిపోవచ్చు. ద్రవ్యలోటు భారీగా పెరుగుతుంది. దీనివలన కూడా ధరలు పెరగవచ్చు. ద్రవ్యోల్బణం 4%నికి చేరింది. ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెడతామని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఊర్జిత్‌పటేల్ అన్నాడు. కానీ ఏ విధంగా అదుపులో పెడతాడో నిర్దిష్టమైన ప్రణాళిక ఏమి చెప్పలేదు.

ఇప్పటివరకు పెట్రోల్ ధరలు అంతర్జాతీయంగా బ్యారల్ 30 డాలర్లు ఉండటం వలన మోడీ ప్రభుత్వానికి కలిసి వచ్చింది. కానీ దేశంలో పెట్రోల్ ధరలు తగ్గించకుండా, పెంచుకునే అవకాశాన్ని అంబనీ లాంటి మార్కెటింగ్ కంపెనీలకు ప్రభుత్వం ఇచ్చింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధర తక్కువగా వున్నప్పటికీ, మన దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. బంగారం దిగుమతుల మీద పన్నులు వేయడం వలన, ఎక్కువ మంది బంగారంలో మదుపులు పెట్టలేదు. ఆ డబ్బు కూడా పెట్టుబడిగా చలామణిలో ఉండటం వలన, మోడీ ప్రభుత్వానికి కలిసి వచ్చింది. అయినప్పటికీ ప్రభుత్వ ఆదాయం, వ్యయం మధ్య వ్యత్యాసం(ద్రవ్యలోటు) 5.46 లక్షల కోట్ల రూపాయలను

దాటిపోయింది. రెవిన్యూ లోటు (బడ్జెట్‌లో నిర్దేశించిన లక్ష్యం) 4.31 లక్షల కోట్ల రూపాయలను దాటిపోయింది.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర పెరుగుదల, పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి. ప్రభావాల వలన ఎగుమతులు తగ్గిపోయాయి. దిగుమతుల చెల్లింపులు పెరిగాయి. వాణిజ్యలోటు కూడా భారీగా పెరిగింది. వాణిజ్యలోటు (ఏప్రిల్, ఆగస్టుకి 2017) 2.4 లక్షల కోట్ల రూపాయలు పెరిగింది. మోడీ ప్రభుత్వం పరిస్థితిని చక్కదిద్దే పేరు మీద రహదారుల నిర్మాణం, విమానాశ్రయాల నిర్మాణం, పోర్ట్‌ల నిర్మాణం, రైల్వేస్టేషన్‌ల నిర్మాణం, విద్యుత్ సరఫర వ్యవస్థలు, ఇండస్ట్రీయల్ కారిడార్‌లు, టెక్నోపార్కుల నిర్మాణాలను చేపట్టింది. ఇవన్నీ కూడా సామ్రాజ్యవాద, దళారీ కంపెనీల మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసమని చెబుతున్నారు. వీటి కోసం 14 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపున బ్యాంకుల మొండిబకాయిలు 2017, సెప్టెంబర్ నాటికి 7.33 లక్షల కోట్ల రూపాయలుగా వుంది. ఈ మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వం బ్యాంకులకు 51 వేల కోట్ల రూపాయలను ఇచ్చింది. మరల సెప్టెంబర్ నెలలో బ్యాంకుల మూల నిధుల్లోకి 2.11 లక్షల కోట్ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. మొత్తంగా ఇప్పటి వరకు 2.62 లక్షల కోట్లను ఇచ్చింది. దేశ జనాభాలో 47% వ్యవసాయ సంబంధిత కార్యకలాపాల్లో వున్నారు. తయారీ రంగం 12%, నిర్మాణ రంగం 13%, వ్యాపార, వాణిజ్య, హోటళ్ళు మొదలగునవి 18%గా వున్నాయి. దేశ జనాభాలో సగానికి పైగా ఆధారపడుతున్న వ్యవసాయ రంగం మీద మోడీ ప్రభుత్వం ఖర్చు పెట్టేది నామమాత్రమే. కార్పొరేట్ కంపెనీలకు, భారీ పరిశ్రమలకు ఉద్దీపన పథకాలు, రాయితీలు, మౌలిక సౌకర్యాలు కల్పిస్తూ, మరోవేపు గ్రామీణ ప్రాంతంలోని చిన్నతరహా, మధ్యతరహా సంస్థలను కూడా జి.ఎస్.టి. పరిధిలోకి తెచ్చి, అందరూ పన్నులు కట్టాలని ప్రభుత్వం భయపెడుతోంది. ప్రజలను నేరస్థులుగా చూస్తోంది. నేరస్థులైన కార్పొరేట్ కంపెనీలను గౌరవిస్తోంది.

మూడీస్ రేటింగ్ సంస్థ తమకనుకూలంగా రేటింగ్ ఇచ్చిందనీ మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఈ రేటింగ్ సంస్థలన్నీ సామ్య్రావాద సంస్థలే. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు మెచ్చుకొని ఈ రేటింగ్‌లను ఇస్తుంది. ఇదే మూడీస్ సంస్థ ప్రభుత్వం ఎదుర్కొంటున్న మరికొన్ని ప్రతికూల విషయాలను కూడా చెప్పింది. దేశానికున్న అప్పు ఆందోళనకర స్థాయిలో వున్నదనీ, నిరుద్యోగం కూడా ఎక్కువగా వుందని చెప్పింది. దేశ అప్పు జి.డి.పి.లో 69.50%గా వున్నది. సంస్కరణలు అమలు జరిపితే ఈ ఋణభారం మరింత పెరుగుతుంది.

ప్రస్తుత మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల ఆస్తులను పెంచుకునేందకు పని చేస్తున్నది. 1977లో రిలయన్స్ అంబనీ ఆస్తులు 37 కోట్లు ఉండింది. 2017 నాటికి అంబానీ ఆస్తులు 1 లక్ష 87 వేల కోట్లుకు పెరిగింది. 10 వేల కోట్ల నిలువలున్న సహజ గ్యాస్ నిల్వలను అమ్ముకునేందుకు లైసెన్సు పొందాడు. రక్షణరంగ పరికరాల ఒప్పందాన్ని యుద్ధనౌకల మరమ్మతు ఒప్పందాన్ని కూడా పొందాడు. ఆదానీ గ్రూపుకు 500 కోట్ల లాభం వచ్చే విధంగా ప్రభుత్వ నిర్ణయం జరిగింది. మిగతా గ్రూపులు కూడా ఇదే విధంగా లబ్ది పొందుతున్నాయి.

యు.పి.ఎ. పాలనలో జి.డి.పి. 9%గా వుంది. ఇంక్లూజివ్ గ్రోత్ అని మన్‌మోహన్‌సింగ్ చెప్పాడు. కానీ వాస్తవంగా జరిగిందేమిటంటే దేశంలోని సామ్రాజ్యవాద, దళారీ కార్పోరేట్ సంస్థల ఆస్తులు మరింత పెరిగాయో గానీ, పేదల సంపద పెరగలేదు.

గత మూడున్నర సంవత్సరాలుగా మోడీ ప్రభుత్వం, ప్రజలు బ్యాంకులో జమచేసిన డిపాజిట్‌లు, ప్రభుత్వ బ్యాంకుల్లో ఉద్యోగులు సాధించిన లాభాల్లో నుండి కార్పొరేట్ కంపెనీల అప్పు ఎగవేత రద్దు కోసం 1,88,377 వేల కోట్ల రూపాయాలను మళ్ళించారు. ఇవికాక చౌకగా భూములివ్వడం, పన్ను ఎగవేతలపై రాజీ పడటం, విద్యుత్ రాయితీలివ్వడం...వగైరా వాటికోసం ఏటా 7 లక్షల కోట్ల నుండి 9 లక్షల కోట్లు రూపాయలు ప్రభుత్వం ఖర్చు పెడుతున్నది.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించే పేరుతో వ్యూహాత్మక రంగాలైన రక్షణరంగం లాంటి వాటిలో విదేశీ కంపెనీలు, దేశీయ దళారీ కంపెనీలు కలిసి ఆయుధాల తయారీ వ్యాపారం చేయాలని నిర్ణయించాయి. ముఖ్యంగా మోడీ అమెరికా సామ్రాజ్యవాదానికి కుక్కలాగా పని చేస్తున్నందున అమెరికా ప్రయోజనాల కోసం మిలటరీ, వ్యాపార, ఇతర ఒప్పందాలు చేసుకొని అమెరికాలో వర్షం పడితే, ఇండియాలో గొడుగు పట్టేలాగా వ్యవహరిస్తున్నాడు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను మరింత సరళతరం చేసి, రక్షణరంగంలోకి వందశాతం విదేశీ పెట్టుబడిని అనుమతించారు. విదేశీ కంపెనీలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా వ్యాపారం చేసుకొనేందుకు 1400 చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసింది. 'రెడ్‌టేపిజం' (తాత్సారం చేయడం)ను లేకుండా చేసి విదేశీ కంపెనీలకు 'ఎర్ర తివాచీ' (రెడ్ కార్పెట్)పరిచానని స్వయంగా మోడీ చెబుతున్నాడు.

చమురు వెలికితీత, గ్యాస్ ఉత్పత్తి, రవాణా, కంపెనీల నెట్‌వర్క్‌లలో విదేశీ కంపెనీలను, అంబానీలను ప్రభుత్వం ఆహ్వానిస్తుంది. రష్యన్ కంపెనీ, సౌదీ అరామ్‌కో, రిలయన్స్, వేదాంత కంపెనీలను ఆహ్వానించి, గ్యాస్‌హబ్‌ను ఏర్పాటు చేయాలనే ఒప్పందాలు మోడీ ప్రభుత్వం చేసుకున్నది. పెట్రోకెమికల్స్ రంగాన్ని మింగివేయటానికి దేశ, విదేశీ సొరచాపలు పథకం తయారు చేశారు. ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాలు అమ్మే పని కూడా ముమ్మరంగా జరుగుతున్నది.

విశాఖపట్నంలోని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లాభాలు సంపాధించే సంస్థగా కొనసాగుతున్నది. ప్రభుత్వం ఇప్పటికే దీనిలో 26.53% వాటాలను ప్రైవేటు కంపెనీలకు అమ్మి వేసింది. ఈ సంస్థకు సంబంధించి వేసిన పార్లమెంటరీ స్థాయి సంఘం కూడా

దీనిని ప్రైవేటు సంస్థలకు అమ్మవద్దని సిఫార్సు చేసింది. ఆ సిఫార్సులను పక్కనబెట్టి ఈ సంస్థను కూడా ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పాలనీ మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనివలన దీంట్లో పని చేసే వేలాది మంది ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి అగమ్యగోచరం అవుతుంది. ఇప్పటికే ప్రభుత్వరంగ సంస్థల వాటాలను అమ్మి 72వేల కోట్లను రాబట్టింది. దీనిని 2 లక్షల కోట్ల వరకు పెంచాలనే తయారీలో వున్నది.

ఇటీవల కాలంలో విశాఖపట్నంలో వ్యవసాయరంగం మీద 3 రోజుల సదస్సు జరిగింది. బిల్‌గేట్స్, భారత పరిశ్రమల సమాఖ్య, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగింది. వ్యవసాయాన్ని కార్పోరేట్ కంపెనీలకు అప్పజెప్పాలని చంద్రబాబు, మోడీలు పథకాలు వేశారు. 10 లక్షల ఎకరాలతో భూ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలనీ, రైతుల భూమిని క్లస్టర్లుగా మార్చాలనీ, ఒక్కొక్క దానిలో 2,500 ఎకరాల నుండి 25,000 ఎకరాల వరకు ఉండాలని నీతిఆయోగ్ సిఫార్సు చేసింది.

దీనికి కొనసాగింపుగా డిల్లీలో ఆహార సమ్మిట్ పేరుతో సదస్సు జరిగింది. 'ఆహార భద్రత'కు బదులు 'ఆహార శుద్ధి' అనే నినాదం ఇస్తున్నారు. దీనికోసం ఒకప్పుడు మన దేశం నుండి బహిష్కరించిన నరభక్షక 'కోకోకోలా', 'పెప్సీకోలా' లాంటి సంస్థలను ఆహ్వానించి, ఆహార పదార్థాల ప్రాసెసింగ్‌ను మోడీ ప్రభుత్వం అప్పజెప్పబోతున్నది. ప్రతిరోజు రైళ్ళలలో 10 లక్షల మంది ఆహారాన్ని కొంటున్నారు. ఇంకా దేశంలో లక్షలాది మంది, పట్టణాల్లో ఆహారాన్ని కొనుక్కొని తినే పద్ధతి వున్నది. ఈ వ్యాపారాలను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు మోడీ ప్రభుత్వం అప్పజెప్పబోతున్నది. దీనివలన చిన్నా, చితకా వ్యాపారాలు చేసుకొనేవారు, పట్టణాలలోని బజార్లలో చిరుతిండ్లు అమ్ముకునే లక్షలాది మంది వీధులపాలవ్వడం ఖాయం.

2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం, రైతులకు ఋణం రద్దు, గిట్టుబాటు ధరలు, ప్రతి ఉద్యోగికి ఇల్లు, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధం చేస్తాననీ, ప్రతి పేదవాడినీ విద్యావంతున్ని చేస్తాననీ, టీచర్లకు కంట్రీబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తానని మోసపూరితంగా వాగ్దానాలు చేశాడు. ఎన్నికలు పూర్తియిన తర్వాత నుండి చేసిన హామీలను పక్కన పెట్టి 'అభివృద్ధి' అని గావు కేకలు పెడుతున్నాడు.

చంద్రబాబు పరిపాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఇప్పటికే రాష్ట్రానికి 2.26 లక్షల కోట్లు అప్పు అయ్యింది. దీనికి వడ్డీ 14 వేల కోట్లు ప్రభుత్వం చెల్లిస్తోంది. రాష్ట్ర ఆదాయానికీ, రెవిన్యూకీ భారీ తేడా వుందనీ, రాష్ట్రం గ్రాంట్లమీద ఆధారపడిందని రాష్ట్ర ఆర్థికమంత్రి రామకృష్ణుడే చెప్పాడు. పెట్టుబడులను ఆహ్వానించే పేరుతో చంద్రబాబు జోలె పట్టుకొని దేశ, విదేశాలు తిరుగుతున్నాడు. ఆహార సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశ, విదేశీ సంస్థలతో 17 ఒప్పందాలు చేసుకున్నది. ఇక నుండి పూతరేకులు, లడ్డూలు, అరిసెలు, బజ్జీలు మొదలగు చిరుతిండ్లు కూడా ఈ కంపెనీలే తయారు చేయబోతున్నాయి. దీనివలన చిన్నదుకాణాదారులు రోజువారి తయారీ చేసే లక్షలాది మంది ఉపాధి పోతుంది. రాష్ట్రంలో పారిశ్రామిక సంస్థల కోసం 38,635 ఎకరాలు కేటాయించారు. రాష్ట్రంలో చంద్రబాబు రేషన్ దుకాణాల్లో రిలయన్స్, ఫ్యూచర్ గ్రూపులకు భాగస్వామ్యం కల్పించాలనీ, ఆ కంపెనీల సరుకులు అమ్మాలని రేషన్ డీలర్లమీద వత్తిడి తెస్తున్నాడు. చంద్రబాబు పాలనలో రోజుకొక కుంభకోణం జరుగుతోంది. విశాఖ భూ కుంభకోణంలో ఇంతవరకు తేల్చిందేమి లేదు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఇసుక మాఫియాగా తయారై రాష్ట్రంలోని ఇసుకను స్వాహా చేస్తున్నారు. సారా వ్యాపారం చేసి, ప్రజల సంపదను లూటీ చేస్తున్నారు. ఈ వ్యాపారంలో 30వేల కోట్లు ప్రభుత్వానికీ, దానికి 3 రెట్లు ఆదాయం కాంట్రాక్టర్లకు వస్తుంది. రాష్ట్రంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లోని 500 మంది అధికారుల మీద అవినీతి కేసులున్నట్లు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. సారా వలన ప్రజల జీవితాలు ధ్వంసమైపోతున్నాయి. ముఖ్యంగా మహిళలు దీనివల్ల ఇబ్బంది పడుతున్నారు. సారా నిషేదం చేయాలనీ మహిళలు ఉద్యమిస్తే, వారి మీదకు చంద్రబాబు పోలీసులను ఉసిగొల్పుతున్నాడు. క్రమబద్దీకరణ పేరుతో 4 వేల స్కూళ్ళను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్యను తగ్గించింది. బి.సి., ఎస్.సి. హాస్టళ్ళలో స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడం లేదు. రాష్ట్రంలో విద్యా వ్యాపారం జోరుగా సాగుతోంది. విద్యా వ్యాపారి నారాయణ ఒక మంత్రిగా, వాని వియ్యంకుడు శ్రీనివాసరావు విద్యామంత్రిగా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. కార్పొరేట్ కాలేజీలలో ర్యాంకులు రావాలనే పేరుతో, విద్యార్థుల మీద గొంతులు కోసుకునే పెట్టుదారీ పోటీ, తీవ్ర ఒత్తిడి కొనసాగుతోంది. దీని వల్లనే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 2017లో ఆంధ్రప్రదేశ్‌కు విద్యార్థుల ఆత్మహత్యల రాష్ట్రంగా పేరొచ్చింది. గిరిజన ప్రాంతాల్లో రోగాల బారీన పడి వందలాది మంది చనిపోతున్నారు. గిరిజన ప్రాంతాలను పర్యాటకం పేరుతో అశ్లీల, వ్యభిచార సంస్కృతిని చంద్రబాబు తీసుకు రాబోతున్నాడు. రాష్ట్రంలోని యువత, విద్యార్థులు మత్తుమందు, అశ్లీల సంస్కృతి, పోర్నోగ్రఫీలాంటి వాటికి బలైపోతున్నారు. ఉత్తరాంధ్రలో ప్రబలిన కిడ్నీ వ్యాధుల గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. రైతులకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు యధావిధిగా కొనసాగుతున్నాయి. నైతిక విలువలను వదిలివేసి, డబ్బు సంపాదనే ధ్యేయంగా పని చేయాలనీ, చంద్రబాబు అదే పనిగా ప్రచారం చేస్తున్నాడు.

రైతులను మోసం చేసేందుకు మోడీ ప్రభుత్వం, 'ఎలక్ట్రానిక్ జాతీయ మార్కెట్' పథకాన్ని తెచ్చింది. ఈ సంవత్సరం పంటల దిగుబడి తగ్గినా కూడా రైతులకు గిట్టుబాటు ధర దొరకలేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ సకాలంలో కొనుగోళ్ళు చేయలేదు. రైతులు తక్కువ ధరలకే ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత మాది కాదంటే

మాది కాదనీ నాటకం ఆడారు. ఈ విధంగా దేశవ్యాపితంగానూ ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణాలలో పెసల పంట వేసిన రైతులు నష్టపోయారు. సోయాచిక్కుడు, మినుములు, పత్తి, వరిధాన్యానికి కూడా ధరలు పడిపోయాయి.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తానని మోడీ ఎన్నికలకు ముందు నాటకమాడాడు. చివరికి దళారీ కార్పొరేట్ కంపెనీల కంట్రోల్, మార్కెట్ మీద సడలకుండా వారి ప్రయోజనాన్నే కాపాడాడు. దేశవ్యాపితంగా రైతుల ఆత్మహత్యలు యధావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రధానమంత్రి ఫసల్‌భీమా యోజన పూర్తిగా మోసపూరితమైనదే. 2016, మధ్యప్రదేశ్‌లో సోయా చిక్కుడు వేసి నష్టపోయిన 52 మంది రైతులకు దక్కిన సొమ్ము 3,061 రూపాయలు. వేలల్లో భీమా కిస్తీలు (ఇన్‌స్టాల్‌మెంట్) కట్టిన వీరికి, ఒక్కొకరికి 58 రూపాయలు భీమా కింద దొరికింది.

ఐ.టి.రంగంలో ఆటోమేషన్, డిజిటలైజేషన్ ప్రభావాల వలన చాలా మంది సీనియర్‌లు నిరుద్యోగులయ్యే ప్రమాదం వుంది. అమితవేగం, తక్కువ జీతాలకు పని చేయడం, కొత్త టెక్నాలజీని అప్‌డేట్ చేసుకోగల్గిన కొద్ది మందికి మాత్రమే అవకాశం వుంటుందని అనేక సంస్థలు చెబుతున్నాయి. ఐ.టి.రంగంలో వచ్చిన సంక్షోభం నుండి టాటా, ఇన్ఫోసిస్ లాంటి సంస్థలు వేల మంది ఉద్యోగుల్ని తొలగించాయి. "పెట్టుబడిదారీ విధానంలో వుండే పోటీ, లాభాలవేట ఈ విధంగా ఉత్పత్తి శక్తుల(నిరుద్యోగం)ను ధ్వంసం చేస్తుందని" ఆనాడే మార్క్స్ మహాశయుడు చెప్పాడు. మోడీ, చంద్రబాబులు లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని, మోసపూరిత ప్రచారం చేస్తున్నారు. సామ్రాజ్యవాద, దళారీ, దోపిడీ పాలక వర్గాలు సంక్షోభం నుండి బయటపడేసేందుకే, మోడీ వారి ఏజెంటుగా మారి ఇటువంటి కసరత్తులు చేస్తున్నారు. జి.డి.పి. పెరిగినా, కరెంట్ అకౌంట్‌లోటు తగ్గినా, ద్రవ్యలోటు తగ్గినా రాబోవు ఫలితాలన్నీ కార్పొరేట్‌దోపిడీ పాలకవర్గాలకే దక్కుతాయి. మిగిలిన వారికి దొరికేదేమి వుండదు. ఈ విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కవలపిల్లల్లాగా ఆర్థికవ్యవస్థను భారీ స్థాయిలో ధ్వంసం చేస్తున్నారు. వనరులను, సంపదను, మార్కెట్‌ను సామ్రాజ్యవాద కంపెనీలకు, దేశంలోని దళారీ కంపనీలకు కట్టబెడుతున్నారు.

## మోడీ స్వచ్ఛభారత్ పథకం

మరుగుదొడ్లు నిర్మాణం చేస్తే పరిశుభ్రత వస్తుందని విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. నిర్మాణం చేసిన 60% మరుగుదొడ్లకు నీటి సరఫరా లేదు. వ్యర్థాలని తొలగించే వ్యవస్థలేదు. పర్యావరణ హితమైన 'రెండు గుంతల' మరుగుదొడ్ల నిర్మాణం చేయమని 'వాటర్‌ఎయిడ్' సంస్థ చెప్పింది. దానిని పక్కన బెట్టి కాంట్రాక్టులు దండుకునే ఉద్దేశంతో పనికిరాని విధంగా మరుగుదొడ్ల నిర్మాణం చేశారు. నిర్మాణం చేసిన వాటిలో 40% పనికిరావని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఇక్కడ కూడా అవినీతికి పెద్ద పీఠ వేశారు. దేశంలో 20లక్షల మంది డాక్టర్ల కొరత, 40 లక్షల మంది నర్సుల కొరత, లక్షన్నర ఉపకేంద్రాల కొరత, 760 కి పైగా జిల్లా ఆసుపత్రుల కొరత వుంది. గాలి, నీరు, కలుషితం కారణంగా వేలాది మంది రోగాల బారిన పడుతున్నారు. ఇండస్ట్రీయల్ కారిడార్‌లు, పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి, మరింత కాలుష్యాన్ని మోడీ ప్రభుత్వం పెంచుతుంది. దానికి డిల్లీయే సజీవ ఉదాహరణ. మరోవేపున అనేక రకాల వ్యాధులకు కారణమైన అమెరికన్ పిజ్జాలు, బర్గర్లు, కెంటకీఫ్రైడ్ చికెన్ వంటి చిరు తిండిని, దేశంలోకి మోడీ ప్రభుత్వం అనుమతించి, లక్షలాది మంది యువజన విద్యార్థులను, రోగ గ్రస్థులుగా మార్చుతున్నది. ప్రజలకు అవసరమైనవి చేయకుండా ప్రమాదకరమైన వాటిని అనుమతిస్తూ, స్వచ్ఛభారత్ అని మోడీ బాకా ఊదుతున్నాడు.

నేడు ప్రపంచవ్యాపితంగా నయా ఉదారవాద విధానాల పేరుమీద, సామ్రాజ్యవాద విధానాలను అమలు జరుపుతున్నారు. పాలసీలన్నీ ముందుగా వరల్డ్‌బ్యాంక్, ఐ.ఎమ్.ఎఫ్.లు తయారు చేస్తాయి. ప్రభుత్వాలు విధిగా బ్యూరోక్రాట్లు, టెక్నోక్రాట్లు, సలహాదారుల మీద ఆధారపడాలి. వీరికి ముందే సామ్రాజ్యవాద సంస్థలు ట్రైనింగ్ ఇచ్చి పంపిస్తున్నాయి. ఆనాటి మన్‌మోహన్, రంగరాజన్‌ల నుండి నేటి ఊర్జిత్‌పటేళ్ళ వరకు ఆ సంస్థల ట్రైనింగ్ పొందినవారే. ప్రతి సంవత్సరం మిలటరీ, ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. అధికారులకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెనెజ్‌మెంట్, హార్వర్డ్ లాంటి బిజినెస్ స్కూళ్ళలో ట్రైనింగ్ ఇస్తున్నాయి. పార్లమెంటులో ఏ పాలసీ మీద కూడా వివరమైన చర్చలు వుండవు. అన్ని పార్టీలు కుమ్మక్కై గోలచేసి, సమావేశాలు ముగిస్తారు. సమావేశాల తర్వాత ఒకరిమీద ఒకరు విమర్శించుకుంటారు. మినిమమ్ గవర్నమెంట్, మాగ్జిమమ్ గవర్నెన్స్ అని నినాదాలు ఇస్తున్నారు. మాగ్జిమమ్ గవర్నెన్స్ అనగా ప్రజలను, ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించడం, ముఖ్యంగా మధ్య తరగతిని మోధావి వర్గాలను పక్కదారి పట్టించి, తెలివిగా మేనేజ్ చేయుట. దాని కోసం ఉద్రేకపరిచే నినాదాలు, ఆవేశపూరిత ఉపన్యాసాలు ఇచ్చి మధ్య తరగతి, మేధావి వర్గాలలో విద్వేశాన్ని రెచ్చగొట్టి, అసలు సమస్య నుండి పక్కదారి పట్టించడం. పోరాడే ప్రజలను, పార్టీలను దేశ ద్రోహులనే ముద్ర వేసి, తామే అసలైన దేశ భక్తులమని సర్టిఫికెట్ ఇచ్చుకోవడం మామూలైపోయింది. ఎన్నికయిన ప్రతినిధులు కాకుండా, అధికారుల ద్వారా పరిపాలన చేయాలనే అర్థం. పార్లమెంటు సభ్యుల్లో 40% మంది క్రిమినల్ కేసులున్నవారు ఉన్నారు. 30% మంది ప్రత్యక్షంగా దళారీ బూర్జువా వర్గం నుండే వచ్చారు. పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలలో కొందరు సెల్‌ఫోన్‌లలో బ్లూఫిల్మ్స్ చూసుకుంటుంటే, కొందరు నిద్రపోతుంటారు. ప్రభుత్వం క్రూరులైన పోలీసు, మిలటరీ అధికారులను సలహాదారులుగా పెట్టుకుంటుంది. అజిత్‌దోవల్, విజయ్‌కుమార్‌లు ఈ విధంగా సలహాకారులుగా నియమించబడ్డవారే. నయా ఉదారవాదంలో

పాలసీలను వేగంగా అమలు జరిపించడం కోసం చర్చలుండరాదని నిర్దేశిస్తుంది. ఫాసిస్టు చట్టాలను తయారు చేస్తుంది. పోలీసు అధికారుల మీద, మిలటరీ అధికారుల మీద ఆధారపడతారు. ఫాసిజాన్ని దేశభక్తి ముసుగులో, అభివృద్ధి ముసుగులో కొనసాగిస్తూ, సామ్రాజ్యవాద కంపెనీలకు దేశాన్ని కట్టబెట్టడమే దీని ముఖ్య ఉద్దేశం. గతంలో ఈ కాషాయ మూకలు 'స్వదేశీ' నినాదం ఇచ్చేవి, నేడు అవి 'అభివృద్ధి' నినాదం ఇస్తున్నాయి. బి.జె.పి. పార్టీ కార్పొరేట్ కంపెనీల నుండి (దీంట్లో బ్యాంకులకు ఋణాలు ఎగగొట్టిన కంపెనీలు కూడా ఉన్నాయి) 900 కోట్ల రూపాయల చందాలు వసూలు చేసుకున్నది. ఇవి బహిరంగంగా తెలిసినవి మాత్రమే.

బి.జె.పి. పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, చత్తీష్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్రాలలో భారీ అవినీతి కుంబకోణాలు జరిగాయి. మధ్యప్రదేశ్‌లో వ్యాపం కుంబకోణం జరిగింది. 50 మంది సాక్షులను హత్య చేశారు. దానికి అతీ, గతీ లేదు. గుజరాత్‌లో మాజీ ముఖ్యమంత్రి అనందీబేన్‌పటేల్, ఇతర మంత్రులు అవినీతి కుంబకోణాల్లో కూరుకుపోయారు. దానిని పక్కదాని పట్టించేందుకే విజయ్‌రూపానిని ముఖ్యమంత్రిని చేశారు. అమిత్‌షా కొడుకు జయషా వ్యాపారం కోట్ల నుండి, వేల కోట్ల వరకు తక్కువ సమయంలో పెరిగిపోయింది. నిత్యం నీతుల గురించి కబుర్లు చెప్పే మోడీ హిమాచల్‌ప్రదేశ్ కాంగ్రెస్‌లో సుఖరామ్, అతని కొడుకును బి.జె.పి.లో చేర్చుకున్నాడు. ఉత్తరాఖాండ్‌లో విజయ్‌బహుగుణానీ, ఉత్తరప్రదేశ్‌లో రీటా బహుగుణాన్ని బి.జె.పిలో చేర్చుకున్నారు. గోవా, మణిపూర్‌లలో తక్కువ సీట్లు వచ్చినప్పటికీ ఎమ్.ఎల్.ఎ.లను కొనుగోలు చేసి ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. బీహార్‌లో కొనసాగుతున్న ప్రభుత్వాన్ని కూల్చి, అవకాశవాద పొత్తులతో, జనతాదళ్ యునైటెడ్‌తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు.

గో రక్షణ పేరుతో ముస్లింల మీద, దళితుల మీద, క్రిష్టియన్‌ల మీద దాడులు, హత్యలు పెరిగిపోయాయి. బలవంతపు మత మార్పిడీలు నిత్యకృత్యమయ్యాయి. యూనివర్సిటీలలో వి.సి.లను మార్చి, తమకనుకూలమైన వారిని నియమించుకుంటున్నారు. డిల్లీ, కలకత్తా, హైదరాబాద్, పూణే, చెన్నై లాంటి చోట్ల ఎ.బి.వి.పి. తరపున అధికారులు, పోలీసులు కలిసి ప్రగతిశీల విద్యార్థుల మీద అణచివేతను ప్రయోగిస్తున్నారు. బెనారస్ యూనివర్సిటీలో పితృస్వామ్య పోకడలతో విద్యార్థినీల మీద అణచివేతను కొనసాగిస్తున్నారు. మత మౌఢ్యాన్నీ, మూఢ విశ్వాసాలను ప్రచారం చేయడం, వాటిని విమర్శించిన వారిని దేశద్రోహులని దబాయించడం చేస్తున్నారు. రచయితలు, కవులు, కళాకారుల మీద దాడులు, బెదిరింపులు సాధారణమైపోయాయి. గోవింద్‌పన్సారే, నరేంద్ర దభోల్కర్, ఎమ్.ఎమ్. కల్బుర్గి, గౌరీ లంకేష్ లాంటి రచయితలను హత్య చేశారు. మరెంతో మందిని బెదిరిస్తున్నారు.

ఎన్‌కౌంటర్లు చేయించిన అమిత్‌షా మీద, ఎన్‌కౌంటర్లు చేసిన పోలీసు అధికారుల మీద కేసులు ఎత్తివేశారు. ఆ అధికారులను సర్వీస్‌లోకి కూడా తీసుకున్నారు. నరేంద్రమోడీ మొదలుకొని అమిత్‌షా, బి.జె.పి.లోని ముఖ్యమంత్రులు చట్ట వ్యతిరేకులుగానూ, రాజ్యాంగ వ్యతిరేకులుగానూ, ప్రజావ్యతిరేకులుగానూ ఉంటూ, సామ్రాజ్యవాద సేవకులుగా కొనసాగుతున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. వారికంటే కూడా నీచంగా సామ్రాజ్యవాద అనుకూల టెర్రరిస్టులుగా బి.జె.పి. పార్టీ వ్యవహరిస్తుంది. ఒకవైపున వారు అసభ్య, అశ్లీల సినిమాలకు అనుమతిస్తూ, మరోవేపున తమిళ సినిమా మెరిసెల్, పద్మావతి లాంటి సినిమాల మీద అణచివేతను ప్రయోగిస్తున్నారు. పద్మావతి సినిమాలో నటించిన "దీపికా పదుకొనే తలను నరికితెస్తే 10 కోట్లు ఇస్తానని" హర్యానా బి.జె.పి. నాయకుడు సూరజ్‌పాల్ ప్రకటించాడు. ఈ విధంగా అన్ని రంగాల ప్రజానీకం మీద మోడీ ప్రభుత్వం ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దాడులను తీవ్రతరం చేసింది. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, హర్యానా, రాజస్థాన్, చత్తీష్‌గఢ్ లాంటి బి.జె.పి. పాలిత రాష్ట్రాలలో రైతులు ఉద్యమించారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో దళితులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దేశ వ్యాపితంగా కార్మికులు, బ్యాంక్ ఉద్యోగులు, రైల్వే కార్మికులు సమ్మెలు చేశారు. విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు, శాస్త్రవేత్తలు కూడా ఉద్యమబాట పట్టారు. చివరికి ఒక ర్యాంక్, ఒక పెన్షన్ డిమాండ్‌తో మాజీ సైనికులు కూడా చాలా కాలం ఉద్యమం చేశారు.

ప్రధాన ప్రతిపక్ష పార్టీలు, రివిజనిస్టు పార్టీలు కూడా ఇవే విధానాలను, వారు అధికారంలో వున్నప్పుడు అమలు జరిపారు. బి.జె.పి. ఫాసిస్టు పద్ధతులకు, దాని పరిపాలనకు వ్యతిరేకంగా నిర్మాణాత్మక కార్యక్రమం వీరి వద్ద కూడా లేదు. ఎన్నికల సమయంలో ఒకరి మీద ఒకరు తీవ్ర స్థాయిలో నిందారోపనలు చేసుకోవడం, ఎన్నికల తర్వాత అలాయ్, బలాయ్ తీసుకోవడం చేస్తున్నారు.

అందువలన మొత్తంగా చూసినప్పుడు దేశంలో అమలు జరుపుతున్న ఈ విధానాలు గతంలో పెట్టుబడిదారీ దేశాల్లో అమలు జరిపి, విషమ ఫలితాలు చవి చూశారు. ఆ సమాజాలలో సంక్షోభాలు తీవ్రస్థాయికి చేరాయి. నేటి పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థ చరమ దశకు చేరింది. దాని అభివృద్ధి ఆగిపోయింది. నేడు సామ్రాజ్యవాదం ద్రవ్య పెట్టుబడి రూపంలో విధ్వంసకరమైన విధానాలను అమలు జరుపుతున్నది. పునాదిలో అమలు జరుగుతున్న ఈ విధానాల వలన ఉపరితలంలో వున్న రాజకీయాలు, సంస్కృతి, విలువలు భ్రష్టు పట్టి పోయాయి. అమెరికాలో నేడు జరుగుతున్న ఉన్మాదపు చర్యలు, మనం చూస్తూనే వున్నాం. మనుషులను రోబోట్‌లుగా మార్చి, లాభాలను సంపాయించు కోవాలనే ఆలోచనతో, సామ్రాజ్యవాదం సమాజాన్ని పతనపు అంచుల్లోకి తీసుకెలుతున్నది. నేడు ఉత్పన్నమైన సమస్యలు పరిష్కరించగలిగే స్థితిలో పెట్టుబడిదారీ విధానం లేదు. ఇక సమాజాన్ని ముందుకు నడించగలిగే స్థితిలో లేదు. అందువలననే

35వ పేజీలో...

## నేను గెరిల్లానెందుకయ్యానంటే?



# వాళ్ళిప్పుడు హుందాగా తమ తలలు పైకెత్తి నిఠారుగా నిల్చున్నారు

# వాళ్ళే ప్రజా గెరిల్లాలు

ప్రతిరోజు ఉదయం నిద్రలేవగానే కళ్ళముందు బాక్సైట్ కొండలు, ఆ పక్కనే పారే పెద్ద నీటి కాలువ, నీటి కాలువకు అందుబాటులో పంటపొలాలు, వీటన్నింటి మధ్యలో మాది ఓ చిన్న గూడెం. దాని పేరే 'ఒంద్రె' అని పిలుస్తారు. విశాఖ జిల్లాలోని, నొర్మతి పంచాయితీలో అనేక గ్రామాలలో మాదొకటి. అమ్మనాన్నలిద్దరూ వ్యవసాయంతో పాటు, కూలీ పనులు చేస్తారు. ఇంచు, మించు మా పొలం 8 ఎకరాలు ఉంటుంది. అయితే ఇది గరువు కావడంతో పంటలు సరిగా పండేవి కావు. మా తాత కష్టపడి బండరాళ్ళను తొలగించి, బీడు బారిన భూమిని సాగులోకి తెచ్చాడని నాన్న అంటుంటాడు. ఆ ఎనిమిదెకరాల భూమినే నాన్న, తన అన్నలిద్దరు ఎవరికి చేతనైనంత భూమిని, వాళ్ళు చేసుకునేవాళ్ళు. ఈ ముగ్గురన్నలకు ఓ చెల్లి. వారు సంపాదించిన దాంట్లో ఎంతో కొంత చెల్లికి సహకరిస్తేనే వీరికి తృప్తి. నాన్నకి చిన్నతనంలోనే తల్లిదండ్రులు కన్ను మూయడంతో, వాళ్ళకు వాళ్ళుగానే పని చేసుకొని, దొరికిన దాంట్లో నలుగురు సర్దుకునేవారంట. వాళ్ళు పెరిగి పెద్దాయాక "ఊరి పెద్దమనుషుల సహకారంతో, పెళ్ళిళ్ళు చేసుకొని ఓ ఇంటివాళ్ళమయ్యాం" అని ఒకానొక సందర్భంలో నాన్న చెప్పిన విషయమే.

మా అమ్మానాన్నలకు మేము మొత్తం ఆరుగురం. మమల్ని సాకడమే కాకుండా 7 గొడ్లు, 5 మేకల పోషణ కూడా చుసుకునే వాళ్ళు. నేను పుట్టగానే మా కువ్వి ఆచారం ప్రకారం పండగ చేసారంట. పుట్టిన దినం ఎలాంటిదో చూసి, పెద్ద వయస్సు గల ముసలమ్మ 'సొన్నాయి' అని నాకు పేరు పెట్టిందంట. నా చిన్నప్పుడే అమ్మనాన్న పనికి పోతే, అక్కే నన్ను చూసుకునేదంట. నాకు కొద్ది వయస్సు రాగానే, అమ్మనాన్నలతో పనికి పోయేదాన్ని. అయితే మా జీవితాలు బాక్సైట్ కొండలంత అందంగా, పారే పెద్ద నీటి కాలువంత హాయిగా సాగలే. నిరంతరం జ్వరాలు, మునుసబుల బెదిరింపులు, పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యలు వెంటాడాయి. ఇంట్లో సంఖ్య పెరగడంతో, ఆదివాసీ ఇళ్ళలో సహజంగానే దరిచేరే ఆకలి సమస్య, మా కుటుంబాన్ని కూడా రుచి చూసింది. ఇంటిల్లిపాది ఎంత కష్టపడ్డప్పటికీ, వచ్చే పైసలు దేనికి చాలేవికాదు. వచ్చే పంటనంతా నాన్న షావుకార్లకు అమ్మి పైసలు తెచ్చేవాడు. ఆ పైసలు మా అవసరాలను తీర్చకపోగా, వాటిని పాత అప్పులు తీర్చేందుకు ఇచ్చేవాడు. "సోళ్ళు, గొచ్చకందులు, ధాన్యం ప్రతి ఏడు వాడికే అమ్ముతున్నావ్, పంట ఎంత బాగా పండినా పైసలు మాత్రం కనిపిస్తలేవు. మందుల పైసలనీ, విత్తనాల పైసలని తిరిగి ఆడికే ఇస్తున్నావ్. రోజు తినే కూరగాయలు కూడా పిల్లలకు ఒండిపెట్టుకోకుండా పైసల కోసం కక్కుర్తిపడి వాడికే ఇస్తున్నాం. ఎంత కష్టంజేసిన మన బతుకు ఇంతే, షావుకారిని మార్చయ్యా" అని అమ్మ బాధతో నాన్నకు చెప్పింది. "పొలంలో చూస్తే 5 కిలోల బస్తా, వాడు కొలత బెడితే మూడున్నరే తూగుతుంది. సరిగ్గా కొలవమంటే 'ఒరేయ్ ఎవడు ఒక్కమాట ఎదురు మాట్లాడరు, నన్నే తప్పుబడుతావురా' అంటూ నాగుపాములాగా బుసగొడతాడు. వీడికి కాకుండా వేరే వాడికిస్తే వాడితో కొట్లాట, అందరం కలిసి నిలదీద్దామంటే ఎవరికి దమ్ము లేకపాయే. మన మెక్కరం ఏం జెస్తం" నిస్సహాయంతో నాన్న జవాబు. ఏది ఏమైనప్పటికీ ఆదివాసీ గొంతు దాహం తీర్చే జావ (రాగులతో చేసిన అంబలి)మాత్రం ఎప్పుడు ఇంట్లో తగ్గనిచ్చేది కాదు మా అమ్మ. ఏ స్థితిలోనైనా ఒక బోర(చేయి సంచి) సోళ్ళు ఇంట్లో వుండటం పరిపాటి.

ఊరందరిపై పెత్తనం చేసే రామారావు అనే మునసబు మాకు మాత్రమే శత్రువు అనుకునే దాన్ని. కానీ కొద్ది రోజులకే తెలిసింది

---

34వ పేజీ తరువాయి...

ఒకప్పుడు మద్ధతు తెలిపిన శాస్త్రవేత్తలు కూడా నేడు అమలు జరుపుతున్న అభివృద్ధి మోడల్‌ను వ్యతిరేకిస్తూ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలోకి వస్తున్నారు. కాబట్టి పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయం సోషలిజమే.

నేడు సి.పి.ఐ. మావోయిస్టు పార్టీ దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజాన్ని నిర్మించి, కమ్యూనిజం వైపుగా లక్ష్యాన్ని పెట్టుకొని పురోగమిస్తున్నది. దానిలో భాగంగానే నేడు చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఎ.ఒ.బి.లాంటి ప్రాంతాల్లో జనతన సర్కార్లు నిర్మించి, పార్లమెంటరీ నియంతృత్వానికి ప్రత్యామ్నాయంగా, వీటిని నిర్మాణం చేసి పురోగమిస్తుంది. వీటికి అండగా మిగతా ప్రాంతాలలో, గెరిల్లా జోన్‌ల నిర్మాణం చేసి, దోపిడీ వర్గానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది. కాబట్టి, పీడిత ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గం, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడమే. అందువలన దేశభక్త ప్రజలందరూ, తమ తమ రంగాలలో సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలను, భూస్వామ్య, దళారీ బూర్జువా పాలక వర్గాలకు వ్యతిరేకంగా ఆందోళనలను తీవ్రతరం చేయాలి. దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థను నిర్మించేందుకు కలిసి రావాలి. ✦

ఊరందరికీ శత్రువేనని. వర్షాలు పడి పంటలు ఓ కొలిక్కొచ్చాయి. ఒకరోజు అమ్మ నాన్నకి వేడి వేడి జావ పోస్తూ "ఈ ఏడు పంటలు ఏ పురుగు బారిన పడలే, కిందటి ఏటికన్న దిగుబడి ఏక్కువే వస్తాయి. మంచి షావుకారికి పంటలమ్మి, అప్పులు తీర్చి, మరో రెండు గొడ్లు కొందాం" అనడం నా వయస్సుకి సరిగా అర్థం కాలేదు కానీ, రోజు గొడ్లు కాసే అక్క కేరింత ఆగలే. నిద్ర లేచి తోటి గొడ్ల జతగాళ్ళకి చెప్పాకగానీ మనస్సు స్థిమిత పడలేదు అక్కకి. మునసబు బెదిరింపులు రోజు రోజుకి పెరిగిపోవడంతో, నాన్న ఇంట్లో నిరంతరం వాడి గురించే ఆలోచించేవాడు. గత 2 సంవత్సరాల నుండి వున్న వీడి బెదిరింపులు, ఈ ఏడు ఉధృతమయ్యాయి. కష్టపడి పండించుకునే మా పంట వాడికంటికి యావగింపుకాలే. ఎన్నోసార్లు నాన్నని ఏదో ఒంక పెట్టుకొని బెదిరించేవాడంట. ఈ సారి బెదిరింపుకు వాడు చంపుతాడేమోననీ, నాన్న ఆందోళన పడి, ఈ విషయాన్ని అమ్మతో చెప్పాడు. అమ్మ మాత్రం నాన్నకు ధైర్యం చెప్పడం నాకు గుర్తున్నది. అప్పుడు నాకు 7 సంవత్సరాలనుకుంటా. ఈ విషయాలను వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుంటే వినేదాన్ని, కాని ఏమి అర్థం కాకపోయేది. వాడు మమ్మల్ని ఏడిపిస్తున్నాడని మాత్రం అర్థం అయ్యేది. 'అక్కా! రామారావు వచ్చినప్పుడు నీవు, నేను, తముళ్ళు అందరం కలిసి కొడదామక్కా' అని తనతో అన్న మాటలను అమ్మతో చెప్పి నవ్వుకునేవాళ్ళు. రోజులు గడుస్తున్న కొద్దీ రామారావు బెదిరింపులు ఎక్కువయ్యాయి. పొలం విడిచి పెట్టమని, నాన్నని నిరంతరం ఇంటిదగ్గర, పొలం దగ్గర వేదిస్తూనే ఉన్నాడు. పెద్దన్నాన్నలిద్దరూ మాత్రం వాడికి భయపడి పొలంకి వెళ్ళడమే మానేశారు. ఓ రోజు అందరం పొలం పనులలో లీనమైవున్నాం. ఎప్పుడొచ్చాడో తెలియదు కానీ, కత్తితో నాన్న దగ్గరగా వెళ్ళి గొంతుపై కత్తి పెట్టాడు. అమ్మ పరుగెత్తి అడ్డంగా నిలబడింది. దూరం నుండే మేము ఏడుపు లంకించుకున్నాం. "ఒరేయ్ కొద్దిలో బతికిపోయావ్, అయినా నీ అన్నలకు లేని దురుసు నీ కెందుకురా! ఊర్లో వుంటే నీవైనా ఉండాలి, నేనైనా వుండాలి. తేల్చుకో" అని గాంభీరంగా అరిచి వెళ్ళిపోయాడు. ఆ రోజు రాత్రి అమ్మ నాన్నలకు నిద్రలేదు. తమ్ముళ్ళు, చెల్లి నిద్రపోతున్నారు. నేను, అక్క మాత్రం పడుకొని వాళ్ళు చర్చించుకునే విషయాలకు చెవులు రిక్కించి వింటున్నాం. "ఉదయం కొద్దిసేపట్లో ఆ కత్తి వేటు నీ గుండెల్లోకి దూసుకుపోయింటే? మా పరిస్థితి ఏమిటి? పిల్లలు నేను ఏమైపోయేవాళ్ళం, మాకు దిక్కెవరు? ఒద్దయ్యా! ఒక్క క్షణం కూడా ఈ ఊర్లో వుండొద్దు. బతికుంటే మరేచోటుకైనా పోయి బతకొచ్చు. ప్రాణం మీదకొచ్చాక కూడా ఇక్కడుండటం దేనికి. మేమక్కడ లేకుంటే వాడు కచ్చితంగా నిన్ను చంపేసేవాడు. ఊరోళ్ళు ఒక్కరు కూడా వాడికి ఎదురు మాట్లాడరు. వాడు ఆడిందే ఆట, పాడిందే పాట. నీవు మాటకు మాట బదులిస్తావని వాడికి నీపైన ఇంకెక్కువ కోపం. నీవేం ఆలోచించినా మనం ఎల్లిపోవడం ఖాయం" అని అమ్మ తన మనస్సులోని ఘర్షణను, కడుపులోని బాధను నాన్న ముందు కక్కేసింది. మౌనంతో వున్న నాన్న, రెండు గంటల అమ్మ వలపోతకు సమాధానం ఏమి చెప్పలేదు. వారిద్దరి మధ్య కాసేపు మౌనం. "సమయం 12 అవుతుంది పడుకో" అని అక్క నుండి ఆంక్ష జారి. వాళ్ళను చూస్తూ ఎప్పుడు పడుకున్నానో నాకు గుర్తులేదు. తెల్లవారగానే నాన్న ఊళ్ళోకి వెళ్ళి, మధ్యాహ్ననానికి ఇల్లు చేరుకున్నాడు. "సామాను అంతా సర్దు, రేపే మన ప్రయాణం" అన్నాడు. అమ్మ మాత్రం ఇప్పటికైనా నాన్న నిర్ణయం మార్చుకున్నందుకు సంతోషపడింది. నాన్న మాటైతే అన్నాడు గానీ, తను పుట్టిన ఊరు, కష్టపడి పంట పండించిన భూమి, వాళ్ళ అమ్మనాన్నలు కట్టిన ఇల్లు వీటన్నింటితో సంబంధం తెంచుకోవడానికి పరిపరి విధాల ఆలోచిస్తుండు. పొద్దుపోయింది, అమ్మ మాకు తిండి పెట్టి పడుకోబెట్టింది. తెల్లారి లేచే సరికీ, అమ్మ సామానంతా సంచుల్లో మూటలు గట్టిపెట్టింది. "పొద్దుపోయే కొద్ది ఎండ పెరుగుతుంది, పిల్లలు నడవలేరు, నీవు జావ తాగితే బయల్దేరుదాం" అని అమ్మ నుండి మాటలు. నాన్నకి తన మాటలేమి పట్టలేదు. తడక దగ్గరికెళ్ళాడు. లోపలవున్న గొడ్లు, మేకలు నాన్నని చూసి, మేపడానికి తీసుకుపోతాడన్నట్లుగా అరవడం ప్రారంభించాయి. తలపై చేతితో వాటిని దువ్వుతూ, తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకొని, చిన్న మేకపిల్లలను ఎత్తుకొని ముద్దాడి చివరిసారి అన్నట్లుగా, వాటిని విడిచిపెట్టి, వెనుదిరగకుండా కదిలాడు.

సాయంత్రం చీకటి అప్పుడప్పుడే అలుముకుంటుంది. ఎప్పుడో బయల్దేరిన మాకు, నడిచే ఓపిక నశించింది. తమ్ముళ్ళకు, నాకు నడిచే శక్తి లేదు. మా నడక ఆగిపోయే సరికి అందరం ఆగాం. పక్కనే పారే నీళ్ళ శబ్దం పసిగట్టిన నాన్న నీళ్ళు తీసుకొచ్చాడు. ఆకలితో వున్న మేము కడుపునిండా నీళ్ళు తాగి, నడక కొనసాగించాం. పిట్టల అరుపులు, మా నడక శబ్దం తప్ప ఇంకేమి వినబడటం లేదు. అర్ధరాత్రి 12 గం॥ సమయానికి ఒక ఊరు చేరుకున్నాం. ఓ ఇంటి ముందు ఆగగానే అలసిపోయి ఉండటంతో, క్షణంలోనే నిద్రలోకి జారుకున్నాం.

'చిన్నగొంది' ఊరు మాకు సుపరిచితమే. అది చిన్నమ్మ(అమ్మ చెల్లి) వాళ్ళ ఊరు. మేము ఉన్నది కూడా చిన్నమ్మవాళ్ళ ఇంట్లోనే. అమ్మ, నాన్న, అక్క కూలీ పనులకు వెలుతుండేవారు. ఎప్పటిలాగే నా పని తమ్ముళ్ళు, చెల్లివాళ్ళ కాపలా. అమ్మ తోబుట్టువు కాబట్టి చిన్నమ్మ బాగా చూసుకునేది. తను లేని సమయంలో వాళ్ళ అత్త, మామలు సూటిపోటి మాటలనేవాళ్ళు. ఏమనలేక ఏడ్చేవాళ్ళం. వాళ్ళు పళ్ళెంలో పెడితేనే తిండి. ధైర్యంగా పెట్టుకొని తినే అనుకూలత లేదు. చాలా సార్లు అమ్మ కూలీ పనిదగ్గర నుంచి కాల్చి తెచ్చిన దుంపలతో, ఆకలి తీర్చుకునేవాళ్ళం. అర్ధాకలితో రోజులు కొట్టుమిట్టాడుతున్నాయి. అప్పుడే సంవత్సరం గడిచిపోయింది. చిన్నమ్మవాళ్ళ ఇంట్లో వుండటం కష్టంగా మారింది. ఎదిగే వయస్సులో వున్న మాకు, వాళ్ళ అత్త కొసిరి కొసిరి ఇచ్చే తిండి ఏ మాత్రం సరిపోయేది కాదు. రాత్రి పూటైతే అమ్మకు పెట్టిన తిండిలో నేను, చెల్లి కలిస్తే, నాన్నకు పెట్టిన తిండిలో తమ్ముళ్ళు కలిసే వాళ్ళు. ఎన్ని రోజులని పక్కవాళ్ళ భూమిలో పని చేస్తాం? ఎలాగైనా భూమి సమస్య తీర్చుకోవాలనే ఆలోచన నాన్నలో పట్టుదలను

పెంచుతున్నది. అమ్మకు కూడా ఇక్కడుండటం ఏ మాత్రం ఇష్టం లేదు.'చాలా సంవత్సరాల నుండి ఆ చుట్టపక్కల గ్రామాలన్నీ పార్టీ ప్రభావం వున్న గ్రామాలంట. ఇక్కడి ప్రజల క్షేమం కోరి, అనేక మంది మునసబుల దగ్గర భూములు లాక్కొనీ, భూమిలేని మా లాంటి పేద ప్రజలకు పంచారంట, ప్రతి ఊర్లో సంఘాలున్నాయంట' ఈ విషయాలన్ని నాన్న ఊరోళ్ళని కలిసాక అమ్మతో పంచుకుంటుంటే విన్నాను. ఓ రోజు "ఎదిగే పిల్లలకు కడుపునిండా తిండి పెట్టలేని దరిద్రులం, ఎన్ని రోజులని ఇట్లుందాం, సంఘంమోళ్ళనడిగి, ఓ సొంత గుడిసె వేసుకుందాం" అని అమ్మ చెప్పిన మాటలు నాన్నని ఆలోచింపజేశాయి. ముందు ఇక్కడి నుండి ఎలాగైనా బయటపడాలనే దానితో పక్కనే వున్న ఊరికి వెళ్ళాం.

'సంపెగొంది' ఊరు చిన్నమ్మ వాళ్ళ ఊరికి 2 కి.మీ దూరంలో వుంటుంది. రోడ్డు పాయింట్ గల గ్రామం. పొద్దున లేస్తే ఏ పనికైనా సంపెగొందికి వెళ్ళాల్సిందే. చిన్నమ్మవాల్ల ఊరు వచ్చినప్పటి నుండే, సంపెగొంది గ్రామస్తులతో పరిచయాలతో పాటు, స్నేహ సంబంధాలు ఏర్పడ్డాయి. నాన్న సంఘంవాళ్ళకు మా పరిస్థితి వివరించి, మొదట ఇల్లు ప్రస్తావన తెచ్చాడు. సంఘంవాళ్ళ గ్రామస్తులతో చర్చించి, ఓ చోట స్థలం చూపించారు. మాతో పాటు సంఘసభ్యుల సహకారంతో, వారం తిరక్కుండానే గుడిసె పూర్తయ్యింది. గుడిసెలోకి మకాం మార్చాం. ఇక నుండి అమ్మ, నాన్న ప్రతి రోజు 'భూమి' గురించే వాళ్ళ చర్చంతా. ఎంతో కొంత కూలీ డబ్బులకు తోడు అప్పు చేసి 3 గొడ్లు కొన్నాడు నాన్న. వాటి కాపలా నావంతయ్యింది. నా ఎక్కువ సమయం వాటితోనే గడుస్తుంది. అనుకోకుండా ఒకరోజు 'ఒండ్రె' నుండి కబురొచ్చింది. "మీ చిన్నన్నయ్య చనిపోయాడు" అని వచ్చిన వ్యక్తి చెప్పగానే నాన్న ముఖం ఎర్రబడింది. అమ్మ కళ్ళలో నీళ్లు. వెంటనే అక్కని తీసుకొని పయనమయ్యారు. నడవడానికి ఇబ్బందవుతుందని మమ్మల్ని తీసుకెల్లలేదు. అంత్యక్రియలు ముగించుకొని, మరుసటి రోజు సాయంత్రానికి ఇంటికొచ్చారు. ఇంట్లో అడుగు పెట్టారో లేదో, అక్కని బయటికి తీసుకెళ్ళి, 'అక్క పెదనాన్న ఎలా చనిపోయాడని' అడిగా. "ప్రతి ఏటా మన్యాన్ని పీడించే విష జ్వరం పెదనాన్నను మింగేసింది. గత 4, 5 సం॥రాల నుండి దగ్గు, దమ్ముతో నిరంతరం బాధపడుతుండేవాడు. నెల రోజుల నుండి జ్వరంతోనే వున్నాడంట. దవాఖానాలకు చూపించేంత ఆర్థిక స్తోమత, మనలాగే పెద్దమ్మకు లేదు. పాపం ఆమె మాత్రం ఏం చేయగలదు. పెద్ద పెదనాన్న (గురుమయ్య) చెట్ల మందులు ఇచ్చాడంట. అయినా లాభం లేకపోయింది. పెద్దనాన్న ఒక్కడే కాదు. తనలాంటి ఎంతో మందిని ఈ మాయదారి విష జ్వారాలు గూడేలకు గూడాలనే మింగేస్తాయి" అని అక్క చెప్పగానే నాకు ఈ మధ్య గొడ్ల దగ్గర పరిచయమైన సూరిగాడు చెప్పిన మాట గుర్తొచ్చింది. 'అక్కా! మొన్న సూరిగాడి అమ్మకు జ్వరం వస్తే ఎవరో దళం వాళ్ళంట, ఆమెకు మందులిచ్చి తగ్గించారంట. పెదనాన్నకి కూడా వాళ్ళతో మందులిప్పిస్తే బతికేవాడు కదక్కా!' అని నేననగానే అక్క "కానీ ఒండ్రెకి దళం పోదు. అక్కడ పెదనాన్న ఇచ్చే చెట్ల మందులే అందరికీ అలవాటు" అంది. 'మరీ సూరిగాడు పాడే దళం పాటలు కూడా బాగున్నాయక్కా అసలు దళం అంటే ఏమిటి? వాడు చెబితే ఏం అర్థం కాలేదు' అన్నాను. నా ప్రశ్నకు చాలా వివరంగా "మనలాంటి పేద జనాల కోసం మాత్రమే పని చేసే మనుషులంట. తల్లితండ్రులు, బంధుమిత్రులు, ఆస్తులు.... సర్వస్వం వదులుకొని, మనలాంటి ప్రజల కోసం పోరాడతారంట. మన సొంతూరు రామారావులాంటి వాళ్ళు ప్రజలను దోపిడీ పీడనలకు గురిచేస్తుంటే, ప్రజల తీర్పుపై ఆధారపడి, వాళ్ళనూ అక్కడనుండి ఎళ్ళగొట్టడమా, చంపడమా చేస్తారంట. ఈ ప్రాంతంలో కూడా చాలా మంది మునసబుల భూములు లాక్కొని, భూమిలేని మనలాంటోళ్ళకు పంచారంట. ఈ పనులన్నింటిని ప్రజల చేతనే చేయిస్తారంట. అందుకు ప్రజల్ని సంఘాలుగా పెడతారంట" అంటూ పని దగ్గర తన దోస్తు చెప్పిన విషయాలను పూస గుచ్చినట్లు చెప్పింది. అంతేకాదు మనకు గుడిసె జాగ ఇచ్చింది కూడా సంఘంవాళ్ళేకదా!" అంటూ తుర్రున అమ్మ కేకతో ఇంట్లోకెళ్ళింది అక్క. అంటే సూరిగాడు చెప్పే దళం, మాకు గుడిసె ఇచ్చిన సంఘం, అందరూ మా లాంటి పేదవాళ్లకోసమే పని చేస్తారన్నమాట.

తోటివాళ్ళందరూ స్కూల్‌కి వెలుతుంటే నేను కూడా వెళ్ళా. స్కూలుకి వచ్చే మాస్టరు మాత్రం 10 రోజులకో, 15 రోజులకో వస్తాడు. దీని కన్న కాఫీతోటల కూలీపనీ, జతగాళ్ళతో గొడ్లకాపు మంచిదనిపించింది. అక్కతో పాటు కూలీ పయనం కొనసాగించాను. అనుకోకుండా తమ్ముడికి జ్వరం రావడంతో మళ్ళీ గొడ్లు కాపు నా వంతయ్యింది. అమావాస్య, పౌర్ణమికి మాస్టరొచ్చి, ఆ గంటసేపు చెప్పే సదువుకన్నా గొడ్లు, మేకలు, మా జట్టులో పాడే దళం పాటలు, బిడిగిలపై గోటీలాట, అన్నింటికన్న ఇష్టమైన దళం ఆట (ఒక జట్టు దళం, ఒక జట్టు పోలీసులు అని పిడకలతో కొట్టుకునే వాళ్ళం, చివరికి దళమే గెలిచిందని కేకలేస్తూ నవ్వుకునేవాళ్ళాం) ....వీటన్నింటితో పొందే సంతోషమే తృప్తిగా అనిపించేవి.

ఇప్పటికీ 2, 3 సార్లవుతుంది. అమ్మ నాన్నలతో పాటు అక్క కూడా రాత్రి 12, 1 గంటకు అనగా ఇంటికొస్తుంది. ఏమి అర్థం కాలేదు. మమ్మల్ని చిన్నోళ్ళని వదిలి వెలుతున్నారు. అమ్మనాన్న మాత్రం ఎక్కడికెలుతున్నారో మా చెవిన పడనీయడంలేదు. తెలుసుకోవాలనే ఆరాటం నాలో రోజు రోజుకు పెరిగిపోతుంది. ఓ రోజు అక్కనడిగా. 'మమ్మల్ని వదిలేసి ఎక్కడికెలుతున్నారక్కా' అని. "దళం వాళ్ల మీటింగ్‌కి వెళ్ళాం. కాఫీ తోటలు మన ఊర్లోనే కాదు, చట్టుపక్కల అన్ని ఊర్లలో ఉన్నాయి. నీవు గొడ్ల కాపుకు వెల్లనప్పుడు మనిద్దరం కాఫీ తోటలో పని కెళ్ళాం. గుర్తుందా! ఆ కాఫీ తోటల గురించే మీటింగ్. రెండు రోజుల నుండి ఊర్లో అంతా మీటింగ్ ఎలా జరుగుతుందో అనే ముచ్చట్లే. అయితే కాఫీ తోటలన్నింటిని సర్కార్ చూసుకుంటుంది. ఆ భూములన్ని మన లాంటి ప్రజలవేనంట. మన భూముల్లో మనల్నే కూలీ మనుషులుగా చేసి, వందో, యాబయ్యే మొహాన కొట్టి వేలు, లక్షల రూపాయలను

సర్కారే తింటుందట. అందుకోసం ప్రజలందరూ కలిసి, కాఫీతోటలను దోపిడీ సర్కార్ నుండి స్వాధీనం చేసుకోవాలనీ, అన్ని ఊర్ల ప్రజలు కదిలి కాఫీ తోటలను దక్కించుకునే వరకు పోరాడాలని చెప్పారు. ఎంత మంది జనాలో తెలుసా! 2, 3 వేలు వుంటారేమో. ఇంకా మనల్ని దోపిడీ సర్కార్ ఏ విధంగా మోసం చేస్తుందో చాలా వివరంగా చెప్పారు" అంటూ వెళ్ళిపోయింది అక్క. ఊరోళ్ళ దగ్గర కూడా ఇవే గుసగుసలు. యధావిధిగా అప్పుడప్పుడు రాత్రుళ్ళు దళం వేసే సమావేశాలకు అమ్మ నాన్నవాళ్ళు వెళ్తొస్తున్నారు. మమ్మల్నయితే తీసుకెల్లడం లేదు. బహుశా మేము చిన్నవాళ్ళమని కావచ్చు. గ్రామంలో మాత్రం రోజురోజుకు వాతావరణం వేడెక్కుతూ వచ్చింది.

సంపెగొందికొచ్చి సంవత్సరం గడుస్తుంది. భూమి సమస్య మాత్రం తీరలేదు. ఎవరో తనకు తెలిసిన వ్యక్తి దగ్గర కౌలుకు భూమి తీసుకొని పని చేస్తున్నాడు నాన్న. కానీ దానిలో లాభం రాకపోగ మేమే నష్టపోతున్నాం. దాంట్లో పండే పంటకు అప్పు చేయక తప్పలేదు. ఇంటిల్లిపాది అదే పొలంలో కష్టపడ్డప్పటికీ ఫలితం లేకుండా పోయింది. భూమి లేదనే బాధ ప్రతి రోజు కలవరపెట్టేది అమ్మనాన్నలని. ఇదే విషయం ఇద్దరు రోజూ చర్చించుకుంటున్నారు. "ఇంకెన్ని రోజులు పక్కోళ్ళ దగ్గర పని చేస్తాం, పరాయి పొలంలో పంట పండించిన లాభం వుంటలేదు. ఎలాగైనా మనం సంఘంవాళ్ళని భూమి అడుగుదాం" అనే నాన్న మాటలతో ఇద్దరూ ఊరోళ్ళతో పాటు, సంఘంసభ్యులను కలిశారు. నెల తిరక్కుండానే గ్రామస్తులతో పాటు, పార్టీతో చర్చించి కాఫీ తోటల పక్కనే 3 ఎకరాల భూమి చూపించారు సంఘంవాళ్ళు. అమ్మానాన్నల సంతోషానికి అవదుల్లేవ్. అంతగా సంతోషపడ్డారు భూమిని చూసి.

దళ మీటింగులు ముందుకన్న పెరిగాయని, అమ్మనాన్నల అర్థరాత్రి రాకను బట్టి అర్థమయ్యాయి. గత నెల రోజుల నుండి పోలీసులు ఉదయనే ఊర్లోకొస్తున్నారు. ఇళ్లళ్లోకి చొరబడి, తేరిపారా చూస్తున్నారు. అందరిలాగే మా ఇంట్లోకి రావడం, వెతకడం చేస్తున్నారు. దళం మీటింగులు చేస్తున్నందుకే కావచ్చేమో, మరి ఇంట్లో ఎందుకు వెతుకుతున్నారో అర్థం కాలేదు. జ్వరం రావడంతో వారం రోజుల నుండి ఇంటిదగ్గరే వున్న. నాకు ఇలా ఎందుకు జరుగుతుందో తెలుసుకోవాలనిపించింది. ఇప్పుడెలా? వెంటనే సేతు గుర్తొచ్చింది. ఆ గ్రామంలో సేతు నాతో బాగా జతయ్యింది. దళం విషయాలు తనకు బాగా తెలుసు. పైగా వాళ్ళ నాన్న సంఘంలో వుంటాడంది. ఇంకేమీ ఆలోచించకుండా సేతు వాళ్ళ ఇంటికెళ్ళా. వాళ్ల ఇంటి ముందు వాకిట్లో వంట పనిలో వున్న సేతు, నన్ను చూడగానే చింతచెట్టు కిందకు పరుగెత్తుకొచ్చింది. వెంటనే సేతుని విషయం అడిగా. 'జ్వరంతో పడుకొని వున్న నన్ను, పోలీసులు లేపి మీ ఇంటికి దళం వాళ్ళు వస్తుంటారా, అని అడిగారు. లేదని చెప్పా. ఇల్లంతా గాలించి ఇనపెట్టెలో వున్న అమ్మ చీరలు, మా ఫోటోలు, నాన్న దాచిన కాగితాలు అన్ని తీసి పడేసి, సర్దుకో అంటూ వెళ్ళిపోయారు. చివరిగా మీ అక్క, నీవు మిలీషియాలో పని చేస్తున్నారా! అని అడిగారు, లేదని చెప్పా. అసలు మిలీషియా అంటే ఏమిటి?' అని అడిగా. దానికి సమాధానంగా సేతు "మా నాన్న కూడా పది రోజుల నుండి ఇంటికి రావట్లేదు. మనం స్వాధీనం చేసుకున్న కాఫీ తోటలను రక్షించుకునేందుకు, దళం వాళ్లు ప్రతి ఊర్లో మీటింగులు చేస్తున్నారు. ప్రజలకు వ్యతిరేకంగా వున్న వారిని ప్రజాకోర్టులో పెట్టి శిక్షిస్తున్నారు. ఈ చర్యలు ఎక్కువవ్వడంతో పోలీసుల కదలికలు కూడా గ్యాప్ లేకుండా ఉంటున్నాయి. మాటల్లో నీవు అడిగిన విషయమో మర్చిపోయా. మిలీషియా అంటే గ్రామ రక్షక దళాలు. వాళ్ళు ప్రజలకు అండగా పోలీసులతో లడాయ్ చేస్తారు. దళం వచ్చినప్పుడు వారికి సహకరిస్తారు. మిగతా సమయాల్లో, ఈ పాకెట్‌లోని గ్రామాలలో, ప్రజాసంక్షేమ పనుల్లో పాల్గొంటారు. ముందుండి నిర్వహిస్తారు" అని తను చెప్పిన మాటలు నాలో దళంపైనా, పోరాటంపైనా ఇష్టాన్ని పెంచాయి.

కాఫీ తోటల పోరాటంలో ఈ మధ్య ధర్నాలు, నిరసన కార్యక్రమాలు పెరగడంతో నిత్యం పోలీసుల కదలికలు సాధారణమైపోయాయి. ప్రతి రోజు బూట్ల శబ్దంతోనే ఊర్లు తెల్లారుతున్నాయి. మాది రోడ్డు పాయింట్ గల గ్రామం. కాబట్టి అన్ని బలగాలు మా ఊరికి వచ్చి, బ్యాచీలుగా విడిపోయి, కూంబింగ్‌లు చేయడం, వాపస్ వచ్చి ఇక్కడే కలుసుకొని జీపులలో క్యాంపులకు వెళ్ళిపోతుండేవాళ్ళు. ఈ కార్యక్రమం నిత్యకృత్యమైంది. దీంతో పోలీసులన్నా, వాళ్ళ బూట్ల చప్పుడన్నా ఎవరికి భయం లేకుండా పోయింది.

ఈ క్రమంలోనే ఊర్లో ఒక అమ్మాయిని హోంగార్డు ఎత్తుకెళ్ళి పెళ్ళి చేసుకున్నాడు. ఇది సాకుగా పెట్టుకొని, హోంగార్డు ఊరికి రావడం పెరిగింది. విషయం పసిగట్టిన మిలీషియా, సంఘం దళానికి సమాచారమిచ్చారు. ఆ కుటుంబంతో మాట్లాడతారనీ, రేపే మీటింగ్ అని ఊరంతా పుకారు. రాత్రి 10 గం॥ అవుతుంది. దళం గురించి వినడమే కానీ ఎప్పుడూ చూడలేదు. ఎలాగైనా మీటింగ్‌కి వెళ్ళాలనే నిర్ణయించుకున్నా. అమ్మవాళ్ళు వెళ్ళాక, వారికి కనబడకుండా వెళ్ళా. ఎక్కడో జనాల్లో సేతు దగ్గరికెళ్ళి కూర్చొన్నా. అందరు కూర్చున్న 10 ని॥లకి నల్లని బూట్లు, ముదురు ఆకుపచ్చ డ్రస్, తలపై టోపి, పోలీసుల దగ్గర లాంటి తుపాకీ, వాళ్లకేసే చూస్తున్నా. అంతలో "వాళ్ళే దళం" అని సేతు అనడంతో, నాలో మరింత ఉత్సుకత పెరిగింది. ముందుగా ప్రజలందరికీ హోంగార్డు కుటుంబాన్ని ఎలా అర్థం చేసుకోవాలో దళం కమాండర్ వివరించాడు. ఆ కుటుంబం వల్ల ప్రజలకు చేకూరే నష్టాన్ని, రాజకీయంగా ప్రజలకర్థమయ్యే విధంగా తెలియచెప్పాడు. దీంతో ఆ కుటుంబానికి తమ కూతురుతోనూ, అల్లుడుతోనూ (హోంగార్డు)వుండాల్సిన సంబంధాల గురించి ప్రజలలో బాగా చర్చ జరిగింది. చివరికి ప్రజల అభిప్రాయం మేరకు, గ్రామ ఉమ్మడి ప్రయోజనాల కోసం ఆ కుటుంబం కూతురుతోనూ, అల్లుడితోను (హోంగార్డు) ఎటువంటి సంబంధాలు కొనసాగించకూడదనీ, ఒకవేళ సంబంధాలు కొనసాగితే వీరిని కూడా

గ్రామం నుండి వెళ్ళగొట్టాలని, మీటింగ్‌లో తీర్మాణించారు. ఈ సందర్భంగా 'రచ్చబండ దగ్గర నాన్నవాళ్ళ చిన్నతనంలో ఊరి మునసబు చెప్పిందే వేదం' అని నాన్న చెప్పిన మాట గుర్తొచ్చింది. పార్టీకి, మునసబులకు ఎంత తేడా. అప్పుడర్థమైంది ప్రజల సరైన నిర్ణయాలకనుగుణంగా పార్టీ నిర్ణయముంటుదని. ఆ మీటింగ్‌లో పాల్గొన్న దగ్గర నుండి, వాళ్ళని మర్చిపోలేకపోయా. ఇప్పుడింకా నాకు కచ్చితంగా మిలీషియాలో పని చేయాలనే పట్టుదల గట్టిపడింది.

అమ్మనాన్నవాళ్ళు, అక్కపెళ్ళికి తెలిసిన బంధువుల దగ్గర కల్లు తాగి వచ్చారు. కనీసం అక్కతో మాటైనా చెప్పలేదు. మా కువ్వి తెగ సాంప్రదాయం ప్రకారం పెళ్ళి జరిపించారు. అక్కలాగ మాత్రం పెళ్ళి చేసుకోవద్దని నిర్ణయించుకున్నా. ఇంట్లో వంట, తమ్ముళ్ళు, చెల్లి బాగోగులు నాపై పడ్డాయి. అమ్మనాన్నలు పొలం పనుల్లోనే రోజంతా. అక్క పెళ్ళయి సం॥రం తిరక్కుండానే నా పెళ్ళి ముచ్చట్లు. 16 సం॥ వయసొచ్చిందనీ, నా తోటి వాళ్ళకు పెళ్ళిళ్ళు అయ్యాయని, ప్రతి రోజు ఇంట్లో చర్చే. తెలిసినవాళ్ళే, వరుసకి అత్త, మామలు అవుతారు. వాళ్ళ కొడుకుకు నన్ను ఇవ్వాలనీ, వాళ్ళే వచ్చి అడగటంతో ఒప్పేసుకున్నారు అమ్మనాన్నలు. నాకు చెప్పకుండానే వాళ్ళ ఊరు తీసుకెళ్ళారు. పెద్దనాన్న కూతురు కూడా అదే ఊరు. అత్తా వాళ్ళ ఇంట్లో ఉండటం ఇష్టం లేక అక్కదగ్గరికెళ్ళా. వాళ్ళు కూడా ఇవే పాఠాలు. "మంచి కుటుంబం, అత్తామామలు మంచోలు, అబ్బాయి అంతకన్న మంచోడు, ఒప్పుకో ఇలాంటి వాళ్ళు దొరకరు, నీ ఇష్టం" అంటు రోజు అక్కబావల పోరు. వాళ్ళ మాటలు కోపాన్ని తెప్పించినా, ఏమి అనలేని పరిస్థితి. ఎలాగైనా ఈ ఊర్లో నుండి బయటపడాలనే నా ఆలోచన నిరంతరం వెంటాడేది. అక్క వాళ్ళ ఇంట్లోనే రోజులు గడుస్తున్నాయి. ఓ రోజు దుకాణానికి వెలతానని అక్కతో చెప్పా. నాపై నమ్మకం లేని అక్క, తన కూతురిని నా వెంట పంపింది. అనుకున్నట్లుగానే వెళ్ళా. కానీ పారిపోవాలనే నా ప్రయత్నం, అక్క భర్త అక్కడే వుండటంతో విఫలమయ్యింది. అత్త రోజు అక్క దగ్గరికి వచ్చి, నేను వాళ్లతో వుండటం లేదనే బాధను పంచుకొని ఏడుస్తుండేది. అది విని అక్క నన్ను ఒప్పించే ప్రయత్నం చేసేది. నా నిర్ణయంలో ఏం మార్పు లేదు. ముందులాగే మరోరోజు అక్కతో చెప్పి దుకాణానికి వెళ్ళా. నా వెనక ఎప్పటిలాగే తన కూతురిని పంపింది. దుకాణానికి వెళ్ళగానే పాపకి బిస్కెట్లు ఇప్పించి, ఇదే అదును చూసుకొని ఎదురుగా వచ్చే జీపు ఎక్కా. మా ఊరు చేరుకున్న. పీడ విరగడయ్యిందని సంతోషపడ్డా. రాత్రంతా అమ్మనాన్నలు ఇలా రావడం సరైంది కాదనీ, సర్దుకోవాలనీ, మంచి కుటుంబమనీ ఏవేవో మాటలు చెప్పారు. నాకవేం పట్టలేదు. కానీ నా సంతోషం కొన్ని గంటలకే పరిమితమైంది. తెల్లరేసరికి అక్కబావలతో పాటు, అత్తమామలు కూడా వచ్చారు. వెళ్ళనన్నప్పటికీ అమ్మవాళ్ళు బలవంతంగా పంపారు. సంవత్సరంన్నర(18 నెలలు) దిన దిన గండంగా గడిచాయి. వీళ్ళు పంపడం, నేను ఏదో ఒక విధంగా పారిపోయి రావడం నాలుగోసారి. ఇంటికెలితే లాభం లేదని, ఈ సారి పాత ఊరు, పెద్దనాన్నవాళ్ళ దగ్గరికెల్లా. ఆకస్మాత్తుగా, ఒంటరిగా వచ్చిన నన్ను చూసి, వాళ్ళు కొంత ఆందోళనకు గురయ్యారు. చూడాలనిపించి వచ్చానని చెప్పా. అక్కడ నేను కనబడకపోయే సరికి, అత్తమ్మవాళ్ళు ఎప్పటిలాగే నేను అమ్మవాళ్ళ దగ్గరికే వెళ్తానని ఊహించి మాఊరెళ్ళారు. అక్కడ అమ్మవాళ్లు నేను ఇంటికి రాలేదనీ, ఆందోళన పడుతూ అత్తమ్మవాళ్ళపై కోపడ్డారు. అందరు కలిసి మూడో రోజుకు పెదనాన్న వాళ్ళ ఇంటికొచ్చారు. నాకు ఏడుపాగలేదు, అమ్మ మాత్రం "తనకు ఇష్టం లేకుండా ఎన్నిసార్లని పంపగలం, కొద్దిరోజులు మాతో పెట్టుకొని సర్దిచెప్పి పంపుతాం" అని సమాధానం చెప్పింది. తన మాటల వెనక సంఘం చేయి వుంటుందని అర్థమైంది. మరోసారి బ్రతికిపోయానని ఊపిరి పీల్చుకున్నా.

నేను లేని ఈ రోజుల్లో గ్రామంలో చాలా మార్పులొచ్చాయి. ఊరంతా శుద్ధిచేసినట్లు వుండటం, చువ్వనీళ్ళ దగ్గర సిమెంట్‌తో తొట్టిలా కట్టడం, ఊర్లో మాస్టరు రావడం...కొత్తదనాన్ని సంతరించుకుంది. ఏమిటీ ఈ మార్పు? సేతునడిగా. "విప్లవ సంస్కరణల్లో భాగంగా సంఘం, మిలీషియా నిర్వహించిన కార్యక్రమాల ఫలితమే ఈ కొత్తదనమంది". పార్టీ ఇలాంటి పనులు కూడా చేస్తుందా! ఆశ్చర్యమేసింది. ఇంటి పని అయిపోగానే, కూలీ పనికెళ్ళడం, తోటి వాళ్ళతో దళ కబుర్లు, ఇలా రోజులు గడుస్తున్నాయి. ఎలాగైనా సంఘం వాళ్ళని కలవాలనే ఆతృత నాలో పెరుగుతోంది. సంఘం అధ్యక్షుడు వరుసకి అన్న అవుతాడు, ఒకరోజు ఆయనతో 'సంఘంలో పని చేస్తానని ఎన్నో రోజులుగా, నా మనస్సులో వున్న మాట' సూటిగా చెప్పా. మిలీషియాలో అయితే బాగుంటుదన్నాడు అన్న. అందుకు ఒప్పుకున్న. మొదట్లో, ఇంట్లో ఏదో చెప్పి మిలీషియాలో తిరిగా. రాను రాను అసలు కథ ఇంట్లో తెలిసింది. సాయంత్రానికి రోజు ఇంట్లో కనిపిస్తున్నా కాబట్టి, పెద్దగా పట్టించుకోలేదు.

ఓ రోజు మా సంఘ నాయకుడు పార్టీ పిలుస్తుందని నాకు కబురు పెట్టాడు. ఎగిరి గంతేసా. మూడు గంటలు నడిచినా, దళం కలవలేదు. ఇంకెంత నడవాలని ఓపికలేక కూర్చొని అడిగా. అతనికి నోరు తడబడింది. ఏం మాట్లాడలేదు. నిజం చెప్పమని నిలదీసా. చేయి పట్టుకోబోయాడు. "నీవంటే నాకిష్టం, ఆ విషయం చెప్పడానికే అబద్ధామాడా" అన్నాడు. గుండె వేగం పెరిగింది. తెలియని భయం. వెను దిరిగి నడక ప్రారంభించా. నా వెనకాలే తను. "విషయం ఎవరికి చెప్పొద్దు" అన్నాడు. నోట మాట రాలేదు. చెప్పనన్నట్లుగా తల ఊపా. రాత్రి ఒంటిగంటైనా నిద్రపట్టలేదు. అమ్మవాళ్ళకు చెబితే కచ్చితంగా మిలీషియాలో పని మానేయుమని అంటారు, కోప్పడతారు. చెప్పొదనుకున్న. అతనన్న మాటలే గుర్తుకొస్తున్నాయి. ఎవరికి చెప్పాలి? సూరిగాడు, సేతు ఇద్దరు కళ్ళల్లో తిరిగారు. వారం రోజులు ఇవే ఆలోచనలతో గడిచాయి. ఇంతదాకా వచ్చాక దాచడం సరైందికాదనిపించింది. చీకటి పండింది. అమ్మ ఇంటికొచ్చింది. ఎలా మొదలు పెట్టాలో అర్థం కావడం లేదు. మొత్తానికి పడుకునే ముందు అతని నుండి ఎదుర్కొన్న రెండు

సంఘటనలు ధైర్యంగా అమ్మకు విప్పి చెప్పా. ఏడుస్తూ కోప్పడింది. అమ్మవాళ్ళు ఈ విషయాన్ని సంఘం ముందు పెట్టారు. సంఘ సభ్యులు పంచాయితీ నిర్వహించారు. అతను నేను చెప్పిన మాటలను అంగీకరించపోగా, నా తప్పేంలేదని, గట్టిగానే అందరి ముందు బుకాయించాడు. పార్టీ వరకు చేరింది విషయం. నాకు నమ్మకమైన వ్యక్తితో పార్టీ రమ్మని వార్త. వెంటనే వెళ్ళా, అతను ఎప్పుడొచ్చాడో తెలియదు. దళంవాళ్ళతో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాడు. నన్ను చూడగానే ముఖం మారిపోయింది. ఎప్పుడు ప్లాన్ చేశారో ప్రజాకోర్టు. మధ్యాహ్నానికి ప్రజలందరూ వచ్చారు. దళ కమాండర్ అతడిని అడగటం ప్రారంభించాడు. అతని నుండి పాత సమాధానమే వచ్చింది. అయితే అప్పటికే దళ కామ్రేడ్స్ అతని తప్పుడు ప్రవర్తనను గ్రామస్తుల ద్వారా అర్థం చేసుకున్నారు. దీంతో అతన్ని సభలో గట్టిగా నిలదీశాడు. ఎప్పుడైతే దళ కమాండర్ అతన్ని గట్టిగా నిలదీసాడో, అప్పుడు ప్రజల నుండి కూడా అతనిపై మరికొన్ని ఆరోపణలు వచ్చాయి. గతంలో మరో ఇద్దరు అమ్మాయిలను కూడా లైంగికంగా వేధించాడని చెప్పారు. దీంతో అతను తల దించుకున్నాడు. ఏం మాట్లాడకుండా తప్పు ఒప్పుకున్నాడు. "ఇన్నాళ్ళు సంఘ నాయకుడిగా వుంటూ ఇంత ద్రోహం చేస్తావా" అంటూ ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. ఆవేశంతో కొట్టబోయారు. దళంవాళ్ళు అడ్డు రావడంతో బ్రతికిపోయాడు. 'ఇలాంటి వాళ్ళకు, ప్రజలకు నాయకత్వం వహించే అర్హత లేదని చెప్పి, సంఘనాయకుడి నుండి తొలగించారు. మరోసారి ఇలాంటి తప్పులకు పాల్పడితే చర్యలు తీవ్రంగా వుంటాయని హెచ్చరించారు.

దళంతో వుండాలనే నా కలనీ, ఈ సందర్భంగా మూడు రోజులు ముచ్చటగా గడిపా. అన్ని కొత్త అనుభవాలే. స్త్రీ, పురుషులనే తేడా లేకుండా సోదరభావంతో (కామ్రేడ్లీ సంబంధం)మెలగడం, పనులన్నీ కలిసి చేసుకోవడం, 'మహిళలు చేసే పనులు వేరు-పురుషులు చేసే పనులు వేరు' అనే భిన్నమైన తేడాలు లేకుండా సమానంగా అన్ని పనుల్లో అందరు భాగం కావడం, పనులు ముగియగానే స్కూల్ నేర్చుకోవడం... తదితర పద్ధతులకి, నాకు తెలియకుండానే ఆకర్షితురాలినయ్యా. దళం సలహా మేరకు, పూర్తిగా ఒక సంవత్సరం పాటు మిలీషియాలోనే పని చేయాలని నిర్ణయించుకున్న. నిర్ణయాని కనుగుణంగానే సంవత్సరం పాటు ఇంటికెళ్ళలేదు. ఇంటివాళ్ళు ఏడ్వడం, దళాన్ని వెతకడం, అన్ని జరిగిపోయాయి. నేనెక్కడా వాళ్ల కంట బడలేదు.

ఒక సంవత్సరం గడిచిన తర్వాత మిలీషియా బాధ్యుడైన కామ్రేడ్ జాంబ్రి "నీవు దళానికి రిక్రూట్ కావాలనేది పార్టీ ప్రతిపాదన, నీ వైపు నుండి ఏమైనా మాట్లాడాలనుకుంటే చెప్పు" అని ముగించాడు. మాట్లాడాల్సింది ఏమి లేదని తల ఊపుతూ, వస్తానన్నట్లుగా నవ్వుతో సమాధానమిచ్చా.

తెల్లవారే, అమ్మనాన్నలిద్దరూ డేరాకొచ్చారు. హఠాత్తుగా చూసే సరికి నా ముఖం ప్రశ్నర్థకమైంది. "రేపే నీ ప్రయాణం, దళానికి వెలితే వీలుకాదని కబురుపెట్టాం" అని కమాండర్ పక్కకి పిలిచి చెప్పాడు. అమ్మా, నాన్నలకు పార్టీ, దళం అంటే ఇష్టమున్నా, నన్ను పూర్తిగా ఆ పనికి కేటాయించేందుకు సిద్ధంగా లేరు. దాంతో వాళ్ళు నన్ను కొంత వెనక్కు లాగేందుకు ప్రయత్నించినా, వాళ్ళకు నచ్చచెప్పి, పీడిత ప్రజల విముక్తికి, ముఖ్యంగా భూమి, అధికారం, కోసం దృఢంగా అడుగు ముందుకేయాలనుకున్నాను.

సాయంకాలం లేత చీకటి చిగురిస్తుంది. పక్షులు అరుపులతో గూళ్ళకి చేరుతున్నాయి. గొడ్లు, మేకలు, ఊరి దారి పడుతున్నాయి. బాక్సైట్ కొండల మధ్యలోంచి సన్నని చందమామ వికసిస్తుంది. కమాండర్ విజిల్ మోగింది. ఆశగా నా వైపు చూస్తున్నారు ఇద్దరు. ఆ ఇద్దరిని ఆలింగనం చేసుకొని, చేతులు కలిపి, పిడికిలెత్తిన చేతితో రోల్‌కాల్ వైపు పరుగెత్తి దళంతో సాగిపోయా.... ✦

---

**"శ్రామజీవి జనరాశులలో చైతన్యాన్ని బయట నుండి కలుగజేయవలసి వుంటుంది; దానిని వారు, వారి ఆర్థిక లేదా పాక్షిక డిమాండ్లపైన చేసే పోరాటాల నుండి పొందజాలరు. అందువలన ప్రజారాశులను రాజకీయంగా జాగృతం చేసి, వారిలో సాయుధ మార్గం ద్వారా రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్న విప్లవకర రాజకీయాలను వారికి రంగరించిపోవడం అన్నది ప్రజా సంఘాలలో వుండే పార్టీ యొక్క అతి ముఖ్య కర్తవ్యంగా వుంటుంది. ప్రజారాశులు పార్టీ విధానాలను అర్థం చేసుకోగలుగుతారు. వారు తమ రోజు వారి పోరాటాలలో వాటిని అమలు పరిచే క్రమంలో వాటిని తమవిగా చేసుకుంటారు.**

**- వ్యూహం-ఎత్తుగడలు, 111వ పేజీలోనిది.**

అమరుల
జీవిత చరిత్ర

# యువ, సాహస కమ్యూనిస్టు విప్లవ గెరిల్లా కామ్రేడ్ సుక్కాల్ త్యాగాన్ని ఎత్తిపడదాం, ఆయన కమ్యూనిజం స్వప్నాన్ని సాకారం చేద్దామని శపథం చేద్దాం!



సుమారు మూడున్నర శతాబ్దాల(37 సం॥లు)క్రితం దండకారణ్యంలో ప్రారంభమైన సాయుధ రైతాంగ వ్యవసాయక విప్లవం అనేక మలుపుల గుండా కొనసాగుతూ, అభివృద్ధి చెందుతూ, గ్రామ స్థాయి నుండి ప్రజా రాజ్యాధికారాన్ని నిర్మిస్తూ, గెరిల్లా బేస్‌ల గుండా విముక్తి ప్రాంతాలని నిర్మించే లక్ష్యంతో పి.ఎల్.జి.ఎ.ను, పి.ఎల్.ఎ.గానూ, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగాను ఎదిగించే ఉన్నత కర్తవ్యాల సాధనలో పురోగమిస్తున్నది.

ఈ ఉద్యమ ప్రాంతంలోని బీజాపూర్ జిల్లా, మొరం పంచాయితీ, కుమ్మెం గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో 23 సం॥ల క్రితం కామ్రేడ్ సుక్కాల్ జన్మించాడు. పేదరికానికి అనారోగ్యం తోడై, వైద్యానికి నోచుకోలేక తల్లిదండ్రులు అకాల మరణం పొందడంతో, చిన్నవయస్సులో అనాధగా మారాడు. తన అక్క చేరదీసి, తానే తల్లై, తమ్ముడిని పెంచి, పెద్దచేసింది. బాల్యం నుండే అక్కడ నెలకొన్న విప్లవ రాజకీయ వాతావరణంలో, వర్గపోరాట ఆచరణతో పెరగడంతో, సహజంగానే విప్లవోద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. చిన్నతనం నుండే వ్యవసాయ కూలీగా పని చేస్తూ, మరో వైపు బాలల సంఘంలో చేరి, ఆ ప్రాంత విప్లవోద్యమంలో భాగమవుతూ వచ్చాడు. 2005లో, సల్వాజుడుం పేరుతో, ప్రభుత్వం అమలు జరిపిన పాశవిక హత్యాకాండలో, అమానవీయ దాడులలో పార్టీ నాయకత్వం కింద ప్రజలు, పి.ఎల్.జి.ఎ. వీరోచితంగా పోరాడి, ప్రతిఘటించి దానిని ఓడించారు. ఈ సమయంలో కామ్రేడ్ సుక్కాల్ నివాసముంటున్న కుమ్మెం గ్రామం, జెగురుగొండ పోలీసు క్యాంపు(సల్వాజుడుం గుండాలు కూడా వున్న)కు, సమీపంలో ఉండటంతో అనేకసార్లు దాడులకు గురై, ఇండ్లు, ఆస్తులు, పశువులు, కోళ్ళు, మేకలు లూటీకి గురికావడం, ప్రజలపై కాల్పులు, మహిళలపై అత్యాచారాలు జరిగాయి. ఈ దాడిలో ఆస్తులతో పాటు తమ మనుగడను కాపాడుకోవడం కోసం ప్రజలు లొంగుబాటుకు గురి కాకుండా, పోరుబాటనే ఎంచుకున్నారు. అడవులలో రహస్యంగా గ్రామాన్ని నిర్మించుకున్నారు. గెరిల్లా యుద్ధ పద్ధతులను అవలంభిస్తూ, శత్రువును ప్రతిఘటిస్తూ, అనేక త్యాగాలు చేసి, ఆ దాడిని తిప్పి కొట్టారు. ఆ ప్రతిఘటనలో చిన్నవాడైన కామ్రేడ్ సుక్కాల్ కూడా చురుకుగా పాల్గొన్నాడు. 2008లో పోలీసులు అరెస్టు చేసి, చిత్రహింసలకు గురి చేసినా లొంగిపోలేదు. అక్రమ కేసులు బనాయించి దంతెవాడ జైలులో నిర్బంధించారు. 2008 నుండి 2011 వరకు కఠోరమైన జైలు జీవితాన్ని అనుభవించాడు. జైలులో రాజకీయంగా ఎలాంటి ఊగిసలాటను ప్రదర్శించకుండా, మరింత రాటుదేలాడు. జైలు నుండి విడుదలైన వెంటనే, ఎలాంటి శషభిషలు లేకుండా మిలీషియా నిర్మాణంలో చేరి, విప్లవ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొన్నాడు. ఆ సమయంలో పార్టీ, ఆర్.పి.సి.ల నిర్ణయాల అమలులో భాగంగా, స్థానికంగా శత్రువు ఏజెంట్లను, ప్రజా వ్యతిరేకులను శిక్షించడంలో, దాడులకు వచ్చే సాయుధ శత్రువులను ప్రతిఘటించే మిలటరీ చర్యలలో శక్తివంచన లేకుండా భాగమవుతూ, ప్రజలకు, ప్రజా నిర్మాణాలకు, జనతనసర్కార్‌కు రక్షణ కల్పించడంలో చురుకైన పాత్రను పోషించాడు. 2014 చివరలో పార్టీ పిలుపునందుకొని పూర్తికాలం కార్యకర్తగా పని చేయడానికి నిర్ణయించుకున్నాడు. అప్పటికే పార్టీ సభ్యుడైన కామ్రేడ్ సుక్కాల్ పార్టీ నిర్ణయంతో సి.ఆర్.సి-1వ ప్లటూన్‌లోకి సభ్యుడిగా 2015లో ఎ.ఒ.బి. ఉద్యమంలో మనస్ఫూర్తిగా భాగమయ్యాడు. ఎ.ఒ.బి., ఈస్ట్ డివిజన్‌లోని మన్యంలో కార్పొరేట్ కంపెనీలకు, బాక్సైట్ ఖనిజ తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇందుకోసం ప్రజల సాగు భూమలనూ, అడవిలోని సహజ సంపదను వారికి అప్పజెప్పింది. ప్రజలను నిర్వాసితులను చేసి, వారి అస్థిత్వాన్ని, మనుగడను ప్రశ్నార్థకంగా మార్చి, పర్యావరణ విధ్వంసానికి పూనుకోవాలనుకుంది. ఆదివాసీలు, పీడిత ప్రజలు ప్రభుత్వ విధానాలను ఎదిరించి, బరిగీసి నిలబడ్డారు. "ప్రాణాలైనా ఇస్తాం,

బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటాం, మన్యం మనుగడను కాపాడుకుంటాం'' అని నినదించారు. పార్టీ నాయత్వంలో పి.ఎల్.జి.ఎ. అండతో, విశాల ప్రజలు, వారి న్యాయమైన పోరాటానికి మద్దతు కూడగట్టుకొని మిలిటెంట్‌గా పోరాడారు. పోలీసు దాడులను ఎదుర్కొని ప్రతిఘటించారు. అధికార పార్టీ నాయకులను బంధించి, ప్రభుత్వం జారి చేసిన జి.ఒ.నెం-97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చివరకు ప్రజల ప్రతిఘటనకు తలొగ్గిన ప్రభుత్వం జి.ఒ.నెం-97ను తాత్కాలికంగా వెనక్కు తీసుకొని, బాక్సైట్ తవ్వకాల నిర్ణయాన్ని నిలిపివేసింది. ఈ పోరాటంలో ప్రజల తరపున పి.ఎల్.జి.ఎ. చేసిన కృషిలో కామ్రేడ్ సుక్కాల్ పాత్ర విడదీయలేనిది. ఎ.పి.ఎన్.ఎమ్.డి.సి. అడవులను ఆక్రమించి, కాఫీ ప్లాంటేషన్లను పెంచి, స్థానిక ఆదివాసీలను కూలీలుగా మార్చి, కోట్లాది రూపాయల ప్రజల సంపదను దోచుకోనారంభించింది. ఇందుకు వ్యతిరేకంగా పార్టీ, పి.ఎల్.జి.ఎ.ల నాయకత్వంలో వేలాది మంది ఆదివాసీలు కదిలి, ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, తిరిగి కాఫీ ప్లాంటేషన్లను ఆక్రమించుకున్నారు. ఈ పోరాటాలకు సి.ఆర్.సి-1వ పి.ఎల్ కూడా ప్రత్యక్షంగా నాయకత్వాన్ని అందించింది. నిరంతరం సాయుధ బలగాల కూంబింగ్‌లు, దాడుల మధ్య ప్రజలను అంటిపెట్టుకొని ఉంటూ, వారికి గొప్ప నైతిక స్థైర్యాన్ని అందించింది. 2015 ఆగస్టులో ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో పలగరేవు వద్ద బి.ఎస్.ఎఫ్. బలగాలపై అంబూష్ చేసి, ముగ్గురిని చంపి, నలుగురిని గాయపర్చిన సంఘటనలో చురుకుగా పాల్గొన్నాడు. ఈస్ట్ ఉద్యమం తీవ్రమైన శత్రుదాడిని ఎదుర్కొంటూ, ముఖ్యమైన కామ్రేడ్స్ అమరత్వాలు ఒకవైపు, మరోవైపు కొందరు గుండెజారి, త్యాగనిరతి కోల్పోయి, శత్రువు ముందు మోకరిల్లుతున్నా, కొత్తవాడైనా కామ్రేడ్ సుక్కాల్ గందరగోళపడలేదు. సిద్ధాంతం, పంథాపైన విశ్వాసం, ప్రజలే చరిత్ర నిర్మాతలనే నమ్మకంతో, కష్టకాలంలో బాధ్యతాయుతంగా, పట్టుదలగా నమ్మిన ఆశయానికి దృఢంగా కట్టుబడి పని చేశాడు. తన రాజకీయ చైతన్యానికి మరింత పదును పెట్టుకున్నాడు. 2016 ఆగస్టులో జరిగిన సి.ఆర్.సి-1వ ప్లటూన్ ప్లీనంలో ప్రతినిధిగా పాల్గొని, కార్యకలాపాల సమీక్షపై లోతుగా చర్చించాడు. ఆ కర్తవ్యాలను మనస్ఫూర్తిగా, పట్టుదలగా, దృఢంగా అమలు చేయడానికి విప్లవోత్సాహంతో పనిలోకి వెళ్ళిన కొద్ది కాలానికే 2016 అక్టోబర్ 24-27 రాంగూడ గ్రామం వద్ద, మన క్యాంపుపై ఎ.పి. గ్రేహౌండ్స్ బలగాలు పక్కా సమాచారంతో చుట్టుముట్టి దాడి చేసినప్పుడు, ఏ మాత్రం గందరగోళపడకుండా, వందలాది ప్రత్యేక పోలీసు బలగాల విచ్చలవిడి కాల్పుల మధ్య వాడిని ఎదుర్కొంటూ, నాయకత్వాన్నీ, తోటి సహచర కామ్రేడ్స్‌ను రక్షించడానికి తీవ్రంగా ప్రతిఘటించాడు. చివరలో శత్రువలయాన్ని ఛేధించేటప్పుడు అనేక మంది కామ్రేడ్స్ ఒక్కరొక్కరుగా నేలకొరుగుతుంటే, కాల్పులు చేస్తూనే, ఆ కాల్పుల మధ్య అమరుడు ప్రసాద్(ఎస్.జడ్.సి.ఎమ్) ఆయుధాన్ని (ఎ.కె-47) శత్రువు స్వాధీనం కాకుండా తీసుకువచ్చాడు. గాయపడ్డ కామ్రేడ్స్‌ను రిట్రీట్ చేయడంలో, ఆ తర్వాత వారికి సహాయం చేస్తూ, కాపాడటంలో చురుకైన, విలువైన గొప్ప విప్లవ స్ఫూర్తిని ప్రదర్శించాడు. ఈ సంఘటనలో 31 మంది వివిధ స్థాయిల కామ్రేడ్స్, అందులో సి.ఆర్.సి.పి.ఎల్.లో ఇద్దరు కామ్రేడ్స్‌తో పాటు, ముఖ్యులైన ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. గుండె నిబ్బరం కోల్పోకుండా మరింత వర్గ కసితో, పట్టుదలతో శక్తి వంచన లేకుండా అమరుల లోటును భర్తీ చేయడానికి విప్లవ దృఢసంకల్పాన్ని ప్రదర్శించాడు. ఆ తర్వాత శత్రువు ఇంటలిజెన్సీ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడంలో చురుకుగా పాల్గొన్నాడు. టి.సి.ఒ.సి.ని విజయవంతం చేయడానికి చివరి వరకూ, దృఢవిశ్వాసంతో అప్పగించిన పనులను మనస్ఫూర్తిగా, పట్టుదలగా అమలు చేశాడు. 2017 డిసెంబర్‌లో ఎమ్.కె.వి.బి.డివిజన్‌లో మిలీషియానూ, ప్రజలను సమీకరించి వారి ప్రత్యక్ష, క్రియాశీలక భాగస్వామ్యంతో చేపట్టిన ప్రతిఘటన క్యాంపెయిన్‌లో, తాను పని చేస్తున్న సి.ఆర్.సి-1 ప్లటూన్ భాగమయ్యి, నాయకత్వం వహించింది. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా శత్రువు స్థానిక ఇంటలిజెన్సీ నెట్‌వర్క్‌ను, వాడి కమ్యూనికేషన్ వ్యవస్థను ధ్వంసం చేశారు. కూంబింగ్‌కి వచ్చే సాయుధ బలగాలపై చొరవగా కొన్ని చర్యలు నిర్వహించేందుకు, డిసెంబర్ 14న మల్కనగిరి జిల్లా, విచ్చినాంచల్ (కటాఫ్ ఏరియా)పప్పురమెట్ట పంచాయితీ, లుక్కపాని-బొందుగూడ మధ్య బి.ఎస్.ఎఫ్. బలగాల కోసం అంబూష్ ఏర్పాటు చేశారు. 15న ఉదయం 6 గం॥లకు అంబూష్ సమీపానికి శత్రువు చేరుకున్నాడు. అయితే అనుమానం వచ్చి, పోలీసులు అప్రమత్తం అయి, ముందుకు వస్తున్నప్పుడు మైన్స్ పేల్చగా, ఫ్లాష్ పని చేయకపోవడంతో మైన్ పేలలేదు. దానితో శత్రువు కౌంటర్‌గా, ఫ్లాంక్‌లోకి వస్తున్నప్పుడు సుక్కాల్‌తో పాటు కొందరు కామ్రేడ్స్ ఫైరింగ్ ప్రారంభించారు. శత్రువు విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ సుక్కాల్‌కు సరైన కవర్ లేక, తూటా తగిలి, అక్కడికక్కడే అమరుడయ్యాడు. కామ్రేడ్ సుక్కాల్ విప్లవ జీవిత ఆచరణ నుండి ప్రతి విప్లవకారుడు నేర్చుకోవాల్సినవి - ఆయన గొప్ప కమ్యూనిస్టు విలువలు, ఆదర్శాలు నెలకొల్పడం, నమ్మిన ఆశయం కోసం కష్టించి పని చేయడం, శత్రువంటే తీవ్రమైన కసి, ప్రజలంటే ఎనలేని ప్రేమ, నిరాండంబరత, తప్పుల పట్ల నిర్మాణాత్మకమైన విమర్శ, తోటి కామ్రేడ్స్‌ను ప్రేమించడం, వారితో ఐక్యం కావడం, ప్రజల నుండి, తోటి కామ్రేడ్స్ నుండి నేర్చుకోవడంలో వినయం, ఉద్యమ కష్టాలలో, నష్టాలలో, ఓటమి, విజయాలలో, ఒడిదుడుకులలో గుండె నిబ్బరం కోల్పోకుండా, ప్రజల కోసం అంకితం కావడం, కార్మికవర్గ, అంతర్జాతీయ దృక్పథం, అన్నింటికీ మించి విలువైన ప్రాణాలను ప్రజల విముక్తి కోసం చిరునవ్వుతో తృణప్రాయంగా అర్పించడం -నేర్పుకోవాలి. కామ్రేడ్ సుక్కాల్ జీవితం భావి విప్లవ తరాలకు స్ఫూర్తిని ఇస్తాయి. ప్రజలను ఆయన బాటలో నడుపుతాయి. సుక్కాల్ అమరత్వాన్ని ఎత్తిపడదాం! విప్లవ విజయానికి మరింత పట్టుదలతో పోరాడి విజయం సాదిద్దామని శపథం చేద్దాం. కామ్రేడ్ సుక్కాల్ త్యాగానికి తలవంచి వినమ్రంగా జోహార్లర్పిద్దాం.

✦

వ్యాసం

# కుందిలి అత్యాచార ఘటనకు నిరసనగా పెల్లుబికిన ప్రజాగ్రహం

10-10-2017న కుందిలి పరిసర ప్రాంతంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై నలుగురు సాయుధ జవాన్లు జరిపిన అమానవీయ అత్యాచార ఘటన, దానిని వ్యతిరేకిస్తూ 10, 11 తేదీలలో ప్రజలు చేపట్టిన 'జాతీయ రహదారి బందు' కొరాపుట్ జిల్లాలోనే కాక, యావత్తు ఒడిశా రాష్ట్రాన్నే కుదిపి వేసింది. ఈ ఘటన పూర్వాపరాల్లోకి వెళితే ....

ముస్సాగూడ గ్రామంలోని దళిత కుటుంబానికి చెందిన మైనారిటీ బాలిక సారిసపాదర్ (పంచాయితీ)స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నది. పరీక్షల నిమిత్తం పాస్ పోర్ట్ ఫోటో తీసుకొనేందుకు కుందిలి (పొట్టంగి, సిమిలిగూడ బ్లాక్‌ల మధ్యలో ఎన్.హెచ్-46పై వుంది) వచ్చి తిరిగి గ్రామానికి ఆటోలో కొంతదూరం పోయి, అక్కడినుండి తన గ్రామానికి ఉదయం 11:30 గం॥ల సమయంలో ఒంటరిగా వస్తున్న బాలికను, నలుగురు సాయుధ పోలీసు జవాన్లు అటకాయించి, రోడ్డుకు ఆనుకొని వున్న అడవిలోకి బలవంతంగా ఎత్తుకుపోయారు. అనంతరం వరుసగా నలుగురు బాలికపై అత్యంత దారుణంగా అత్యాచారానికి ఒడిగట్టారు. తర్వాత ఈ విషయాన్ని బయటకు వెల్లడిస్తే చంపేస్తామని బెదిరించి, నిస్సహాయ స్థితిలో వున్న తనని విడిచి వెళ్ళిపోయారు. వారు వెళ్ళిన కొద్దిసేపటికే, సమీపంలో పశువులను మేపుతున్న ఒక రైతు అచేతనావస్థలో వున్న బాలికను గమనించి, రోడ్డుపై వెళుతున్న మరొక వ్యక్తి సాయంతో తన గ్రామానికి చేర్చాడు. జరిగిన సంఘటనను తెలుసుకున్న తల్లిదండ్రులు దుఃఖంతో, ఆగ్రహంతో రగిలిపోయారు. వెంటనే బాలికను కుందిలి హాస్పిటల్‌కు తీసుకెళ్ళగా, అక్కడి వైద్య సిబ్బంది కొరాపుట్ మెడికల్‌కు తీసుకెళ్ళాల్సిందిగా చెప్పి పంపించారు. బాలిక పరిస్థితి తెలుసుకున్న బంధువులు, ప్రజలు ఆగ్రహంతో రోడ్లపైకి చేరుకున్నారు. బాలిక అన్నయ్య పొట్టంగి స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళుతూ, జరిగిన అన్యాయానికి పోలీసులపై కోపంతో స్టేషన్ గేట్ తన్నుకుంటూ లోపలికి వెళ్ళాడు. అక్కడి పోలీసు అధికారులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయకపోవడమే కాకుండా, లాఠీలతో తీవ్రంగా చితకబాది పంపించి వేశారు. పోలీసుల వైఖరిని నిరసిస్తూ మధ్యాహ్నం 1:30 గం॥ల ప్రాంతంలో టైర్లను కాల్చి, వాహనాల రాకపోకలను అడ్డుకొని ప్రజలు జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు. ప్రారంభంలో 150 నుండి 200 వరకు వున్న ప్రజల సంఖ్య సాయంకాలానికి 700 గానూ, మరుసటి రోజు (10-10-17) ఉదయానికి సుమారుగా 3000 లకు చేరుకున్నారు. ఆందోళనకారులు ఒక దశలో బస్సులను తగులబెట్టేందుకు ప్రయత్నించగా, స్థానిక నాయకత్వం వారిని వారించింది. స్థానిక బి.జె.పి. నాయకులు ప్రఫుల్ల పాంగీ (ఎమ్.ఎల్.ఎ), రఘురామ్ పడాల్‌లు వచ్చి, బందు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ, విరమించాలని చెప్పిన మాటలకు, ప్రజలు వారిపై తిరగబడ్డారు. బందు విరమింపచేయడానికి సబ్‌కలెక్టర్ చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. చివరకు 11వ తేదీ సాయంత్రం 5 గం॥లకు కలెక్టర్, ఎస్.పి., ఇతర ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని చర్చలకై ప్రతిపాదించారు. వారి రక్షణకై వచ్చిన సాయుధ బలగాల వ్యానును తగులబెట్టేందుకు యువకులు దూసుకుపోయారు. ప్రజాసంఘాల నాయకత్వం వారిని వారించినప్పటికీ, ఆ వాహనాన్ని రివర్స్ గేర్‌లో నడిపించి, రెండు కి.మీ. దూరంలో నిలిపివేశారు. చర్చలకై, విస్తాపనా సమస్యలపై పని చేస్తున్న "మాలి సురక్ష సమితీ" నాయకత్వం, దళిత, ఇతర సెక్షన్‌ల నాయకత్వంలోని 12 మంది ప్రతినిధులతో కూడిన ఒక తాత్కాలిక కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ అత్యాచార నిందితులైన నలుగురు జవాన్ల అరెస్ట్, కొరాపుట్ జిల్లాలో మైనింగ్ నిలిపివేత, పోలీస్ క్యాంపుల ఎత్తివేత, బాధితురాలికి 2 కోట్ల నష్టపరిహారంతో పాటు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పన డిమాండ్‌లను ముందుకు తెచ్చింది. దానికి బదులుగా క్యాంపుల ఎత్తివేత, మైనింగ్ రద్దు కేంద్ర పరిధిలోని అంశాలన్నీ, నిందుతుల అరెస్ట్, ఇతర డిమాండ్ల పరిష్కారానికై రెండు రోజుల గడువు కోరడంతో, చర్చల సారాంశాన్ని ప్రజలకు వివరించి బందు విరమించాలని నాయకత్వం విజ్ఞప్తి చేయగా 12వ తేదీ తెల్లవారు జామున 2 గం॥ల ప్రాంతంలో జాతీయ రహదారిపై తిరిగి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

బందు విరమణ అనంతరం నలుగురు జవాన్లను అరెస్ట్ చేయడానికి బదులుగా బాధితురాలి కుటుంబానికి చెందిన నలుగురు యువకులను ఇళ్లనుండి ఎత్తుకుపోయి తామే అత్యాచారం చేసామని ఒప్పుకోవాలని చిత్రహింసలు పెట్టారు పోలీసులు. బాలిక బావ (మేనమామ కొడుకు)ను ప్రధాన నిందితుడిగా ఒప్పించేందుకు, తుపాకీ బట్లతో తొడలపై, కాళ్ళపై కమిలిపోయేలా కొట్టి, నడవలేని స్థితిని కల్పించారు. రెండుసార్లు కరెంట్ షాక్ ఇవ్వడంతో పాటు, నిర్జన ప్రదేశంలోకి రాత్రి సమయంలో తీసుకుపోయి తుపాకీ గురి పెట్టి, ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారు. పోలీసుల చిత్రహింసలకు తాళలేక, తానే ఆ అత్యాచారం చేసానని ఒప్పుకున్నాడు. పోలీసుల ఆకృత్యాలను వ్యతిరేకిస్తూ, తనపై అత్యచారం చేసింది ముమ్మాటికీ జవాన్లేననీ, తన బంధువులు కాదని వారిని హింసిస్తే తను ఆత్మహత్య చేసుకుంటానని బాలిక మీడియాలో వెల్లడించడంతో, ముగ్గురు యువకులను వదిలి, బాలిక బావను లైడిటెక్టర్ పరిక్షలకై రాజధాని భువనేశ్వర్‌కు పంపగా, ఫలితం నెగటివ్ వచ్చింది. దాంతో తాము పెట్టిన చిత్రహింసలను మీడియాకు తెలియచేసినా, కేసు నమోదు

చేసినా ఎన్‌కౌంటర్ చేస్తామని ఆ యువకుడిని, అతని తల్లిదండ్రులను బెదిరించి, వారం రోజుల అనంతరం విడుదల చేశారు. తర్వాత బాలిక తన వాంగ్మూలం మార్చుకోవాల్సిందిగా, హాస్పిటల్‌లో ఆమెకు రక్షణగా వున్న మహిళా కానిస్టేబుళ్ళతో పాటు ఎస్.పి., డి.ఐ.జి.షైనీలు అందరూ కలిసి తీవ్రమైన ఒత్తిడికి గురి చేశారు. అత్యాచారంతో పాటుగా శారీరకంగా, మానసికంగా తనను చిత్రహింసలకు గురి చేస్తూ, ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం వేధిస్తున్న తీరును బాలిక మరొక్కసారి మీడియా ముందుకు వెల్లడి చేసింది. 18 రోజుల వైద్య చికిత్స అనంతరం అసలు బాలికపై అత్యాచారం జరగలేదనీ, మెడికల్ రిపోర్టు వచ్చిందని ఎస్.పి. ప్రకటించి, బాలికను ప్రభుత్వ బాలిక సంక్షేమ వసతిగృహంలో పోలీసుల కాపలా మధ్య బంధించారు. ఎస్.పి. ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కొరాపుట్ జిల్లాలోని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలెక్టర్ ఆఫీసు, అసెంబ్లీల ముందు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అత్యాచార ఘటన నుండి ప్రజల దృష్టిని మళ్ళించేందుకు, కాలయాపన చేసేందుకు, నిందితులను రక్షించేందుకు, సి.బి.ఐ. ఎంక్వయిరీ వేసి చేతులు దులుపుకుంది ప్రభుత్వం. అయినప్పటికీ బాధితురాలికి న్యాయం జరిగేంతవరకు ఆందోళన కొనసాగించాలని ప్రజాసంఘాలు నిర్ణయించాయి.

"కుందిలి అత్యాచార ఘటన" జరగడానికి గల కారణాలను తెలుసుకోవాలంటే, ఆ ప్రాంతంలోని ప్రజల సామాజిక, ఆర్థిక చరిత్రను మనం తెలుసుకోవాల్సి ఉంటుంది. కొరాపుట్ జిల్లాలో ఒడిశాలోనే అతిఎత్తైన మాలి, దేవమాలి పర్వతాలు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న సిమిలిగూడ-పొట్టంగి బ్లాకుల నడుమ ఉన్నాయి. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్న ఈ పర్వతాలు, ప్రకృతి అందాలతో పాటు, అపారమైన బాక్సైట్ సంపదకు నిలయాలు. పర్వతాల పాదభాగంలో ఆదివాసీ, దళిత, ఇతర వెనుకబడిన వర్గాల ప్రజలు జీవిస్తున్నారు. వీరంతా పర్వతాల నుండి వెలువడే అసంఖ్యాకమైన సెలయేర్ల నీటిపై ఆధారపడి సారవంతమైన భూములలో వ్యవసాయం చేస్తున్నారు. అందులో ప్రధానంగా కూరగాయలు, వాణిజ్య పంటలు(అల్లం, పసుపు, వేరుశనగ), పప్పుదినుసులు పండిస్తున్నారు. పండించిన ఉత్పత్తులను సమీపంలోని, కుందులి మార్కెట్‌కు తరలించేందుకు రైతులు సమిష్టిగా కొనుక్కున్న స్వంత వాహనాల ద్వారా నిత్యం రవాణా చేస్తారు. కుందిలి మార్కెట్ చేరిన కూరగాయాలు అక్కడ నుండి వివిధ రాష్ట్రాలకు నిత్యం ఎగుమతి అవుతుంటాయి. దీని ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. అక్షరాస్యత పెరిగింది. కొద్దిమందికి ఉద్యోగాలు వచ్చినప్పటికీ, మెజారిటీ నిరుద్యోగులు. వీరంతా ప్రధానంగా వ్యవసాయం, ఖాళీ సమయాల్లో సమీప పట్టణాలకు వివిధ వృత్తి పనులకు, కూలీ పనులకు వెళుతుంటారు. ఆదీవాసీ, ఇతర సెక్షన్ల ప్రజల ఆచార, సాంప్రదాయాలు, భిన్న మతాల సంస్కృతి కొనసాగుతూ ప్రజల మధ్య ఐక్యత, సుహృద్భావ వాతావరణం నెలకొని వుండేది.

ఈ క్రమంలో ప్రజలకు జీవనాధారం కల్పిస్తున్న ఈ పర్వతాలలో, నిక్షిప్తమై ఉన్న బాక్సైట్ గనులపై దేశ, విదేశీ బహుళజాతి కంపనీల కన్ను పడింది. 2000 సం॥లో నవీన్‌పట్నాయక్ (బి.జె.డి)ప్రభుత్వం, బాక్సైట్ తవ్వకాలకై ఇండాల్‌కో కంపెనీకి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, ఆదివాసీ నిరుపేదలను, నిర్వాసితులుగా చేయడానికి పూనుకుంది. అనుమతి పొందిన నాటి నుండి ప్రభుత్వ, పోలీసుల అండతో కంపెనీ అనేక కుట్రలకు పాల్పడింది. కంపెనీని వ్యతిరేకిస్తూ, ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కొద్ది మందిని స్థానిక రాజకీయ నాయకులను డబ్బుతో కొనివేసింది. జాతీయ రహదారికి ఆనుకొని వున్న (రవాణాకు వీలుగా వున్న) మూడు గ్రామాలలో దళారులను తయారు చేసి, ఆ గ్రామాలను తన నియంత్రణలోకి తెచ్చుకుంది. ఈ విధంగా ప్రజల మధ్య చీలికలు తీసుకువచ్చి ఘర్షణలు సృష్టించింది. ఇతర ప్రాంతాలనుండి గూండాలను తెప్పించి ప్రజలపై దాడులు చేసింది. అనంతరం కంపెనీకి అమ్ముడుపోయిన కొద్దిమంది వ్యక్తులతో సిమిలిగూడ లాడ్జిలో "గ్రామ సభ" నిర్వహించి అనుమతులు ఇచ్చింది ప్రభుత్వం. దీని తర్వాత మైనింగ్ పనులు ప్రారంభించి, మట్టి తరలింపుకై "రాసలీల ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ"కి కాంట్రాక్టు ఇచ్చింది ఇండాల్‌కో. తమ భూములను, అడవిని కాపాడుకునేందుకు ప్రజలు "మాలి సురక్ష సమితి" పేరుతో సంఘటితం అయ్యారు. ప్రభుత్వ కంపెనీ దళారుల కుట్రలను, మోసాలను ఎదుర్కొంటూ, ఉద్యమాన్ని బలోపేతం చేశారు. ఈ క్రమంలో అనేక సంఘర్షణలు, కొట్లాటలు జరిగి, అనేక మంది ప్రజలపై వందలాది కేసులు మోపబడ్డాయి. అయినప్పటికీ ప్రజలు వెనక్కి తగ్గలేదు. అంతేకాదు 2014, జనవరిలో మట్టి తరలింపుకై కంపెనీ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడంలో భాగంగా 30 వాహనాలనూ, కంపెనీ ఆఫీసునూ, అందులోని కంప్యూటర్లు, సి.సి. కెమెరాలనూ, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ సమయంలో ఆందోళనకారులను నిలువరించేందుకు వచ్చిన పోలీసు అధికారులను సైతం కొట్టారు. దాంతో "రాసలీల ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ" తన ప్రయత్నాలను విరమించుకొని వెనక్కి వెళ్ళిపోయింది. దాంతో కంపెనీ అనుకూల మూడు గ్రామాల దళారులు తాము కూడా కంపెనీ వ్యతిరేక పోరాటంలో కలిసి వస్తామని రాజీకి ముందుకు వచ్చారు. అనేక దఫాల చర్చల అనంతరం కేసుల ఎత్తివేతకై ఇరు వర్గాల నడుమ ఒప్పందం కుదిరింది. కంపెనీపై ప్రజలు సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి ఏటా జనవరి నెలలో మాలి పర్వతంపై "బంధుమిలన్" పేరుతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనికి ఒడిశాలోని విస్తాపన వ్యతిరేక సంఘాలు, మేధావులు, పర్యావరణవాదులు హాజరవుతూ, ఒకరికొకరు బాసటగా నిలుస్తున్నారు. మాలి సురక్ష సమితి ఇంతటితో ఆగకుండా కొరాపుట్‌లోని ఇతర ప్రాంతాలలో విస్తాపన సమస్యను ఎదుర్కొంటున్న ప్రజలకు అన్ని రకాల మద్దతు, మార్గదర్శకత్వాన్ని అందిస్తున్నది. విస్తాపన ఇతర సామాజిక సమస్యలపై స్పందిస్తూ ఆందోళన చేస్తున్నది. ఈ క్రమంలో 2016లో ఒడిశాలోని

కందమాల్ జిల్లాలో 'గుముడుమహా' వద్ద ప్రజలపై ఎస్.ఒ.జి. బలగాలు జరిపిన బూటకపు ఎదురు కాల్పులను నిరసిస్తూ "ఆగస్టు 3"న కొరాపుట్ బంద్ జరపాలని ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపుకు ప్రజలు అనూహ్యంగా స్పందించి స్వచ్ఛందంగా బందును విజయవంతం చేశారు. దీన్ని తట్టుకోలేని ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం కక్ష సాదింపు చర్యలకు పూనుకొని, నాయకత్వాన్ని అరెస్టులు చేసింది. అంతేకాకుండా కంపెనీకి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటాన్ని అణచివేసేందుకు వారికి అండగా వున్న మావోయిస్టు పార్టీని నిర్మూలించేందుకు కూంబింగ్ ఆపరేషన్లు ముమ్మరం చేసింది. ఈ క్రమంలో 16-9-2017 బిత్తరకోట గ్రామానికి చెందిన "దాసుకోరా" అనే సంఘ కార్యకర్తను అరెస్ట్ చేసి, జైలుకు తరలించారు. ఇది జరిగి నెల రోజులు కూడా గడవకముందే "కుందిలి అత్యాచార ఘటన" జరిగింది. ఈ ఘటనకు నిరసనగా ప్రజలు చేపట్టిన ఆందోళన, ప్రదర్శనలను తుంగలో తొక్కి "అసలు అత్యాచారమే జరగలేదని" నిస్సిగ్గుగా ప్రకటించింది ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం. ప్రతిపక్షాలు ఓట్ల రాజకీయాలకై ఆందోళనలో పాల్గొని, నిందితుల అరెస్ట్ డిమాండ్ గాలికొదిలి, కేవలం నష్టపరిహారంకై ప్రతిపాదించాయి. పై సంఘటనలు మన వ్యవస్థలో వున్న లోపాన్ని తెలియచేస్తున్నాయి. పోలీసులు మహిళలపై జరిపిన అత్యారాచాలలో ఇది మొదటిది కాదు, చివరిది అంతకన్నా కాదు. 10 సం॥ల క్రితం వాకపల్లి, బల్లుగూడలలో గ్రేహౌండ్స్ బలగాలు చేసిన అత్యాచార కేసులో నేటికి బాధితులకు న్యాయం జరగలేదు. దండకారణ్యంలో సల్వాజుడుం కాలం నుండి మహిళలపై జరుగుతున్న పోలీసు అత్యాచారాలు లోకవిదితమే. వాటిలో ఇడిమె అనే మైనర్ బాలికను అత్యాచారంతో పాటు హత్య చేసి, ఆలీవ్ గ్రీన్ దుస్తులు తొడిగి, ఎన్‌కౌంటర్‌గా చిత్రించిన పోలీసు బలగాల దుర్మార్గ ఉన్మత్తకాండ దేశ ప్రజలకు సుపరిచితమే. ప్రజల యొక్క ప్రజాస్వామిక ఆందోళన, నిరసనను అణచివేయడానికి మహిళలపై అత్యాచారాన్ని ఒక ఆయుధంగా ఉద్దేశపూర్వకంగా ఉపయోగిస్తున్నాయి ప్రభుత్వ పోలీసు యంత్రాంగాలు. అటువంటి ప్రభుత్వాల నుండి బాధితులకు న్యాయం జరుగుతుందని ఆశించడం మన భ్రమే అవుతుంది.

తరతరాలుగా ఆదివాసీలు, పీడిత ప్రజలు కాపాడుకుంటూ వస్తున్న భూమి, అడవి, ఖనిజసంపదను బహుళజాతి కంపెనీలకు అప్పగించేందుకై "అపరేషన్ గ్రీన్‌హంట్" పేరుతో వారిపై యుద్ధాన్ని ప్రకటించి అమలు చేస్తున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. ఈ కారణంగా నిరంతరం పోలీసు, పారా మిలటరీ బూట్ల చప్పుళ్ళతో దాడులు, పంటల-ఆస్తుల నష్టం, అరెస్టులు, మహిళలపై అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లతో గ్రామాలు భీతిల్లుతున్నాయి. అటవీ ఉత్పత్తుల సేకరణ, ఇతర దైనందిన అవసరాలకు ప్రజలు ధైర్యంగా తిరగలేనిస్థితి నెలకొంది. ప్రజల ప్రజాస్వామిక, మౌలిక హక్కులు కాలరాచి వేయబడుతున్నాయి. ఆదివాసీ ఇతర సెక్షన్‌ల ప్రజానీకం తమ అస్థిత్వాన్ని, ప్రజాస్వామిక హక్కులను భూమి, అడవి, నీరులపై అధికారాన్ని కాపాడుకోవాలంటే, సాయుధులై ప్రభుత్వ పోలీసు బలగాల(ఆపరేషన్ గ్రీన్‌హంట్)ను ఓడించి తీరాలి. అంతేకాదు ఈ దేశంలో కొనసాగుతున్న దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య, సామ్రాజ్యవాదుల పాలనను కూలదోసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, నాలుగు వర్గాల (కార్మిక, కర్షక, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువా)అధికారాన్ని నెలకొల్పాల్సి వుంటుంది. దీనికై పీడిత ఆదివాసీలతో పాటు, దేశంలోని పీడిత వర్గాలు, ఇతర సెక్షన్‌ల ప్రజానీకం విశాల ఐక్య సంఘటనగా ఏర్పడి దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలి. ✦

---



**"పోరాడి ఓడిపోవడం కంటే, పోరాడకుండా లొంగిపోవడం ద్వారానే ప్రజానీకం ఎక్కువగా డీమోర -లైజేషన్‌కు గురి అయి నైతికధృతినీ, మనో నిర్బరాన్నీ కోల్పోయి దిగజారిపోయిన సందర్భాలెన్నో 1848, 1871 విప్లవాలలో మనకు కనిపిస్తాయని మార్క్స్ చెప్పారు"**

-కామ్రేడ్ లెనిన్

పోరాట ప్రవంతి

# ఎ.ఒ.బి.లో రాజ్యాధికార లక్ష్యంతో కొనసాగుతున్న వ్యవసాయక విప్లవ, నిర్వాసితత్వ వ్యతిరేక పోరాటాలు

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో నేటికీ ప్రజల సమస్యలలో భూమి సమస్యనే కీలకమైంది. దేశంలో అర్ధవలస-అర్ధభూస్వామ్య ఉత్పత్తి సంబంధాల మూలంగా, ఒకవైపున భూస్వాముల కంబంధ హస్తాలలో భూమి బంధించబడి ఉండటంవల్లనూ, మరోవైపు సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు, దేశీయ కార్పొరేట్ సంస్థలు 'అభివృద్ధి' పేరుతో లక్షలాది మంది రైతాంగం నుండి బలవంతంగా భూమి గుంజుకొని విస్తాపితుల్ని చేయడం వల్లను, విశాల రైతాంగానికి భూమి సమస్య కేంద్ర బిందువుగా మారింది. పర్యావసానంగా రైతాంగం ఒకవైపున భూస్వాముల నుండి దున్నేవారికే భూమి ప్రాతిపదికన భూఆక్రమణ పోరాటాలనూ, మరోవైపు బహుళజాతి సంస్థల, కార్పొరేట్ సంస్థల వక్రమైన అభివృద్ధి కార్యక్రమం వల్ల ఏర్పడే విస్తాపితత్వం నుండి తమ భూములను రక్షించుకునే పోరాటాన్ని, దోపిడీ పాలక వర్గాలకు వారి రాజ్యానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారు.

కొరాపుట్ జిల్లాలోని నారాయణపట్న, బందుగాం బ్లాక్‌లలో భూ సమస్య కేంద్రంగా, ఉవ్వెత్తున ఎగిసిన సాయుధ రైతాంగ పోరాటం, భూస్వాముల, ప్రభుత్వ సాయుధ బలగాల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించింది. పీడిత ప్రజలలో పోరాట స్ఫూర్తిని నింపింది. అయితే ఈ పోరాటాన్ని అణిచివేయడం కోసం, ప్రభుత్వం భూస్వాములకు అండగా సాయుధ బలగాలను పంపి, కార్పెట్ సెక్యూరిటిని ఏర్పాటు చేసి, రైతాంగంపై తీవ్రమైన దమనకాండను అమలు చేసింది. పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ. అండతో రైతాంగం ప్రతిఘటించారు. 2012 నాటికి ఈ ఉద్యమం ఉన్నత దశకు చేరింది. ఒకవైపు తీవ్రతరమైన ప్రభుత్వ సాయుధ బలగాల దాడి, అక్రమ అరెస్టులు, జైలు నిర్బంధాలు, బూటకపు ఎన్‌కౌంటర్‌లు పెరిగాయి. మరొకవైపు ఈ దాడిని ప్రతిఘటించి, ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోయే, రాజకీయ సంసిద్ధత లేని చసి మూలియా సంఘ నాయకుడు నాచికలింగ మితవాద, అవకాశవాద రాజకీయాలతో, స్థానిక సంస్థల ఎన్నికలలో పాల్గొనాలనే దానిని ఒక ఎత్తుగడగా ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చాడు. ఈ రివిజనిస్టు రాజకీయాలు ప్రజలను గందరగోళపర్చాయి. ఒక వైపు శత్రువు దాడి, మరొక వైపు స్థానిక నాయకత్వ విద్రోహం వలన ప్రజలు వెనుకడుగు వేశారు. భూస్వాములు, వారికి అండగా వున్న ప్రభుత్వం విజయం సాధించింది. సాయుధ రైతాంగ పోరాటం 2013 నాటికి తాత్కాలికంగా వెనకపట్టు పట్టింది. భూస్వాముల నుండి స్వాధీనం చేసుకొని, సాగు చేసుకున్న భూములు కొన్నింటిని సాయుధ బలగాల అండతో తిరిగి భూస్వాములు స్వాధీనం చేసుకోగా, మరికొన్ని భూములు ప్రజల సాగులో వున్నాయి. ఇప్పటికీ ఎక్కువ భూములు పడావు పడి వున్నాయి. ప్రజానిర్మాణాలు దెబ్బతినిపోవడం, శత్రువుకు సమాచారం యిచ్చే కొందరు ఏజెంట్లు తయారు కావడం, ప్రజలలో తలెత్తిన రాజకీయ గందరగోళం, అవిశ్వాసం, ఓటమి ప్రభావం వంటి సంక్లిష్ట పరిస్థితులు ఏరియాలో నెలకొన్నాయి. ఇటువంటి పరిస్థితులలో పార్టీ, స్వీయాత్మక శక్తులను నష్టపోకుండా రక్షించుకునే ఎత్తుగడలు అవలంబిస్తూ, రహస్యంగా ప్రజలను కలుస్తూ, లింగ మితవాద, అవకాశవాద రాజకీయాలను ఎండగడుతూ, ప్రజాయుద్ధ రాజకీయాలతో గత మూడు సం॥లుగా కృషి చేస్తూ వచ్చింది. పార్టీ చేపట్టిన, ఓపికతో కూడిన ఈ రాజకీయ కృషి వలన, శత్రువు ఎత్తుగడలను త్రిప్పిగొట్టగలిగింది. రహస్యంగా ప్రజలు ప్రజా నిర్మాణాలలో చేరి, పని చేసే సంసిద్ధతను పెంచింది. ఈ రాజకీయ కృషి మూలంగా ప్రజలు తమ విముక్తికి సరైన మార్గమేమిటో అర్థం చేసుకుంటున్నారు. గత పోరాట అనుభవాలు, గుణపాఠాల నుండి నేర్చుకున్న విషయాల ఆధారంగా సరైన పోరాట, నిర్మాణ ఎత్తుగడలతో ముందుకు వస్తున్నారు. బందుగాం బ్లాక్‌లో తిరిగి భూ ఆక్రమణ, పంపిణీ సాగు చేసుకొనే పోరాటం కొన్ని గ్రామాలలో ప్రారంభమైంది. ఈ క్రమంలోనే కత్తులపేట భూస్వాముల సెంటు గడ్డి (లెమన్ గ్రాస్)భూములలో నాలుగు గ్రామాల ప్రజలు జండాలు పాతి తిరిగి ఆక్రమించుకున్నారు. ప్రజలు తమ భూమి సమస్యను పరిష్కరించుకోవడానికి కొత్త రూపాలలో ముందుకు వస్తారనడానికి ఇవి సంకేతాలు.

మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియా; విశాఖ జిల్లా, పెదబయలు ఏరియాలలో గత 2సం॥లుగా దున్నేవారికే భూమి నినాదంతో సాగుతున్న వ్యవసాయక విప్లవ కార్యక్రమంలో భూస్వాముల భూములనూ, కొందరు తెగ పెద్దల అక్రమ ఆక్రమణలో వున్న ప్రజల భూములనూ, అసైన్డ్ భూములను విప్లవ రైతుకూలి సంఘం నాయకత్వంలో పేదరైతాంగం స్వాధీనపర్చుకొని, పంపిణీ చేసుకొని సాగు చేసుకుంటున్నారు. సాగు భూమి తక్కువగా వున్న గ్రామాలలో, భూమి చదును కార్యక్రమం చేపట్టి, భూమిలేని పేదలకు భూములు అందిస్తున్నారు. మరి కొన్ని గ్రామాలలో భూ పంపిణీకి భూములు లేని చోట, వ్యవసాయ కూలీ, పేద రైతాంగం భూ సమస్యలను పరిష్కరించడంలో భాగంగా, గ్రామంలోని భూమంతటిని సమిష్టి భూమిగా మార్చి, సమిష్టి వ్యవసాయాన్ని చేపట్టి, పండిన పంటలను సమానంగా పంచుకుంటున్నారు. భూములను సాగులోకి తేవడానికి దుక్కిటెద్దులు, అరకలు వంటి ఉత్పత్తి సాధనాలు అందరివద్ద లేనప్పుడు, ఈ సమస్యను పరిష్కరించడంలో భాగంగా గ్రామంలో శ్రమ సహకార టీంలను ఏర్పర్చుకోవడం చేస్తున్నారు. అలాగే ఒంటరి

మహిళల, వృద్ధుల, వ్యవసాయ పనుల సమస్యను కూడా సహకారతత్వంతో పరిష్కరించుకుంటున్నారు. ఈ కార్యక్రమం అనేక గ్రామాలకు విస్తరించి, ప్రజలు ఒక ఉద్యమంలా కొనసాగిస్తున్నారు.

ఇవి వెనుకబడిన ఆదివాసీ ప్రాంతాలు కావడం, దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యం తోడవటంతో ఇక్కడ వ్యవసాయం చాలా వెనకబడి వున్నది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రైతాంగ సదస్సులు నిర్వహిస్తూ, వారి అవగాహనను పెంచే కృషి కొనసాగుతున్నది. పశుసంరక్షణ, పంటల మార్పిడి, కూరగాయల సాగును ప్రోత్సహించడం జరుగుతున్నది. ఈ ప్రాంతంలో మొదట లాభాల కోసం ధనిక రైతులు గంజాయి సాగును చేయడం ప్రారంభించారు. క్రమంగా అది మధ్య, పేద రైతులకు కూడా విస్తరించింది. ఆ పేద రైతులు ఉపాధిలేమి సమస్యనుండే ఈ సాగును ప్రారంభించారు. వాస్తవంగా ఈ సాగు వల్ల రైతులు పొందిన దానికంటే వ్యాపారులు, మధ్య దళారీలు, పోలీసు అధికారులు అక్రమంగా సంపాదించుకున్నది ఎన్నో రెట్లు వుంటుంది. పేద, మధ్య తరగతి రైతులు అమ్మకాల సందర్భంగా షావుకార్ల మోసానికి గురైన సంఘటనలు అనేకం వున్నాయి. మరోవైపు క్రమంగా గ్రామాలలో ఒక సెక్షన్ శ్రమకు దూరం కావడం, మొబైల్స్, మోటర్ సైకిళ్ళు, పెళ్ళిళ్ళలో ఆర్థిక దుబార, లంపెనైజన్ వంటి ఆర్థిక దుబార, ఇతర అరాచకపు ధోరణులకు ప్రభావితులవుతున్నారు. ఈ సమస్య మూలాలను అర్థం చేసుకొని ప్రజలను దీని నుండి బయటకు తీసుకురావడానికి గత 3 సం॥లుగా పార్టీ, ప్రజా సంఘాలు చేసిన రాజకీయ కృషి ఫలితంగా, క్రమంగా గంజాయి సాగు విస్తీర్ణం తగ్గి, ఈ సం॥రం ఆహర (సాంప్రదాయిక) పంటల సాగు విస్తీర్ణం పెరిగింది.

పోలీసులు, రాజకీయ నాయకులు, వ్యాపారులు గంజాయి మాఫీయాగా మారి లక్షలు, కోట్లలో ఆస్తులు కూడగట్టారు. పోలీసులు, రాజకీయ నాయకులు పైకి గంజాయికి వ్యతిరేకంగా ఫోజులు పెడుతూ, పార్టీ వలనే ఆదివాసీ ప్రాంతాలలో గంజాయికి ప్రోత్సాహం లభిస్తున్నదని దుష్ప్రచారం చేస్తున్నారు. మరోవైపు అక్కడక్కడ తాము గంజాయి సాగుకు వ్యతిరేకమని చెప్పుకునేందుకు గంజాయి తోటల ధ్వంస కార్యక్రమం చేపడుతున్నారు. ఈ ధ్వంస కార్యక్రమాలు ప్రధానంగా పార్టీ నేతృత్వంలో పని చేస్తున్న పేద, మధ్య తరగతి రైతుల గంజాయి తోటలపైనే జరుగుతున్నాయి. అక్కడక్కడ కంటి తుడుపుగా ఇతర ప్రాంతాలలో కూడా గంజాయి తోటల ధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. వాస్తవంగా గంజాయి వ్యాపారంలో లక్షలు దండుకుంటున్న వీరికి, గంజాయి సాగును నిరోధించాలనే చిత్తశుద్ధి ఏ మాత్రం లేదు. ప్రజలు మాత్రం ఒక వైపున పోలీసు దాడులను మిలిటెంట్‌గా ఎదుర్కొంటునే మరోవైపు పార్టీ ఇచ్చిన చైతన్యాన్ని అందుకొని, క్రమంగా గంజాయి సాగు నుంచి బయటపడుతున్నారు.

విశాఖపట్నం జిల్లాలోని కోరుకొండ, గాలికొండ ఏరియాలలో ఎ.పి.ఎఫ్.డి.సి. ఆధీనంలో వున్న సుమారు 1500 హెక్టారుల కాఫీ ఎస్టేట్‌లను విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో ప్రజలు స్వాధీనం చేసుకొని సాగుచేసుకుంటున్నారు. పోలీసులు గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు చేసి, తప్పుడు కేసులు బనాయించినా, పంటల సీజన్‌లో పోలీసులే స్వయంగా కాఫీ తోటలను తగుల బెట్టినా, సాగుకు అవసరమయిన ఎరువుల కొనుగోలు సరఫరాలను అడ్డుకున్నా, ప్రజలు మాత్రం పి.ఎల్.జి.ఎ. రక్షణలో కాఫీ ప్లాంటేషన్లను వదలకుండా సాగు చేసుకుంటున్నారు. ఈ పోరాటం కొత్త ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నది. ఈ సం॥రం ఎ.పి.ఎఫ్.డి.సి. అధికారులు మేక తోలు కప్పుకున్న పులి చందంగా గ్రామాలలోకి వచ్చి ప్రజలతో సమావేశాలు నిర్వహిస్తూ, తిరిగి కాఫీ తోటలు ఎ.పి.ఎఫ్.డి.సి.కి అప్పగిస్తే, ప్లాంటేషన్ల నిర్వహణలో మెరుగుదల తెస్తామనీ, మీకు కూలీ పనులు కల్పిస్తామని బొంకుతూ ప్రజాభిప్రాయాన్ని కోరారు. వీరి ప్రతిపాదనను నిర్మొహమాటంగా, ప్రజలు తిరస్కరించడంతో పాటు, ఈ అడవి మీద అధికారము మాదేనని ఖచ్చితంగా తేల్చి చెప్పడంతో ఎ.పి.ఎఫ్.డి.సి. అధికారులు తోక ముడిచారు.

## నిర్వాసితత్వ వ్యతిరేక పోరాటాలు

ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో, దేవమాలి పర్వతంలో బాక్సైట్ ఖనిజం తవ్వకాల కోసం ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న కార్పొరేట్ కంపెనీని అడ్డుకుంటూ అన్ని వర్గాల, సెక్షన్‌ల ప్రజలు, ప్రజా సంఘాలు కలిసి ఐక్య పోరాట కమిటీగా ఏర్పడి పోరాడుతున్నారు. కంపెనీ సమీప గ్రామాల ప్రజలలో చీలిక తెచ్చి, ఒక సెక్షన్‌ను ఆర్థిక సహాయం, ఉపాధి పాకేజ్‌తో లొంగదీసుకునే ప్రయత్నం జరిగింది. యాజమాన్యం గుండాలను పెంచి పోషించి, పోరాడే నాయకత్వాన్ని హత్య చేయించడానికి కుట్రలు చేసింది. ప్రభుత్వ సాయుధ బలగాలతో దాడులు, అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు బనాయించింది. అయితే ప్రజలు అడవిపైనా, భూమిపైనా, నీటిపైనా హక్కు మాదేనంటూ, సంఘటిత పడుతూ ఉద్యమాన్ని వివిధ రూపాలలో మరింత మిలిటెంట్‌గా కొనసాగిస్తున్నారు. ప్రజల ప్రతిఘటన ముందు ప్రభుత్వం, గనుల మాఫియా తోక ముడచక తప్పడం లేదు.

ఇదే ఏరియాలో, మరికొన్ని ప్రాంతాలలో, గనుల తవ్వకాలకు ప్రభుత్వంతో ఎమ్.ఒ.యు.లు కుదుర్చుకున్న బహుళజాతి కంపెనీల ప్రయత్నాలు, ప్రజల ప్రతిఘటన మూలంగా విఫలమైనాయి.


విశాఖపట్నం జిల్లాలో, బాక్సైట్ తవ్వకాలకు ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుమతినిస్తూ జి.ఒ.నెం.97.ను తెచ్చింది. రహస్యంగా పీసా కమిటీలు పెట్టింది. పునరావాస కమిటీలంటూ హంగామా చేసింది. ప్రజల ఆమోదం వుందని తప్పుడు నివేదికలు సృష్టించింది. "ప్రాణాలైన ఇస్తాం, బాక్సైట్ తవ్వకాలకు అనుమతివ్వం" అంటూ ఆదివాసీలు ఏకమై ముక్తకంఠంతో నినదించారు. పీసా, పునరావాస కమిటీలలో చేరిన దళారీలను ప్రజల్లో పెట్టి విచారించి, శిక్షలు విధించారు. ప్రజాభిప్రాయ సేకరణంటూ, ప్రభుత్వం ఆడిన దొంగ నాటకాలను ప్రజలు బహిష్కరించి బహిరంగ పరిచారు. అధికారులెవ్వరిని మన్యంలో అడుగుపెట్టకుండా తరిమి కొట్టారు.

బాక్సైట్ తవ్వకాలకు మద్ధతుగా అధికార టి.డి.పి. నాయకులను బంధించారు. పోలీసులు వస్తే ప్రతిఘటించారు. పోలీసు క్యాంపులు ఏర్పాటు చేయడానికి చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. ఆదివాసీల ఈ న్యాయమైన పోరాటానికి మైదాన ప్రజల, ప్రజాస్వామిక వాదుల సంఘీభావం లభించింది. ఎన్నికల ప్రయోజనాల కోసమే, ప్రతిపక్షాలైన వై.ఎస్.ఆర్. కాంగ్రెస్, రివిజనిస్టు సి.పి.ఐ., సి.పి.ఎమ్.లు బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకించాయి. అయితే పార్టీ ఒక వైపున వీరి అవకాశవాద రాజకీయాలను ఎండగడుతూ, మరో వైపున క్షేత్ర స్థాయిలో వీరితో కలిసి ప్రజలను పెద్ద ఎత్తున కదిలించి ఉద్యమించడంతో, బాక్సైట్ తవ్వకాలు చేపట్టడం సాధ్యం కాదని భావించిన ప్రభుత్వం, జి.ఒ.నెం.97ను తాత్కలికంగా నిలిపివేసింది.

ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న సి.పి.ఐ(మావోయిస్టు) పార్టీని దెబ్బతీయకుండా, ప్రజలను లొంగదీసుకోవడం సాధ్యం కాదని గ్రహించిన ప్రభుత్వం ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను మరింత తీవ్రతరం చేసింది. ప్రజల మధ్య చీలికలు తీసుకురావడానికి, ప్రజల నుండి ఒక దళారీ సెక్షన్‌ను కో-ఆప్ట్ చేసుకొని, కుట్రలు చేయ చూస్తున్నది. 'అభివృద్ధి' పేరుతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (మౌళిక సదుపాయాలు: రోడ్లు, కమ్యూనికేషన్స్ మొదలగు కార్యక్రమాలు) మెరుగుపరచడం మీద దృష్టి పెట్టింది. పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించింది. సెల్‌టవర్స్ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నది. కొత్తగా అనేక చోట్ల పోలీసు క్యాంపుల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి, కేంద్రానికి నివేదికలు పంపింది. ప్రజలు వైద్యం అందక అనారోగ్యాలతో పిట్టల్లా రాలిపోతున్నా, రూపాయి ఖర్చు చేయడానికి సిద్ధంగా లేని ప్రభుత్వం, వేలకోట్ల రూపాయలు వెచ్చించి రోడ్లు, కమ్యూనికేషన్స్ అభివృద్ధిపై కేంద్రీకరిస్తున్నది. ప్రభుత్వం 'అభివృద్ధి' పేరుతో చేస్తున్న ఈ సర్కస్ ఫీట్‌లన్నీ బాక్సైట్ తవ్వకాల కోసమేనని ప్రజలు అర్థం చేసుకున్నారు. అందుకే పార్టీ పిలుపుతో ప్రజలు రోడ్ల నిర్మాణం, సెల్‌టవర్స్, పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. ఇదంతా అభివృద్ధిని అడ్డుకోవడమేనని ప్రభుత్వం, పోలీసులు 'గోబెల్స్' ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో దారకొండలో పోలీసు క్యాంపు పెట్టాలని ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని ఆ ప్రాంత ప్రజలు తిప్పికొట్టారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌ను పి.ఎల్.జి.ఎ. నాయకత్వంలో ప్రజలు ధ్వంసం చేశారు. దీనిని సాకుగా తీసుకొని, ప్రభుత్వం 200 మంది ప్రజలపై తప్పుడు కేసులు బనాయించి, అరెస్ట్ చేయడం, సరెండర్ కమ్మని బలవంతం చేయడం వగైరా పద్ధతులను అనుసరించింది. ఈ నిర్బంధానికి వ్యతిరేకంగా వివిధ ప్రజా సంఘాలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, కవులు, కళాకారులు, ప్రతిపక్షాలు ఐక్యంగా ప్రతిఘటిస్తున్నారు. ఈ నిరసనను, ప్రతిఘటనను మరింత సమరశీలంగా చేపట్టేందుకు ఐక్య కార్యాచరణను నిర్మించాల్సిన అవసరం వున్నది. ఈ ఐక్య కార్యాచరణలో, భాగస్వాములైన స్థానిక బూర్జువా, రివిజనిస్టు పార్టీల దివాళాకోరు ఎన్నికల రాజకీయాలను ఎండగడుతూ, ప్రజలను పార్టీ నేతృత్వంలోకి సమీకరించాల్సిన అవసరం వున్నది. ఈ సందర్భంగా "బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుందాం. మన్యం మనుగడను కాపాడుకుందాం" అనే నినాదాన్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్ళాలి. ✦

## ఎమ్.కె.వి.బి. డివిజన్

# అమరుల వీరోచిత త్యాగాలను ఎత్తిపడుతూ, వారి ఆశయ సాధనకు అంకితం అవుదాం అంటూ, గ్రామ, గ్రామాన జరిగిన అమరుల సంస్మరణ వారోత్సవాలు





జులై 28, 2017 అమరుల వారోత్సవాల సందర్భంగా, రాంగూడ అమరుల జ్ఞాపకార్థం, గురుశెట్టి చౌక్ వద్ద స్మారక భవనాన్ని నిర్మించుకొని, బహిరంగ సభను జరుపుకున్న విప్లవ ప్రజానీకం




**పార్టీ పిలుపునందుకొని జులై 28, 2017 అమరుల వారోత్సవాలను జరుపుకున్న కటాఫ్, పెదబయలు (కొజరుగూడ, పనసపుట్, తోటగూడ, జమ్మ, కొసుంపుట్) ఏరియాల విప్లవ ప్రజా సంఘాలు**

**16 గ్రామాల విప్లవ ప్రజానీకం సమిష్టిగా ఏకమై రాంగూడ అమరుల గుర్తుగా దర్లబెడ చౌక్ వద్ద నిర్మించుకున్న స్మారక భవనం**

భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయాన్ని లక్ష్యంగా ఎంచుకొని, ఎమ్.ఎల్.ఎమ్. సిద్ధాంతాన్ని ఆయుధంగా చేబూని, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గం ద్వారా పీడిత ప్రజల విముక్తికి, వారి రాజ్యాధికారం కోసం సర్వస్వాన్ని ధారపోసి, చివరకు ప్రాణాలను సైతం ఫణంగాపెట్టి పోరాడుతూ, రాజ్యం హత్యాకాండలో ఎందరో విప్లవకారులు, విప్లవ ప్రజలు, విప్లవ అభిమానులు అమరులవుతున్నారు. ఈ అమరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం జులై 28 (చారుమజుందారు అమరత్వం పొందిన దినం) నుండి వారం రోజులు గ్రామ, గ్రామాన పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజా సంఘాల నేతృత్వంలో ప్రజలు విస్తృతంగా కదిలి, సంస్మరణ సభలు జరుపుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో, విప్లవోద్యమ సమూల నిర్మూలన కోసం అత్యంత అమానవీయంగా, పాశవికంగా పార్టీ, ప్రజలపై సాయుధ హంతకదాడిని కొనసాగిస్తున్నది. ఈ దాడిని ప్రజాయుద్ధం ద్వారా ప్రతిఘటిస్తూ, ఎ.ఒ.బి.లో విప్లవోద్యమాన్ని పురోగమింపచేసే కృషిలో, 2016 జులై నుండి 2017 జులై వరకు వివిధ స్థాయిలకు చెందిన 36 మంది కామ్రేడ్స్ తమ రక్త తర్పణతో మన విప్లవ మార్గాన్ని మరింత ప్రకాశవంతం చేసి, ఎర్రజెండాను ఎరుపెక్కించి,

పోరాడే ప్రజలకు మార్గదర్శకులుగా, పదనిర్దేశకులుగా, ఆదర్శ ప్రాయులుగా నిలిచారు. అమరులైన 36 మంది కామ్రేడ్స్‌లో 31 మంది 2016, అక్టోబర్ 24-27 మధ్య మల్కనగిరి జిల్లా, రాంగూడ గ్రామం వద్ద జరిగిన భారీ ఎన్‌కౌంటర్ హత్యకాండలోనే అమరులు కాగా, 2017, ఫిబ్రవరి 24న విశాఖపట్నం జిల్లా, గొర్లమెట్ట వద్ద జరిగిన, బూటకపు ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్స్ జాంబ్రి, చిట్టిబాబులూ, 2017, మార్చి 9వ తేదీన కొరాపుట్ జిల్లా వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ కాంత(పద్మ), కామ్రేడ్ టుబ్రి(అంకు)లు అమరులయ్యారు. 2017, జూన్ 1న మల్కనగిరి జిల్లా కప్పతొట్టి వద్ద కామ్రేడ్ చిన్నాబ్బాయిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు.

ఈ ఎన్‌కౌంటర్ హత్యకాండలలో పాల్గొన్న పోలీసులకు ప్రభుత్వం అవార్డులు, రివార్డులతో సత్కరించింది. ఎ.ఒ.బి.లో పార్టీనీ, విప్లవోద్యమాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసామనీ, విప్లవోద్యమం తిరిగి తలెత్తే అవకాశం లేదనీ, పోలీసులు పెద్ద ఎత్తున అసత్య ప్రచారం చేసి, బాక్సైట్ కార్పొరేట్ మాఫియాను, భూస్వాములను, ఎ.పి.ఎఫ్.డి.సి.ని, ప్రజా వ్యతిరేకులను సంతోషపెట్టేందుకు ప్రయత్నించారు. ప్రజలలో, పార్టీ క్యాడర్‌లలో ఆత్మవిశ్వాసం సడలింపజేసి, లొంగదీసుకోవాలని కుటిల పన్నాగాలు పన్నారు. అయితే వారి అంచనాలకు భిన్నంగా రాంగూడ అమరుల త్యాగం ప్రజలలో పార్టీ పట్ల, విప్లవ పంధా పట్ల మరింత విశ్వాసాన్ని పెంచాయి. విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు రాజ్యం వర్గ స్వభావాన్ని మరింతగా అర్థం చేసుకొని తీవ్రంగా నిరసించారు. ప్రజల న్యాయమైన, విప్లవ పోరాటానికి మద్దతును, సంఘీభావాన్ని ప్రకటించారు. పీడిత ప్రజలను ఈ నష్టాలు, బాధకు, దుఃఖానికి, విచారానికి గురి చేసినప్పటికీ, త్వరలోనే వారు కోలుకొని, పార్టీ రూపొందించిన 'నష్టాల సమీక్ష' వెలుగులో కర్తవ్యాలకు పదును పెట్టుకున్నారు. రాజ్యంపై అంతులేని వర్గ కసిని పెంచుకున్నారు. అమరుల ఆశయాలను మరింత దృఢంగా, పట్టుదలగా ముందుకు తీసుకుపోతామని ప్రతినబూనారు. అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ, విప్లవ రాజకీయ ప్రచారాన్ని చేశారు. అమరుల స్మారకార్థం, వారి పోరాట స్ఫూర్తిని ఎత్తిపడుతూ, జిల్లాలోని అనేక గ్రామాలలో శత్రువు దాడులను ఎదుర్కొంటూనే, అమరుల స్మారక స్థూపాలను, భవనాలను నిర్మించుకున్నారు.

మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలోని, పనసపుట్ పంచాయితీ, గురుశెట్టి గ్రామ చౌక్ వద్దా; జొడాంబ పంచాయితీ, దార్లబెడ గ్రామ చౌక్ వద్దా; ఒంద్రపల్లి పంచాయితీ, తోటగూడ గ్రామం వద్ద, రాంగూడ అమరుల స్మారకార్థంగా అమరుల స్మృతి భవనాలు నిర్మించుకున్నారు. ఈ భవన నిర్మాణానికి అయ్యే ఆర్థిక అవసరాలకు, వందలాది గ్రామాల నుండి ప్రతి కుటుంబం వారి ఆర్థిక స్తోమతపై ఆధారపడి 50/- నుండి మొదలు, 200/- వరకు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. ఇటుక, రాళ్ళు, ఇసుకను భవన నిర్మాణ స్థలాలకు చేర్చారు. భవన నిర్మాణ కమిటీ నేతృత్వంలో, ప్రతిరోజు ఒక్కొక్క గ్రామం చొప్పున వెళ్ళి, తాము వెంట తీసుకెళ్లిన ఆహార పదార్థాలతో వంట చేసుకొని తిని, భవన నిర్మాణానికి మండె ఎండలను లెక్క చేయకుండా పిల్లల నుండి వృద్ధుల వరకు పాల్గొన్నారు. ఒక్కొక్క భవన నిర్మాణాన్ని రెండు నెలలు శ్రమించి నిర్మించుకున్నారు. భవనం చుట్టు బౌండరి నిర్మాణం చేసి, పండ్ల, పూల మొక్కలు నాటారు. వీటిని నిర్మిస్తున్న సమయంలో శత్రువు నుండి రక్షించుకోవడానికి రాత్రి, పగలు కాపలా(సెంట్రీ) కాశారు.

**గురుశెట్టిలో స్మారక భవనం ఆవిష్కరణ :** ఈ సందర్భంగా శత్రువు భవన ఆవిష్కరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తాడని గ్రహించిన ప్రజలు, వాడి ఊహకు అందని విధంగా జులై 28కి ముందే భవన ఆవిష్కరణకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంలో భాగంగా జులై 10న ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్లాన్ చేసుకొని, 8న రాత్రి నుండి కటాఫ్‌కు శత్రువు ప్రవేశించడానికి వీలున్న అన్ని మార్గాలను కవర్ చేస్తూ, వందలాది మిలీషియా సెంట్రీలు ఏర్పాటు చేశారు. 9న సాయంత్రానికి, ప్రజలకు సభకు హాజరు కావాలని సమాచారం అందించారు. మీటింగ్ సమాచారం శత్రువుకు చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. సెల్‌ఫోన్‌లు రెండు రోజులు వాడవద్దని నిర్ణయించుకున్నారు. సెల్ నెట్‌వర్క్ వచ్చే స్థలాలలో సెంట్రీ పెట్టి, రహస్యంగా శత్రువు ఏజెంట్లు ఫోన్ చేయకుండా చూసారు. పనసపుట్, ఒంద్రపల్లి, జొడాంబ, ఆంధ్రలోని లక్ష్మీపూర్, బూసిపుట్, కుమ్మ, జాంగూడ పంచాయితీలోని వందలాది గ్రామాల ప్రజలు 9న రాత్రి నుండి కాలినడకన బయలుదేరి, ప్రయాణంలో వంటలు చేసుకొని తిని, 10న ఉదయానికి గురుశెట్టి గ్రామ చౌక్‌కు ఎర్రజెండాలు, బ్యానర్స్, అమరుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీ బ్యానర్స్ చేబూని, అమరులు కుటుంబాలకు సహాయం చేయడానికి ధాన్యం, బియ్యం, బట్టలు, వంట పాత్రలు పట్టుకొని ఊరేగింపుగా చేరుకున్నారు. దూర ప్రాంతాలనుండి వచ్చే ప్రజల ప్రయాణ మార్గంలో వున్న గ్రామాల ప్రజలు, వారికి ఆహారం, నీళ్ళు అందించారు.

ఈ కార్యక్రమానికి రాంగూడ ఎన్‌కౌంటర్‌లో అమరులైన 9 మంది స్థానిక మిలీషియా తల్లిదండ్రులతో పాటు, బంధుమిత్రులు హాజరైనారు. వీరితో పాటు పెదబయలు ఏరియాకు చెంది అమరులైన 4గురు పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ కుటుంబాలు కూడా హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ, భవన ఆవిష్కరణ అమరుల కుటుంబ సభ్యులతో జరిగాయి. ఆ సందర్భంగా ప్రజల విప్లవ నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. అమరుల కుటుంబాలు, బంధుమిత్రుల దుఃఖంతో వాతావరణం గంభీరంగా మారింది. 8 నుండి 10 వేల మంది ప్రజలతో, జె.ఎన్.ఎమ్. కళాకారుల పాటలతో భారి ఊరేగింపు జరిగింది. ఆ తర్వాత సభా స్థలికి చేరుకున్నారు. అమరుల కుటుంబ సభ్యులు, సంఘ నాయకులు, ప్రజలు అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ వారి ఆశయాలను ముందుకు తీసుకుపోతామనీ ప్రతిన బూనుతూ ఉపన్యసించారు. వారి అమరత్వం లోటును భర్తీ చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. చివరగా

అమరుల కుటుంబాలను పరిచయం చేయగా వేలాది ప్రజలు ఆ కుటుంబాలకు సహాయంగా, ధాన్యం, బియ్యం, బట్టలు, వంటపాత్రలు, డబ్బులు అందజేసి, ఆర్థికంగా హార్థికంగా మీకు అండగా వుంటామని తెలియజేసారు.

గొప్ప విప్లవ రాజకీయ వాతావరణంలో స్థానిక ఆదివాసీ, విప్లవ సాంప్రదాయాలతో శత్రువు కళ్ళుగప్పి, ఈ సభను విజయవంతంగా జరుపుకున్నారు. ఈ సభ విజయంలో వందలాది వాలంటీర్ల, ప్రజల కృషి వున్నది. శత్రువు రావడానికి అవకాశమున్న దారులలోనూ, కొండలపైన వందలాది మంది వాలంటీర్లు, ప్రజలు రెండు రోజులు పాటు, సెంట్రీ, పెట్రోలింగ్‌లు నిర్వహించారు. 'ప్రజావీరులు మృత్యుంజయులు-ప్రజలే అజేయులు'నే చారిత్రక సత్యంపై ప్రగాఢ విశ్వాసం ఉంచుతూ, అమరుల లోటును భర్తీ చేద్దామనీ, పోరాడే ప్రజల నుండే తిరిగి నూతన విప్లవ నాయకత్వ శక్తులను అభివృద్ధి చేసుకుందామని ప్రతిజ్ఞ చేశారు. ప్రజలు నిర్మించుకున్న స్మారక భవనాలను ఉపయోగపడే విధంగా స్కూలుగానూ, లైబ్రరీగానూ, రేషన్ పంపిణీకి గాను ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఇదే కాలంలో అమరుల సంస్మరణ వారాన్ని పెద్ద ఎత్తున నిర్వహించమని పార్టీ ఇచ్చిన పిలుపునందుకొని అన్ని ఏరియాలలో అమరుల స్థూపాలను, ఆవిష్కరణ సభలను అనేక గ్రామాలలో చేపట్టారు.

### పెదబయలు ఏరియాలో స్థూపాలు

1. సుజరి-15 అడుగులు.

2. నానబరి-35 అడుగులు (10 గ్రామాల ప్రజలు వారాల తరబడి శ్రమించి నిర్మిచారు).

3. జాంగూడ

4. కొత్తూరు

5. గిన్నెలగరువు

### కటాఫ్ ఏరియా

1. దర్లబెడ- 20 అడుగులు, (5 గ్రామాల ప్రజలు కలిసి నిర్మించారు).

2. దకడపాదుర్- (3 గ్రామాల ప్రజలు కలిసి నిర్మించారు).

3. సిమిలిపొదుర్, ఉప్పచెరువు, సంతవీధి (నిరంతరం పోలీసు కూంబింగ్‌ల మధ్యనే వందలాది మంది ప్రజలు కదిలి స్థూపాల నిర్మాణం చేశారు).

4. బియాన్‌కుడి, జాంపుర్ల, కొజరిగూడ, మట్టికల్, లాడిగూడ, కొసంపూట్, సాకిరేవు, వంతలగూడ, కంఠవరం మొదలైన గ్రామాలలో స్థూపాల నిర్మాణం జరిగింది.

### కోరుకొండ ఏరియా

1. గోపురము కొండ- ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం (15 గ్రామాలకు చెందిన 500 మంది ప్రజలు కదిలి, ఒక రోజంతా పని చేసి, రాళ్ళతో అతి పెద్ద స్థూప నిర్మాణం చేసి, ఎర్ర జెండాను ఎగరవేశారు).

పై నిర్మాణలే కాకుండా ఎ.పి., తెలంగాణా మైదాన ప్రాంతాలలో రాంగూడ అమరులకు చెందిన స్థూపాలు అనేక చోట్ల నిర్మించారు. మల్కనగిరి జిల్లాలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడైన చిన్నబ్బాయి స్వగ్రామంలో స్థూపాన్ని నిర్మించారు. వీటిని నిర్మించడంలో కూడా వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

### శత్రు నిర్బంధాన్ని తిప్పికొడుతూ జరిగిన ప్రచార కార్యక్రమం

జులై 28 నుండి ఆగస్టు 3 వరకు, అమరవీరుల స్మారక వారోత్సవాలను, పార్టీ, ప్రజా సంఘాల నేతృత్వంలో ప్రజలు విస్తృతంగా కదిలి, పోస్టర్స్, అమరుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలు, బ్యానర్స్ ద్వారా, క్యాంపెయిన్ టీంల ద్వారా గ్రామ, గ్రామాన ప్రచారం నిర్వహించారు. అమరుల సంస్మరణ వారోత్సవాలను ప్రజలు జరుపుకోకుండా అడ్డుకోవడానికి వారం రోజుల ముందు నుండే ప్రత్యేక సాయుధ బలగాలు ఏరియాలలో, పెద్ద ఎత్తున కూంబింగ్‌లు ప్రారంభించి, ప్రజలను భయపెట్టాలని చూశాయి. పోలీసు కూంబింగ్‌లను దిక్కరించి, ప్రజలు పెద్ద ఎత్తున కదిలి గ్రామ, గ్రామాన అమరులను స్మరించుకుంటూ సభలు, సమావేశాలు జరిపారు. కోరుకొండలో గోపురం బీడింగ్‌పైన స్థూపం వద్ద వందలాది మంది ప్రజలు, మిలీషియా రక్షణలో సంస్మరణ సభ జరుపుకున్నారు. కటాఫ్ ఏరియాలో అనేక గ్రామాలలో ప్రతి ఇంటికి జులై 28న అమర జ్యోతులను వెలిగించి, ఇంటికొక ఎర్రజెండాను ఎగురవేశారు. 5, 10 గ్రామాలు కలిసి కొన్ని చోట్ల, మరికొన్ని చోట్ల ఏ గ్రామానికి ఆ గ్రామంలో వారంలో ఏదో ఒక రోజున గ్రామ ప్రజలంతా పనులు ఆపుకొని పెదబయలు, కటాఫ్ ఏరియాలోని ఆదివాసి సాంప్రదాయాలను కూడా జోడించి, సభ స్థలం వద్దకు పిల్లల నుండి వృద్ధుల వరకు తరలివెళ్ళి, సామూహికంగా వంటలు చేసుకొని తిని, అమరులను సంస్మరించుకున్నారు. ఈ సందర్భంగా అమరుల కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి డబ్బులు, బియ్యం, బట్టలు, వంట పాత్రలు తెచ్చి వారికి అందజేశారు. వారం రోజులు గ్రామాలలో ఒక విప్లవ వాతావరణం వెల్లివిరిసింది. ఈ సభలు విజయవంతం చేసుకోవడానికి ప్రజలే రక్షణ కోటగా నిలబడి, సెంట్రీలు, పెంట్రోలింగ్‌లు నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారులు ఈ సభలను అడ్డుకోవాటాన్ని చాలెంజ్‌గా తీసుకున్నారు. రాంగూడ ఎన్‌కౌంటర్ అమరుడు కామ్రేడ్ దాసురాం స్వగ్రామం వాకపల్లిలో నిర్మించిన స్థూపాన్ని స్థానిక జి.మాడుగుల పోలీసుస్టేషన్ ఎస్.ఐ. స్పెషల్ బలగాలతో వచ్చి, గునపాలతో కూల్చివేయాలని ప్రయత్నించగా, గ్రామ ప్రజలు, ప్రధానంగా మహిళలు ముందు వరుసలో నిలబడి, పోలీసులను ప్రతిఘటించడంతో తోకముడిచి వెనుదిరిగారు. ప్రజల శక్తి ముందు వీరు గడ్డిపోచలనేది మరోమారు

రుజువైంది. బూర్జువా ప్రసార సాధనాలు కూడా 'సంస్మరణల సభలను అడ్డుకోవడంలో పోలీసు యంత్రాంగం విఫలం అయ్యింది' అని రాయక తప్పలేదు. ఈ అమరుల సంస్మరణ వారోత్సవాలను ప్రజలు, పార్టీ నాయకత్వంలో ఒక రాజకీయ పోరాటంగా కొనసాగించారు. ఇవి మన విప్లవ రాజకీయాలను, ప్రజలలోకి తీసుకుపోవడానికి ఒక వేదికగా ఉపయోగపడ్డాయి. ఈ క్యాంపెయిన్ ప్రజలలో గొప్ప విప్లవోత్తేజాన్ని నింపాయి. మన ఉద్యమం లేని ప్రాంతాలలో కూడా ఈ సారి అమరుల వారోత్సవాలను జరిపినట్లుగా వార్తలు వచ్చాయి. అంటే అమరుల పట్ల, పార్టీ నాయకత్వం పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఈ సంఘటనలు నిదర్శనంగా భావించాలి.

## 2. విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో మద్యనిషేధం అమలుకై కొనసాగుతున్న పోరాటాలు

కటాఫ్ ఏరియాలో, విప్లవ మహిళా సంఘం నాయకత్వంలో, రైతుకూలీ సంఘం మద్దతునందించగా, మద్య నిషేధ పోరాటం ఊపందుకుంది. ఏరియాలో తయారు చేస్తున్న నాటుసారా, బయట నుండి తెచ్చిన బీర్లు, బ్రాందీ, సంతలలో, సెంటర్ గ్రామాలలోను విక్రయాలు విపరీతంగా పెరిగాయి. దానితో ప్రతిరోజు వందలు మొదలు వేల రూపాయలు ఖర్చు చేసి, ప్రధానంగా యువత మద్యం మత్తులో తేలియాడుతూ, శ్రమకు దూరం కావడం, అనారోగ్యాల పాలు కావడం, కుటుంబంలో ఘర్షణలు పెరగడం, మహిళలను కొట్టడం పెరిగింది. సామాజిక స్పృహను కోల్పోవడం, డబ్బుకోసం వక్రమార్గాలు అనుసరించడం జరుగుతున్నది. దీనితో, ముందు పై సమస్యలపై ప్రచారం చేసి, ప్రజల అవగాహనను పెంచి, అమ్మేవారికి, త్రాగేవారికి నచ్చచెప్పారు. అయినప్పటికీ అమ్మకాలు మానుకోకుండా, సంతల వద్ద జరుగుతున్న మద్యం వ్యాపారాన్ని బందు పెట్టించారు. రహస్యంగా అమ్ముతున్న కుంతులపొద్దూరు, గురుశెట్టి గ్రామలలో కొనసాగతున్న సారా వ్యాపారాన్ని బట్టబయలు చేసి, ఆ దుకాణాలను ధ్వంసం చేశారు. నాటు సారా తయారీ దారులకు అర్థం చేయించి, బంద్ చేయించారు.

## 3. పనసపుట్ మాజీ సర్పంచ్ అవినీతిపై ప్రజాకోర్టు

కటాఫ్ ఏరియాలోని పనసపుట్ మాజీ సర్పంచ్ అర్జున్ ప్రజావ్యతిరేకిగా, పోలీసు ఏజెంట్‌గా పని చేస్తున్నాడని ప్రజలు, పార్టీ నిలదీయడంతో, గ్రామం వదిలి ఒక సంవత్సర కాలం పారిపోయాడు. ఆ తర్వాత తప్పులు అంగీకరించి, తిరిగి గ్రామంలో వుంటున్నాడు. పంచాయితీలోని అందికల్, జాంగూడ, పనసపుట్ గ్రామాలలో 15 మంది సాధారణ రైతులపై మావోయిస్టులని పోలీసులు కేసులు పెట్టారని అబద్దాలు చెప్పి, వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని, ఒక్కొక్కరు 25,000/- చెల్లిస్తే వకీలుతో మాట్లాడి కేసుల్లేకుండా చేస్తాననీ, 2,50,000/- వసూలు చేశాడు. ఆ డబ్బుతో ట్రాక్టర్ కొన్నాడు. తనుకు దగ్గరి బంధువు అయిన ఒక మహిళాపై అత్యాచారం చేసి, ఆ కుటుంబంపై దాడి చేసి, కొట్టాడు. పైగా ఆ కుటుంబ పెద్దను తెగ నుండి బహిష్కరించాలని, తెగ పెద్దల ద్వారా నిర్ణయం చేయించాడు. వీడి అరాచకాలను భరించలేక ప్రజలు, దళం నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్రజా పంచాయితీ నిర్వహించారు. అర్జున్‌పై విచారణ జరుపగా తప్పులను అంగీకరించాడు. 500 మంది ప్రజల అభిప్రాయంపై ఆధారపడి, డబ్బులు వాపస్ యిప్పించడంతో పాటు, శిక్షగా దేహశుద్ది చేయడం జరిగింది. ఈ సంఘటన తర్వాత అవినీతి పరులైన మరికొందరు సంఘాల ముందు సరెండర్ అయి, అవినీతి చేసిన డబ్బులను వాపస్ యిస్తామని అంగీకరించారు. జొడాంబ మాజీ సర్పంచ్, ప్రభుత్వ ఉద్యోగులైన జి.ఆర్.ఎస్., బి.ఎల్.డబ్ల్యూ.ఒ.లతో కలిసి ఇందిరా ఆవాస్ యోజన క్రింద ఇళ్ళు మంజూరు అయిన కుటుంబాల నుండి అక్రమంగా 1,50,000/- వసూలు చేశాడు. ఈ సందర్భంగా సర్పంచ్ తాను కాజేసిన 50,000/- తిరిగి ప్రజలకు యివ్వడానికి అంగీకరించాడు. అలాగే జొడాంబ పంచాయితీ సేల్స్‌మెన్ బియ్యం పంపిణీలో చేస్తున్న అవినీతిని ప్రజల్లో పెట్టి, విచారించి తప్పులను అంగీకరింపజేశారు. ఇకనుండి కోటా ప్రకారం బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒకవేళ కార్డు వున్నవారెవరైనా బియ్యం తీసుకోని ఎడల, ఆ బియ్యాన్ని కార్డులేని నిరుపేదలకు యివ్వాలని నిర్ణయం చేసి అమలు చేయిస్తున్నారు.

## 4. సెప్టెంబర్ 21, పార్టీ అవతరణ దినోత్సవాలు

సెప్టెంబర్ 21 సి.పి.ఐ.(మావోయిస్ట్) 14వ అవతరణ దినోత్సవాలను జరుపుకోవాలని పిలుపునిస్తూ, జోన్ వ్యాపితంగా పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ప్రచారము చేశాం. ఎమ్.కె.వి.బి. డివిజన్‌లో అన్ని ఏరియాలలో గ్రామ స్థాయిలో పార్టీ సెల్స్, ప్రజా సంఘాలు ప్రజలను సమీకరించి సభలు, సమావేశాలు నిర్వహించారు. కోరుకొండ ఏరియాలోని చెరువూరు పాకెట్‌లో 10 గ్రామాలకు చెందిన సుమారు 500 మంది ప్రజలు ఎర్రజెండాలతో ఊరేగింపు జరిపి, ఆ తర్వాత సభ జరుపుకున్నారు. ఈ సభలో ఐక్య పార్టీ ఆవిర్భావం, భారత విప్లవోద్యమంలో గొప్ప మైలురాయిగా నిలిచిందనీ, దేశంలోని విప్లవకారుల ఐక్యత ద్వారా విప్లవోద్యమం గొప్ప ముందంజ వేసిందనీ, పార్టీ వంధా మరింత సుసంపన్నమైందని పేర్కొంటూ, ప్రస్తుతం ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళను వివరిస్తూ వక్తలు ఉపన్యసించారు. కటాఫ్ ఏరియా, పనసపుట్ పాకెట్‌లో సుమారు 800 మంది ప్రజలు ఊరేగింపు చేసి, సభ జరుపుకున్నారు. ఏరియాలోని మిగిలిన గ్రామాలలో 100 నుండి 300 మంది ప్రజలు కలిసి సభలు జరుపుకున్నారు. ఈ సభలు గొప్ప రాజకీయ వాతావరణంలో విప్లవోత్తేజంతో జరిగాయి. "దున్నే వారికే భూమి, విప్లవ ప్రజా కమిటీలకే అధికారం" అనే నినాదం సర్వత్రా మారుమ్రోగింది. ఈ సందర్భంగా సభలను అడ్డుకోవడానికి పోలీసులు ఏరియా 'డామినేషన్'ను కొనసాగించినా, పి.ఎల్.జి.ఎ., మిలీషియా రక్షణలో ఈ సభలను విజయవంతం చేసి, పార్టీ రాజకీయ సందేశాన్ని ప్రజలలోకి తీసుకుపోయారు.

## 1. ఎమ్.కె.వి.బి.లో, విప్లవోద్యమంపై శత్రువు కొనసాగిస్తున్న విప్లవ ప్రతిఘాతుక సాయుధ దాడిని ఎదుర్కొంటూ, పురోగమిస్తున్న ప్రజాయుద్ధం

### ప్రభుత్వ నిర్బంధ రూపాలు

కేంద్రంలో అధికారంలో వున్న, నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం, గత యు.పి.ఎ. ప్రభుత్వ సామ్రాజ్యవాద అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలకు మరింత పదును పెడుతూ, తన బ్రహ్మణీయ హిందూ ఫాసిస్టు ఎజెండాను జోడించి, మరింత దూకుడుగా అమలు చేస్తున్నది. ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలు పై విధానాలను, పోటీ పడి అమలు చేస్తున్నాయి. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న పీడిత ప్రజలు, దళితులు, ఆదివాసీలు, మత మైనారిటీలు, మహిళలు, ప్రగతిశీల శక్తులు, ప్రజాస్వామిక వాదులపై దాడులు పెరిగాయి. ముఖ్యంగా మావోయిస్టు పార్టీపైనా, విప్లవోద్యమంపైన దాని ప్రతిఘాతుక, హంతక, సాయుధ దాడి మరింత తీవ్రతరం అయింది. ఈ దాడిని ప్రతిఘటిస్తూనే ప్రజాయుద్ధం పురోగమిస్తూ వస్తున్నది. అన్ని వర్గాల, సెక్షన్ల ప్రజలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వివిధ రూపాలలో తమ నిరసనను, వ్యతిరేకతను తెలియజేస్తూ పోరాడుతున్నారు. ఎ.ఒ.బి. ఆదివాసీ ప్రాంతాలలో, సహజ ఖనిజ సంపదను కార్పొరేటు శక్తులు దోచుకువెళ్ళి, ప్రజలను నిర్వాసితులను చేసే విధానాలను, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. కొరాపుట్, విశాఖపట్నం జిల్లాలలో పార్టీ నాయకత్వంలో ఆదివాసీలు, పీడిత ప్రజలు బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా మిలిటెంట్‌గా పోరాడుతున్నారు. ఇంకొకవైపు 'దున్నేవారికే భూమి, విప్లవ ప్రజా కమిటీలకే అధికారం' నినాదంతో సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని చురుకుగా అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడే ప్రజలకు నాయకత్వం లేకుండా చేయడానికి 'ఆలౌట్ అభియాన్' పేరుతో, నాయకత్వ నిర్మూలన లక్ష్యంతో, భారీ సైనిక దాడిని ప్రారంభించారు. ఈ సైనిక దాడిలో భాగంగా, రెండు సంవత్సరాలుగా ఎ.పి-ఎస్.ఐ.బి. తీవ్రమైన ప్రయత్నాల ఫలితంగా, 2016 అక్టోబర్, రాంగూడలో వందలాది బలగాలను మోహరించి చేసిన ఎన్‌కౌంటర్ హత్యాకాండలో 31మంది కామ్రేడ్స్‌ను పొట్టన పెట్టుకుంది. ఈ సంఘటన తర్వాత ఎ.ఒ.బి. ఉద్యమం తుడిచి పెట్టుకుపోయిందనే అసత్య ప్రచారంతో, ప్రజల మనోనిబ్బరాన్ని దెబ్బ తీసే విధంగా, మానసిక యుద్ధాన్ని తీవ్రతరం చేసింది. ఈ విజయం తర్వాత మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నది. ముఖ్యంగా సమాచార ఆధారిత దాడులకు పథకాలు రూపొందిస్తున్నది. అదే సమయంలో మనం ప్రతి దాడి చేస్తే, తమ శక్తులను నష్టపోకుండా ఉండే విధంగా అదనపు జాగ్రత్తలు పాటిస్తూ, కూంబింగ్‌లకు వస్తున్నారు. కొన్నిసార్లు కూంబింగ్‌లను తగ్గించి, వెసులుబాటును ఇస్తున్నట్లు నటించి, మన కదలికలు అర్థం కాగానే సర్‌ప్రైజ్‌గా దాడులు చేసే ఎత్తుగడలు అవలంభిస్తున్నారు. ప్రజావ్యతిరేకులు, మజీలు, లంపెన్ యువతను ఇన్‌ఫార్మర్స్‌గా మార్చుకోవడంతో పాటు, టెక్నాలజీని వినియోగించుకోవడం పెరిగింది. అందులో భాగంగా ఇజ్రాయిల్ అధికారులతో కలిసి ఏరియల్ సర్వేలు నిర్వహించి, మరింత ఆధునిక టెక్నాలజీని కలిగిన డ్రోన్‌లు, 'టోహీ'లను దిగుమతి చేసుకుంటున్నారు. మన ఉద్యమ ప్రాంతంలో రెగ్యులర్‌గా డ్రోన్‌లు, టోహీలను (రాత్రి సమయాలలో) తిప్పుతున్నారు. పారా మిలటరీ బలగాల రక్షణలో రోడ్లు, బ్రిడ్జిలు, సెల్‌టవర్‌ల నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా ఎమ్.కె.వి.బి. డివిజన్‌లో తూరుమామిడి, దండాబడిల వద్ద పోలీసు క్యాంపులను ఏర్పాటు చేయగా, కోరాపుట్‌లో మరికొన్ని నూతన క్యాంపులు పెట్టె ప్రయత్నంలో ఉన్నారు. ప్రజా సంఘాల, ప్రజాస్వామికవాదుల బహిరంగ, చట్టబద్ధ కార్యకలాపాలపై నిఘా పెంచడంతో పాటు, దాడులు పెరిగాయి. ప్రజల నుండి, పి.ఎల్.జి.ఎ. నుండి ఏ చిన్న ప్రతిఘటన జరిగినా, అభివృద్ధిని అడ్డుకొంటున్నారనీ, హింసకు పాల్పడుతున్నారనీ, అమాయకులను హత్య చేస్తున్నారని పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజా వ్యతిరేకులను, కిరాయి మనుషులను సమీకరించి వ్యతిరేక ప్రదర్శనలు చేయిస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఏమి తెలియని సాధారణ, అమాయక పౌరులను కూడా ఈ వ్యతిరేక ప్రచారంలో భాగాస్వాముల్ని చేస్తున్నారు. పోలీసులే వివిధ పేర్లతో పోస్టర్స్, కరపత్రాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు. గ్రామాలపై దాడులు చేసి, పెద్ద ఎత్తున అక్రమ అరెస్టులు చేసి, తప్పుడు కేసులు బనాయించి జైళ్ళల్లో పెట్టడం, సరెండర్ కావాలని నోటీసులు పంపడం చేస్తున్నారు. దారకొండ గ్రామంలో సెల్‌టవర్‌ను ధ్వంసం చేస్తే 200 మంది ప్రజలపై అక్రమ కేసులు పెట్టి, పదుల సంఖ్యలో సాధారణ ప్రజలను అరెస్టులు చేసి, ప్రజల్లో భయానక వాతావరణాన్ని సృష్టించారు. పనులమీద బ్లాక్, మండల కేంద్రాలకు, సంతలకు వెళ్ళే ప్రజలను అరెస్ట్ చేసి పార్టీ, సంఘాల సమాచారం యివ్వాలని బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్‌లు, చిత్రహింసలకు గురి చేయడం నిత్యకృత్యమైంది. దానితో ప్రజలు వైద్యశాలలకు వెళ్లడం, పిల్లలను స్కూళ్ళకు పంపడం, ఆధార్ కార్డులు తెచ్చుకోవడం, బ్యాంకులకు వెళ్ళడం, ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడం, బంధువుల ఇళ్లకు వెళ్ళడం చివరకు ముఖ్యమైన జీవిత అవసరాలకోసం సైతం ఇతర ప్రాంతాలకు వెళ్ళడం మానివేస్తున్నారు. ఆంధ్ర గ్రేహౌండ్స్ బలగాలు భౌగోళిక హద్దులు చెరిపేసి, ఒడిశాలోని సరిహద్దు ప్రాంతాలలోకి చొచ్చుకువచ్చి దాడులు, అరెస్టులు చేయడం నిత్యకృత్యంగా మారింది. ఆదివాసీ గ్రామాలలో భయానక యుద్ధ వాతావరణం కొనసాగుతున్నది.

### పి.ఎల్.జి.ఎ., ప్రజల ప్రతిఘటన

విశాఖపట్నం జిల్లాలోని, రాళ్ళగడ్డ పోలీసు క్యాంపుకు సమీపంలో పి.ఎల్.జి.ఎ. పేల్చిన మందుపాతరలో ఒక హెంగార్డు చనిపోయాడు. దానితో ఖంగుతిన్న పోలీసులు ఆంధ్ర, ఒడిశా

సరిహద్దు గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు తీవ్రతరం చేశారు. ఈ అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా విప్లవ రైతుకూలీ సంఘం నాయకత్వంలో సరిహద్దు గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది ప్రజలు సమావేశం జరుపుకొని ఈ దాడులను, అక్రమ అరెస్టులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో, గొనబెడ గ్రామం వద్ద దళం వుందనే సమాచారం తెలుసుకున్న ఎ.పి. గ్రేహౌండ్స్ బలగాలు రాత్రికి రాత్రే వచ్చి, మకాం(ఖాళీ చేసిన)నూ, గ్రామాన్ని అన్ని వైపుల నుండి చుట్టుముట్టారు. దళం తృటిలో, చుట్టివేత నుండి బయటపడి ప్రజల సహకారంతో సురక్షితంగా రిట్రీట్ అయ్యింది. ఆ సందర్భంగా దారిలో అంబూష్ పెట్టిన పోలీసు బలగాలకు ఒండ్రపల్లి, బచ్చులిపొద్దూరు గ్రామాలకు చెందిన ముగ్గురు మిలీషియా సభ్యులు దొరికి పోయారు. ఈ విషయం ప్రజలకు అర్థం కానివ్వకుండా, రహస్యంగా ఎ.పి.కి తరలించారు. సాయంత్రానికి ఈ విషయం ప్రజల దృష్టికి వచ్చింది. అప్పటికప్పుడు సుమారు 300 మంది ప్రజలు అందుబాటులో వున్న కుంతులిపొద్దూరు ఐ.ఆర్.బి. పోలీసు క్యాంపుకు వెళ్ళి, ఎ.పి. పోలీసులు అరెస్ట్ చేసినవారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారు, తమ పైఅధికారులకు తెలియజేస్తామంటూ కాలయాపన చేయడంతో, తిరిగి వచ్చిన ప్రజలు రాత్రికి రాత్రే అన్ని గ్రామాలకు సమాచారం అందించి, తెల్లవారి 2 వేల మంది ప్రజలు ఊరేగింపుగా వెళ్ళి, పోలీసు క్యాంపు ముందు బైఠాయించారు. పోలీసులు మాకు ఈ అరెస్టులతో సంబంధం లేదని బుకాయించారు. దానితో ప్రజలు కోపోద్రిక్తులై క్యాంపు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని డిమాండ్ చేస్తూ, గేట్ లోపలికి చొచ్చుకుపోయే ప్రయత్నం చేశారు. రెచ్చిపోయిన పోలీసులు ప్రజలపైకి ఆయుధాలు లోడ్ చేశారు. ప్రజలు రాళ్ళు, కర్రలతో ప్రతిఘటించడానికి సిద్ధపడడంతో, పోలీసులు ఒక అడుగు వెనక్కి వేశారు. ఇంతటితో ప్రజలు ఆగకుండా ఐ.ఆర్.బి.క్యాంపు పోలీసులకు వస్తున్న ఆహార పదార్థాల సప్లైలు నిలిపివేయాలనీ, ఏరియాలో ప్రజలుగానీ, కిరాణ దుకాణాలుగాని ఎలాంటి వస్తువులు(కూరగాయలు, కోళ్ళు, మేకలు)అమ్మరాదని నిర్ణయం తీసుకున్నారు. మొదట చిత్రకొండ నుండి మిషన్ డొంగ (పడవ)లో జరుగుతున్న సప్లైలను అడ్డుకోవడంలో భాగంగా పడవను, అందులో రవాణా అవుతున్న సామానులను ప్రజలు, పి.ఎల్.జి.ఎ. స్వాధీనం చేసుకున్నది. దానితో ప్రస్తుతం హెలిక్యాప్టర్ల ద్వారానే సప్లైలు కొనసాగిస్తున్నారు. స్థానిక సంతలలో, దుకాణాలలో, గ్రామాలలో క్యాంపు పోలీసులకు సరుకులు అమ్మవద్దని నిర్ణయం తీసుకొని అమలు చేస్తున్నారు.

విశాఖపట్నం జిల్లాలో బాక్సైట్ తవ్వకాల కోసం, దారకొండ గ్రామంలో సి.ఆర్.పి.ఎఫ్. క్యాంపు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ నిర్మాణ పనులను వ్యతిరేకిస్తూ, పార్టీలకు అతీతంగా, ఆదివాసీలంతా ఐక్యమై ప్రతిఘటించారు. ఈ పోలీసు క్యాంపులకు స్థలాలు యివ్వవద్దని నిర్ణయించుకొని, పోలీసులు వెనుదిరిగిపోవాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ప్రజలను బెదిరించడం, లాఠీచార్జ్ చేయడం వంటి నిర్బంధ పద్ధతులకు పూనుకున్నారు. అయినా ప్రజలు వెనుదిరగకుండా ప్రతిఘటించడంతో పోలీసులు తాత్కాలికంగా వెనకడుగు వేసి, వారి నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత పోలీసులు 'అభివృద్ధి' పేరుతో ఆ గ్రామంలో సెల్‌టవర్‌ను నిర్మాణం చేశారు. ప్రజల ఆమోదంతో పి.ఎల్.జి.ఎ. సెల్‌టవర్‌ను ధ్వంసం చేసింది. దానితో రెచ్చిపోయిన కుక్కలాగా, జిల్లా ఎస్.పి. ఆదేశాలతో పోలీసులు గ్రామాలపై దాడులు చేసి, పదుల సంఖ్యలో ప్రజలను అరెస్ట్ చేసి, 200 మందిపైన కేసులు పెట్టి, భయానక వాతావరణాన్ని సృష్టించి లొంగదీసుకోవాలని ప్రయత్నించారు. ఈ అక్రమ అరెస్టులను ఖండిస్తూ, అఖిలపక్షం పేరుతో వై.ఎస్.ఆర్.సి.పి., సి.పి.ఎమ్., అధికార టి.డి.పి. (అవకాశవాదం)తో సహా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన సంఘాలు, విద్యార్థులు, రచయితలు ఈ అరెస్టులను ఆపివేయాలనీ, పోలీసు క్యాంపులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, వీటిని నిలిపివేయకపోతే ప్రజా ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మల్కనగిరి జిల్లా, విచ్ఛిన్నాంచల్ ఏరియా, పప్పరమెట్టలో పోలీసు క్యాంపు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ, పంచాయితీలోని వివిధ గ్రామాలకు చెందిన 500 మంది ప్రజలు పప్పరమెట్టలో ఊరేగింపు చేసి, సభ జరుపుకున్నారు. ఈ సభలో పోలీసు క్యాంపు నిర్మాణానికి స్థలం ఎవరు ఇవ్వవద్దని, సహకరించవద్దని నిర్ణయించారు. పోలీసు క్యాంపులు ఎవరి రక్షణ కోసం నిర్మిస్తున్నారని ప్రశ్నిస్తూ, మేము సురక్షితంగానే వున్నాం అంటూ, మాకు పోలీసుల నుండే రక్షణ కావాలనీ, పోలీసు క్యాంపులు అవసరం లేదని ప్రకటించారు. "ప్రజలపై ప్రేమ వుంటే స్కూల్, హస్పిటల్ నిర్మించండి" అంటూ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ బహిరంగంగా పత్రిక ప్రకటనలు చేశారు.

పెదబయలు ఏరియా, నుర్మతి గ్రామంలో పోలీసు క్యాంపు నిర్మాణంతో పాటు, సెల్‌టవర్ నిర్మించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయంలో భాగంగా సెల్‌టవర్, లాండ్‌లైన్ ఫోన్‌లను నిర్మించేందుకు పోలీసుల రక్షణలో జె.సి.బి.లను ఉపయోగించి, పనులు మొదలు పెట్టారు. గతంలో ఈ గ్రామంలో పోలీసు క్యాంపు వున్నప్పుడు ప్రజలు తాము అనుభవించిన బాధలను దృష్టిలో పెట్టుకొని, ఈ సారి క్యాంపు, సెల్‌టవర్ నిర్మాణాన్ని బహిరంగంగానే వ్యతిరేకించారు. అయినా ప్రభుత్వం దౌర్జన్యపూరితంగా సెల్‌టవర్‌ను నిర్మించపూనుకున్నది. దానితో మిలీషియా, ప్రజలు కలిసి నిర్మాణ పనులలో వున్న రెండు జె.సి.బి.లను దగ్ధం చేసి, పైపులను స్వాధీనం చేసుకొని తీసుకెళ్ళి తమ త్రాగునీటికి వినియోగించుకోవాలనే నిర్ణయం చేసుకున్నారు. ప్రభుత్వం ఈ సెల్‌టవర్స్ ప్రజల అభివృద్ధిలో భాగమేనని ఎప్పటిలాగే మోసపూరిత ప్రచారం చేసింది. ప్రజలు మాత్రం ప్రభుత్వ బూటకపు అభివృద్ధిని తిప్పికొడుతూ తమ సుశక్తిపైనే

అభివృద్ధికి పథకాలు రూపొందించుకుంటున్నారు. ఇదే ప్రాంతంలో పోలీసు క్యాంపు నిర్మాణం సన్నాహాలు చేస్తూనే, రోడ్డు నిర్మాణం కోసం పోలీసుల రక్షణలో రెండు జె.సి.బి. యంత్రాలను ఉపయోగించి పనులు ప్రారంభించారు. చుట్టుపక్కల గ్రామాలలో నిరంతరం కూంబింగ్‌లు కొనసాగిస్తూ, ప్రజలను భయపెట్టడం ప్రారంభించారు. అప్పటికే ప్రజల ప్రయాణ అవసరాల కోసం పక్కా పిచ్చి(డాంబర్)రోడ్డు వుంది. దాని వెడల్పును పెంచెందుకూ, పోలీసు రక్షణలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేసే ఈ రోడ్డు ప్రజల అవసరాలు, అభివృద్ధిలో భాగం కాదని ప్రజలు గుర్తించారు. ఈ రోడ్డు నిర్మాణాన్ని, ఇంటర్‌నెట్ కనెక్షన్ పనులను అడ్డుకోవడంలో భాగంగా ఒకేరోజు దాడి చేసి, రెండు చోట్ల 4 జె.సి.బి.లను తగలబెట్టారు. ఈ సంఘటన తర్వాత పనులు నిలిచిపోయాయి. అయితే పోలీసులు మాత్రం ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేసి, వాకపల్లి మహిళలపై పోలీసుల అత్యాచారంపై కేసు విచారణను అడ్డుకోవడంలో భాగంగానే మావోయిస్టులు ఈ చర్యకు పాల్పడ్డారని తల, తోకలేని ప్రకటన చేశారు.

## పోలీసు సమాచార యంత్రాంగా(ఇన్‌ఫార్మర్స్)న్ని ధ్వంసం చేస్తున్న ప్రజలు, పి.ఎల్.జి.ఎ.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి, సమాచార యంత్రాంగాన్ని బలోపేతం చేస్తున్నారు. ఈ వ్యవస్థకు అత్యంత అధిగ ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులకు వచ్చిన విజయాలలో, ప్రధానంగా ఈ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ద్వారా వచ్చిన సమాచరంపై ఆధారపడి చేసినవే ముఖ్యమైనవి. అందుకే ఈ వ్యవస్థకు ప్రభుత్వం, పోలీసులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ వ్యవస్థలోకి ఉద్యమ ప్రాంతాలలోని ప్రజాశత్రువులనూ, ప్రజా వ్యతిరేకులనూ, నిరుద్యోగ లంపెయిన్ యువత(డబ్బులు, ఆశ చూపి)నూ, లొంగిపోయిన మాజీలనూ, సంఘాలలో పని చేస్తూ శత్రువు దాడిలో రాజకీయంగా బలహీనపడిన కొందరు సభ్యులను నయాన భయాన బెదిరించి లొంగదీసుకుంటున్నారు. అలాగే ప్రజలు సంతలకు, పట్టణాలకు, హాస్పిటల్స్‌కు, బంధువుల ఇళ్ళకు, వెళ్ళినప్పుడు రహస్యంగా అరెస్ట్ చేసి, బ్లాక్‌మెయిల్ పద్ధతి ద్వారా లొంగదీసుకుంటున్నారు. మరి కొందరిని వ్యాపారం పేరుతో, క్రిష్టియన్ మత పెద్దల పేరుతో గ్రామాలకు పంపి, వారి ద్వారా సంఘాల, పార్టీ, పి.ఎల్.జి.ఎ. సమాచారాన్ని సేకరిస్తున్నారు. వీరు రకరకాల పద్ధతులలో(మొబైల్స్ ద్వారా, ప్రత్యక్షంగా కలిసి వగైరా)ఇచ్చే సమాచారంపై పోలీసులు సర్‌ప్రైజ్ దాడులకు పాల్పడుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో విప్లవోద్యమాన్ని రక్షించుకుంటూ పురోగమింపజేసేందుకు ప్రజలపై ఆధారపడి ఈ సమాచార యంత్రాంగాన్ని ధ్వంసం చేస్తున్నాము. అనివార్య పరిస్థితులలోనే కొద్ది మందిని నిర్మూలించాల్సి వస్తున్నది.

విశాఖపట్నం జిల్లా, చింతపల్లి మండలంలోని, అన్నవరం గ్రామానికి చెందిన గుంపలోవ శ్రీనివాస్ సీజనల్ వ్యాపారాలు (కందులు, పసుపు, తృణధాన్యాలు) చేస్తూ, గ్రామాలకూ, సంతలకు తిరుగుతుంటాడు. ఈ క్రమంలో ఇంటలిజెన్సీ సి.ఐ, నరహంతకుడు వెంకట్రావ్‌తో సంబంధాలు ఏర్పర్చుకున్నాడు. వ్యాపారం పేరుతో తిరుగుతూ, ప్రజలతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని, వారికి నమ్మకస్తుడిగా వ్యవహరిస్తూ, పార్టీ సమాచారం సేకరించి, రహస్యంగా పోలీసులకు చేరవేస్తుండేవాడు. ఈ క్రమంలో 2012లో లువ్వసింగి గ్రామం వద్ద దళం వుందని తెలుసుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు దాడికి రాగా, ప్రజలు ముందే గమనించి పార్టీకి సమాచారం యిచ్చి, అప్రమత్తం చేయడంతో, దళం ప్రతిఘటించి క్షేమంగా బయటపడింది. ఆ సందర్భంగా మనకు సమాచారం యిచ్చిన ఇద్దరు గ్రామస్తులను, పోలీసులు కాల్చి చంపి, ఎన్‌కౌంటర్ కథ చెప్పారు. ఈ సంఘటన తర్వాత శ్రీనివాస్ గ్రామాలకు రావడం మానుకొని, జాగ్రత్తలు తీసుకుంటూ, కొంతకాలం గడిపాడు. తిరిగి 2016 నుండి గ్రామాలకు వస్తూ, నమ్మకస్తులను కలుస్తూ, క్రమంగా బలహీనంగా వున్న సంఘ నాయకులను రహస్యంగా లొంగిపోయే విధంగా ప్రోత్సహించడం, రైతులకు ఋణాలిచ్చి ఎక్కువ ధరలకు అపరాలను కొంటానని అడ్వాన్స్ ఇచ్చి, మన ఉద్యమప్రాంత గ్రామాలకు రావడం, సమాచారం సేకరించడం ప్రారంభించాడు. ఈ విషయాలు అర్థం అయిన తర్వాత కోరుకొండ సంతలో పట్టుకొని విచారించి, సమాచారం రాబట్టి, పి.ఎల్.జి.ఎ. అక్టోబర్‌లో కాల్చిచంపింది.

మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, కటాఫ్ ఏరియాలోని జొంత్రి గ్రామంలో గ్రామ పెత్తందారు, ప్రజావ్యతిరేకి అయిన సోమ పాంగి సీజనల్ వ్యాపారాలు, కిరాణ దుకాణము, మిషన్ డొంగ ద్వారా చాపల వ్యాపారము వగైరా వ్యాపారాలు చేస్తుండేవాడు. ఈ ప్రాంతానికి పార్టీ వెళ్ళిన తర్వాత, పార్టీ ఇతడిని ప్రజా పంచాయితీలో పెట్టి, ప్రజా వ్యతిరేక పద్ధతులు మానుకోవాలని మందలించింది. ఇతడు సరిదిద్దుకోవడానికి బదులు, పోలీసులతో సంబంధాలు పెట్టుకొని, 2015లో ఆలౌటొ అభియాన్‌కు కీలకంగా సమాచారాన్ని ఒ.ఎస్.-ఎ.పి. పోలీసులకు అందజేసాడు. ఆ తర్వాత ప్రజా వ్యతిరేకులతో కలిసి, పార్టీకి వ్యతిరేకంగా మీటింగ్ జరిపి, ప్రజలను లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. ఈ విషయాలపై ప్రజాకోర్టు నిర్వహించగా చివరకు అంగీకరించాడు. ఆ సందర్భంగా ఆ పాకెట్ గ్రామాల ప్రజలు వాడి ఆస్తులు స్వాధీనం చేసుకొని, గ్రామం నుండి బహిష్కరించాలని తీర్మానించి అమలు చేశారు. అప్పటి నుండి చిత్రకొండ డ్యాం స్పీల్‌వే (లాంచ్ గాటి)వద్ద పోలీసులు ఇచ్చిన ఒక క్వార్టర్‌లో వుంటూ, పెట్రోల్, డిజిల్ వ్యాపారిగా మారాడు. పోలీసులు ఒక మిషన్ డొంగ యిచ్చి, పోలీసు క్యాంపులకు సామానుల సరఫరా చేసే పని కూడా అప్పగించారు. పూర్తికాలం ఇన్‌ఫార్మర్‌గా మార్చారు. ఈక్రమంలో ఎ.పి. ఇంటలిజెన్సీ వీడితో సంబంధాలు ఏర్పర్చుకొని, కటాఫ్ ఏరియాలో నాయకత్వాన్ని నిర్మూలించే విధంగా ఒక పెద్ద సంఘటనకు పథకం రూపొందించారు. రాంగూడ ఎన్‌కౌంటర్‌లో

పని చేసిన ఏజెంట్లందరూ సోమ తయారు చేసిన వ్యక్తులే. రాంగూడ ఎన్‌కౌంటర్ సందర్భంగా ఎ.పి. గ్రేహౌండ్స్ బలగాలను రహస్యంగా రాత్రి సమయాలలో రిజర్వాయర్ గుండా మిషన్ పడవలో తరలించింది కూడా సోమ పాంగినే. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత బహిరంగంగానే పోలీసులతో కలిసి ప్రయాణం చేయడం, సరఫరాలు చేయడం, ప్రజలను బెదించిండం, దాడులు చేయడం ప్రారంభించాడు. ఇన్‌ఫార్మర్స్‌కు నాయకుడిగా మారి, రెగ్యులర్‌గా సమాచారం సేకరిస్తూ, ఎ.పి.ఎస్.ఐ.బి.కి అందజేయడం ప్రారంభించాడు. దీంతో ప్రజల డిమాండ్‌తో పి.ఎల్.జి.ఎ. అక్టోబర్ 22, 2017న స్పీల్‌వే వద్దడ్యాం పైన కాల్చి చంపి, వాడి మిషన్ డొంగను కూడా స్వాధీనం చేసుకొని, శత్రువుకు సవాల్ విసిరింది. వీడి ఖతం తర్వాత ప్రజలు గ్రామాలలో పండుగ జరుపుకున్నారు. శత్రువుకు సోమను కోల్పోవడంతో, మిగిలిన ఏజెంట్ల మరోస్థైర్యాన్ని నిలబెట్టడం కష్టంగా మారింది. ఈ చర్య పోలీసు సమాచార యంత్రాంగానికి గట్టిదెబ్బ తగిలినట్లయింది.

మల్కనగిరి జిల్లా కలిమెల బ్లాక్‌లోని కొరుబు గ్రామంలో 15 సం॥ర క్రితం డొమ్రు వచ్చి స్థిరపడ్డాడు. అప్పటి నుండి వ్యాపారాలు చేయడం, స్థానిక కోయ ప్రజల భూములను కాజేయడం, క్రమంగా ధాన్యం మిల్లు, ట్రాక్టర్ కొని కాంట్రాక్టర్‌గా కూడా మారి ధనిక రైతుగా ఎదిగాడు. విప్లవోద్యమం బలంగా వున్నప్పుడు సంఘం, పార్టీ పట్ల, ప్రజల పట్ల అనుకూలంగా వున్నట్లు నటించాడు. 2015 లో ప్రభుత్వం ఈ ఏరియాలో నిర్బంధాన్ని తీవ్రతరం చేసింది. ఇందులో భాగంగా కార్పెట్ సెక్యూరిటీని విస్తరించడం, గ్రామాలపై దాడులను పెంచడం, అక్రమ అరెస్టులు, కూంబింగ్ ఆపరేషన్స్ నిత్యకృత్యంగా మార్చారు. ఈ వత్తిడితో కొందరు సంఘ నాయకులు లొంగిపోయారు. పోలీసులు ప్రజలను బలవంతంగా సామూహిక సరెండర్‌లుగా చూపడం ప్రారంభించారు. ఈ క్రమంలో, డి.వి.సి.ఎమ్.గా వున్న సుఖ్‌దేవ్‌లో అన్యవర్గ ధోరణులకు తోడు ప్రజలపైన, విప్లవోద్యమంపైన విశ్వాసం సడిలి, త్యాగనిరతి కోల్పోయి, శత్రు పాదాల ముందు మోకరిల్లి, విప్లవ ద్రోహిగా మారాడు. వీడితో పాటు మరికొందరు, ద్రోహులు కలిసి ప్రజలపై దాడులలో పాల్గొంటున్నారు. ఈ పరిస్థితిని డొమ్రు తనకు అనుకూలంగా మార్చుకొని, మాజీలతో, పోలీసులతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టకుని, సంఘనాయకులను లొంగిపోయే విధంగా అర్గనైజ్ చేయడం, బెదిరించడం ప్రారంభించాడు. కొందరిని సరెండర్ చేయించాడు. గ్రామంలో సంఘ రాజకీయ అధికారం స్థానంలో తన అధికారాన్ని స్థాపించుకున్నాడు. దళం ఆ ప్రాంతానికి వెళితే వెంటనే సమాచారం ఇవ్వడం, గ్రామంలో వుండకుండా తప్పుకొని తిరగడం, పోలీసు బలగాల కూంబింగ్‌ల మధ్య గ్రామాలకు రావడం, పోవడం చేస్తున్నాడు. డొమ్రు అనుసరిస్తున్న విప్లవ, ప్రజా వ్యతిరేక విషయాలను ప్రజలలో చర్చించి, వారి ఆమోదంతో ప్రజలు ఇచ్చిన సమాచారంతో గ్రామంలో పట్టుకొని విచారించి ఖతం చేయడం జరిగింది.

## ప్రజాయుద్ధంలో పెరుగుతున్న ప్రజల భాగస్వామ్యం

ఎ.ఒ.బి.లో గత మూడున్నర దశాబ్దాలుగా విప్లవోద్యమానికి, ప్రతిఘాతుక విప్లవానికి మధ్య జరుగుతున్న సాయుధ ఘర్షణలో విప్లవోద్యమం పురోగమిస్తూ, గెరిల్లా జోన్ స్థాయికి ఎదిగి, విముక్తి ప్రాంత లక్ష్యంతో పని చేస్తున్నది. అయితే ఎ.పి. శత్రువు ఎల్.ఐ.సి. వ్యూహంలో భాగంగా కొనసాగించిన బహుముఖ దాడిని ఓడించడంలో, ఎత్తుగడల లోపాల వలన 2006 నాటికి శత్రువు యుద్ధంలో పైచేయి సాధించగా, విప్లవోద్యమం తాత్కాలిక సెట్‌బ్యాక్‌కు గురైంది. అప్పటి నుంచి, శత్రువు ఎ.ఒ.బి.లో ఉద్యమాన్ని సంపూర్ణంగా నిర్మూలిస్తామని ప్రగల్భాలు పలుకుతూనే ఉన్నాడు. కానీ పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ., ప్రజలు కలిసి, దోపిడీ పాలకవర్గాల లక్ష్యాన్ని వమ్ము చేస్తున్నారు. శత్రువు మనల్ని ఒంటరి చేసి దెబ్బ తీయాలనుకుంటే, మనం ప్రజలలోకి విస్తృతంగా వెళ్ళి, ప్రజా పోరాటాలు చేపట్టి, శత్రువును ఒంటరి చేసే ప్రయత్నాలను కొనసాగిస్తున్నాం. శత్రువు మనల్ని సాయుధ చర్యల ద్వారా నిర్మూలించాలని చూస్తే, మనం ప్రజా సాయుధ ప్రతిఘటనను పెంచి ఎదుర్కొంటున్నాం. ఈ క్రమాన్నంతా రక్తతర్పణతోనూ, అనన్యమైన త్యాగాలతోను కొనసాగిస్తూ, పార్టీ ఎలాంటి కష్టాలలోనైనా, ఎగుడు దిగుడులలోనైనా ప్రజలవైపే నిలుస్తుందనే విశ్వాసాన్ని ప్రజలకు కల్పించగలుగుతున్నాం. మన ఈ కార్యాచరణ వల్ల ప్రజలకు పార్టీ ఎడల విశ్వాసం పెరగడమే కాకుండా, విప్లవ యుద్ధంలో వారి భాగస్వామ్యం కూడా క్రమంగా పెరుగుతున్నది.

పి.ఎల్.జి.ఎ. 18వ ఆవిర్భావ వార్సికోత్సవాల సందర్భంగా, మన ప్రజాయుద్ధ లక్ష్యాన్ని, ప్రజాయుద్ధంలో ప్రజలు పోషించాల్సిన కర్తవ్యాలను, ముఖ్యంగా యుద్ధం, అధికారానికి మధ్య వున్న సంబంధాన్ని తెలియజేస్తూ, ప్రజానిర్మాణాలలో, మిలీషియాలో ఎడ్యుకేషన్ క్యాంపెయిన్ చేపట్టాము. అలాగే ప్రజలలో ప్రచారం కొనసాగించి, మన శక్తులన్నింటిని శత్రువుకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధంలో భాగస్వాములయ్యేలా పెదబయలు, కటాఫ్ ఏరియాలలో 15 నుండి 20 రోజుల పాటు నిర్దిష్టంగా గెరిల్లా చర్యలు చేపట్టేలా కార్యక్రమం రూపొందించాం. ఈ కార్యక్రమంలో భాగంగా వందలాది మంది మిలీషియా, ప్రజలు కదిలి ప్రచారం, ప్రతిఘటనను కొనసాగించారు. ఎస్.ఎమ్.సి. సందేశాన్ని ప్రజలు, మిలీషియా వరకు తీసుకెళ్ళి ఎడ్యుకేట్ చేశాం. పి.ఎల్.జి.ఎ. వారోత్సవాలను జరుపుకోవాలని పిలుపునిస్తూ పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ప్రచారం చేశాం. జననాట్యమండలి/గొననాట్యసంఘ్ ద్వారా గ్రామాలలో సభలు, సమావేశాలు నిర్వహించాం. వందలాదిగా మిలీషియా, ప్రజలు కదిలి ఈ సందర్భంగా దాడులకు వచ్చే శత్రువును ప్రతిఘటించడానికి సిద్ధమయ్యారు. విశాఖ జిల్లాలోని, పెదబయలు ఏరియాలో 'ఆపరేషన్ వింజరి' (గ్రామ పంచాయితీ) పేరుతో, 500 మంది గ్రేహౌండ్స్ బలగాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, డిసెంబర్ 1 నుండి 5 వరకు భారీ అభియాన్‌ను చేపట్టారు. ఈ అభియాన్‌ను ప్రతిఘటించడానికి ప్రజలు, మిలీషియా

చురుగ్గా పాల్గొన్నారు. నానబరి గ్రామంలో వంటలు చేసుకుంటూ, స్నానాలు చేయడానికి సిద్ధమవుతున్న పోలీసులపై, దాడి చేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. పోలీసులు ముందే అప్రమత్తమై గ్రామంలోని ఒక ఇంటిలో ఒక బిగ్‌గన్‌ను స్వాధీనం చేసుకొని, ఆ ఇంటి యజమానిని అరెస్ట్ చేశారు. ఈ విషయం గమనించిన ప్రజలు కత్తులు, విల్లుకాడులు, గొడ్డళ్ళతో తిరగబడ్డారు. దానితో ఖంగుతిన్న గ్రేహౌండ్స్ పోలీసులు, అరెస్ట్ చేసిన రైతును విడిచిపెట్టక తప్పలేదు. ప్రజల ప్రతిఘటనతో పోలీసులు తిరుగుముఖం పట్టారు. వాపస్ అవుతున్న పోలీసు బలగాలపై నానబరి, జక్కం గ్రామాల మధ్య పి.ఎల్.జి.ఎ. బలగాలు(మిలీషియాతో సహా) డిసెంబర్ 5న క్లేమోర్ మైన్ పేల్చారు. శత్రువు తృటిలో తప్పుకున్నప్పటికీ, తీవ్రమైన ఆందోళనకు గురైనాడు. ప్రతీగా మనపై విచ్చలవిడిగా కాల్పులు జరిపాడు. ఆ తర్వాత మరిన్ని అదనపు బలగాలను పిలిపించుకొని, రెండు రోజుల తర్వాత అక్కడి నుండి అతి జాగ్రత్తలతో కదిలి వెనక్కు వెళ్ళాడు. ఈ సంఘటనలో శత్రవుకు భౌతిక నష్టం జరగక పోయినప్పటికీ, కిరాయి బలగాల పిరికితనాన్ని చూసి ప్రజలు ఆనందపడ్డారు.

ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బి.ఎస్.ఎఫ్. బేస్ క్యాంపు నుండి ఇంటలిజెన్సీ అధికారులు మఫ్టీలో చిన్న ఆయుధాలతో మూడు మోటర్ సైకిళ్ళపైన సమాచార సేకరణకు అత్యంత రహస్యంగా వచ్చి, వెనుతిరిగి వెలుతున్నప్పుడు, ప్రజలు అందించిన సమాచారంతో కొజ్జరిగూడ, మెట్టగూడ గ్రామాల మధ్య ఆంబూష్ నిర్వహించడం జరిగింది. ఈ దాడిలో ఎస్.ఐ.తో పాటు మరో జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హెలిక్యాప్టర్‌లో విశాఖపట్నం తరలించారు. అందులో ఒకడు హాస్పిటల్‌ల్లో చనిపోయాడు. తర్వాత వాళ్ళ మోటర్ సైకిళ్ళను స్వాధీనం చేసుకుని, తగులబెట్టారు. ఈ సంఘటన ప్రజల్లో మరింత ఆత్మ విశ్వాసాన్ని పెంచింది.

ఒడిశాలోని, మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, లుక్కపాని గ్రామం నుండి హోంగార్డుగా పని చేస్తూ, పోలీసు బలగాలతో వస్తున్న దాసు, కుటుంబ సంబంధాల్లో వుంటూ, వారి ద్వారా సమాచారం సేకరించి, గ్రామాలపై పోలీసుల ద్వారా దాడులు చేయిస్తుండటంతో, చుట్టుపక్కల గ్రామాల నుండి 150 మంది మిలీషియా కదిలి, దళం నేతృత్వంలో అతని కుటుంబంపై ప్రజా పంచాయితీ నిర్వహించి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకొని, ప్రజలకు పంపిణీ చేసి, అదే రోజు వారిని గ్రామం నుండి బహిష్కరించారు. ఈ సమాచారం తెలుసుకున్న శత్రువు తప్పనిసరిగా ఆ గ్రామంపై దాడికి వస్తాడని అంచనా కట్టి, ఆ గ్రామానికి వచ్చే మార్గంలో అంబూష్ ఏర్పాటు చేశారు. అనుకున్న విధంగానే ఒక రోజు తర్వాత 50 మంది బి.ఎస్.ఎఫ్. బలగాలు 15వ తేదీన, ఉదయం 6గం॥లకే మన అంబూష్ సైట్‌కు చేరుకున్నారు. దీంతో అనుకున్న విధంగా మైన్ పేల్చారు. అయితే సాంకేతిక లోపం వల్లన మైన్ పేలలేదు. అప్పటికే శత్రువు అప్రమత్తం అయ్యాడు. శత్రువు చేసిన రాపిడ్ ఫైరింగ్‌లో అడ్వన్స్ అయి, ఫైరింగ్ చేస్తున్న కామ్రేడ్ సుక్కాల్ అమరుడయ్యాడు. శత్రువు ఆదరా బదరగా కామ్రేడ్ సుక్కాల్ శవాన్ని స్వాధీనం చేసుకొని వెనుదిరిగాడు.

పెదబయలు ఏరియాలోని మద్దిగరువు గ్రామంలో సూర్య, కిషోర్‌లు అనే ఇద్దరు ఇన్‌ఫార్మర్స్, ఇంటలిజెన్సీ సి.ఐ. వెంకట్రావ్ సంబంధంలో వుంటూ సమాచారం చేరవేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన సమాచారంపై ఆధారపడి దళం, 100 మందికి పైగా మిలీషియా కలిసి, ఆ గ్రామానికి వెళ్ళి, వాళ్ళను పట్టుకొని ప్రజాకోర్టు నిర్వహించారు. ప్రజల్లో వారు అనుసరిస్తున్న విప్లవ వ్యతిరేక కార్యకలాపాలను వివరించారు. ఆ తర్వాత సూర్యకు సంబంధించి ఎలక్ట్రికల్ షాప్‌లోని సామానులను స్వాధీనం చేసుకొని, ప్రజలకు పంపిణీ చేసి, వారిద్దరిని ఖతం చేశాం.

పెదటేకుపొద్దూరు గ్రామంలో చాలా కాలంగా ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్న కిలో సీతారాంను పార్టీ, ప్రజలు పట్టుకొని తన పద్ధతులు మార్చుకొమ్మని హెచ్చరించినప్పటికీ, పెడచెవిన పెడుతూ, పోలీసు ఏజెంటుగా పని చేస్తూ, ప్రజలపై పెత్తనం చేస్తూ, బెదిరింపులకు దిగాడు. దీంతో ప్రజలు, మిలీషియా కలిసి వీడిని ఖతం చేశారు.

కటాఫ్ ఏరియాలోని, నక్కమామిడి పంచాయితీ, పిప్పలిపొద్దూరు గ్రామంలో సాదురాం, నక్కమామిడిలో వున్న బి.ఎస్.ఎఫ్. క్యాంపుతో రెగ్యులర్‌గా సంబంధాల్లో వుంటూ, ఆ ప్రాంతంలోని సంఘ కార్యకర్తల సమాచారం చేరవేస్తూ, క్యాంపుకు పాలు అమ్మే పేరుతో వెళ్ళిరావడం చేస్తున్నాడు. ఈ విషయాలపై ప్రజలు ఆయనకు గుర్తింపచేసి, సరిదిద్దుకోమ్మని సూచించినప్పటికీ, తన పద్ధతులలో ఎలాంటి మార్పు రాలేదు. ఈ మధ్య ప్రభుత్వం నక్కమామిడి నుండి ఒనకడిల్లీకి రోడ్డు వెడల్పు చేస్తూ పనులు ప్రారంభించింది. ప్రజలు, పార్టీ ఈ రోడ్డును వ్యతిరేకించారు. వీడు కాంట్రాక్టర్ నుండి డబ్బులు తీసుకొని, కొందరు లంపెన్ యువకులను కూడగట్టి, కాంట్రాక్టర్ వాహనాలకు కాపలా పెట్టించాడు. వీడిని మిలీషియా, దళం కలిసి పట్టుకొని విచారించి ఖతం చేసింది.

పెదబయలు ఏరియాలోని బొంగిజంగి గ్రామానికి చెందిన మాజీ సంఘ సభ్యుడు మోహన్ ఒకసారి అరెస్ట్ అయ్యి, పార్టీ సమాచారం ఇస్తానని పోలీసులతో రహస్య ఒప్పందం చేసుకొని, విడుదల అయ్యాడు. అప్పటి నుండి ఆయన ప్రవర్తనపై ప్రజలు నిఘా పెట్టి, శత్రువుతో సంబంధాలు వున్నాయని తేల్చారు. పార్టీ మందలించి వదిలివేసింది. అయినా సంబంధాలను వదులుకోలేదు. గంజాయి వ్యాపారిగా కూడా మారాడు. ఇతన్ని పట్టుకొని ప్రజాకోర్టులో విచారించి, శిక్షించాలని పార్టీ నిర్ణయించింది. దానితో మిలీషియా, దళం కలిసి పట్టుకోవడానికి వెలితే కుటుంబం అప్రమత్తం చేసి తప్పించింది. ఆ పాకెట్‌లోని 15 గ్రామాలకు చెందిన సుమారు 1000 మంది ప్రజల సమక్షంలో ఆ కుటుంబాన్ని విచారించారు. కుటుంబాన్ని గ్రామం నుండి బహిష్కరించాలని ప్రజలు ఏకగ్రీవంగా నిర్ణయించి, గ్రామం నుండి పంపివేశారు.

అదే ప్రజా కోర్టులో ఆంత్రిపడ సత్తిని కూడా ప్రజల్లో విచారించి దేహశుద్ధి చేసి వదిలేశారు.

పప్పర్లమెట్ట (ఒడిశా) పంచాయితీలోని, పాలెం గ్రామంలో హోంగార్డులుగా పని చేస్తున్న సుబ్బారావు, రాజారావులు (అన్నదమ్ములు) చెప్పా పెట్టకుండా గ్రామం వదిలి పారిపోయి, చిత్రకొండలో మకాం పెట్టారు. ఈవిషయాన్ని ప్రజలతో చర్చించగా, వాళ్ళు వదిలి వెళ్ళిన ఇళ్ళ నుండి ధాన్యం, పశువులతో పాటు, భూములను పంచాలని నిర్ణయించారు. వాటిని చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పంపిణీ చేయడం జరిగింది.

కటాఫ్ ఏరియలో 3 నెలల క్రితం పనసపుట్ పంచాయితీలోని గొనబెడ సంఘటనకు కారణం, మూలాపుట్ వ్యక్తి రాజబో అనే విషయాన్ని ప్రజలు గ్రహించారు. దానితో వాడిని పట్టుకొని, ప్రజల్లో పెట్టి విచారించగా, సమాచారం ఇచ్చింది తానేనని అంగీకరించాడు. వాడిని తయారు చేసిన మరో పోలీసు ఏజెంటు, పెత్తందారు అయిన కుమ్మ (ఎ.పి.)గ్రామానికి చెందిన రామాంజనేయులును కూడా పట్టుకొని, విచారించి వాస్తవాలను ప్రజలలో చెప్పించి, పద్ధతి మార్చుకోమని హెచ్చరించి వదిలివేశారు.

జోడాంబ పంచాయితీలోని, కుంతులిపొద్దూరు ఐ.ఆర్.బి. క్యాంపు పోలీసులకు సహకరిస్తున్న, సామాను సరఫరా చేస్తున్న వ్యక్తులను విచారించి, తప్పులు ఒప్పించి వదిలివేశారు.

నక్కమామిడి పంచాయితీ, నారింజోల గ్రామంలో, పోలీసులతోనూ, పారిపోయిన ఇన్‌ఫార్మర్‌తోనూ సంబంధాలలో ఉంటున్న తెగ పెద్ద గ్రోను కుటుంబాన్ని ప్రజల్లో విచారించి, నాయక్ తమ్ముడు కాడికి దేహశుద్ధి చేసి, ఆ కుటుంబాన్ని గ్రామం నుండి బయటకు వెళ్ళవద్దని కండీషన్ పెట్టి, వదిలివేయడం జరిగింది.

ఒంద్రాలు పంచాయితీ, సిందిగూడ గ్రామానికి చెందిన, తెగ పెద్ద, మరియు మాజీ వార్డ్ మెంబర్ పోలీసుల సంబంధాలలో వుంటూ ప్రజలను బెదిరిస్తూ, ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ వున్నాడు. ఇతని కార్యకలాపం చుట్టు పక్కల సంఘాలకు కూడా సమస్యగా మారింది. దానితో సుమారు 150 మంది మిలీషియా, దళం కలిసి అతడిని పట్టుకొని, గ్రామంలోనే ప్రజాకోర్టు నిర్వహించి దేహశుద్ధి చేసింది. అలాగే బొజ్జగూడ గ్రామానికి చెందిన లంపెన్, అరాచకుడు, పోలీసు ఏజెంటు అయిన దొనపతికి కూడా దేహశుద్ధి చేసి గ్రామం వదిలి వెళ్ళవద్దని కండీషన్ పెట్టి కదిలివేశారు.

### ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు, ప్రభుత్వం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసిన ప్రజలు

కోరాపుట్, మల్కనగిరి, విశాఖపట్నంలలోని వ్యూహాత్మక ప్రాంతాలలో బ్రిడ్జిలు, రోడ్లు పోలీసు రక్షణలో నిర్మిస్తున్నారు. మల్కనగిరిలో కోయిరిపుట్ బ్లాక్ నుండి కోరాపుట్ జిల్లా, ఒనకడిల్లీకి ప్రస్తుతం వున్న రోడ్డును వెడల్పు చేసేందుకు, భారీ యంత్రాలను ఉపయోగించి, పోలీసు పెట్రోలింగ్‌ల మధ్య పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. 100 మంది మిలీషియా, దళం కలిసి ముదిలిపడ గ్రామం వద్ద రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న క్యాంపుపై దాడులు చేసి, జె.సి.బి., ట్రాక్టర్, 8 వాహనాలను దగ్ధం చేసి, పనులు ఆపాలని హెచ్చరించారు. అలాగే నక్కమామిడి నుండి ఒనకడిల్లీ వరకు కీలకమైన రోడ్డు పనులు బిట్స్‌గా విడగొట్టి భారీ యంత్రాలను ఉపయోగించి, కొందరు మధ్య దళారీలను అడ్డం పెట్టుకుని పనులు ప్రారంభించారు. ప్రజలు, మిలీషియా, దళం కలిసి జె.సి.బి.తోపాటు 3 వాహనాలను దగ్ధం చేసి పనులను నిలిపి వేశారు.

విశాఖపట్నం జిల్లా, జి.మాడుగుల మండలం, మందవీధి గ్రామంలో పోలీసులు సెల్‌టవర్‌ను నిర్మించారు. డిసెంబర్‌లో దానిపై వందలాది మంది మిలీషియా, వేలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా పాల్గొని దాన్ని ధ్వంసం చేశారు. ఈ సంఘటనలు ప్రజా యుద్ధంలో ప్రజల క్రియాశీలక భాగస్వామ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

## శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్

### 1. అవినీతిపరుడు, ప్రజావ్యతిరేకి అయిన హత్తిబారి పంచాయితీ సర్పంచ్ జగ్గకు మరణశిక్ష

నందపూర్ ఎ.సి. పరిధిలో నందపూర్ బ్లాక్, హత్తిబారి పంచాయితీకి చెందిన జగ్గ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలతో గత 15 సం॥లుగా వరుసగా మూడుసార్లు కూడా తానే సర్పంచ్ పదవిని (లేడిస్ సీట్ వచ్చినప్పుడు తన భార్యను సర్పంచ్‌గా చేసినా, తానే నడిపేవాడు) పొంది అధికారం చలాయిస్తున్నాడు. అధికార బలంతో పంచాయితీకి వచ్చే నిధులన్నీ తానే స్వాహా చేసేవాడు. అంతే కాకుండా కాంట్రాక్టు పనులు చేసి, ప్రజలకు కూలీ డబ్బులు ఇవ్వకుండా ప్రజల శ్రమను దోపిడీ చేసేవాడు. ఇందిరావాస్ ఇండ్లు, వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు పెన్షన్లు ఇవ్వాలన్నా, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఇవ్వాలన్నా, ప్రజల నుండి పెద్ద మొత్తంలో లంచాలను వసూలు చేసేవాడు. చివరకు ఏదైనా దరఖాస్తుపై వీడి సంతకం కావాలన్నా లంచం ఇవ్వాల్సిందే. రేషన్ డీలర్‌గా కూడా వీడే వుండి, ప్రజలకు ఇవ్వాల్సిన రూపాయి బియ్యాన్ని, కిరోసిన్‌ను కూడా బ్లాక్‌లో అమ్మేసుకునేవాడు. ఈ విధంగా వీడు శ్రమ చేయకుండా అవినీతి, అక్రమాలతో ప్రజల శ్రమను దోపిడీ చేసే పరాన్నభుక్కుగా మారాడు. ఇలా అక్రమంగా సంపాధించిన డబ్బుతో అక్రమ ఆస్తులను కూడబెట్టాడు. ట్రాక్టరు, బొలేరో, కారు, జీపు, 2 మోటర్ సైకిళ్ళు, 3 ఇళ్ళను సంపాదించి ముగ్గురు భార్యలతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. పేద ప్రజల కడుపులు కొట్టి, విలాస జీవితం గడుపుతున్న వీడి అరాచకత్వానికి కడుపు

మండిన ప్రజలు వీడ్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, పార్టీ ముందుకు సమస్యను తీసుకువచ్చారు. వీడ్ని శిక్షించాల్సిందిగా కోరారు. అంతే కాకుండా 2017, జనవరిలో వచ్చిన స్థానిక ఎన్నికల్లో వీడు మళ్ళీ సర్పంచ్ పదవికి పోటీ చేస్తే ఓట్లు వేయకుండా వీడ్ని ఓడించాలనీ, వేరొకరిని సర్పంచ్‌గా పోటీ చేయించారు. కానీ ధనబలం, అధికారబలంతో వీడు ఓట్లను కొనివేసి, తప్పుడు పద్ధతులతో మళ్ళీ వీడే సర్పంచ్‌గా గెలిచాడు. మళ్ళీ వీడి అరాచకాలు మొదలు పెట్టాడు. ఈ సారి వీడికి ఓటు వేయని గ్రామాల ప్రజలను వేధించడం, ప్రభుత్వం నుండి వచ్చే సదుపాయాలను ఈ గ్రామాలకు ఇవ్వకపోవడంతో పాటు, గట్టిగా నిలదీసిన వారిని కొట్టడం, యాక్సిడెంట్లు చేయించడం, అక్రమ అరెస్టులు చేయించడం చేసేవాడు. వీడు గెలిచిన వెంటనే పంచాయితీ సెంటర్‌లో పోలీసుల ద్వారా జనసంపర్క్ శిబిర్‌ను దగ్గరుండి నిర్వహించాడు. ఈ ఏరియాలో దళం కదలికలను తెలుసుకొని పోలీసులకు సమాచారం ఇస్తున్నాడు. ఈ విషయాలన్నీ పంచాయితీ ప్రజలు మళ్ళీ పార్టీ ముందు పెట్టి వాడికి మరణ శిక్ష విధించాలని కోరారు. ప్రజల అభిప్రాయంతో 7 గ్రామాల నుండి సుమారు 50 మంది యువకులతో కలిసి మన పి.ఎల్.జి.ఎ. ఆగస్టు 8వ తేదీన వీడి ఇంటి మీద దాడి చేసి, వీడి వాహనాలన్నీ తగులబెట్టి, వీడికి మరణశిక్ష విధించడం జరిగింది.

## 2. "ఇసుకపై స్థానికులకే హక్కు కావాలి" అని పోరాడి, సాధించుకున్నప్రజలు

నందపూర్ ఎ.సి. పరిధిలోని నందపూర్ బ్లాక్ పాడువ, సటువ పంచాయితీలలో పెద్ద కాలువ (వాగు) నుండి ఇసుకను తీసి, కాలువకు రెండు వైపులా వున్న స్థానిక గ్రామాల ప్రజలు దాన్ని విక్రయించి ఆదాయాన్ని పొందుతుండేవారు. నలుగురు లేదా ఐదుగురు ఒక గ్రూప్‌గా ఏర్పడి, కాలువ నుండి ఇసుకను తీసి, దాన్ని కొనుగోలు చేసేవారి వాహనానికి లోడ్ చేయాలి. ఒక ట్రాక్టర్ లోడ్‌కు సీజన్, డిమాండ్‌ను బట్టి 1000/- నుండి 1500/- వరకు ఇస్తారు. దాన్ని నలుగురు, ఐదుగురు పంచుకుంటారు. వ్యవసాయ పనులు లేని కాలంలో స్థానిక ప్రజలు ఈ ఇసుక ద్వారా కొంత ఆదాయాన్ని పొందేవారు. అయితే ఇందులో కూడా ప్రజలకు కూలీ డబ్బులు మాత్రమే దక్కేవి. ఇసుకను లోడ్ చేసుకొని, తీసుకుపోయి ఎక్కువ మొత్తంలో ధరకు అమ్మే షావుకారికి మాత్రం లాభం దక్కేది. ఈ రకంగా స్థానిక ప్రజలు తమ కాలువలోని ఇసుకపై తమకు హక్కు లేకుండా కూలీలుగా దోపిడీకి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు ఆ మాత్రం కూలీ డబ్బులు కూడా అందకుండా చేసి, తాము మరింత లాభాలను పొందేందుకు, స్థానికేతర షావుకార్లు కొంత మంది ఈ ప్రాంతంలో ఇసుకను కూలీల ద్వారా కాకుండా, యంత్రాల ద్వారానే తీయడం, లోడ్ చేయడం కూడా చేసి, పెద్ద మొత్తంలో ఇసుకను తవ్వి, తరలించుకుపోవటం 3 సం॥లుగా కొనసాగుతుంది. దీంతో తమ కాలువలోని ఇసుకపై హక్కు కాదు కదా, కనీసం కూలీ కూడా దొరకని స్థానిక గ్రామాల ప్రజలు తమ సమస్యను చట్టబద్ధంగా ప్రభుత్వంతో మొరపెట్టుకున్నారు. బి.డి.ఒ.కి, కలెక్టర్ ఆఫీసుకు మెమొరాండంలు ఇచ్చారు. అయినా పరిష్కారం కాలేదు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతానికి వెళ్ళిన పార్టీ ముందుకు ప్రజలు ఈ సమస్యను తీసుకువచ్చారు. మెషిన్‌ల ద్వారా నియంత్రణ లేకుండా, కాలువల్లో ఎక్కడకపడితే అక్కడ పెద్ద మొత్తంలో లోతుగా ఇసుకను తవ్వి తీసేయడంతో కాలువలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి గొడ్లు, ప్రజలు కూడా మునిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాలన్నీ సంబంధిత గ్రామాల ప్రజలతో చర్చించి ప్రజల అభిప్రాయం మేరకు ఇసుక యంత్రాలను, వాహనాలను తగులబెట్టడం, ప్రజల డిమాండ్లతో పోస్టర్లు వేయాలని పార్టీ నిర్ణయం తీసుకుంది. అందుకోసం 12 గ్రామాల ప్రజలతో ఒక పోరాట కమిటీని ఏర్పర్చి, ఆ కమిటీలో చర్చించి, కొన్ని డిమాండ్లను రూపొందించింది.

1. ఇసుకపై హక్కు స్థానిక గ్రామాల ప్రజలకే! మెషిన్ల ద్వారా ఇసుకను తవ్వడం తక్షణమే ఆపాలి.

2. కమిటీ నిర్ణయించిన ధరకే (ట్రాక్టర్ లోడు 1500/-)ఇసుకను కొనుగోలు చేయాలి.

3. ప్రతీ గ్రామానికి ఆదాయం వచ్చేలా ఇసుకను సీరియల్ ప్రకారం లోడ్ చేయాలి.

పై డిమాండ్లతో పాటు, ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్న స్థానికేతర షావుకార్లను కూడా హెచ్చరిస్తూ, పోస్టర్లు రాయడం జరిగింది. ఈ విధంగా పోరాట కమిటీ, సంబంధిత గ్రామాల ప్రజల నిర్ణయం ప్రకారం 27-6-2017 తేదీన సంబంధిత గ్రామాల నుండి 60 మంది మిలీషియాతో మన పి.ఎల్.జి.ఎ. కూడా కలిసి రెండు బ్యాచ్‌లుగా వేరు వేరు చోట్ల వున్న 5 ఇసుక మెషిన్లను ధ్వంసం చేసి, పోస్టర్లు వేయడం జరిగింది. ఈ సంఘటన ఆ ప్రాంత గ్రామాల ప్రజల్లో మంచి ప్రభావాన్ని, ఉత్సాహాన్ని కలిగించింది. ఇది జరిగిన తరువాత కాలువకు రెండు వైపులా వున్న గ్రామాలలో పాకెట్ కమిటీలు ఏర్పడ్డాయి. స్థానిక గ్రామాల ప్రజలు ఇసుకను తవ్వి, ఆదాయాన్ని పొందుతున్నారు. అయితే ప్రస్తుతం ఇసుకను తవ్వే మెషిన్లు ఉపయోగించనప్పటికీ, షావుకార్లు స్థానికేతర లేబర్‌ను తీసుకువచ్చి, తక్కువ కూలీ ఇచ్చి, ఇసుకను తవ్వి తీసుకుపోవడం చేస్తున్నారు. ఈ విషయంలో ప్రజల్లో చర్చ వున్నప్పటికీ, బయట నుండి లేబర్ వచ్చినప్పటికీ, తమకు కూడా పని దొరుకుతుంది కదా అని భావిస్తూ, తక్షణ సమస్యగా లేకపోవటంతో కొంత ముందూ, వెనకా అవుతున్నారు. ఈ సమస్యపై ప్రజల్లో మరింత చైతన్యాన్ని పెంచుతూ, ఇసుకపై పూర్తి హక్కును సాధించేందుకు ప్రజలను ఐక్యం చేసి, పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం వుంది.

### 3. జులై 28 అమరుల సంస్మరణ వారం సందర్భంగా అమరుల కుటుంబాలకు ఆర్థిక, హార్థిక సహకారాన్నందించిన ప్రజానీకం

2017, జులై 28 అమరుల సంస్మరణ వారాన్ని ఘనంగా జరుపుకోవాల్సిందిగా పిలుపునిస్తూ, ఎస్.కె.ఎల్–కె.పి. డివిజన్ పత్రికా ప్రకటనను ఇచ్చింది. డివిజన్ వ్యాప్తంగా పోస్టర్లు, బ్యానర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటుగా, నెల రోజుల ముందు నుండే క్యాంపెయిన్‌గా ప్రతి గ్రామంలోనూ, అమరుల త్యాగాలను ఎత్తివడుతూ, అమరుల కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా పిలుపునివ్వటంతో, ప్రజలు స్పందించి, విరాళాలను అందించారు. నందపూర్ ఎ.సి. పరిధిలో ప్రజలు ఇచ్చిన విరాళాలను (27,000/–) కొరాపుట్ డివిజన్‌లో ఈ సంll అమరులైన ముగ్గురు కామ్రేడ్స్ కుటుంబాలకు అందజేయడం జరిగింది. అలాగే పార్టీ పిలుపునందుకొని నందపూర్ ఎ.సి. పరిధిలో బూరుగులపాడు పాకెట్‌లో అమరుల స్మారక స్థూపాన్ని సిమెంట్‌తో ప్రజలు నిర్మించుకున్నారు. మరికొన్ని గ్రామాలలో రాళ్ళతో స్థూపాలు కట్టారు. పాత స్థూపాలకు రంగులు వేసి, జెండాలు పెట్టి, సమావేశాలు జరుపుకొని అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అమరుల ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### 4. కత్తులపేట భూముల్లో జెండాలు పాతి, పంటను కోసుకున్న ప్రజానీకం

2009లో నారాయణపట్న, బందుగాం బ్లాకుల్లో ఆదివాసేతర భూస్వాములకు వ్యతిరేకంగా బద్దలైన భూ పోరాటం, పీడిత ప్రజానీకంలో అది వేసిన గొప్ప ప్రభావం అందరికీ తెలిసినదే. అయితే ఆ వీరోచిత పోరాటాన్ని అణచివేయడానికి పాలక వర్గాలు అత్యంత కౄరమైన నిర్బంధాన్ని అమలు చేయడంతో చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ పోలీసు అండతో ఆదివాసేతర భూస్వాములు, షావుకార్లు, ప్రజలు పోరాడి సాధించుకున్న భూములను తిరిగి బలవంతంగా ఆక్రమించుకున్నారు. ఆ భూముల్లో ప్రజలు కూలీలుగా గొత్తి (వెట్టి)పని వారిగా మారిపోయారు. తీవ్రమైన నిర్బంధం మధ్యలోనే పార్టీ పి.ఎల్.జి.ఎ. చేసిన రాజకీయ కృషి వలన ప్రజల్లో రాజకీయ చైతన్యం క్రమంగా పెరుగుతూ, రహస్యంగా కన్సాలిడేట్ అవుతూ, తిరిగి తమ భూముల కోసం పోరాడటానికి సిద్ధమవుతున్నారు. అలాంటి పరిస్థితి వున్నచోట్ల పార్టీ ప్రజల సంసిద్ధతను పెంచే విధంగా కృషి చేస్తూనే ప్రజల భాగస్వామ్యంతో కనిష్ఠ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అందులో భాగంగానే కత్తులపేట భూముల విషయంలో మాజీ సంఘ నాయకుడు బిర్సును ప్రజాకోర్టులో నిలబెట్టి, ప్రజలకు చేసిన ద్రోహం విషయంలో ప్రజల ముందు దేహశుద్ధి చేయడంతో పాటు, ప్రజలు తిరిగి భూములను స్వాధీనం చేసుకోవాల్సిందిగా మోటివేట్ చేస్తూ, 2017 మార్చిలో ప్రజాకోర్టు నిర్వహించి ప్రజలకు పిలుపునివ్వడం జరిగింది. అదే రోజున 4 గ్రామాల ప్రజలు కదిలి గతంలో తమ గ్రామాలకు కేటాయించిన భూముల్లో జెండాలు పాతారు. రాత్రికి రాత్రి కత్తులపేటలో బ్యానర్లు, పోస్టర్లు వేశారు. ఆ తర్వాత ఆ భూముల్లో ఏపుగా పెరిగివున్న సెంటుగడ్డి (లెమన్ గ్రాస్)4 గ్రామాల ప్రజలు కలిసి సమిష్టిగా ఒకదాని తర్వాత ఒకటి కోసేశారు. సెంట్రీలు పెట్టుకొని 3 రోజులు శ్రమ చేసి తీసిన సెంటునూనె అమ్మగా, వచ్చిన డబ్బులను గ్రామాల వారిగా సమానంగా పంచుకున్నారు. ఒక్కో గ్రామానికి 30,000/– రూll ల చొప్పున పంచుకున్నారు. అయితే భూముల్లో ప్రజలు జెండాలు పాతి సెంటు కోయడం ప్రారంభించడంతో సంబంధిత షావుకార్లు సంఘ నాయకుల వద్దకు వచ్చి, తమకు సగం వాటా ఇవ్వాలనీ, తాము పెట్టుబడి పెట్టాం కనుక కనీసం ఖర్చులైనా ఇవ్వాలని పదే పదే రాజీబేరాలు చేయడం మొదలుపెట్టారు. చివరికి 4 గ్రామాల సంఘ నాయకత్వం, ప్రజలు మాట్లాడుకొని, షావుకార్లందరిని పిలిచి "భూములకు సంబంధించి ఒక్క పైసా కూడా ఇచ్చేదిలేదనీ, భూములను విడిచిపెట్టమనీ, ఇంతకాలం మా భూములను ఆక్రమించుకొని సంపద పోగేసుకున్నందుకు షావుకార్లు ప్రజలకు డబ్బులు చెల్లించాలనీ, ఇప్పటికైనా ఈ భూముల కోసం ప్రజల జోలికి వస్తే సహించేది లేదనీ, ప్రభుత్వ పోలీసులను దించి నిర్బంధం ప్రయోగిస్తే, భూముల కోసం దేనికైనా సిద్ధమేనని" షావుకార్లకు తేల్చి చెప్పారు.

ప్రజలు ఇలా తిరస్కరించడంతో, షావుకార్లు తాత్కాలికంగా వెనక్కి తగ్గారు. అయితే వాళ్ళు లోపాయికారిగా తమ ప్రయత్నాలను కొనసాగించారు. ఫలితంగా 3 గ్రామాల ప్రజలు, సంఘ నాయకులు దేనికి లొంగక గట్టిగా నిలబడినప్పటికీ, ఒక గ్రామానికి చెందిన నాయకత్వం కొంత బలహీనపడింది. దాంతో రెండవసారి భూములలో సెంటుగడ్డి కోతకు ఆ గ్రామస్తులు సిద్ధపడలేదు. మిగతా 3 గ్రామాలలోనూ, ఏ గ్రామానికి ఆ గ్రామం సమిష్టిగా రెండవ కట్టింగ్ చేసి, వచ్చిన ఆదాయాన్ని గ్రామ ఉమ్మడి ఆదాయంగా పెట్టారు. (సెంటుగడ్డిని 4నెలలకొకసారి కట్టింగ్ చేసి, నూనె తీస్తారు. సంవత్సరానికి 3 కట్టింగ్‌లు వుంటాయి. ఒక లీటర్ సెంటు నూనె 1000/–రూll నుండి 1200/– రూll వరకు ధర వుంటుంది). 2017 మార్చిలో జెండాలు పాతి, మొదటి కట్టింగ్ మార్చి చివరికి చేయగా, రెండవ కట్టింగ్ ఆగస్టులో చేశారు. పార్టీ తిరిగి సెప్టెంబర్‌లో ఆ పాకెట్‌కు వెళ్ళేటప్పటికి పై పరిణామాలు అర్థమయ్యాయి. భూపోరాటంలో భాగమైన 4వ గ్రామం షావుకార్లు బెదిరింపులకు, ఒత్తిడికి లొంగి, సంఘ నాయకత్వం బలహీనపడి, తమకు కేటాయించిన భూముల్లో రెండవ కట్టింగ్ చేయకపోవడం, దాన్ని అప్పటికే షావుకార్లు కూలీలతో సెంటు కట్టింగ్ చేయించిన విషయం తెలిసింది. దాంతో పోరాటంలో గట్టిగా నిలబడిన 3 గ్రామాలలోనూ, ముందుగా ప్రజలతో, సంఘ నాయకత్వంతో సమావేశాలు జరిపి పై విషయాలను లోతుగా చర్చించి, ప్రజల, సంఘనాయకుల అభిప్రాయాలను సేకరించడం జరిగింది. ఈ సమావేశాల్లో మన ముందుకు వచ్చిన సమస్యలు ....

1. మొదటిసారి సెంటు కోతను 4 గ్రామాలు కలిసి సమిష్టిగా చేశారు. రెండవసారి ఏ గ్రామానికి ఆ గ్రామం విడివిడిగా చేశారు. ఇందులో 4వ గ్రామం తమకు కేటాయించిన భూమిలో సెంటు కోయలేదు.

2. సెంటునూనె ద్వారా వచ్చిన డబ్బును గ్రామ ఉమ్మడి ఆస్తిగా పెట్టినట్లు చెప్పినప్పటికీ, వాస్తవంగా అది ఆయా గ్రామాల సంఘ నాయకత్వం కొంత మంది వారి అవసరాలకు ఉపయోగించుకోవడం, అడిగినప్పుడు ఇచ్చివేస్తామని చెప్పడం జరిగింది.

3. ప్రజలు స్వాధీనం చేసుకున్న భూముల్లో సెంటుగడ్డి మాత్రమే కాకుండా, ఒక గ్రామానికి కేటాయించిన భూమిలో 10 ఎకరాల పొలం కూడా వుంది. అయితే జెండాలు పాతే నాటికి, షావుకారి పంటను కోసేశాడు. అయితే ఆ భూముల్లో గతంలో తమకు కేటాయించిన విధంగా గ్రామస్తులు అంతా కలిసి, రెండవ పంట కోసం ఏర్పాట్లు చేయాల్సి వుంది. ఈ పొలాన్ని 20 మందికి (గతంలో) పంపకాలు చేయటం అయ్యింది. కానీ ఈ సంవత్సరం 6గురు మాత్రమే 3 ఎకరాల్లో సాగు చేశారు. మిగతా భూమి ఖాళీగా వదిలిపెట్టారు.

4. కత్తులపేట భూపోరాటంలో ఈ 4 గ్రామాలే కాకుండా గతంలో మరో పంచాయితీకి చెందిన సుమారు 10 గ్రామాలకు పైగా ప్రజలు పాల్గొన్నారు. ఆ గ్రామాలన్నిటికి భూములు పంపకాలు చేయడం అయ్యింది. కానీ ప్రస్తుతం 4 గ్రామాలే సిద్ధపడటం, అందులో ఒక గ్రామం కొంత బలహీనపడటం, మరో వైపు శత్రువు ఈ పోరాటాన్ని నీరుగార్చడానికి తీవ్ర ప్రయత్నాలు చేయడం వల్ల, గట్టిగా నిలబడిన 3 గ్రామాలపై శత్రు కేంద్రీకరణ ఒత్తిడి చేయడం జరుగుతుంది. కనుక మిగతా గ్రామాలను కూడా మోటివేట్ చేసి, ఐక్యం చేసి, భూ పోరాటాలలోకి దించాల్సిన అవసరం వుందనీ, అప్పుడే తమకు బలం పెరుగుతుందని ప్రజలు అభిప్రాయపడ్డారు.

5. 4 గ్రామాలను పోరాటంలోకి దించడం, కార్యక్రమం ఇవ్వడం జరిగింది. కానీ దానికి సరైన మార్గదర్శకత్వం వహించేందుకు నిర్దిష్టంగా కమిటీ నిర్మాణం చేయకపోవడం వలన వచ్చిన సమస్యలను ఏ గ్రామానికి ఆ గ్రామంగానే పరిష్కరించుకుంటున్నారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాలేదు. వచ్చిన ఆదాయాన్ని వెంటనే పంపిణీ చేయకుండా పార్టీ కలిసేంతవరకు సమిష్టిగా వుంచుదాం అనే పేరుతో కొంత మంది ఉపయోగించుకుంటున్నారు.

పై విషయాలన్నీ అర్థమయ్యాక సమస్యను పరిష్కరించేందుకు ముందు 4 గ్రామాలు కలిసి కమిటీ నిర్మాణం చేయాలనుకున్నాం. అందుకు 4 గ్రామాల నుండి ముఖ్యమైన వాళ్ళతో కోర్‌ను 20 మందితో సమావేశం జరిపి, అందులో నుండి 7గురితో కమిటీ నిర్మాణం చేశాం. కమిటీలో పై సమస్యలన్నీ లోతుగా చర్చించి ఈ క్రింది తీర్మాణాలు చేయడం జరిగింది.

ఎ. సమిష్టిగా అందరూ పనిలో పాల్గొనాలి. వచ్చిన ఆదాయాన్ని ఖర్చులకు పోను తదుపరి పంట కోసం అవసరమైన మదుపు (పెట్టుబడి)తీసేయగా మిగిలిన డబ్బును ఎప్పటికప్పుడు గ్రామంలో ప్రజలందరికీ సమానంగా పంపకాలు చేయాలి.

బి. 4వ గ్రామానికి కేటాయించిన భూమిలో షావుకారి సగం కోసివేశాడు. మిగిలినదంతా వెంటనే 4 గ్రామాలు కలిసి కోసివేయాలి. వెంటనే మొత్తం భూమిని దున్ని, సెంటు మొక్కలను నాటాలి. 4 గ్రామాలు ఐక్యంగా పని చేయాలి.

సి. సెంటు గడ్డి వేసిన భూమి కాకుండా, ఒక గ్రామానికి కేటాయించిన 10 ఎకరాల పొలాన్ని అందరూ(ఆ గ్రామస్తులు) సమిష్టిగా పని చేసే విధంగా కమిటీ బాధ్యత పడాలి.

డి. భూముల సాగు విషయంలో గ్రామంలో ప్రజల మధ్య సమస్య వచ్చినా, షావుకార్ల వలన సమస్య వచ్చినా కమిటీ వెంటనే సమావేశమై ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యతను ఇచ్చి సమస్యను పరిష్కరించాలి.

ఇ. 4 గ్రామాలకు మద్దతుగా కత్తులపేట భూముల్లో గతంలో కలిసి వచ్చిన మిగతా గ్రామాలను కూడా కలుపుకొచ్చే విధంగా కమిటీ కృషి చేయాలి.

ఎఫ్. గతంలో ఒకసారి ప్రజాకోర్టులో బిర్సుకు వేసిన నష్టపరిహారాన్ని కమిటీ తీసుకొని సంబంధిత గ్రామానికి అందజేయాలి.

ఈ విధంగా సమావేశం జరిపి నిర్ణయం తీసుకున్న తర్వాత వెంటనే కమిటీ పోరాటంలో బలహీనపడిన 4వ గ్రామానికి వెళ్ళి ప్రజలతో సమావేశం జరిపింది. ఈ సమావేశంలో ప్రజలు సెంటు గడ్డి కోయడానికి సిద్ధపడటంతో 4 గ్రామాలు కలిసి ఒక్కపూటలోనే ఆ గడ్డిని కోసి, నూనె ద్వారా వచ్చిన ఆదాయాన్ని సంబంధిత గ్రామానికి ఇవ్వడమే కాకుండా, ఆ భూమిని వెంటనే దున్ని, కొత్త సెంటు మొక్కలను కూడా నాటారు. ఇది ప్రజల సమిష్టితత్వాన్ని, ఐక్యతను తెలియచేస్తుంది. అయితే ప్రజలు అభిప్రాయ పడుతున్నట్లుగానే ఈ 4 గ్రామాలకు మద్దతుగా, మిగతా గ్రామాలను కూడా మోటివేషన్, కన్సాలిడేట్ చేసే విధంగా, పోరాటంలోకి దించే విధంగా రాజకీయ కృషిని చేయడంతో పాటుగా, ఆటంకాలను తొలగించే విధంగా ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో కార్యక్రమం తీసుకోవాల్సిన అవసరం పార్టీ కర్తవ్యంగా వుంది.



"విప్లవ యుద్ధం ప్రజలు చేసే యుద్ధం. ప్రజలను సమీకరించి వారిపై ఆధారపడి మాత్రమే దానిని నిర్వహించగలం" -కామ్రేడ్ మావో

# ప్రజాకోర్టులు

## అవినీతిపరులు, ఇన్‌ఫార్మర్లపై ప్రజా పంచాయితీలు నిర్వహించి, వారిని లొంగదీసిన ఆదివాసీ ప్రజానీకం

1. కొరాపుట్ జిల్లా, నందపూర్ ఏరియా, గొల్లూరు పంచాయితీ, పొట్టుగూడ గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తి ప్రభుత్వం దగ్గర వున్న తన పలుకుబడిని ఉపయోగించుకొని, 2014 నుండి 2015 వరకు సుమారు 5 లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ పనులను, ప్రజల చేత చేయించాడు. కానీ ప్రజలకు మాత్రం ఒక్క నయా పైస కూడా ఇవ్వకుండా మొత్తం తానే స్వహా చేసి, ప్రజల దగ్గర బిల్లు కాలేదనీ, ప్రభుత్వం నుండి డబ్బులు వచ్చిన వెంటనే మీకు ఇచ్చేస్తానని అబద్దాలు ఆడుతూ వచ్చాడు. సంవత్సరాల తరబడి డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రజలకు అనుమానం వచ్చి, సంబంధిత ప్రభుత్వ అధికారులను కలిసి మాట్లాడటంతో, రాము ఎప్పుడో తనకు రావల్సిన బిల్లును మంజూరూ చేయించుకున్నాడన్న విషయం అర్థమైంది. దీంతో ప్రజలకు వాస్తవం అర్థమైందన్న విషయం తెలుసుకున్న రాము, ప్రజలను బెదిరించడం మొదలుపెట్టాడు. "నాకు ప్రభుత్వం, పోలీసుల అండదండలు వున్నాయనీ, గట్టిగా మాట్లాడితే పోలీసులతో చెప్పి జైళ్ళల్లో పెట్టిస్తానని భయపెట్టాడు. ఈ క్రమంలో గ్రామంలోని సంఘ నాయకత్వాన్ని అరెస్ట్ చేయించేందుకు ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో పార్టీ, స్థానిక సంఘం కలిసి ప్రజా పంచాయితీ నిర్వహించారు. ఈ ప్రజా పంచాయితీకి 7 గ్రామాల ప్రజలు, సుమారు 100 మంది వరకు హాజరై రామును నిలదీయడంతో తన తప్పును ఒప్పుకున్నాడు. ఈ సందర్భంగా ప్రజలు వాడికి దేహశుద్ధి చేసి, బకాయి పడివున్న 2 లక్షల 50 వేల రూపాయలను తక్షణమే వసూలు చేశారు. ఇక నుండి కాంట్రాక్టు పనులు చేయవద్దనీ, పోలీసులతో తనకున్న సంబంధాలను వెంటనే మానుకోవాలనీ, లేనిచో భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని సంఘం హెచ్చరించడంతో, సంఘం పెట్టిన షరతులను ఒప్పుకున్నాడు. ప్రజల సంఘటిత శక్తి ద్వారా పై సమస్య పరిష్కారం కావడంతో, భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా ఇదే పద్ధతిని కొనసాగించాలని సంఘం, ప్రజలు నిర్ణయించారు.

2. కొరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్, పేటూరు పంచాయితీ, మొండిగవాడ గ్రామానికి చెందిన రాజు గ్రామ మునసబు, పెత్తందారీగా వుంటూ ఆ గ్రామ ప్రజలపై ఆధిపత్యం కొనసాగించడంతో పాటు ప్రభుత్వం నుండి వస్తున్న ఎన్.ఆర్.జి.సి., రోడ్డు నిర్మాణం తదితర పనులకు కూడా తానే కాంట్రాక్టర్‌గా వుంటూ ప్రజలను దోచుకునేవాడు. ప్రజలు కూలి డబ్బులు అడిగితే వాళ్ళను కొట్టడం, పోలీసులకు చెప్పి జైలులో పెట్టిస్తానని బెదిరించడం చేసేవాడు. ఈసమస్యను కూడా సంఘనాయకత్వంలో ప్రజా పంచాయితీ నిర్వహించారు. ఈ పంచాయితీకి 5 గ్రామాల ప్రజలు హాజరై రాజు చేసిన అరాచకాలను నిలదీసి, దేహశుద్ధి చేయడంతో పాటు కాంట్రాక్టు పనుల ద్వారా అక్రమంగా స్వాహా చేసిన 30 వేల రూపాయలను ప్రజలకు ఇవ్వాలనీ, అవసరానికి మించి తన దగ్గర వున్న భూములను తీసి, గ్రామంలో వున్న నిరుపేద కుటుంబాలను పంచి పెట్టాలనీ, పోలీసుల అండతో ప్రజలను బెదిరించే పద్ధతులను మానుకోవాలనీ, డిమాండ్ చేసి వాటిని సాదించుకున్నారు.

3. నందపూర్ బ్లాక్, తమ్మడింగ్ గ్రామానికి చెందిన డొంబు అనే వ్యక్తి పెద్దమనిషిగా చలామణి అవుతూ, పోలీసుల అండదండలతో గ్రామంలోనే కాకుండా, ఆ చుట్టపక్కల గ్రామాలలో కూడా గూండాగిరినీ, అనేక అరాచకాలను కొనసాగిస్తున్నాడు. ఒక రోజు దళం ఆ గ్రామానికి వెళ్ళి, ప్రజలతో మీటింగ్ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా డొంబు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు రాత్రికి రాత్రే ఆ గ్రామంపై దాడి చేశారు. అప్పటికే దళం ఆ పరిసరాలను దాటుకొని ముందుకు పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ గ్రామంలో మనకు సహకరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, కొట్టి విడిచిపెట్టారు. డొంబు ద్వారానే పోలీసులకు సమాచారం వెళ్ళిందనే విషయాన్ని ప్రజల ద్వారా తెలుసుకున్న స్థానిక దళం డొంబును పట్టుకొని ప్రజల ముందు పెట్టి దేహశుద్ధి చేయడంతో, తన తప్పును ఒప్పుకున్నాడు. అయితే వీడి కొడుకు సునబెడలో హోంగార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. తన కొడుకు కూడా ఉద్యోగానికి రాజీనామా చేసి, గ్రామంలో బతకాలనీ, పోలీసుల అండదండలతో కొనసాగిస్తున్న దాదాగిరిని వెంటనే మానుకోవాలనీ, స్థానిక ప్రజలు చేసిన డిమాండ్స్‌ను ఒప్పుకున్నాడు. పై సమస్య పార్టీ నాయకత్వంలో పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషించారు.

4. నందపూర్ ఏరియా, మాదల పంచాయితీ, తోంగూడ గ్రామానికి చెందిన పాంగి రాజేష్, పాంగి బింగులతో పాటు, చాపరాయివలస గ్రామనికి చెందిన కామేష్‌లు ఆంధ్ర పోలీసుల లింక్‌లో వుంటూ, దళ సమాచారం సేకరించే పనిని కొనసాగిస్తూ వచ్చారు. పాత డబ్బుల వ్యాపారం పేరుతో ఏరియా మొత్తం తిరుగుతూ, దళం సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందజేయడంతో, అనేక సార్లు దళం ప్రజల సహకారంతో తృటిలో ఎన్‌కౌంటర్స్ నుండి తప్పించుకోగలిగింది. దళం సమాచారం పోలీసులకు చెప్పడంతో పాటు, గ్రామంలో ఉన్న మహిళలపై అత్యాచారం చేయడం, ఎవరైనా ఎదిరిస్తే వాళ్ళపై దౌర్జన్యం చేయడం లాంటి పనులు కొనసాగించేవాళ్ళు. ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని ఆ పాకెట్ ఆదివాసీ రైతు కూలి సంఘం ప్రజా కోర్టును నిర్వహించి, ఆ ముగ్గురికి దేహశుద్ధి చేసింది. ఈ సందర్భంగా పోలీస్ ఇన్‌ఫార్మర్ పని చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అత్యాచారినికి గురైన మహిళలకు వాళ్ళ చేత క్షమాపనలు చెప్పించారు. పాత డబ్బుల పేరుతో ఏరియాలో తిరగడాన్ని నిషేదించారు. ఈ నిర్ణయాలు అమలులోకి రావడంతో వారి నుండి ప్రజలకు స్థానిక దళానికి సమస్యలు తగ్గాయి. ✦

65వ పేజీ తరువాయి...

పునాదిని మార్చింది. సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు, పాత పద్ధతుల్లోనూ మార్పులు తెచ్చింది. ఆలోచనల్లో మౌలిక మార్పులు తెచ్చేందుకు ప్రయత్నం మొదలు పెట్టింది.

సొంత ఆస్తుల మీద పీఠం వేసుకొని కూర్చున్న భూస్వాముల, పెట్టుబడిదారుల ఆస్తులను స్వాధీనం చేసుకొని –'విధిరాత, తలరాతల'ను మార్చివేసింది. పీడిత ప్రజల ప్రభుత్వంగా సోవియట్‌లను నిర్మించింది. అప్పటిదాకా వంచింపబడిన ప్రజానీకానికి సోవియట్‌ల ద్వారా సర్వహక్కులు ఇచ్చింది. రష్యన్ విప్లవ విజయానికి ఆనాటి రివిజనిస్టులపై లెనిన్ తీవ్రమైన పోరాటం చేశాడు. దోపిడీవర్గం, దేశభక్తి పేరుతో ప్రజలను మోసం చేస్తే, రివిజనిస్టులు దానికి వంత పాడారు. వర్గాలకతీతమైన దేశభక్తి వుండదని లెనిన్ అర్థం చేయించాడు. సామ్రాజ్యవాదుల దేశభక్తి ప్రేరేపిత యుద్ధాన్ని బహిర్గత పర్చాడు. యుద్ధాన్ని అంతర్యుద్ధంగా (వర్గయుద్ధంగా)మార్చమని ప్రజలకు పిలుపునిచ్చాడు. ఆ విధంగా సామ్రాజ్యవాదుల ఎత్తుగడలను చిత్తు చేశాడు.

బోల్షివిక్ విప్లవ విజయంతో కార్మికవర్గ విప్లవాల యుగం ప్రారంభమైంది. ఈ విప్లవం సామ్రాజ్యవాదులను భయపెట్టింది. దీని ప్రభావంతో వలసదేశాలలో కూడా కమ్యూనిస్టు పార్టీల నిర్మాణం జరిగింది. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ రచనలను, ఇతర మార్క్సిస్టు సాహిత్యాన్ని ఆయా జాతుల స్థానిక భాషల్లోకి అనువాదాలు చేయించి ప్రపంచమంతా మార్క్సిజాన్ని ప్రచారం చేశారు. ఈ విధంగా విప్లవ సిద్ధాంతాన్ని ప్రపంచంలోని పీడిత ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. బోల్షివిక్ విప్లవ ప్రభావం వలన చాలా దేశాల్లో సామ్రాజ్యవాదులు తమ వలసలను వదులుకొని ప్రత్యక్ష పాలన నుండి పరోక్ష పాలనకు మారారు. బోల్షివిక్ విప్లవంలో రష్యాలోని ఇతర జాతులకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి కార్మికవర్గానికీ, పీడిత జాతులకు ఐక్యతను కల్పించారు. ఇది భవిష్యత్ విప్లవాలకు మోడల్‌గా వుండింది. సంస్కరణల ద్వారా పీడిత ప్రజలు అధికారానికి రావడం జరగదనీ, సాయుధ విప్లవం ద్వారానే దోపిడీవర్గాన్ని కూలదోసి అధికారానికి రావడం సాధ్యమని బోల్షివిక్ విప్లవం నిరూపించింది.

సామ్రాజ్యవాద దశలో అసమానాభివృద్ధి వుంటుందనీ, సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలో బలహీనమైన లింక్ వద్ద శత్రువు మీద దాడి చేయాలనీ, అనగా శత్రువు బలహీనతలమీద, శత్రువు బలహీనపడినప్పుడు తీవ్రంగా దెబ్బ కొట్టాలనే ఎత్తుగడలను బోల్షివిక్ విప్లవంలో అమలు జరిపారు. ఒక దేశంలో విప్లవం విజయవంతం కాదనే వాదనని తప్పని నిరూపించారు.

**సోవియట్ యూనియన్‌లో సోషలిజం నిర్మాణం :-** విప్లవానికి ముందు రష్యా మిగతా పెట్టుబడిదారీ దేశాలకంటే చాలా వెనకబడి వుండింది. మొత్తం జనాభాలో కార్మికులు 10 శాతం కంటే కూడా తక్కువ ఉన్నారు. రైతాంగం ఆర్థికంగానూ, సాంస్కృతికంగాను వెనకబడి వున్నారు. నలువైపులా సామ్రాజ్యవాద శత్రువులు పొంచి వున్నారు. ఈ పరిస్థితుల్లో బోల్షివిక్ పట్టుదలతో వారు ముందుకే ప్రయాణం సాగించారు. 1920ల ప్రాంతంలో ఉత్పత్తిలో ఒక ఉద్యమం బయల్దేరింది. శనివారపు (రష్యన్ భాషలో సుబోత్నిక్ అంటారు) సెలవు దినాల్లో కూడా పార్టీ సభ్యులు, సానుభూతిపరులు ఉచితంగా శ్రమ చేశారు. దీనిలో మాములు కంటే 3 రెట్లు ఎక్కువ ఉత్పత్తి చేసేవారు. దీన్ని సుబోత్నిక్ ఉద్యమం అన్నారు. ఆ తర్వాత కాలంలో స్టఖ్‌నోవ్ అనే సాధారణ కార్మికుడు బొగ్గును రెట్టింపు స్థాయిలో ఉత్పత్తి చేసే కొత్త పద్ధతిని కనిపెట్టాడు. ఈ ఉదాహరణ ద్వారా సాధారణ కార్మికులు సైతం నిపుణులుగా అభివృద్ధి చెందవచ్చనే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఇదే స్టఖ్‌నోవ్ వైట్ ఉద్యమంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. 1930ల నాటికి సోవియట్ యూనియన్‌లో లేబర్ ఎక్స్‌చేంజ్‌లను మూసివేశారు. నిరుద్యోగ సమస్యను నిర్మూలించారు. 1936 నాటికి 'పని చేసే హక్కు'ను రాజ్యాంగంలో గ్యారంటీ చేశారు. 1947-50కి మధ్య కాలంలో వినియోగ వస్తువుల ధరలను 40 శాతం వరకు తగ్గించారు. ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మార్కెట్ ప్రమేయాన్ని తగ్గించారు. మరోవైపున అన్ని పెట్టుబడిదారీ దేశాలలో నిరుద్యోగం, దరిద్రం, ఆకలి తాండవించింది. పంచవర్ష ప్రణాళికల ద్వారా సోవియట్ ఆర్థిక వ్యవస్థను వేగంగా అభివృద్ధి చేశారు.

పెట్టుబడిదారీ దేశాల్లో మహిళల శ్రమను దోచుకుంటూ, మహిళను వ్యాపార సరుకుగా మార్చారు. సోవియట్ యూనియన్‌లో "ప్రతి ఒంటకత్తె ఒక రాజకీయ వేత్త కావాలనే" నినాదంతో ముందుకుపోయారు. ఇంటి పని, వంట పని నుండి మహిళను విముక్తి చేశారు. పిల్లల పెంపక కేంద్రాలను ఏర్పరిచారు. గర్భవతులైన మహిళలకు సదుపాయాలు, రాజ్యాంగంలో రక్షణ కల్పించారు. పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాలలో రాణించారు.

పెట్టుబడిదారీ దేశాల్లో విద్యా వ్యవస్థను సమాజానికి పనికిరాకుండా, దోపిడీ వర్గాలకు లాభాల కోసం, స్వార్థం కోసం నడిపించారు. "సమాజం నుండీ, జీవితం నుండి విడివడిన విద్య వట్టి బూటకం, అబద్ధం" అని లెనిన్ మహోపాధ్యాయుడు చెప్పాడు. సోవియట్ యూనియన్‌లో సమాజ అవసరాల కనుగుణంగానే విద్యా వ్యవస్థను తయారు చేశారు. ప్రకృతితో అనుసంధానం చేసి బాలలకు చదువును ఆట, పాటలతో పరిచయం చేసేవారు. ప్రాథమిక, ఉన్నత, ఆపై చదువులలో సమాజ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పాఠాలను తయారు చేసేవారు. విద్యార్థులు చదివిన పాఠాలను ఆచరణలో పెట్టేందుకు ఫ్యాక్టరీలకూ, వ్యవసాయ క్షేత్రాలకు తీసుకొని వెళ్ళి శ్రమ చేయించేవాళ్ళు. సిద్ధాంతాన్ని ఆచరణకు జోడించడం దీని ద్వారా చేశారు. శ్రమ పట్ల విద్యార్థులకు గౌరవం పెరిగింది. మేధస్సు వ్యక్తిగతమైంది కాదనీ, సామాజికమని విద్యా విధానం ద్వారా నేర్పించారు. వ్యక్తివాద ఆలోచనలకు భౌతిక పునాది లేకుండా చేశారు.

1930లలో పెట్టుబడిదారీ సంక్షోభం నుండి ఫాసిజం పుట్టింది. ఇది జర్మనీలో హిట్లర్ రూపంలోనూ, ఇటలీలో ముస్సోలిని రూపంలో ముందుకు వచ్చింది. ఫాసిస్టు జర్మనీ సోవియట్ మీదకు దాడికి వచ్చినప్పుడు సామ్రాజ్యవాదులు కూడా లోలోపల సంతోషించారు. కానీ వారి ఆశలను వమ్ము చేస్తూ ఉక్కుమనిషి స్టాలిన్ నాయకత్వంలో సోవియట్ ప్రజలు అనన్యమైన త్యాగాలు చేసి ఫాసిస్టు జర్మనీని మట్టిగరిపించారు. దీని కోసం 2 కోట్ల మంది రష్యా ప్రజలు బలిదానం చేశారు. ఇది చరిత్రలో మహత్తర ఘటనగా నిలిచిపోయింది.

ఇంత ఘన చరిత్ర గలిగిన సోవియట్ యూనియన్‌లో, 1953లో స్టాలిన్ మరణం తర్వాత పార్టీలో పెట్టుబడిదారీ శక్తులు పైచేయి సాధించి రష్యాను సామ్రాజ్యవాద దేశంగా మార్చారు. కొన్ని సిద్ధాంత పరమైన పొరపాట్ల వలన ఈ తిరోగమనం జరిగింది. సోషలిజంలో కూడా వర్గాలు అంతం కావనీ, సోషలిస్టు నిర్మాణ దశలో వర్గ పోరాటం విప్లవ పంథాగా వుంటుందని చైనా సాంస్కృతిక విప్లవ అనుభవం పాఠం నేర్పింది. ఇప్పటికీ చరిత్ర వర్గపోరాట మార్గం ద్వారానే, అనగా బోల్షివిక్ విప్లవ అనుభవం ద్వారానే ప్రయాణం చేసి, సోషలిజంలో కూడా కార్మికవర్గ నియంతృత్వంలో వర్గపోరాటాన్ని కొనసాగించి కమ్యూనిజానికి చేరవలసినదే.

నేడు పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థ పతనపు అంచుల్లోకి చేరింది. దాని అభివృద్ధి ఆగిపోయింది. సమాజాన్ని ముందుకు నడిపించలేకపోతోంది. దానిలో వచ్చిన సమస్యలు పరిష్కారం కావటంలేదు. యుద్ధాల ద్వారానే దాని బ్రతుకును వెళ్లదీస్తోంది. నేడు పెట్టుబడిదారీ విధానం సాగిస్తున్న ప్రకృతి విధ్వంసానికి వ్యతిరేకంగా శాస్త్రవేత్తలు, మేధావులు తమ పరిధిలో ప్రతిఘటిస్తున్నారు. వీరు గతంలో పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించినవారే.

ఈ పరిస్థితుల్లో బోల్షివిక్ విప్లవపు ప్రాధాన్యత ఎంతో ఉన్నది. మరల ప్రపంచ వ్యాపితంగా మార్క్సిజం –లెనినిజం –మావోయిజం పట్ల ప్రజలలో మొగ్గు పెరుగుతున్నది. దానికనుగుణంగా విప్లవ పార్టీలు పుడుతున్నాయి. విప్లవోద్యమాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు, ప్రజాస్వామిక ఉద్యమాలు, సాంస్కృతిక మరియు పర్యావరణ ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఈ ఉద్యమాలన్నీ ఒక తాటిమీదకు రావాలి. బోల్షివిక్ విప్లవపు పాఠాలనూ, వారు సాధించిన కృషిని అధ్యయనం చేయాలి. ప్రచారం చేయాలి. మహోపాధ్యాయుడు లెనిన్ చెప్పిన అంతర్జాతీయ కార్మికవర్గ సాధారణ పంథా నేటికి సరైనదిగానే, అన్వయింప దగినదిగానే వున్నది. అందువలన మనం బోల్షివిక్ ఉత్తేజంతో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి. పెట్టుబడిదారీ –సామ్రాజ్యవాద వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజమే. ఇది చారిత్రక సత్యం. మరోక ప్రత్యామ్నాయం లేదు.

బోల్షివిక్ విప్లవ స్ఫూర్తిని నలుదిక్కుల ప్రచారం చేయాలి. సోషలిజమే ప్రత్యామ్నాయమని ఎలుగెత్తి చాటాలి. బోల్షివిక్ అమరుల స్మృతిలో ముందుకు పోవాలి. బోల్షివిక్ ఉత్తేజం, సృజనాత్మకతతో ముందడుగు వేయాలి.

★ కుళ్ళిపతనమై పోయిన పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద వ్యవస్థను ధ్వంసం చేయాలి!

★ ప్రపంచ సోషలిస్టు మహా విప్లవం వర్థిల్లాలి!

★ విప్లవ, సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక ఉద్యమాలు వర్థిల్లాలి!

★ భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్థిల్లాలి!

★ సి.పి.ఐ. మావోయిస్టు వర్థిల్లాలి!

విప్లవాభివందనాలతో,

ఎ.ఒ.బి.–ఎస్.జడ్.సి.,

సి.పి.ఐ.(మావోయిస్టు).

# నూరు వసంతాల మహత్తర బోల్షివిక్ విప్లవాన్ని మననం చేసుకుందాం!

*ప్రియమైన ప్రజలారా !*



1917, నవంబర్ 7వ తారీఖున (అక్టోబర్ 25 పాత క్యాలండర్ ప్రకారం), రష్యా దేశంలో బోల్షివిక్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కార్మికులు, రైతులు, ఇతర పీడిత ప్రజలు కలిసి దోపిడీ వర్గాన్ని కూలదోసి పీడిత ప్రజల అధికారాన్ని స్థాపించారు. చరిత్రలో మొదటిసారి దోపిడీ వర్గాన్ని కూలదోసిన, ఈ విప్లవానికి ఎంతో ప్రాముఖ్యం ఏర్పడింది. ప్రపంచాన్ని కుదిపివేసిన, ఆనాటి బోల్షివిక్ విప్లవం గురించి చరిత్రలో ఎన్నో కథనాలు, సమీక్షలు, విశ్లేషణలు వెలువడ్డాయి. నేడు దోపిడీ వ్యవస్థ కూలిపోవాలనీ, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకునేవారు, దాని కోసం పాటుపడే విప్లవ పార్టీలు, విప్లవ ప్రజలు, మేధావులు, పీడిత ప్రజలు ఈ సందర్భంగా మరొకసారి ఆ విప్లవపు అనుభవాలు, గుణపాఠాలు నెమరువేసుకొని వాటి సాధనకై ప్రతిన పూనుదాం!

మహనీయులు మార్క్స్, ఎంగెల్స్‌లు వారి జీవిత కాలంలో విప్లవ సిద్ధాంతాన్ని తయారు చేశారు. సమసమాజ స్థాపన, సంస్కరణల ద్వారా సాధ్యమా లేక విప్లవం ద్వారా సాధ్యమా అనే చర్చకు, 1848 ఫ్రాన్స్‌లో కార్మికుల పోరాటం, 1871లో జరిగిన ప్యారిస్ కమ్యూన్ అనుభవాల నుండి కర్కశమైన వర్గపోరాటం ద్వారానే అది సాధ్యమని వారు నిరూపించారు. అప్పటికే సొంత ఆస్థులు కోల్పోయి, సమిష్టి ఉత్పత్తి విధానంలో, వేతనాల మీద జీవనం సాగిస్తున్న కార్మికులకు వర్గ చైతన్యం ఏర్పడింది. ఇక వారికి విప్లవ సిద్ధాంతం అవసరం. విప్లవ సిద్ధాంతాన్ని కార్మికుల మెదళ్ళలోకి ఎక్కించాలి. తర్వాత అదొక భౌతిక శక్తిగా మారి పోరాటం ఉధృతమవుతుంది. ఈ పని చేయడానికి కమ్యూనిస్టు పార్టీ అవసరం.

**బోల్షివిక్ పార్టీని నిర్మాణం చేసిన క్రమం :-** విప్లవ సిద్ధాంతాన్ని పరిస్థితులకు అనుగుణంగా అన్వయించి విప్లవాన్ని ఎలా విజయవంతం చేయాలనే విషయాన్ని రష్యాలో లెనిన్, స్టాలిన్‌లు బోల్షివిక్ పార్టీని నిర్మాణం చేసి నిరూపించారు. కమ్యూనిస్టు పార్టీ ఎలా వుండాలి అనేది బోల్షివిక్ విప్లవపు, బోల్షివిక్ పార్టీల అనుభవాల నుండి మనకు అర్థమవుతుంది. అప్పటిదాకా రష్యాలో అనేక గ్రూపుల మధ్య (రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ) కొనసాగుతున్న చర్చకు సిద్ధాంత పోరాటం ద్వారా ముగింపు పలికించి, 1905లో లెనిన్ ఉన్నత చైతన్యం కలిగిన బోల్షివిక్ పార్టీని నిర్మాణం చేశాడు. బోల్షివిక్ అనగా త్యాగానికి పర్యాయ పదం. దోపిడీ వర్గాన్ని అంతం చేయడానికి నిర్దాక్షిణ్యమైన వర్గపోరాటం చేసే ఆయుధం. స్వార్థం అనేది వ్యక్తి నుండి పుట్టేది కాదు. అది వర్గం నుండి పుడుతుంది. దానికి మూలం సొంతాస్తి. వర్గాలను అంతం చేయడం ద్వారా స్వార్థాన్ని జయించవచ్చు. ఈ ఆలోచన కలిగినదే బోల్షివిక్ పార్టీ.

రెండవ ఇంటర్నేషనల్(మార్క్స్, ఎంగెల్స్ తర్వాత కాలం)నాటి పార్టీలు శాంతి దూతలుగా, మిలిటెన్సీ రహితంగా మారాయి. పార్లమెంటరీ ఎన్నికలకూ, ఊకదంపుడు ఉపన్యాసాలకు అనువైన యంత్రాలుగా మారిపోయాయి. లెనిన్ నాయకత్వంలోని రష్యన్ బోల్షివిక్ పార్టీ కార్మికవర్గ అగ్రగామి దళంగా వుండింది. ఉక్కు క్రమశిక్షణను కలిగి వుండింది. పట్టుదల, త్యాగం, ధైర్య సాహసాలను ప్రధర్శించింది. కష్టజీవులైన ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నది. ప్రమాదకరమైన పెట్టుబడిదారీ వర్గాన్ని ఓడించాలంటే, కమ్యూనిస్టు పార్టీ ప్రజాస్వామిక పునాదిపై మిక్కిలి కేంద్రీకృతమైన పద్ధతిలో నిర్మించబడాలి. మిలటరీ ఉక్కు క్రమశిక్షణను కలిగి వుండి మొత్తం పార్టీ సభ్యులందరి విశ్వాసాన్ని చూరగొని, శక్తివంతమైన అధికార యుతమైన సంస్థగా పార్టీ కేంద్రం వుంటేనే తన కర్తవ్యాన్ని నిర్వహించగల్గుతుంది. ఇటువంటి పార్టీని సరిగ్గా రష్యాలో లెనిన్ నిర్మాణం చేశాడు. సరైన రాజకీయ నాయకత్వాన్ని అందించాడు. సరైన వ్యూహం-ఎత్తుగడలను అనుసరించాడు. 1905లో రష్యాలో విప్లవం ఓడిపోయినప్పటికీ, ప్రతికూల పరిస్థితుల్లో కూడా అనుకూలాంశాలను వెతికి పట్టుకొని వాటి మీదనే ప్రజలను కూడగట్టాడు. గొప్ప ప్రజా ఉద్యమాన్ని నిర్మించాడు. ఓర్పుతోనూ, దీర్ఘకాల ప్రయత్నాల ద్వారా కష్టాలను అధిగమించి, అనుభవాలను మదింపు చేసుకోవడం ద్వారానే ఇటువంటి విజయాలు సాధ్యమవుతాయి. 1917లో కార్మికవర్గం, రైతాంగం కలిసి బోల్షివిక్ పార్టీ దిశా-నిర్దేశంలో సార్వత్రిక తిరుగుబాటు ద్వారా పీడిత ప్రజల అధికారాన్ని స్థాపించారు. మానవ సమాజ చరిత్రలో ఇది ఒక మౌలికమార్పు. అప్పటిదాకా కొనసాగుతున్న ఆస్తి సంబంధాలను మార్చింది.

63వ పేజీలో...




తెలంగాణ రాష్ట్రం, మెదక్ జిల్లాలోని, నర్సంపల్లి గ్రామంలో రాంగూడ అమరుల స్మృతిలో నిర్మించిన స్థూపం